మాస్టర్ పార్వతీకుమార్

# రుక్మిణీ కళ్యాణము



ధనిష్ఠ

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# రుక్మిణీ కళ్యాణము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2017 ప్రతులు : 1,000
(56వ గురుపూజా మహోత్సవములు)

వెల : రూ॥ **100-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN :978-81-89467-68-5

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయు లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"*అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# మనవి

సర్వ శుభప్రదము, సర్వ మంగళకరము, సమున్నత సంస్కారము, కళ్యాణప్రదము అయిన రుక్మిణీ కళ్యాణము విజయవాడ గురుపూజలలో తొమ్మిది ప్రవచములుగ మూడు సంవత్సరములు సాగినవి. మాస్టర్ పార్వతీకుమార్ గారు ఎప్పటివలెనే ఉల్లాసముగ, ఉత్సాహముతో శ్రీ రుక్మిణీ కళ్యాణ ఘట్టమును రహస్యార్థములతో, యోగసాధనా పరమగు సూచనలతో, సున్నితమగు హాస్యమును జోడించుచు, ఆత్మసాధకులకు వివరించిరి. ముప్పది మూడు (33) సంవత్సరములుగ మాస్టరుగారు చేయు ప్రవచనములకు ముగ్ధులగుచు, వినుచు, అనుసరించు ఆత్మసాధకులు ఎందరో కలరు. వారి కోరిక మేరకు భాషణా పూర్వకమగు మాస్టరుగారి బోధన వారందించిన, తెలుగు భాగవత పద్యములతో సహా ధనిష్ఠ ప్రచురించుచున్నది.

ప్రచురణ కర్తలగు **గానుగుల రామారావు** గారి కుటుంబమునకు ధనిష్ఠ తమ ధన్యవాదములను తెలియపరచు చున్నది.

ఇట్లు
**ధనిష్ఠ**

# ఆశీస్సులు

**చి. సౌ. జాహ్నవి, గానుగుల విజయ దంపతికి** శుభాశీస్సులు. ఈ యువ దంపతి అమితమగు భక్తి శ్రద్ధలతో మాస్టర్ పార్వతీకుమార్ గారు ప్రవచించిన "అంబరీషోపాఖ్యానమును, రుక్మిణీ కళ్యాణమును" లేఖనము గావించి, దివ్యాశీస్సులకు పాత్రులైరి. వారు లేఖనము చేయు చుండగనే దివ్యసాన్నిధ్యమును బడయుచు, జీవన సోపానములను ఆరోహించిరి. సమస్యలు పరిష్కృతమై శుభములు పొందుచు నున్నారు. భాగవత ఉపాఖ్యానములు ప్రవచించుట, రచించుట, వినుట వలన భవరోగము లన్నియు దాటుట తథ్యమను సత్యమును ప్రత్యక్షముగ అనుభవించినారు. ఈ దంపతి తల్లిదండ్రులు ఇరు వర్గములు సంభ్రమానందములతో పొంగిన హృదయము గలవారై యున్నారు. రచనా యజ్ఞమున వారి జీవితములందు కలిగిన శుభమగు మార్పులు వారికొక మధురానుభూతిని మిగిల్చినది. రామభద్రుడు భాగవతమును శ్రద్ధగ అనుసంధానము చేయు వారందరిని నేటికిని పరిరక్షించుకొను చున్నాడను సత్యమును ఈ యువ దంపతి మరొక్క మారు ప్రకటితము చేసినారు. వారికిని, వారి పూర్వీకులకును, ఉత్తరోత్తర సంతతికిని భాగవతమూర్తియగు రామబ్రహ్మము సర్వోన్నతిని ప్రసాదించవలెనని ఆశంసనము. సర్వము కళ్యాణప్రదము గావలెనని ఆశంసనము.

కార్తీక శుద్ధ పంచమి
శుక్రవారము
తేది 4-11-2016

ఇట్లు
**పార్వతీకుమార్**

# రుక్మిణీ కళ్యాణము

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముందుమాట | ...... | 11 |
| 2. | బలరాముని వివాహము | ...... | 29 |
| 3. | రుక్మిణి గుణగణములు | ...... | 34 |
| 4. | రుక్మిణికి వివాహ యోగ్యత | ...... | 66 |
| 5. | దివ్యప్రణాళిక | ...... | 76 |
| 6. | శ్రీకృష్ణునికి రుక్మిణి పంపిన సందేశము | ...... | 90 |
| 7. | శ్రీకృష్ణుడు విదర్భకు పయనమగుట | ...... | 142 |
| 8. | రుక్మిణి అంతరంగం | ...... | 150 |
| 9. | శుభసూచనలు | ...... | 188 |
| 10. | భీష్మకుడు రామకృష్ణుల నాహ్వానించుట | ...... | 196 |
| 11. | రుక్మిణీదేవి గౌరీపూజ | ...... | 202 |
| 12. | శ్రీకృష్ణుడు రుక్మిణిని గొనిపోవుట | ...... | 236 |
| 13. | బలరాముని శాంత వచనములు | ...... | 262 |
| 14. | రుక్మిణీ కళ్యాణము | ...... | 281 |

# ముందుమాట

బ్రహ్మావర్తము, ఆర్యావర్తము, భరతభూమి అని ప్రసిద్ధి గాంచిన ఈ పుణ్యభూమి యందు అనాదిగా మానవులు బ్రహ్మమును నిరాకరించక, బ్రహ్మోత్సాహముతో కూడిన నిత్య జీవితం సాగించిన నాగరికత మనది. బ్రహ్మమును చేరటమే జీవునికి నిజమగు విజయము. అలా బ్రహ్మమును చేరుట అనేది ఎవరికి సాధ్యపడిందో వారందరూ విజయమును సాధించి నటువంటివారు. "విజయ" అన్నటువంటి నామము దైవమును చేరినటువంటి జీవునికి వర్తింపబడుతుంది. పుణ్యనది అయిన కృష్ణానదీ తీరంలో కనకదుర్గమ్మ వెలసినట్లుగా, విజయవాడ ఒకటి ఇక్కడ ఏర్పడి వున్నది. ఈ విజయవాడలో మాస్టర్ సి.వి.వి. గురుపూజా మహోత్సవములు నిర్వర్తించుకుంటూ ఉన్నాము. మూడవ దశాబ్దంలో చేరాము. ఏ జీవుడైతే బ్రహ్మమును చేరేటటు వంటి ప్రయత్నంలో ఉంటాడో, దాన్ని అతడు విజయమును సాధించ డానికి చేసే ప్రయత్నంగా భావిస్తూ ఉండాలి. దైవము–జీవుడు, పరమాత్మ–జీవాత్మ, ప్రకృతి వీటి కథే మొత్తం సృష్టి కథ. జీవుడు దైవముతో కూడి సృష్టిని ఆనందముగా అనుభవించవచ్చును. దైవముతో కూడినటువంటి జీవునికి ప్రకృతి సౌందర్యములన్నీ కూడా మహత్తరమైనటువంటి ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాయి. దైవమును వీడి, జీవుడు ప్రకృతితో అనుసంధానం చెందినప్పుడు,

ప్రకృతి తనకు అవగాహన కాక, తనదైనటువంటి చిక్కులు తాను ఏర్పరుచుకుని, క్రమంగా పశ్చాత్తాపం చెంది, మరల దైవమును చేరి, అటుపైన ఆనందదాయకమైనటువంటి జీవితాన్ని అనుభ వించటం అనేటువంటి కథలు కోకొల్లలుగా మన వాఙ్మయంలో ఉన్నాయి. అలాంటి కథల్లో ఆణిముత్యాల్లాంటివి, రత్నాల్లాంటివి, మణుల్లాంటివి కొన్ని ఉపాఖ్యానాలు ఉంటాయి. అలాంటి ఉపాఖ్యా నమే భాగవతమందు వివరింపబడిన ఈ ''రుక్మిణీ కళ్యాణ ఘట్టము''.

ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టము అందరికీ తెలిసిన కథయే. ఈ కథలో చాలా లోతులు ఉన్నాయి. ఈ కథలో జీవాత్మ–పరమాత్మల అనుసంధానానికి సంబంధించిన సమస్త సాధన ఉన్నది, భక్తి ఉన్నది, జ్ఞానం ఉన్నది, వైరాగ్యం ఉన్నది, యోగం ఉన్నది. దైవమును జీవుడు చేరేటువంటి ప్రయత్నంలో మనకు సహజంగా మనలో నుండి అడ్డుపడే అహంకార తత్వం ఉన్నది. ఇలా రకరకములైన విషయములన్నీ కూడా ఒక మధురమైన ఘట్టంగా రూపొందించారు ఋషులు. జరుగుతున్న కథలో ఎన్నెన్నో రహస్యాలు చూపించి, సాధకునికి పనికొచ్చే తీరులో ఆ కథని వర్ణించడమే ఋషులు చేసిన ఒక మహత్తరమైన ప్రయత్నము. రుక్మిణీ కళ్యాణము అనే ఈ ఉపాఖ్యానము సర్వశుభకరము, మంగళప్రదము. ఇది కళ్యాణ ఘట్టము కనుక దీనిని చదివినా, విన్నా, అప్పుడప్పుడూ పారాయణ చేసుకున్నా, చాలా శుభములు కలుగుతాయి అనేటువంటి అనుభ వము దాదాపు భారతీయు లందరికీ తెలిసి ఉన్నది.

కాకపోతే, మనకు ఉండేటువంటి జీవన విధానంలో ఇవన్నీ క్రమంగా మరుగున పడుతూ, ఇతరములైన విషయముల యందు ఆసక్తి పెరుగుతూ, నాగరికుల మనుకొనుచూ, అభివృద్ధి చెందు తున్నాము అనుకుంటూ, అనాగరికులుగా, ఇంద్రియలోలురుగా, పశుప్రాయంగా, ప్రస్తుతం దాదాపు జాతి అంతాకూడా ఒక జారుడుబండ ఎక్కి, పతనమైనటువంటి స్థితిలోకి జరుగుతూ వస్తూ ఉంది. అయినప్పటికీ, భరతభూమి యందు ఋషులకు మక్కువ ఎక్కువ– వల్లమాలిన ప్రేమ, అభిమానం. ఎంచేతంటే, ఈ భూమి మీద అలాంటి దైవీపరమైనటువంటి ఘట్టములు ఎన్నో జరిగి ఉండడం చేత. *"ఎందరో మహానుభావులు"* అని కీర్తన ఉందికదా! సిద్ధులు, తపస్వీజనులు, మహర్షులు రకరకములుగా దైవపరమైన విజయములు సాధించినవారు నడిచిన పుణ్యభూమి. అంచేత, ఈనాటికీ భూగోళం అంతా కూడా దివ్యదేహధారులై సంచరించే సిద్ధులు అయిన పరమగురువు లందరూ కూడా భరతభూమి యందు ఆకాశంలో సంచరించడానికి ఎక్కువ ఇష్టపడుతూ ఉంటారు. వారి సంచారంలో వారు భరతభూమికి సంబంధించిన ఎల్లలలో, ఆకాశంలో సంచరిస్తునప్పుడు వారికి తెలియకయే ఒక తేలికతనం అనుభవిస్తూ ఉంటారు. ఒక చల్లదనం అనుభవిస్తూ ఉంటారు. ఒక అనిర్వచనీయమైన హాయిని అనుభవిస్తూ ఉంటారు. మూడుసార్లు ఇతర భూఖండములలో సంచరిస్తే, మూడు వందల సార్లు భారతదేశంలో సంచరిద్దామనిపిస్తుంది వాళ్లకి. అలాంటి ఒక పవిత్రమైన వాతావరణము ఇంకా మన దేశపు ఎల్లలను ఆశ్రయించుకొని ఆకాశంలో నిండి ఉంది.

మనం వాతావరణాన్ని ఎంత కాలుష్యం చేస్తున్నా, ఆ కాలుష్యానికి అందనటువంటి ఒక స్థితిలో ఒక దివ్యత్వము ఈ భూమిని ఆశ్రయించి ఉంది. కాస్తోకూస్తో సంస్కారం ఉండేటువంటి పాశ్చాత్యులు కూడా భారతదేశం వచ్చినప్పుడు, ఇక్కడి గాలి పీల్చి, ఒక రకమైన తేలికదనాన్ని అనుభవిస్తూ ఉంటారు. భౌతికమైనటువంటి సౌకర్యములు అంతంత మాత్రంగాను, అసౌకర్యములు కోకొల్లలుగాను ఉన్నా, సామాన్యమైన, సంస్కారవంతమైన జీవులు ఎందరో ఈ దేశంలో ప్రవేశించడానికి ఉత్సాహం చూపిస్తూ ఉంటారు. “మాటిమాటికి ఈ దేశం ఎందుకొస్తారు? ఇక్కడ ఏమి కనిపిస్తుంది? ఏ సౌకర్యం ఉండదుకదా?” అని అడుగుతూవుంటే, “ఒక తెలియని ఆనందం, ఒక తెలియని ఉత్సాహం, మళ్ళీమళ్ళీ రావాలి అనేటువంటి భావన మాలో ఎప్పుడూ ఉంటాయి” అని చెప్తూ ఉంటారు మన పాశ్చాత్య సోదరులు అందరు కూడా. అలాంటి పుణ్యభూమిలో మనమున్నాము. మనం ఇందులోనే పుట్టి, పెరగడం చేత దీని వైభవం మనకి తెలియదు. పరమాన్నంలో పడ్డ ఈగలాగా గిలగిల లాడుతూ ఉంటూ ఉంటాము మనము! హిమాలయాల్లో పుట్టి పెరిగిన వారికి హిమాలయముల వైభవము తెలియదు. అలాగే భరతభూమిలో పుట్టి పెరుగుతున్నవారికి భారతభూమి వైభవము తెలియదు. కానీ, తనదైన ప్రత్యేకత కలిగినటువంటి ఏకైక దేశము ఈ భూమి. అది ముమ్మాటికీ నిస్సందేహము. ఈ దేశం ఎందు కీవిధమైనటువంటి పవిత్రత పొంది ఉన్నదంటే బ్రహ్మోపాసన

చేసినవారు, దైవోపాసన చేసినవారు లెక్కకు చాలా మిక్కిలిగా ఉన్నటువంటిది ఈ భూఖండం.

ఇక్కడ మనం గత కొన్ని గురుపూజలుగా చక్కని దైవీ పరమైన ఉపాఖ్యానములు చెప్పుకుంటూ వస్తున్నాము. దానికి ప్రధాన కారణం జగద్గురుపీఠము, విజయవాడ కేంద్రం గణపతి కృష్ణమూర్తిగారి యొక్క భాగవత మార్గ ఆసక్తి, భక్తి, దానియందు జీవించేటటువంటి ఒక ప్రయత్నమే కారణం. వారు "రుక్మిణీ కళ్యాణం చెప్పుకుంటే బాగుంటుంది మన గురుపూజల్లో" అన్నారు. ఎందుకు బాగుండదు? బాగుంటుంది. అంతకు ముందు 'కుమారసంభవం' చెప్పుకున్నాము. అంతకుముందు 'బలిచక్రవర్తి కథ' చెప్పుకున్నాము. అంతకు ముందు 'ధ్రువోపాఖ్యానం' చెప్పు కున్నాము. ఇలా ఏవో ఉపాఖ్యానాలు కొన్నికొన్ని సీరియల్ గా నడిచినాయి మనకి. ఈ రుక్మిణీ కళ్యాణం అనే ఉపాఖ్యానం భాగవతం దశమ స్కంధం పూర్వభాగంలో చిట్టచివరి ఘట్టం. కృష్ణుని యొక్క కళ్యాణ ఘట్టం అది. కృష్ణుని కోరి పొందవలెనని ఆశించినటువంటి ఒక స్త్రీ మూర్తి యొక్క పుణ్యకథ.

సీతా కళ్యాణము, పార్వతీ కళ్యాణము అంటారు. "ఏవండీ! పార్వతీ కళ్యాణం అంటే శివుడికి కూడా కళ్యాణం కదా! శివ కళ్యాణం అని ఎందుకు అనరు? కృష్ణ కళ్యాణం ఎందుకు అనరు? రామ కళ్యాణం ఎందుకు అనరు?" అంటే, ఎవరు ఎవరిని చేరుతున్నారు అనేది ముఖ్యం. ఎవరు ఎవరిని చేరడం వలన ఎవరికి ఎక్కువ అది కళ్యాణప్రదమైనది? శిష్యుడు గురువును చేరితే గురువుకు

కళ్యాణప్రదమా, శిష్యునికి కళ్యాణప్రదమా? జీవుడు దైవాన్ని చేరితే జీవునికి కళ్యాణప్రదమా, దేవునికి కళ్యాణప్రదమా? పరిపూర్ణతను చేరినవారికి పరిపూర్ణత లభిస్తుంది. శిష్యుడు, జీవుడు ఇలాంటి వారికి పరిపూర్ణత లభిస్తుంది. అపరిపూర్ణులైనటువంటి వారు పరిపూర్ణులు అవ్వాలని చేసే ప్రయత్నంలో వారికది కళ్యాణప్రదమై నిలిచింది అని చెప్పడానికి నామకరణమే ఇలా ఉంటుంది.

రుక్మిణీ కళ్యాణకథలో చాలా అద్భుతాలు ఉన్నాయి. ఈ కథలో ఒక భక్తురాలు భగవంతుని చేరే విధానము ఉంటుంది. ఆమె చేసిన సాధన, ఆమెకి వచ్చినటువంటి విఘ్నములు ఉంటాయి. ఒక జీవుడు దైవాన్ని చేరాలంటే చాలా విఘ్నములు ఉంటాయి. అవి ఎక్కడ ఉంటాయి? తమలోనే ఉంటాయి. తమ పరిసరాల్లోనే ఉంటాయి. తమ ఇంట్లోనే ఉంటాయి. ఇవన్నీ అహంకార స్వరూపంగా అడ్డుపడుతూ ఉంటాయి. జీవుడు దైవం దగ్గరకు చేరకుండా ఉండేటువంటి కార్యక్రమం ఒకటి అహంకారం చేస్తూ ఉంటుంది. అందుకని ఆ కార్యక్రమాలకి అడ్డుపడుతుంది. అలా రుక్మిణికి అడ్డుపడేవాళ్ళు ఉంటారు. రుక్మిణిని ప్రోత్సహించే వాళ్ళు ఉంటారు. అంతరాయం కలిగించే వాళ్ళు ఉంటారు. దేహం లోపలా ఉంటారు, గృహం లోపలా ఉంటారు, సంఘం లోపలా ఉంటారు. జీవుడు అన్నిటినీ అధిగమించి, తన సాధన ప్రధానంగా తన గమ్యాన్ని తానేర్పరుచుకొని, స్థిరము, ధైర్యముతో కూడినటువంటి కొన్ని నిర్ణయాలు చేసుకోవలసి వస్తుంది. ఆత్మసాధనా మార్గంలో శ్రేయోభిలాషులమని అనుకుంటూ, మమకారం చేత మనకు అడ్డు పడే వాళ్ళు ఉంటారు. మనకు రక్షకుల మనుకుంటూ అడ్డుపడే

వాళ్ళు ఉంటారు. మంచి చెయ్యాలనే ఉద్దేశ్యంతో అడ్డుపడే వాళ్ళు ఉంటారు. ఇతనికి మంచి జరగకూడదు అనేటువంటి ఉద్దేశ్యంతో అడ్డుపడేవాళ్ళు ఉంటారు. దేనికి లొంగుతాడు జీవుడు అనేది జీవుడి నిర్ణయమే.

"ఆ! ఏం వెళ్తాం గురుపూజలకి, ఎప్పుడూ ఉండేవే కదా!" అని ఇంట్లో ఎవరన్నా అన్నారనుకోండి. నిజమే కదా అనిపిస్తుంది. అందుకని ఆగిపోవచ్చు. "ఎండలు ముదిరినాయి. చాలా గురుపూజలకి వెళ్ళాం కదా! దీనికి వెళ్ళకపోతే ఏమి?" అనే భావన కలగవచ్చు. శ్రేయస్సు కలిగించేటువంటి విషయమందు ఒక నిశ్చయం మనం చేసుకున్నప్పుడు, ఆ నిశ్చయానికి తోడ్పాటు గావించే అన్ని కార్యక్రమములకు అవరోధం కలగకుండా, వాటిని నిర్వర్తించుకోవడం అనేటువంటిది సాధన అవుతుంది తప్ప, ప్రతి చిన్న విషయానికి మనమే అడ్డు వేసుకొని, వాడు చెప్పాడని, వీడు చెప్పాడని, ఇందుకు వీలు పడలేదు, అందుకు వీలు పడలేదు అని చెప్పుకోవడానికి తలమీద వెంట్రుకలన్ని ఉంటాయి. చెప్పుకోడానికి ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇన్ని ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా అందులో కొనసాగడం అనేటువంటిది సాధన అవుతుంది. దాన్నే నిత్యమైనటువంటి సంకల్పం అంటారు. దాన్నే దృఢ సంకల్పం అంటారు.

అలాంటి సంకల్పానికి అప్పుడప్పుడూ అంతరాయాలు కలుగుతుంటే, అధిగమించడానికి అప్పుడప్పుడు ధైర్యం కూడా చెయ్యాలి. ధైర్యం చెయ్యనివారు తాము ఏర్పరుచుకున్న గీత

లను తాము దాటలేరు. "ఎత్తుకుపో, వచ్చేస్తాను" అనడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఒక సంస్కారవంతమైన స్త్రీ కదా! ''గుడికి వస్తాను, దార్లో నన్ను ఎత్తుకుపో" అని పరిపూర్ణమైనటువంటి సంస్కారం ఉన్న ఒక స్త్రీ చెప్పటంలో, ఆమె దేనికి ప్రాధాన్యత ఇచ్చింది? దైవమునకు ప్రాధాన్యత ఇచ్చింది. "ఒప్పుకుంటే మంచిదే, ఒప్పుకోకపోతే ఎత్తుకుపో" అని చెప్పింది. ఇలాంటి ఘట్టం ఎక్కడా ఉండదు. పార్వతీ కళ్యాణంలో అడ్డుపడతారు. "ఉమ, ఉమ" అంటారు కదా! వద్దు తల్లీ, అది వీలుపడే విషయం కాదు. చాలా కష్టం. మహా మొండివాడు. ఏ దేవతలయినా దగ్గరికి వెళ్ళడానికి భయపడతారు. పైగా ప్రత్యేకంగా ఇప్పుడు మహత్తరమైన తపస్సులో ఉన్నాడు. ఎవరు వెళ్ళినా ఆ తపస్సు అగ్నికి కాలిపోతారు. అలాంటి వాడిని వరించి, అతనిని వివాహమాడతాను అని నీవు అనుకోవడం పిల్లచేష్ట అవుతుంది" అని ఎంతమంది చెప్తారో, ఎన్నిరకాలుగా చెప్తారో! ఎన్నిరకాలుగా చెప్పినా, ఆమె పర్వత రాజు పుత్రి. పర్వతం అంత స్థిరమైనటువంటి సంకల్పం కలిగి ఉంటుంది.

"పార్వతి" అని పేరు పెట్టుకొని స్థిర సంకల్పం లేదనుకోండి, "శైలజ" అని పేరు పెట్టుకొని స్థిర సంకల్పం లేదనుకోండి, పేరు మార్చుకుంటే మంచిది! పేర్లేమో మనం అందానికి పెట్టుకుంటాం తప్ప, ఆ పేరు మనకి అర్థవంతము కావాలి కదా! అర్థవంతమైన నామమే మనం పెట్టుకునేది. మిగతా నాగరికతల్లాగా "స్టోన్", "బిల్", "మిల్లర్", "ముల్లర్" ఇట్లా పెట్టుకోముగా మనము! అందరికీ దైవ నామములే ఉంటాయి. లేకపోతే, దైవము యొక్క

కళ్యాణ గుణములు నామముగా ఉంటాయి. అంచేత, స్థిరమై నటువంటి సంకల్పం. ఆ సంకల్పం లోపల స్థిరపడుతున్నకొద్దీ మౌనం పెరుగుతుంది. మొండివాడు మౌనంగానే ఉంటాడు కదా! అంతేకాదు, అవసరమైతే ధైర్యం చెయ్యాలి. తాను చేస్తున్నటువంటి నిర్ణయానికి సంబంధించిన గమ్యాన్ని చేరటానికి వలసిన సమస్త జ్ఞానమూ తాను పొంది ఉండాలి. కృతనిశ్చయము, జ్ఞానము, మౌనము, సాహసము– ఈ నాలుగు లేకుండా చేసేటువంటి సాధనంతా కూడా అదేదో సరదాగా చేస్తున్నట్టే. మనం చాలా పనులు సరదాగా చేస్తుంటాం. ఇది (సాధన) కూడా అలాగే ఒక సరదాగా చేసేటువంటి కార్యక్రమంగా అయిపోతుంది. సరదాగా చేస్తే దైవం ప్రతిస్పందించడు. ఎంచేతంటే, నీ లోపలినుంచి అన్నీ చూస్తూ ఉంటాడు. నీ బయట నుంచి అన్నీ గమనిస్తూ ఉంటాడు. బయటకన్నా లోపలే ఉంటాడు కాబట్టి గమనించడం సులభం. ఇంటిదొంగని ఈశ్వరుడైనా పట్టలేడు అన్నారు. బయటవాళ్ళ కన్నా ఇంట్లో వాళ్ళే మన విషయాలు బాగా గమనించగలరు. నీ లోపలే ఉంటూ, నీలో కలిగేటువంటి భావ సంచలనం అంతా గమనిస్తూ ఉంటాడు.

ఈ రుక్మిణీ కళ్యాణంలో కథానాయిక రుక్మిణి. ఆమె చేసి నటువంటి సాధన, ఆమె కృష్ణుని పొందిన విధానం కథగా ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టం ఉన్నది. నెమ్మదిగా చెప్పుకుంటాం మనం. ఎందుకంటే, భాగవతము మూడు రోజుల్లో చెప్పేస్తాను, నాలుగు రోజుల్లో చెప్పేస్తాను అనుకోకూడదు. ఎందుకంటే భగవంతుని

స్మరించి, భాగవతం వ్యాఖ్యానం చేస్తూ ఉంటే, భగవంతుడు తానే చెప్పుకుంటూ ఉంటాడు. చెప్పేవాడు కూడా వినడమే!

*"పలికెడిది భాగవత మట*
*పలికించు విభుండు రామభద్రుం డఁట నేఁ*
*బలికిన భవహర మగు నఁట*
*పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?"*

భాగవత పద్యాలు మనం చదువుకోవడం, ఇతరులకు చెప్పటం చేత, మన మధ్య అదృశ్యంగా దైవం కూడా ఉండి, ఆయనే బాగా వివరణ ఇస్తూ ఉంటాడు. ఆదివారం పూట భాగవత పారాయణం చేస్తున్నాం చాలా కాలంగా. అందులో వచ్చేటువంటి విశేషాలు, రహస్యాలు, చాలా సంభ్రమాశ్చర్యాలతో కూడి ఉంటాయి. ఒక వాక్యంలో ఒక పుస్తకం ఉన్నట్టుగా ఉంటుంది. "ఎంత చెప్తారు? ఎంతసేపు చెప్తారు? ఎన్నాళ్ళు చెప్తారు?" అంటే, "ఎన్నాళ్ళైనా నువ్వు చెప్తూ ఉండు, మేము వింటూ ఉంటాము, అంతకన్నా మాకు ఇంకేమీ అక్కర్లేదు" అన్నారు శౌనకాది మునులు సూతునితో. ఇంతకన్నా ఇంకేం కావాలి? ఇది ఒక్కటి ఉంటే చాలు. దీన్ని వింటూ ఉంటే, తెలియకనే మనం బ్రహ్మానుభూతిలో ఉంటాం. ఇతరములేవీ మనకి స్ఫురణకు రావు. అన్నీ కరిగి, ఇది మిగిలిన స్థితి ఉంటుంది. ఎన్నో సాధనలు చేసి పొందవలసినటువంటి స్థితులను, భక్తితో తెలియకయే మధురంగా ఆ స్థితులు పొందడం, అనుభూతి చెందడం ఉంటుంది. అలాంటిది భాగవతం. క్రమంగా జన్మ పరంపరను తగ్గిస్తూ వస్తుంది.

అందరిలోనూ లోపల దివ్యమైనటువంటి పురుషుడు లేక పురుషోత్తముడు ఉన్నాడు. పురుషుడుగా మనం ఉన్నాం. క్షర పురుషుడుగా మనకు మన శరీరం, మన స్వభావం ఉంది. పురుషోత్తముడు ఉన్నాడు మనలో. పురుషుడుగా, అతనికి ప్రతీకగా మనం ఉన్నాం. పురుషోత్తముడు నుంచి పురుషుడు పుడితే, పురుషుడు ఆధారంగా అతని దేహం, అతని స్వభావం పుడుతూ ఉంటుంది. అంటే, మన తొడుగు మనం ఏర్పరుచుకుంటూ ఉంటాం. నత్తగుల్ల ఎట్లా ఏర్పరుచుకుంటూ ఉంటుందో, అలా మన గుల్ల మనం ఏర్పరుచుకొని, ఆ గుల్లలో మనం ఉంటూ ఉంటాం. ఆ గుల్లే గృహం. దేహం అనేటువంటి ఒక గృహాన్ని ఏర్పరుచుకొని పురుషుడు, అందులో పురుషోత్తముడుతో కూడి జీవిస్తూ ఉంటాడు. మనం three-in-one అంటారు. పురుషుడు, పురుషోత్తముడుతో కూడి ఈ దేహమందు జీవిస్తూ ఉంటాడు. ఈ కనపడేటువంటి దేహము మాటి మాటికీ మారుతూ ఉంటుంది, స్వభావము మారుతూ ఉంటుంది. జీవుడు, దేవుడు ఎప్పుడూ కలిసే ఉంటారు.

జీవుడు దైవంతో కూడి, తన స్వభావాన్ని ఆసరాగా తీసుకొని, దేహంతో బయట ప్రపంచంలో అనుభూతిని పొందవచ్చును. దైవంతో కూడక, స్వభావంతోను, శరీరంతోను కూడితే, స్వభావము జీవుడిని చిక్కులు పెడుతుంది. చిన్నప్పుడు మనం కథలు చదువుకునే వాళ్ళం: బ్రాహ్మణుడు, పులి, మేక, గడ్డివాము బ్రిడ్జి దాటాలి. రెండుకన్నా ఎక్కువ వస్తువులు ఒక్కసారి బ్రిడ్జిమీద

నుంచి అవతలకు దాటడానికి వీల్లేదు. బ్రాహ్మణుడు లేకపోతే పులి మేకను తినేస్తుంది. బ్రాహ్మణుడు లేకపోతే మేక గడ్డిని తినేస్తుంది. ఆ బ్రాహ్మణుడు లేకపోతే ఈ మూడిటిలో ఏదీ దానంతట అది దాటలేదు. ఒక్కసారి రెండు వస్తువులే దాటగలవు. ఎట్లా దాటిస్తారు అనేది ఈ కథ. నా దృష్టిలో అది నిజానికి ఉపనిషత్తు కథ, ఎంచేతంటే బ్రహ్మముతో కూడి దాటవచ్చు. అందుకని, ప్రతిసారి బ్రాహ్మణునితో కూడే– ముందు మేకను తీసుకెళ్ళి అక్కడ కట్టేసి, పులిని, గడ్డివామును వదిలేస్తాడు. పులి గడ్డి తినదు కదా! ఆ తర్వాత మళ్ళీ వస్తాడు. మళ్ళీ వెళ్లి ఏం తీసుకెళ్తాడు? మేక అక్కడుంది కదా! ఈ సారి గడ్డివామును తీసుకెళ్ళి అక్కడపెట్టి, మేకను తెచ్చేస్తాడు. అటునుంచి మళ్ళీ పులిని తీసుకొని అటుపక్క చేర్చి, మళ్ళీ అటునుంచి వెనక్కి గడ్డివామును తీసుకెళ్ళిపోతాడు. ఇట్లా బ్రహ్మానికి శ్రమ లేదు. జీవులని చేర్చుకోవడంలో ఒకటికి నాలుగు సార్లు దిగివస్తూ ఉంటాడు. అట్లా దిగి వచ్చి, కథ నడిపిస్తూ ఉంటాడు. ఆయనే గురువు. *"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః, గురుస్సాక్షాత్పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"* . మాటిమాటికీ వచ్చి, ఏదో రకంగా జీవుల్ని తనలో చేర్చుకునే కార్యక్రమమే సద్గురువు కార్యక్రమం.

ఈ విధంగా పురుషుడు తనలోని దివ్య పురుషుడితో అనుసంధానం చెంది జీవితాన్ని అనుభవం చెందితే ఆ జీవితం వైభవోపేతం అవుతుంది. పురుషుడంటే మగవాడు అనికాదు అర్థం. పురమునందు వసించేవాడు పురుషుడు అయి ఉండడంచేత

స్త్రీలు కూడా పురుషులే. స్త్రీమూర్తి అయినా పురుషరూపం అయినా విరాట్రూపుని యొక్క అవతార రూపమే. లోపల దైవం ఉన్నాడు. “May the light in me” అనంగానే ఆగిపోవాలి. ఎందుకంటే, “ May the light in me” అన్నప్పుడు దైవం ఉన్నాడు అనే భావన నీలో ఉందా? ఆలోచించావా? చూశావా? నేనే ఉన్నాను కదా అనుకుంటూ ఉంటాడు ప్రతివాడు. నేను “నేను” తో కూడి ఉన్నాను అనుకుంటాడు భక్తుడు. భక్తుడు “నేను” అనే దేవుడితో కూడి ఉంటాడు. They are two-in-one. నేను అనే స్వభావాన్ని, శరీరాన్ని పట్టుకొని పని చేస్తుంటాడు. ఎప్పుడూ తన లోపలి దైవాన్ని వీడనివాడు భక్తుడు. ఆయన్ని గూడులో పెట్టేసి, మనం ఊరికే తిరిగొచ్చేసి, అప్పుడప్పుడు మనకు బాగుండక పోయినప్పుడు, కష్టం వచ్చినప్పుడు, బారుబారు మనటానికి కాదు. లోపల గూడులో ఉన్నాడు కదా! నువ్వు ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తూనే ఉంటాడు. నీ దేవతా మందిరాన్ని ఎక్కడికి పడితే అక్కడికి పట్టుకెళ్తావా? గర్భగుడిలో కూర్చొని అడ్డమైన మాటలు మాట్లాడతావా? అడ్డమైన పనులు చేస్తావా? అడ్డమైన తిరుగుళ్ళు తిరుగుతావా? పూర్వకాలంలో దేవతార్చన పెట్టెని ఏ ఊరు వెళ్ళినా అది పట్టుకెళ్తూ ఉండేవాళ్ళు. వాళ్ళవాళ్ళ పరిస్థితినిబట్టి ఇత్తడిపెట్టో, వెండిపెట్టో, రాగిపెట్టో, బంగారుపెట్టో. పెట్టె ఏదైనా లోపల పెట్టే కదా! నీ లోపల దేవతార్చనా పెట్టె ఉన్నది. అది పట్టుకెళ్ళి తిరుగుతూ ఉంటావు. అక్కడ అర్చన లేకపోతే ఆయన వెళ్ళిపోతాడు. వెళ్ళిపోతాడంటే నిద్రపోతాడు.

ఈ బయట ఉన్నటువంటివి ఎప్పటికప్పుడు మారిపోయేవి–

స్వభావము, శరీరము ఇవి మారుతూ ఉంటాయి. "లావయ్యారండి, సన్నబడ్డారండి, కొంచెం నల్లబడ్డారండి, తెల్లబడ్డారండి'' ఇవన్నీ చెప్పుకుంటూ ఉంటాం కదా! అవన్నీ దేనివి? క్షరపురుషుడివి. మారేదాంట్లో మారని వాడుగా నువ్వు ఉండాలి. మారని వాడుగా నువ్వు ఉండాలంటే, నిన్ను పుట్టించినవాడు నీలో ఉన్నాడు కాబట్టి వాడితో నువ్వు కూడి ఉంటే నీకు పురుషోత్తమ ప్రాప్తి యోగం ఉంటుంది. వాడితో నువ్వు కూడి ఉండక, ఏదేదో చేస్తూ ఉంటే, పురుషోత్తమప్రాప్తి యోగము అధ్యాయము కంఠోపాఠంగా వచ్చినా ఉపయోగము లేదు. మామూలుగా భగవద్గీతలో పురుషోత్తమప్రాప్తి యోగాన్ని బాగా కంఠోపాఠం చేయిస్తారు. ఎందుకో తెలుసా? మొత్తం పద్దెనిమిది అధ్యాయాల్లో అతిచిన్నదైన అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తి యోగం. అదొక పెద్ద తాళం చెవి. నీ లోపల దైవము, నీవు, నీ స్వభావము అనే మూడు ఉన్నాయి. నీ స్వభావం నీ తోక వంటిది. అదెప్పుడూ ఆడుతూనే ఉంటుంది. నీవు దైవంతో కూడి ఉంటే, నీ స్వభావం నిన్ను ఇబ్బంది పెట్టదు. నీవు దైవాన్ని వదిలేస్తే స్వభావం చాలా ఆడించేస్తుంది. స్వభావం చేత మనం తిప్పలు పడకూడదు అనుకుంటే దైవాన్ని ఆశ్రయించి ఉండాలి. ఇదే కథ.

దైవం ఎక్కడ ఉన్నాడు? లోపల ఉన్నాడు. లోపల చూడటం మొదలుపెడితే, ఇతరుల లోపల కూడా ఎట్లా ఉన్నాడో తెలుస్తుంది. ఇతరుల లోపలే కాదు, మొత్తం అంతా వ్యాపించి ఎట్లా ఉన్నాడో తెలుస్తుంది. అసలు ఆరాధన అప్పుడే పట్టుకోలేము మనల్ని! ఆరాధన చేస్తుంటే వాడొచ్చాడా? వీడొచ్చాడా? సరిగ్గా దీపాలు

వెలుగుతున్నాయా? అగరొత్తులు ఆరిపోయాయా? రోజూ వచ్చేవాడు రాలేదే ఇవాళ? ఇవన్నీ గుర్తుండేవాడికి ఆరాధన ఏం జరుగుతుంది? అక్కడే అయిపోతుంది! సాయంత్రం ఆరాధన ఎలాగూ చేయము మనము! ఎప్పుడూ బిజీ కదా! లోపల దైవము ఉన్నాడు అనే భావముతో ఉండి, కన్నులు మూసుకొని, నీ కిష్టమైన ఒక రూపాన్ని దర్శనం చేసుకుంటూ, "ఆయనతో" కూడి తిరుగు. ఆయన్ని వదిలేసి తిరగకు. ఆయన్ని వదిలేసి తిరిగితే ఏమీ లేదు కదా! ఆయనతో కూడి తిరుగు. అంచేత, దేనితో కూడి ఉండాలి? నీకు, నీ ఆస్తిత్వానికి, నీ బ్రతుకుకి ఆధారమైనటువంటిది నీయందే ఉంది. అది ఉండడం బట్టే నీకు ఉచ్ఛ్వాస, నిశ్వాసలు జరుగుతున్నాయి. అది ఉండడం బట్టే నీకు ఆలోచన, తెలివి అనేది ఒకటి పనిచేస్తుంది. అది వెళ్ళిపోతే తెలివి లేదు, ప్రాణం లేదు. రెండూ లేకపోతే నువ్వేం ఉన్నావు?

నీలో ఉన్న వాడు 'అది'. 'వాడు' కాదు, 'ఆడది' కాదు. "*స్త్రీ నపుంసక పురుష మూర్తియును గాక*" అంటుంది భాగవతంలోని గజేంద్రమోక్షం. నపుంసకమూర్తి కాదట, పురుషమూర్తి కాదట, స్త్రీమూర్తి కాదట. వాటన్నిటికీ ఆధారమైనది 'అది'. అలాంటిది నీ లోపలే నీవలే ఉంటుంది. దానిని నీవు ఆరాధన చేసుకోవడానికి కనులు మూసుకొని, లోపల చూసుకుంటూ ఆరాధన చెయ్యాలి అని భాగవత మార్గం చెప్తుంది. దాన్నే దర్శించుకుంటూ, దాంతోనే కూడి, బయట ఇంద్రియములతో మనం పనులు చేసినా, వాక్కును వినియోగించి మాట్లాడినా, ఏంచేసినా, దాంతో కూడి ఉండి చేస్తుంటే, క్రమంగా అతనితో కూడిక పెరుగుతూ, యోగం

జరుగుతూ ఉంటుంది. యోగం చేయటమంటే ఏమిటి? అతనితో కూడటమే యోగం. మనకు నిజంగా భాషించడానికి వీలులేదు కాబట్టి "అతను" అంటూ ఉంటాం. వేదాలు "అది" అంది, "తత్" అన్నారు. దాంతో కూడి ఉండాలి. ఏ సాధన అయినా కూడి ఉండనిది సాధన కాదు. కూడి ఉండడం చేత లక్ష్మణుడు ఎప్పుడూ క్షేమంగా ఉంటాడు. కూడిలేకపోవటంచేత అమ్మ కొంచెం ఇబ్బంది పడ్డది. ఇబ్బంది పడ్డప్పుడు లోపల మళ్ళీ పెంచుకుంది. ఎంతలా పెంచుకుందంటే, రావణుడు గడ్డిపోచలా కనిపించాడు ఆవిడకి. ఎందుకని? తాను రాముడితో కూడి ఉన్నది కాబట్టి. నీవు రాముడితో కూడి ఉండి ఎదుటి వ్యక్తితో మాట్లాడుతుంటే, వాడికన్నా నీవు పెద్దవాడివే. వాడు కూడా కూడి ఉన్నాడనుకో, ఓహో! వీడు మన సోదరుడు అని నీకు తెలుస్తుంది. ఇంకో రామబంటు కదా! అందుకేకదా, "వీరంతా నా సహోదరులు అన్నాడు" త్యాగరాజు! వారందరూ నా సహోదరులు అని ఎలా అనగలిగాడండి? తాను ప్రస్తుతము లోపల ఉన్నటువంటి రాముడితో కూడి ఉండడం చేత. అలా కూడి ఉన్న వారి దర్శనాలు జరిగినాయి ఆయనకి. ఆహా! అందుకని వీళ్ళందరూ ఇలా శాశ్వతులైనారు అని తెలిసింది. ఈ రోజు మనం కూడా అదే కాబట్టి, వాళ్ళు మనకు అన్నయ్యలు– కాబట్టి "సహోదరులు మాకు" అని పాడతాడు. అలా సహోదరత్వం ఉంటుంది తప్ప, ఏం బ్రదర్! అనుకుంటే ఉండదు. వాడు వెళ్ళంగానే, వాడి గురించి వేరే మాట్లాడుకుంటూ ఉంటాం కదా! వాడేం బ్రదర్? వాడి ముందొకమాట, వెనుకొక మాట మాట్లాడేవాడు బ్రదర్ ఎట్లా అవుతాడు?

రుక్మిణీ కళ్యాణంలో ఒక భక్తురాలు భగవంతుని చేరడంలో ఉండేటువంటి ఎన్నో సాధనాపరమైన రహస్యాలు మనకి మళ్ళీ గుర్తు చేయబడతాయి. మనకు తెలిసి ఉన్నవి గుర్తుచేయబడతాయి. తెలియనివి తెలియజెప్పబడతాయి. అంచేత, మళ్ళీ మళ్ళీ చదువుకోవాలి. ఎంచేతంటే, అదే రుక్మిణీకళ్యాణం ఇంకో ఐదేళ్ళ తర్వాత మళ్ళీ చదువుకుంటే మరి కొన్ని విషయాలు తెలుస్తాయి. నీలో వికాసం కలుగుతున్నకొద్దీ, గ్రంథంలోంచి రహస్యాలు తెలిసి వస్తాయి. కేవలం అక్షరములు తెలియటంవలన అంతా తెలియదు. మనలోని దైవము మనం భాగవతం చదువుతుంటే సంతోషించి, తను కూడా కూడి చదువుతాడు. అందుకని *"పలికించు విభుండు రామభద్రుం డట".* ఆయన రాశాడా అన్ని పద్యాలు? ఆయన రాయలేదుగా. కొన్ని పద్యాలు ఆయన చేతుల్లోంచే లోపలివాడు రాశాడు. లోపలివాడు రాసిన తర్వాత, మళ్ళీ చూసుకొని పద్యం నేనే రాశానా అనుకున్నాడు. మనవాళ్ళు మందులేస్తూ ఉంటారు, ఒక్కొక్కసారి అద్భుతంగా తగ్గిపోతూ ఉంటాయి కదా! మనమే వేశామా ఈ మందు అనిపిస్తుంది. అలాంటివి ఎన్నిసార్లు వెయ్యలేదు? ఒక్కొక్కసారి ఈ చేతుల్లోంచి ఆ చేయి పనిచేస్తుంది. ఈ వాక్కులోంచి ఆ వాక్కు వ్యక్తం అవుతుంది. ఈ చూపులోంచి ఆ చూపు వ్యక్తమౌతుంది. ఈ స్పర్శలోంచి ఆ స్పర్శ వ్యక్తమౌతుంది. అది భక్తుడి పరిస్థితి. ఎక్కువగా దైవం ఉంటూ ఉంటాడు, వీడు తక్కువగా ఉంటూ ఉంటూ, ఆయనలో ఉండిపోతాడు. మధ్య మధ్యలో వీడుకూడా కాసేపు బయటకు వస్తూ ఉంటాడు. మళ్ళీ లోపలికి వెళ్ళిపోయి, ఆయన బయటకు వస్తుంటాడు. ఇలా

ఒకళ్ళు లోపలికెళ్ళిపోతే, ఒకడు బయటకు వస్తూ ఉంటాడు. నరుడు లోపలికి వెళ్ళిపోతే, నారాయణుడు బయటకు వస్తాడు. నారాయణుడు లోపలికి వెళ్ళిపోతే, నరుడు బయటకు వస్తాడు. అదే నరనారాయణుల గుహ. గుహలోకి మనం వెళ్ళిపోతే, గుహలో ఉండే నారాయణుడు బయటకు వచ్చి, మన రూపంతోనే పనిచేస్తూ ఉంటాడు. మనం మళ్ళీ బయటకు వచ్చేసరికి, ఆయన అప్పటికే చేసేసి ఉంటాడు మన పని. భక్తులకు ఇలా పని చేసిపెడతాడండి భగవంతుడు. నువ్వు చేస్తున్నావనేటువంటి కొంచెం మెరమెర తప్ప, ఆయనే అంత పనీ చేసిపెడ్తుంటాడు.

లోపలి భగవంతుడు బయటకి వ్యక్తం అవ్వాలంటే మనం వాడితో అనుసంధానం చేసుకుని, వాడికి మనం సమర్పణ చెందుతూ ఉంటే, వాడు మనలోకి మనల్ని అనుగ్రహించడానికి వస్తూ ఉంటాడు. ఇలాంటి కథలు భాగవత గ్రంథంలో చాలా ఉంటాయి. అందులో ఇది ఒకటి. ఇది చాలా బాగుంటుంది. బహుశా కృష్ణమూర్తిగారి ఆలోచనో, కృష్ణమూర్తిగారిలోన ఉన్నటువంటి మాస్టరుగారి ఆలోచనో! ప్రత్యేకంగా విజయవాడలోనే ఇట్లా మనకి భాగవతపరమైనటువంటి ఉపాఖ్యానాలు చెప్పుకోవడం అవుతోంది. ఈ ముందుమాటతో ఈ ఉపాఖ్యానం మొదలు పెడుతున్నాను.

# రుక్మిణీ కళ్యాణము

## బలరాముని వివాహము

"ఆ వనజగర్భు పంపున
రైవతుఁడను రాజు దెచ్చి రాముని కిచ్చెన్
రేవతి యనియెడు కన్యను
భూవర మును వింటి కాదె బుద్ధిం దెలియన్."

రుక్మిణీ కళ్యాణంలో మొట్టమొదటి పద్యం. ఈ పద్యం ఏం చెప్తుందంటే, బలరాముడి వివాహం. శుకమహర్షి పరీక్షిత్ మహారాజుతో చెప్తున్నాడు: "ముందు చెప్పాను కదా నీకు, మళ్ళీ ఇప్పుడు బలరాముడి కథ ఒకసారి గుర్తుపెట్టుకో" అని. ఆ వివాహం అయిన తర్వాత కృష్ణుడి వివాహం. వనజగర్భుడంటే ఎవరు? చతుర్ముఖబ్రహ్మ. "పద్మభూ" నాభి కమలంలోంచి పుట్టినటువంటివాడు. ఆయన దగ్గరకు రైవతుడనే మనువు వెళ్ళాడండి. మనువులందరూ రాజులు. ప్రజాపతులందరూ ఋషులు, బ్రాహ్మణులు. ప్రజాపతి అంటే సలహాదారు లేక పురోహితుడు. మనువు అంటే నిర్వహణాధికారి లేక రాజు. ఆ ప్రజాపతులు, మనువులు మన్వంతరాలపాటు పరిపాలిస్తూ

ఉంటారు. ఈ రైవతుడనే మనువు ఎప్పుడు ఉంటాడు? ఇప్పుడు వైవస్వత మన్వంతరం. దీని ముందు చాక్షుస మన్వంతరం. అప్పుడు మనందరికీ మూడు కళ్ళు ఉండేవి. మనం బాగా నాసిగా అయితే ఒక కన్ను మూసేశారు, మట్టితో కూరేశారు. కోరికలు పెరిగినకొద్దీ మూడో కన్ను మూసుకుపోతుంది. ఇప్పుడు అది తెరవాలంటే నానాబాధా పడాల్సి వస్తోంది. ఒకప్పుడు మూడో కన్నుతో ఉండేవాళ్ళం. చాక్షుస మన్వంతరం ముందు రైవత మన్వంతరం. ఈ రైవతుడనే మనువు బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. అప్పుడు మన మానవ జాతి stature కూడా ఇంతకన్నా చాలా ఎక్కువగా ఉండేది. ఎక్కువ ఎత్తుగాను, ఎక్కువ పుష్టిగాను, ఎక్కువ ధారుఢ్యంగాను ఉండేవారు. మంచి seven footers, ten footers, twelve footers, fourteen footers, twenty eight footers. ఇరవై ఎనిమిది అడుగుల ఎత్తు ఉన్న వాళ్ళు ఉన్నారు. ఇప్పటికీ ఒకడు ఉన్నాడట భూమి మీద sample. మనం sample ఉంచుతాం కదా! మన మాస్టరు ఫోటో samples, ఎప్పుడో మొట్టమొదటి గురుపూజలు ఫోటోలు కూడా ఉంటాయి కదా! ఇట్లా ఇరవై ఎనిమిది అడుగుల ఎత్తు sample ఉంది భూమిమీద– "యతి" అంటారు. ఆయన పాదం ఏడు అడుగులు ఉంటుందట. హిమాలయాల్లో తిరుగుతూ ఉంటాడట. మంచులో ఆయన పాదముద్ర కనిపిస్తే మైత్రేయాది మహర్షులందరూ కూడా అక్కడ సాష్టాంగ నమస్కారం చేస్తారు. మన్వంతరాలు దాటుతున్నకొద్దీ మనుషులు అట్లా పొట్టివాళ్ళు అయిపోతూ ఉంటారు. మళ్ళీ పొడుగువాళ్ళు అవుతూ ఉంటారు.

కొంచెమైపోతోంది కదా బుద్ధి! లిల్లిపుట్ వరకు కూడా ఉన్నాయి కదా కథలు! గలివర్ ట్రావెల్స్ అనే పుస్తకం అదే చెప్తోంది.

ఈయన తపస్సు కెళ్లాడండి ఆ (చాక్షుస) మన్వంతరంలో. ఇంట్లో ఆడపిల్ల ఉంది. బ్రహ్మను గురించి తపస్సు చేసి, బ్రహ్మానుభూతి పొంది, తిరిగివచ్చేసరికి అన్నీ మారిపోయినాయి. మన్వంతరం అంతా మారిపోయింది. అంటే, ఎంత తపస్సు చేశాడో మహానుభావుడు! మధ్యలో ఒక మన్వంతరం అయిపోయి, మరో మన్వంతరం వచ్చేసింది. మనుషులంతా ఇంతింతగా కన్పిస్తున్నారు. ఆయనికి ఇంట్లో చూస్తే అమ్మాయి ఉందిట అంత ఎత్తున. మరి అమ్మాయికి పెళ్లి చేయాలి కదా! ఎలా చెయ్యాలి? అంత అమ్మాయిని ఎవరు చేసుకుంటారు చెప్పండి! పిల్ల ఏదో కొంచెం పొడుగ్గా ఉంటే సరిపెట్టుకుంటాం కదా! మనకి ఆలస్యమైపోతుంటే పెళ్ళిళ్ళు. కానీ, ఇంత ఎత్తు ఉంటే ఎట్లా చేసుకుంటాం? రాజ కుమారుల్లో ఆమాత్రం ఎత్తు ఉండేవాళ్ళు కాదు అప్పుడు. సరే ఇది ఎక్కడ గోలని మళ్ళీ కళ్ళు మూసుకొని చతుర్ముఖ బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. ఇలాంటి కన్యను నా కిచ్చినప్పుడు ఒక వరుడిని ఎక్కడో సృష్టించకుండా ఉంటాడా? ఉండే ఉంటాడు. అసలు పుట్టిందంటే వెంటనే ఎక్కడో మొగపిల్లవాడు పుట్టే ఉంటాడు పెళ్ళి చేసుకోడానికి అని కదా మన విశ్వాసం! వెతకటమే మన పని. ఎక్కడ వెతుకుతావు? వెతికితే కనపడదు. తారసపడాలి. లేదా ఇదిగో ఈయన చేసినట్టు చెయ్యాలి. కళ్ళు మూసుకుని ఆరాధన చేస్తుంటే ఎవరో చెప్తారు, " వాళ్ళింట్లో మంచి అబ్బాయి ఉన్నాడు.

వెళ్ళండి.'' " వీళ్ళింట్లో మంచి అమ్మాయి ఉంది చేసుకోండి.'' అట్లా బ్రహ్మదేవుడిని ఆయన కళ్ళు మూసుకొని తపస్సు చేసి, "సృష్టికర్తా! నాకిలా ఒక అవివాహిత అయిన కూతురుంది. ఈమెకు వివాహం ఎట్లా జరిపించాలి? చూడబోతే రాజకుమారులందరూ అర్భకుల్లాగా కనిపిస్తున్నారు. చూస్తూచూస్తూ నా కూతుర్ని ఒక అర్భకుడికిచ్చి చేయలేనుకదా!" అని చెప్పి మొరపెట్టుకుంటాడు. ఎక్కడ? లోపలే మనసులో. మొర పెట్టుకుంటే వినిపిస్తుంది, "కంగారు పడక, ఏర్పాటు చేశాను" అని. ఎవరంటే, బలరాముడు.

బలరాముడు చాలా ఆజానుబాహుడు. ఆ రోజుల్లో అందరి కన్నా పొడుగైనవాడు, గుణసంపద గలవాడు. ఒక మనువు కుమార్తెను పెళ్లి చేసుకునేటువంటి చైతన్యస్థితి కలిగినవాడు. "వెళ్ళు, అడుగు. దైవము యొక్క అంశావతారము. తప్పక చేసు కుంటాడు. వెళ్ళు" అని చెప్తాడు. ఈ కథ నవమ స్కంధంలో వస్తుంది. నవమ స్కంధంలో అప్పుడు చెప్పాను కదా నీకు అని అంటున్నాడు శుకమహర్షి. *"మును వింటి కాదె"*– విన్నావు కదా అప్పుడు చెప్పినప్పుడు, గుర్తుంది కదా అంటే మనం అయితే అలా పెడతాం మొహం! మనకేం గుర్తుండదు కదా! ఎన్నిసార్లు చెప్పినా మళ్ళీ అట్లాగే పెడతాం మొహం, వింతగా! కానీ, పరీక్షిత్ మహారాజు అలాంటివాడు కాదు కదా! *"ఆ వనజగర్భు పంపున రైవతుఁడను రాజు దెచ్చి రామున కిచ్చెన్"* ఎవరు రాముడు? బలరాముడు. *"రేవతి యనియెడు కన్యను భూవర మును వింటి కాదె బుద్ధిం దెలియన్."* ఇది ఊరికే ముందు prelude అన్న మాట. దీనికి అనుపానమైనటువంటి ఒక పూర్వ ఘట్టం.

అన్నగారి పెళ్లి అయిన తర్వాత కదా తమ్ముడిది! అన్నగారి పెళ్లి, ఆయన కన్య కథ నవమ స్కంధంకు సంబంధించిన కథ. రేవతి వయస్సులో బలరాముడు కన్నా చాలా పెద్దది. ఎక్కువ వయస్సు ఉన్న ఆడపిల్లని పెళ్లి చేసుకోవచ్చా అంటే ఈ కథ చెప్పాలి. గభాలున "చేసుకోకూడదమ్మా" అని చెప్పకూడదు. నీకేం తెలుసు? భారతీయుల దగ్గర ఉండే ఒకే ఒక జబ్బేంటంటే మనకు తెలియకపోయినా సలహా చెప్తామండి! అడిగిన వారిది పాపం! అయ్యో! వాడు అడిగాడు, మనకది తెలుసా, తెలీదా అని ఏమీ లేదు. ఎందుకు చేసుకోకూడదు? చేసుకుంటాడు. సీతమ్మ రామునికన్నా ముందు పుట్టింది తెలుసా! ఏం తెలుసు నీకు? ఏం తెలియదు. ఒకరికొకరు స్వాభావికంగా నచ్చితే. . . ఏం చూడాలి? మనోభావాలు ఎలా ఉన్నాయి అని చూడాలి. మనోభావాలకు వయస్సుతో సంబంధం లేదట. బలరాముడుకి ఆ విధంగా పెళ్లి అయ్యింది.

# రుక్మిణీదేవి గుణగణములు

"ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశ భవన్ మహోగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్."

*"ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్న చందంబునన్".* అంటే, ఆకాశంలో గమనించే వాళ్ళందరికీ కూడా రాజు గరుత్మంతుడు. గరుత్మంతుడు, హనుమంతుడు వారిద్దరినీ సరిపోల్చి చెప్తారు. వాళ్ళు ఏడో ఆకాశమార్గం వరకూ కూడా విహరించగలరు. అంటే, సహస్రారం వరకూ కూడా చాలా సులభంగా ఇట్లే వెళ్లి, అట్లే వచ్చేయడం. ఏడో అకాశంలో ఎగరటమంటే సహస్రారం చేరడం, ఏడో ప్రజ్ఞా కేంద్రం. వెళ్ళి పోయి, అక్కడ ఉండిపోయేవాళ్ళు చాలామంది ఉంటారు. వీళ్ళు అన్ని ఆకాశాల్లోనూ భగవత్ కార్యంగా చరిస్తూ ఉంటారు. అందుకనే, పిలిస్తే పలుకుతూ ఉంటారు. పిలిస్తే పలికేవాళ్ళు ఎవరయ్యా ఏ లోకంలోనైనా అంటే, ఇలాంటి మహాయోగులు, భగవత్ ప్రతినిధులు. అలాంటి గరుత్మంతుడు అమరేంద్రుడిని గెల్చి, అంటే ఇంద్రుడిని గెలిచి, అమృతాన్ని తెచ్చాడుకదా ఇంతకు ముందు! ఆయన అమృతాన్ని తీసుకురావడం అంటే మనం అమృతత్వ విజయం పొందినట్లు, అమరులమైనట్లు, బ్రహ్మత్వం

చెందినట్లు. అక్కడంతా ఉంటుంది. ఇంద్రుడిని కూడా నిర్జించి, అమృతభాండాన్ని తీసుకొస్తాడు గరుత్మంతుడు. ఎలా నిర్జిస్తాడంటే ఇంద్రుడు ఆశ్చర్యపోయి, భయపడిపోయి, ఎందుకైనా మంచిది, ఇంత బలవంతుడితో స్నేహం చేసుకుంటే మంచిదని, స్నేహం కోరతాడు గరుత్మంతునితో. అలాంటి వాడు గరుత్మంతుడు. అలా ఏ విధంగా అమృతాన్ని పట్టుకొచ్చాడో, అట్లాగే *"జగతీనాథులఁ జైద్యపక్షచరులన్"*– "జైద్యుడు" అంటే శిశుపాలుడి రాజ్యం. వాడు ఒకడు ఉన్నాడు! వాడికి ఒక బృందం ఉంది, వాళ్ళూ రాజులే! *"జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి."* సాళ్వుడు కూడా ఆయనకి స్నేహితుడు. *"గెల్చి భ ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్".* చాలా క్షేమంగా తెచ్చేశారటండి. గరుత్మంతుడు ఎట్లా ఇంద్రాది దేవతలను, దిక్పాలకులను ఎదిరించి అమృత భాండాన్ని ఎలా ఎత్తుకొచ్చాశాడో, అలా చక్రాయుధం ధరించి నటువంటి శ్రీకృష్ణుడు *"భీష్మకసుతన్"* – రుక్మిణీదేవి తండ్రి పేరు భీష్మకుడు. ఆమెను ఆ విధంగా చాలా క్షేమంగా తీసుకొచ్చాడట.

ఆవిడ గుణాలు ఏమిటి? *"రాజీవగంధిన్ రమాభగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్."* "రాజీవగంధిన్" –పద్మము యొక్క సువాసన ఎట్లా ఉంటుందో, రుక్మిణీదేవి శరీరం యొక్క వాసన అలా ఉంటుందట. అంటే, సువాసనలతో కూడి నటువంటి దేహము. అంటే, అది ఎంత పవిత్ర దేహం అయి ఉండాలి? పవిత్రమైన వస్తువు అంతే పవిత్రత లేక అంతకన్నా ఎక్కువ పవిత్రత ఉండే చోటుకు చేర్చాలి కదా! అంతకన్నా తక్కువ పవిత్రత ఉండే చోటుకు చేర్చకూడదు. పవిత్రమైన వస్తువు

జాగ్రత్తగా శుచి అయిన ప్రదేశంలో పెట్టుకుంటాం కదా మనం కూడా! అందుకని ఎక్కడపడితే అక్కడ పవిత్రమైన వస్తువులు పెట్టకూడదు. పెడితే, వాటికి అపవిత్రత వస్తుందనికాదు, మనకి మంచి జరగదు. "రాజీవగంధిన్" –గంధం అంటే సువాసన– పద్మము వంటి వాసన కలిగినటువంటి శరీరము కలది రుక్మిణీదేవి. ఎంచేతంటే, "రమాభగవత్యంశ భవన్" ఆమె. సాక్షాత్తూ లక్ష్మీ దేవి అంశతో పుట్టింది. లక్ష్మీదేవి పుట్టిందే కమలంలో కదా! కనపడడమే చేతులలో కమలముతో కనబడుతుంది. ఆమె ముఖము పద్మము. కనులు పద్మదళములు. అన్నీ పద్మములే కదా! పద్మాక్షి, పద్మముఖి, పద్మసంభవ, పద్మ పాదములు, పద్మ హస్తములు– అన్నీ పద్మాలే. పద్మంగా శ్రీసూక్తం ఫలశ్రుతిలో వస్తుంది, లక్ష్మీఅష్టోత్తరములో వస్తుంది. ఇట్లా పద్మమయము. అంటే, బాగా వికాసం చెందేటువంటి వస్తువుల్లో అత్యద్భుతమైనది పద్మము. అది చైతన్య వికాసము. చైతన్యం పరిపూర్ణంగా వికసిస్తే దాన్ని పద్మంతో పోలుస్తారు. అలా పద్మముల చెరువులో ఉంటుంది అమ్మవారు. పద్మంలో కూర్చుంటుంది. పద్మం చేతిలో ధరిస్తుంది. హస్తములు కూడా పద్మములంత సున్నితంగా ఉంటాయి. కనులు పద్మదళాల్లాగాగ ఉంటాయి. ముఖమంతా కూడా ఒక పద్మమల్లే ఉంటుంది. అందానికి, పవిత్రతకు, ఆకర్షణకు, శుద్ధచైతన్యానికి, ఆత్మతత్వానికి, వికసించేటువంటి విధానానికి, అన్నిటికీ పద్మాలే. అందుకని, అలాంటి వారందరూ కూడా శ్వేతపద్మవాసులు అని చెప్తూ ఉంటారు. The White Islanders, శ్వేతపద్మ వాసుల గూర్చి మనకి మంద్రజాలంలో మాస్టారు రాస్తారు–

వారు సహజంగా సహస్రారంలో ఉంటారు. పద్మాలన్నిటిలోకల్లా సహస్రారపద్మం వెయ్యి దళములతో అత్యద్భుతంగా ఉంటుంది. అంచేత, "ఈ మొత్తం సృష్టి అంతా తలక్రిందులైనా, వారి తలలు క్రింద కావు" అని రాశారు మాస్టారు మంత్రజాలంలో.

అసలు సృష్టి పద్మమే అమ్మవారు. ఎందుకంటే, ప్రతీ గోళము ఒక పద్మమే. ఈ పద్మాలయం అంటే దాన్నిండా అనేకానేక మండలాలు ఉంటాయి– గ్రహమండలాలు, సూర్య మండలాలు, సవితృమండలాలు– అవే పద్మాలు. ఆ పద్మాల సరస్సు అలాంటి మహాలక్ష్మి యొక్క అంశతో పుట్టినటు వంటిది రుక్మిణీదేవి. ఆమె సహజంగా పద్మగంధి. మనం కూడా అమ్మవారిని పూజించాలంటే, శుచియై పూజించాలి. అమ్మవారినే కాదు, దైవారాధన చేసుకుందాం అనేకునేవారు ఎప్పుడూ ఒకటి గమనించుకోవాలి. శరీరముగాని, ముఖముగాని అంటే నోరు వాసన ఉండకుండా చూసుకోవాలి. శరీరంలో అగ్నికార్యం జరుగు తుండడంచేత వాసన పడితే, మళ్ళీ స్నానం చెయ్యడమే. ఆరాధనకి శుచియైనటువంటి మనస్సు, శుచియైన శరీరము కూడా ప్రధానం. శుచియైన ప్రదేశము ప్రధానము. అంతర్ శుచి, బాహ్యశుచి ఎక్కడ ఉంటే అక్కడ క్రమంగా వికాసానికి అవకాశం కలుగుతుంది. అంచేతే, మలినం లేకుండా చూసుకునే పద్ధతి సాధనలో ఒక ప్రధానమైన అంశమై ఉంటుంది. వేసవికాలం వచ్చిందనుకోండి, ఒకటికి నాలుగుసార్లు స్నానం చెయ్యడమే. బద్ధకించకూడదు. ఒక్కసారి దంతధావన చాలదనిపిస్తే, రెండుసార్లు చేసుకోవచ్చు. రెండుసార్లు చాలదంటే మూడుసార్లు చేసుకోవచ్చు. మనం

మాట్లాడుతుంటే, ముందున్నవాడు మూడు అడుగులు వెనక్కి వేశాడట అంటే అర్థమేంటో తెలుసా? అంత దుర్గంధం మనలోంచి వ్యక్తమౌతోందని. మనవలన దుర్గంధము వ్యాప్తి కాకూడదు. సుగంధవ్యాప్తి కావాలి. సుగంధం ఎక్కడుంటే అక్కడ అమ్మ తలుపులు తెరుచుకుని వచ్చేస్తుందట. గంధమే ఆమెకు ద్వారం – *"గంధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్"* – ఎక్కడ సువాసన ఉంటుందో అక్కడ పుష్టి కలిగిస్తూ ఉంటుంది. అందుకనే, ఇళ్ళు, ఒళ్ళు, రెండు కూడా ఎప్పుడూ దుర్వాసన లేకుండా ఉండాలి.

ఆమె పద్మగంధి. లక్ష్మి అంశతో పుట్టింది. మహాగుణమణి. మహాగుణములని కొన్ని చెప్తారు. మనుషుల్లో మామూలుగా ఉండవు. కలియుగంలో కరవు. అందులో మొట్టమొదట చెప్పేది శమము. *"శం నో మిత్ర శ్శం వరుణః".* "శం" అంటే మనసు యందు ఒక సామ్యము, సమస్థితి– ప్రశాంతత కలిగి ఉండడం. శమమే జీవితమంతా మనకి విజయానికి కారణ మవుతుంది. కంగారులో పనిచేస్తున్నవారికి ఏం పనులూ అవ్వవు. కంగారుగా ఉండేవాడు ఏ పని సవ్యంగా చెయ్యగలడు? తప్పులు చేస్తుంటాడు కదా! మొట్టమొదట గుణము శమము.

రెండవ గుణము దమము. దమమంటే ఎదుటివారి యందు ఉండేటువంటి రజస్సు, తమస్సువంటి గుణాలు ప్రకోపించినప్పుడు, మనం శాంతం వదలకుండా, క్రమంగా ఆ తమోగుణాన్ని, ఆ రజో గుణాన్ని చక్కదిద్దటం. మంచివారి సాన్నిధ్యంలో ఢాం, ఢూం అనే వాళ్ళు కూడా మెత్తగా ఉంటారు కదా! ఆ సన్నిధిలో కోపిష్టి వారికి కోపం రాదు, చిరాకు మనుషులకి చిరాకు రాదు, తొందరపాటు

మనుషులికి శాంతత వస్తుంది. ఋషుల ఆశ్రమాలకి వెళ్తే అలా జరుగుతుంది. అక్కడ పులులు, లేళ్ళు అన్యోన్యంగా ఉంటాయి. సాధారణంగా పులి, లేళ్ళు అన్యోన్యంగా ఉంటాయా? ఉండవు. పరస్పర విరుద్ధభావం ఉండే వాళ్ళందరుకూడా అక్కడ కలిసిమెలిసి ఉంటారండి. అలా ఉంటే అది దమము అంటారు. దమన శక్తి అంటే ఇతరుల యొక్క రజస్సు, తమస్సు దమింపబడతాయి. అంటే, వారిని చూడగానే అవతలవాళ్లకి వాళ్ళలో ఉండే ప్రకోపాలన్నీ చల్లారిపోతాయి. చాలాసార్లు చెప్తూ ఉంటాను – మొట్ట మొదటిసారి రావణుడు రాముడిని యుద్ధంలో చూసి నప్పుడు. అదే మొదటిసారి చూడడం. చాలా క్రోధంతో వస్తాడు, సంహరించాలని. కానీ రాముడిని చూడగానే మొత్తం రజోగుణం, తమోగుణం అన్నీ పోయి, సత్వగుణం ఆవరించేసి, అదేదో పులిపిల్లల్లే తోకాడిస్తునట్టుగా స్వభావంలో పూర్తిగా మార్పు వచ్చేస్తుంది. కేవలం రాముని చూపు అలా ఉంటుంది. అలా ఉంటాడు రాముడు. అలా ఉంటాడు కృష్ణుడు. దుర్యోధనాదులకి లోపల ఎంత ద్వేషం ఉన్నా, కృష్ణుడిని చూడగానే అవన్నీ కరిగిపోయి, జీవుని స్వతః సిద్ధమైనటువంటి సత్వగుణం ప్రకటింపబడి, అట్లా పెంపుడు కుక్కలాగా తోకాడిస్తూ, వింటూ ఉంటారు చెప్పింది. ఆ రాయబారంలో కృష్ణుడు అందరిని కఠినమైనటువంటి మాటలు మాట్లాడినా, ఎవ్వరూ చోటు వదలక, అట్లా గుడ్లు అప్పగించి, నోళ్ళు తెరిచి, చెప్పింది వింటారు.

రుక్మిణీ కళ్యాణంలో కూడా అంతే జరుగుతుంది. ‘‘ఆయన వస్తాడు. ఆయుధాలు పట్టుకుని మనమంతా జాగ్రత్తగా ఉండాలి. ఏ క్షణంలోనైనా రావచ్చు. అసలే మాయగాడు. జాగ్రత్తగా ఉండండి.’’

అని అందరికి హెచ్చరికలు జారీ చేసి, అందరూ సాయుధులై సంసిద్ధంగా ఉంటే, ఒకసారి చక్కగా నవ్వుతాడు వాళ్ళను చూసి, "ఏంట్రా! వెర్రివెధవల్లారా!" అన్నట్టు. నవ్వంగానే, అందరూ అట్లా నిశ్చేష్టులైపోతారు. అలా గుడ్లు అప్పగించి చూస్తూ ఉంటారు. అలా వెళ్లి, redcarpet మీదుగా వెళ్ళినట్టుగా ఆమె చేయి తన చేతిలోకి తీసుకుని, చక్కగా వచ్చి రథమెక్కించి, ఆ తర్వాత బయలుదేరి వెళ్తూ, వీడ్కోలు చెప్తాడు. అప్పుడు వాళ్ళకి తెలివొస్తుంది. అది దమము అంటే– మహా గుణము.

శమమే లేనివాడికి దమము ఎట్లా వస్తుంది? ''ఏమిటోనండి! ఎదుటివారిని బోల్డు అందాం అని వెళ్ళాను. ఏమీ అనలేకపోయాను. వచ్చేశాను" అంటాడు కదా! "ఆయన్ని చూస్తే ఏమీ మాట్లాడ బుద్ధి కాలేదండి" అంటాడు. "నీకెందుకు? నేను మాట్లాడతాను, పద" అంటాడు, ఎవరినో వెంటేసుకొని. ఒక సత్పురుషుడు చూడంగానే నవ్వుతాడు. అంటే, జీవుడిని పలకరిస్తాడు "బాగున్నావా" అని. పలకరిస్తే, ఇంత వకాల్తా పుచ్చుకొచ్చినవాడు మాట్లాడలేదు. "ఇదేంటయ్యా! బోల్డు చెప్పావు మాట్లాడతానని. ఏం చెప్పలేదు" అంటే, "ఏంటో! ఆయన్ని చూస్తే ఏం చెప్పబుద్ధి కాలేదండి" అంటాడు. "అయినా, మీరు కూడా కొంచెం ఆలోచించుకోవాలి" అని వీడు చెప్తేస్తుంటాడు ఇంక! దమము ఒక అద్భుతమైన శక్తి. ఎవరికుంటుంది? బాగా శమమునందుండి, సమభావం కలిగినటువంటి వాళ్ళకి దమము ఉంటుంది.

తర్వాత, మూడో గుణము ఉంది– దేనికైనా వేచి ఉండటం, Ability to wait, తితీక్ష. తితీక్ష అనేటువంటి ఒక గుణం ఉంది.

వేచి ఉండుట. వేచి ఉన్నవారి దగ్గరకి అన్నీ వస్తాయి. తొందర పడేవాళ్ళ దగ్గరకి ఏమీ రావు. వేచి వున్నవారికి అన్నీ కలిసివస్తాయి. Ability to wait అనేది పెద్ద గుణం. ఈ గుణాలన్నీ శనిగ్రహం ఇస్తాడండి. శనైశ్చరుడు దగ్గర ఉంటాయి శమము, దమము, తితీక్ష. ఎక్కడికన్నా వెళ్ళామనుకోండి, ఎంతసేపు కూర్చుంటామండి! ఎంతసేపు wait చేస్తాం? అసహనం వస్తుంది. ధర్మరాజుకీ గుణాలన్నీ ఉన్నాయి. అందుకనే అన్నీ శుభ్రంగా జయించేశాడు. తితీక్ష మూడో గుణం.

శమము, దమము, తితీక్ష, శ్రద్ధ. అన్ని విషయాల్లో శ్రద్ధ ఉండేవాడే అవసరమైనప్పుడు వాడికి శ్రద్ధ పనికొస్తుంది. General గా అశ్రద్ధగా ఉండి, important పనుల్లో శ్రద్ధగా ఉందామనుకుంటే కుదరదు. ఎందుకంటే, నీకు మాములుగా స్వభావంలో అశ్రద్ధ ఉన్నప్పుడు, శ్రద్ధ అవసరమైన చోట అది నీచేతికి అంది రాదు. శ్రద్ధ ఎలా ఉండాలంటే చిన్నచిన్న పనుల దగ్గరనుంచి, అన్ని పనులవరకు కూడా, ప్రతి పనిని చాలా శ్రద్ధగా చెయ్యాలి. తీసిన ఒక వస్తువుని తీసినచోట పెట్టగలిగుండాలి. పెట్టంగా! తీసిన వస్తువు తీసినచోట పెట్టడం అనేటువంటిది ఈ రోజుల్లో ఎక్కడా చూడము. ఎక్కడో పెడతాం! మనకి గుర్తు ఉండదు కదా! ఎలా తీశావో, అలాగే పెట్టగలిగుండాలి. Everything has to be restored to its original order. అది శ్రద్ధ. చిన్నచిన్న విషయాల్లో శ్రద్ధ లేకుండా, అలా ఒక డంబాచారంగా భాగవతం తీసి చదువుకున్నామనుకోండి, ఏమీ అర్థం కాదు. చదివేస్తే అది భాగవతం కాదు.

మొన్న ఒక ఊరు వెళ్తే, పది స్కంధాలు చదివేశాను భాగవతం, దశమ స్కంధం వరకూ వచ్చేశానన్నాడు ఒకాయన. దశమ స్కంధం వరకు భాగవతం వస్తే ఇక తెలియందంటూ ఏమీ ఉండదు సృష్టిలో. ఏమంటావు అప్పుడు? "చాలా సంతోషం" అన్నాను. ఏమీ అనకూడదు కదా! కాస్త ఏమన్నా అంటే ఇబ్బంది వచ్చేస్తుంది! అంతా అయిన తర్వాత "నాకో డౌటుంది" అన్నాడు. ఏమి డౌటు అది? ముప్పైసార్లు అంతకుముందు చెప్పిన విషయాలు ఉన్నాయి అందులో. భాగవతం దశమస్కంధం వరకూ చదువుకున్నవాడికి ఇంకే doubt ఉండకూడదు. సృష్టి ఎలా వస్తుందో తెలియాలి, జీవులెందుకొస్తారో తెలియాలి, ఈ మన్వంతరాలు ఏమిటో తెలియాలి, ఈ గోళాలు అన్నీ ఎట్లా పుడతాయో, ఎట్లా వెళ్ళిపోతాయో తెలియాలి, యుగాలు తెలియాలి, కల్పాలు తెలియాలి, అన్నీ తెలియాలి. ఏం తెలియవు! మనకు అక్షరాలు వచ్చు, అంతే గబ గబా అక్షరాలు చదువుకుంటూ వెళ్ళిపోయావు, పుస్తకం అయిపోయింది!

మొన్న ఎవరో అడిగారు బెంగుళూరులో, "ఏవండీ! ఇంగ్లీషులో చిన్నదిగా ఉంది. తెలుగులో పెద్దదిగా ఉంది మీరు రాసిన బుక్?" అంటే, గభాలున ఒకావిడ సమాధానం చెప్పింది— "ఇంగ్లీషు భాషలో ఇరవైఆరు అక్షరాలే కదా. తెలుగు భాషలో ఎక్కువ అక్షరాలు కదా. అంచేత, ఇది చిన్నదిగా ఉంది. అది పెద్దగా ఉంది", అంటే వాళ్ళు సమాధానపడిపోయారు. చాలా ఆశ్చర్యం తెలుసా! తక్కువ అక్షరాలుంటే తక్కువలో అయిపోతుందా అట్లా? మనకు ఇంగ్లీషులోనే ఎక్కువ చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే

తెలుగులో ఒక పదం వాడితే ఆఒక్క పదంలో మూడు వ్యాఖ్యలు చెప్పేస్తాం. ఇంగ్లీషులో మూడు పదాలు పడతాయి. కానీ ఆవిడ చెప్పిన సమాధానం వాళ్ళకీ నచ్చింది. Quantitative under-standing తప్ప qualitative understanding ఉండదు కదా! అందుకని, ఆవిడచెప్పిన సమాధానం టక్కున నచ్చింది. "అబ్బా! ఎంత బాగా చెప్పారు" అని అందరూ అన్నారు. అంటే, నిజమే కావచ్చు అనుకుంది ఆవిడ. చదవటం అంటే అక్షరాలు తెలిస్తే చదువొచ్చినట్టాండి? అందుకని మాస్టరుగారు గోలపెట్టేస్తూ ఉండేవారు, " Literacy is not education" అని. Literacy వేరు, Education వేరు. ఒక పద్యం చదువుకోవటమంటే, చదివే ప్రతి పదం చూసుకొని, వెతుక్కుని చదువుకోవాలి. చదువు వేరు. విద్య వేరు.

రుక్మిణీదేవికి ఇలాంటి మహాగుణాలు ఉన్నాయండి. శమము, దమము, తితీక్ష, శ్రద్ధ, సమాధానము. సమాధానం అంటే ఆధానము, సమము. ఉన్న పరిస్థితిని చక్కగా అవగాహన చేసుకొని, తదనుగుణంగా మన ప్రయత్నం చేసుకుంటూ ఉండడం. సమాధాన పడ్డాను అని అంటే అర్థం ఏమిటంటే అర్థం చేసుకుని, తదనుగుణంగా నా కర్తవ్యాన్ని మలుచుకుని, నేనేం చెయ్యాలో అది నిర్వర్తించుకుంటూ ఉండడం. ఇలాంటి గుణాలు ఉన్నాయండి ఆవిడకి. ఆవిడ మహాగుణమణి.

ఆమె *"రాజీవగంధిన్ రమాభగవత్యంశ భవన్ మహాగుణ మణిన్ బాలామణిన్".* అంటే బాలలలో బాలామణి. అంటే ఆ వయస్సు వారందరికన్నా ఎక్కువ ప్రకాశంగా ఉంటుంది. స్వయం

ప్రకాశం కలది. మణి అంటే స్వయంప్రకాశం. “రుక్మిణిన్” – రుక్మము అంటే బంగారము. రుక్మిణి అంటే బంగారు దేహము గలది అని అర్థం. రుక్మిణి పుట్టుకతోనే బంగారు దేహం కలిగి నటువంటిది. అంటే, బంగారు దేహపు నిర్మాణం చేసుకోవలసిన పరిస్థితి లేదు. బంగారు దేహం కలిగి ఉండబట్టే ఆమె అంతకన్నా ఉన్నతమైన విషయములందు ఆసక్తి కలిగిఉన్నది తప్ప, పదార్థ మయమైన విషయములందు ఆమెకి ఆసక్తి లేదు. పరమార్థ మందు ఆసక్తి కలిగిన జీవి రుక్మిణి. ఆమె కృష్ణుని భార్యలలో ప్రత్యేకమైనటువంటిది. నిజానికి కృష్ణుడు వరించిన కన్య. మిగతా వాళ్ళందరినీ కొంతమందిని గెలుచుకున్నాడు, కొంతమంది భయంచేత వాళ్ళే తెచ్చి ఇచ్చేశారు. వారు కృష్ణుని వరించి ఉండ వచ్చు. కృష్ణుని వరించడానికేం, ఎవరైనా వరిస్తారు. కానీ, కృష్ణుడు వరించిన కన్య రుక్మిణి. ఎంచేతంటే, ఆమె పుట్టుకతోనే అలాంటి పరిస్థితిలో ఉంది. అమరత్వం కలిగివున్నటువంటి స్త్రీ, జీవి. అంటే, అమరలోకం నుంచి దిగివచ్చిన జీవి. కారణజన్మురాలు అయి వుండటం చేత అలాంటి గుణాలు ఆమెకి ఉన్నాయి. ఇలాంటి సద్గుణాలతో కూడినటువంటి మూర్తి రుక్మిణి అని ఈ పద్యం చెప్తుంది.

“అనిన రా జిట్లనియె. మున్ను రాక్షస వివాహంబున స్వయంవరంబునకు వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయె నని పలికితివి కృష్ణుం డొక్కరుం డెవ్విధంబున సాళ్వాదులం జయించి తన పురంబునకుం జనియె నదియునుంగాక.”

ఈయన ఇంతకముందు బలరాముడి కథ ఒక పద్యంలో చెప్పేశాడు కదా! కృష్ణుడు ఎట్లా పెళ్ళిచేసుకున్నాడు అనేది ఇంకో పద్యంలో చెప్పేశాడు. అలా గెల్చుకుని, తెచ్చుకున్నాడన్నాడు. అంటే, మనబోటి వాళ్ళు "ఆహా! సరే తర్వాత" అంటాము. అలా అనకుండా, "అలాకాదమ్మా! గురువుగారు! కొంచెం వివరంగా చెప్పండి" అని పరీక్షిత్తు అడుగుతున్నాడు. ఎలా తెచ్చాడు? ఒక్కడే వెళ్ళాడు అని ఇది వరకు చెప్పావు. ఒక్కడే వెళ్లి, రాక్షస వివాహం ఉన్నది కదా! ఎత్తుకుపోవటం కదా! *"రాక్షసవివాహంబున స్వయంవరంబునకు వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయె నని పలికితివి కృష్ణుం డొక్కరుం డెవ్విధంబున సాళ్వాదులం జయించి తన పురంబునకుం జనియె"* అట్లా ఎట్లా వెళ్ళాడు? ఆ సాహసో పేతమైనటువంటి కృత్యం, అది కూడా కొంత వివరించమన్నాడు. ఎందుకంటే, ఈయన క్షత్రియుడు కదా! భగవంతుని యొక్క సాహస గుణాలు మనం చదువుకుంటే మనకి కూడా లోపల కొంత ధైర్యం వస్తుంది. ఇలాంటివాడు మనకి తోడై ఉంటాడు కదా! *"తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు"* – ఒక్క రాముడుంటే చాలు, ఇంకేమీ వద్దు మనకి. అవతల పక్క ఎంతమందున్నా ఫర్వాలేదు. ఇలా పాట మనం గట్టిగా అర్థం చేసుకుంటే రాముడు ఒక్కడుంటే ఈ సృష్టిలో ఇంకేం కావాలి చెప్పండి? ఇంక దేనికీ కొదవ లేదు. అలాగ ఇంకొకటి చెప్పు సుమా అన్నాడు!

"కళ్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై
కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు సా

కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ
కళ్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్."

అడిగేవాడిని బట్టి చెప్పేవాడు ఉంటాడు. "ఈ ఈ విషయాల్లో ఇంకొంచెం వివరం కావాలి" అని అడగడంలో శ్రోతయొక్క ఉత్సుకత, శ్రద్ధ, కుతూహలము, భక్తి ఇవన్నీ కనిపిస్తాయి. అంచేతే, పెద్దవాళ్ళు చెప్పేటప్పుడు ముందు టూకీగా చెప్తూ ఉంటారు. టూకీగా చెప్తున్నప్పుడు, ఆయన్ని ఆపి, ఇంకొంచెం వివరించండి అని అడిగేవాళ్ళు ఉంటే వివరిస్తాడు. లేకపోతే వివరించడు. తనకి తెలిసిందంతా చెప్పేద్దామనే కుతూహలం ఉండేవారు వేరు. వినేవాడిని బట్టి చెప్పటం అనేది వేరు. అంచేత, శ్రద్ధ బట్టి ఈయన అడిగాడు. ఏమడిగాడు? *"కళ్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్"*– ఎప్పటినుంచో వింటున్నాడు పరీక్షిత్తు విష్ణు కథలు. దశమ స్కంధం వరకూ వచ్చింది భాగవతం. శుకమహర్షి చెప్తూ వస్తున్నాడు కదా! అవి వింటూ ఉంటే *"ముక్తవైకల్యం డెవ్వఁడు"*– వైకళ్యాల నుంచి ముక్తి వచ్చేస్తూ ఉంటుందటండి. భాగవతం వింటున్నప్పుడు, మనకుండేటువంటి వికారాలు కాస్త అట్లా బయటకి వెళ్తాయి. వాటి నుంచి మనం ముక్తి పొందుతాము. భగవత్ కథలు వింటున్నప్పుడు, అందులో జీవుడికి కలిగినటువంటి ఆకర్షణ చేత, ఇతర సమస్యలు, దేహబాధలు, కుటుంబబాధలు, ఉద్యోగబాధలు, మిగతా పీడలు– ఇవన్నీ ఏముండవట. అవి గుర్తుండవు. ఆ వైకళ్యాల నుంచి ముక్తి పొందుతాడు.

*"విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవైకల్యుం డెవ్వఁడు తృప్తుఁడౌ"*–తృప్తి ఉండదట. ఎన్నిసార్లు చెప్తున్నా, ఇంకా చెప్పండి, ఇంకా

చెప్పండి అంటారట. అట్లా ఉంటాయట విష్ణుకథలు. అందుకనే నారదమహర్షి మొదట్లో చెప్తాడు వేదవ్యాసుడికి, "విష్ణుకథలుగా నువ్వు సృష్టి ధర్మాలన్నీ చెప్పుంటే అది ఎక్కువ బాగుండేది నీక్కూడా. నువ్వు అట్లా చెప్పకపోవటంవల్ల నీకే లోపల కొరతగా ఉంది. మహాభారతం అంతా చెప్పిన తర్వాత వేదవ్యాసునికి కొరత ఉండి పోయింది – "ఏదో సరిగ్గా చెప్పలేదు నేను" అని. ఏదో చెప్పలేదంటే, అంతా ధర్మపరంగా చెప్పాడు భారతం. దైవ పరంగా చెప్పలేదు. దైవపరంగా ధర్మసూక్ష్మాల్ని చెప్తూ ఉంటే, ధర్మమూ తెలుస్తుంది, దైవము నందు ఆకర్షణ చెంది జీవుడూ ఉద్ధరింపబడుతూ ఉంటాడు. ఇప్పుడు యోగం ఉందనుకోండి, అది ఒక శాస్త్రంగా చదువుకొని యోగం చేసేవాళ్ళకి ఏం యోగం అబ్బదు. ఎంచేత అని అంటే భక్తి లేకపోవడంతో. భక్తితో కూడి అష్టాంగయోగం చేసుకుంటే ఆ కథ వేరు. భక్తి లేక శాస్త్రం, శాస్త్రంగా చదువుకుంటే ఆ కథ వేరు. శాస్త్రానికి రాణింపు అది దైవపరంగా నేర్చుకుంటేనే ఉంటుంది. ఏ విద్యైనా రాణించాలంటే అది దైవ పరంగా నేర్చుకోవాలి. యోగవిద్యైనా అంతే, ధర్మాలైనా అంతే. అట్లా ధర్మసూత్రాలన్నీ రోజూ చదువుకుంటూ ఉంటే బోరుకొడ్తూ ఉంటుంది. ఆ ధర్మాలని రాముడు ఎట్లా నిర్వర్తించాడు? కృష్ణుడు ఎట్లా నిర్వర్తించాడు? ధర్మరాజు లాంటి వారు ఎలా నిర్వర్తించారు? భాగవతుడు ఎట్లా నిర్వర్తించాడు? అట్లా కథల్లో చెప్పుకుంటూ వెళ్ళామనుకోండి, అప్పుడు నిలిచిపోతాయి. దానికొక రాణింపు ఉంటుంది. ఒక సంతృప్తి ఉంటుంది. చెప్పేవాడికీ బాగుంటుంది, వినేవాడికీ బాగుంటుంది.

*"విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవైకల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు"* –ఇంకా కొత్తగా, ఇంకా తెలుసుకుందాం, ఇంకా తెలుసుకుందాం అని ఉంటుంది. *"సాకల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ కళ్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్."* పాఠం చెప్పే వాడు, వినేవాడికి కుతూహలం పుట్టించాలి, వాడిని ఊరిస్తూ చెప్పాలి. అలా ఊరిస్తూ, ఊరిస్తూ అన్నం పెట్టిన దారి వేరండి. ఇట్లా పారేసి, తినమంటే వేరుకదా! అట్లా దేంట్లో అయినా ఓ సార్థకత ఉండాలి. ఒక సాఫల్యం ఉండాలి. ఆ సాఫల్యం ఉండాలంటే సాకల్యంగా చెప్పుకోవాలి. అంచేత, అక్కడ చెప్పమన్నాడు.

"భూషణములు చెవులకు బుధ
తోషణము లనేక జన్మదురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్."

*"గరుడగమన రారా మమ్మేలు కోరా"* అని చెప్పి పాడాడు కదా! "నువ్వు వచ్చి ఏలుకో" అని. ఇక్కడ ఏమని చెప్తున్నాడు? చెవులకి ఏమిటయ్యా భూషణాలంటే, రవ్వల దుద్దులు కాదట. మరి ఏమిటి భగవంతుని గుణభాషణములు. దైవం గూర్చి వినాలి అనేటువంటి తపన ఉండేటువంటి ఇంద్రియముగా నీ చెవి మారితే అదృష్టం. అలాంటి చెవి కాని చెవి ఎందుకు? చేటంత చెవి ఉందనుకోండి? అంతమాత్రంచేత విజ్ఞాని అవ్వక్కర్లేదు. చెవిని

దేనికి వాడుతున్నావు? దేనివలన చెవి యందు ఉండేటువంటి ప్రజ్ఞ విప్పారుతుంది? వినికిడే అంతా. ఇంద్రియాల్లో ఆకాశగుణం కలిగినటువంటిది చెవి. పంచభూతాల్లో అత్యుత్తమైనటువంటిది ఆకాశం. వినికిడి ఉన్నవారికి చూపు చాలా సులభం. చూపు లేకపోయినా ఫర్వాలేదు, వినికిడుంటే చాలు. వినికిడున్నవాడు, చూడకుండానే "అదిగో కృష్ణుడు వస్తున్నాడు. అదిగో పరమగురువు వస్తున్నాడు" అని చెప్పగలడు. సూరదాసు ఎట్లా నడిచాడండి? ఇట్లా గాలిలో కఱ్ఱపట్టుకొని వెళ్తుండేవాడు, నేలమీద పెట్టేవాడుకాదు. పుట్టు గుడ్డివాడు. పాడుకుంటూ, అన్నిచోట్లకి కళ్ళున్నవాడికన్నా చక్కగా నడిచి వెళ్ళిపోయేవాడు. "ఈ కఱ్ఱ ఇట్లా (గాలిలో) ఎందుకు పెట్టావు? నేలమీద పెట్టుకుంటూ తడుముకుంటూ వెళ్ళాలి కదా?" అంటే, "ఆయన పట్టుకున్నాడు. ఆయన ముందు కఱ్ఱ పట్టుకుని, నన్ను వెనకాలనుంచి నడిపిస్తున్నాడు. నేను ఆయన గుణకీర్తనం చేస్తూ, నడిచి వెళ్లిపోతున్నాను. ఆయన నాకు వినిపిస్తూ ఉంటాడు. ఆయన అందెల సవ్వడి వినిపిస్తుంది.'' అని అంటాడు. వినిపిస్తే కనిపిస్తుంది. అంచేత, చూపు కన్నా వినికిడి ఎక్కువ ముఖ్యమండి. చూపు అనేటువంటిది అగ్ని. పంచభూతాల్లో– ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి– మధ్యస్థమైనటువంటిది కన్ను. వినికిడి చాలా ప్రధానం.

అలా భగవంతుని యొక్క గుణగణములను బాగా వింటూ ఉండేటువంటి వాళ్ళు ఎవరైతే ఉంటారో, వారికి గ్రహింపు శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఏకసంథాగ్రాహు లంటారు కదా! ఒక్కసారి వింటే మరచిపోనివాళ్ళు ఉంటారు కదా! వాడే ఒక

గురువుకి చాలా ఆనందం కలిగించేటువంటి శిష్యుడు. ఒక్కసారి వింటే మర్చిపోడు. అలాంటి వాడికి ఎన్ని విద్యలైనా చెప్పచ్చు. ఎన్నిసార్లు చెప్పినా మర్చిపోయేవాళ్లకి ఓపిగ్గా చెప్తాడుగాని, వారిని చూస్తే ఒక్కసారి చెప్తే విని నేర్చుకునే వాడియందు ఉండేటువంటి సంతోషం ఉంటుందా గురువుకి? "మనిషికో మాట, పశువుకో దెబ్బ" అన్నారు. మనిషన్నవాడికి ఒక్కసారి చెప్తే చాలట. అంచేత, మళ్ళీ మళ్ళీ చెప్పడానికి ఏమీ సందేహించడట, ఓపికుండేటువంటివాడు.

పరీక్షిత్ మహారాజు బాగా వినడం నేర్చుకున్నాడు కదా! ఎప్పటినుంచి వింటున్నాడు? చిన్నప్పుడు ధర్మరాజాది తాతలు చెప్పారు. అటుపైన కొలువులో గురువులు చెప్పారు. తనకే స్వతఃసిద్ధంగా కృష్ణుని యందు ప్రేమ. చెప్తున్నాడు, "టూకీగా చెప్పవద్దు" అని శుకమహర్షితో అంటున్నాడు. ఎందుకంటే, ఈయన వినగలడు కాబట్టి. "బుధతోషణములు" – తోషణ మంటే సంతోషం. ఎవరికి భగవంతునియొక్క కథలు, గుణగణములతో కూడినటువంటి విశేషములు వినడం వలన సంతోషం కలుగుతుందో, వాళ్ళే బుధులు, తెలిసినవారు. ఎవరు తెలిసినవారంటే, దివ్యకథలను వినగోరుట తెలిసినవాళ్ళు. వాళ్ళే తెలిసినవాళ్ళు. ఏది వినడానికి చెవి ఉత్సాహపడుతుందో, ఏది వినాలని ఎప్పుడూ మనసు ఉత్సాహపడుతుందో, అలాంటి వాళ్ళే బుధులు, తెలిసినవారు. వాళ్ళ గురించి, వీళ్ళ గురించి చెప్తుంటే వినటానికి ఉత్సాహపడడు బుధుడు. దైవం గురించి చెప్తే విని సంతోషిస్తాడు. మరీ పిచ్చి మాటలు ఎక్కువగా ఉంటే "అవన్నీ ఎందుకులెండి. ఏదైనా మంచి మాటలు మాట్లాడుకుందాం"

అనగలిగిన సాధకుడు సత్సాధకుడు. ఇద్దరు సాధకులు కలిసి, అక్కడ లేని మూడో సాధకుడి గురించి మాట్లాడుకుంటూ ఉన్నారను కోండి. . . ఎంత టైము అయినా అయిపోతుంది. వృథా అయిపోతుంది.

"బుధతోషణములు" – ఎవరు తెలిసినవారు, ఎవరు బుద్ధి మంతులంటే, భగవంతుని యొక్క గుణగణములు వినడమందు ఆసక్తి చూపించేవాళ్ళు బుధులు. *"బుధతోషణము లనేక జన్మ దురితౌఘ విని శ్శోషణములు".* ఈ భగవత్ కథలు వింటూ ఉంటే, మనలో ఉండే కల్మషాలన్నీ కరుగుతాయండి. అందుకనే పూర్వకాలంలో సాయంత్రం అయ్యేసరికల్లా పురాణ కాలక్షేపం అని గుడికెళ్ళి పోయేవాళ్ళు. ఆర్యధర్మంలో పురాణ కాలక్షేపం చాలా ముఖ్యం. ఇప్పుడు పురాణ కాలక్షేపం టెలివిజన్ ద్వారా మనింటికే వచ్చేస్తోంది కదా! భారతమో, భాగవతమో, రామాయణమో, ఏదో ఒకటి. చెప్పేవారు ఎవరైనా కానీయండి, చెప్తున్న విషయం దైవం గూర్చేగా! అట్లాంటి కార్యక్రమాలు రోజూ సాయంత్రం చూడడం నేర్చుకున్నవాళ్ళు, మిగతా కార్యక్రమాలకి రమ్మంటే రారు. ఇప్పటికీ ఉన్నారు మన వాళ్ళల్లో అలా చూసేవాళ్ళు! వాళ్ళు బుధులు కాదు? ఎవరు బుధులు? ఏ ఊరెళ్ళినా, ఆ సమయానికి టెలివిజన్లో రామాయణమో, భారతమో, భాగవతమో, తెలుగో, హిందీయో ఏదైతే అది. ఇంత కలియుగంలో కూడా అలాంటివి ఒక పక్క భగవంతుడు ఏర్పాటు చేస్తూనే ఉన్నాడు. అది విందామనుంటుందా? లేదు సినిమా చూద్దాం అనిపిస్తుంది! టెలివిజన్లో సినిమాలు, పాటలు, కార్టూన్లు, స్పోర్ట్స్, వార్తా ఛానెల్స్ ఉంటాయి. అన్నీ ఇబ్బడి ముబ్బడిగా బోల్డున్నాయి. సాయంత్రం

అయ్యేసరికి ఏమి వింటావు? నిద్రలోకి వెళ్లేముందు ఏది విని పడుకుంటే బాగుంటుంది నీకు?

భగవత్పరమైన విషయములు బాగా కూలంకషంగా విని, ఆనందిస్తూ అటుపైన నిద్రకు ఉపక్రమించినవాడు పుణ్యక్షేత్ర దర్శనములు, సద్గురువు ఆశ్రమములు, ఇలాంటి వాటిల్లో నిద్రలో ప్రయాణించి ప్రవేశించవచ్చును. ఒక్కొక్కసారి స్వప్నానుభూతులు కలుగుతాయి. స్వప్నానుభూతి కలగకపోయినా, ప్రతి నిత్యం ఒక దైవాశ్రమానికో, ఒక దివ్యక్షేత్రానికో వెళ్తున్నట్లుగా భావన చేసుకొని నిద్రలోకి వెళ్ళాలి. అలా వెళ్ళడం రోజు ముగింపుకి చాలా శుభప్రదం. సినిమా అంతా అయిపోయిన తర్వాత శుభం అని వేస్తారే, అట్లా ఏ విధంగా రాత్రి నువ్వు conclude చేశావు? ప్రతి రాత్రి ఒక మరణం వంటిది. ప్రతి పగలు ఒక జననం వంటిదే. ప్రతి రోజు కథ ఒక జన్మ వంటిదే. చిట్ట చివరికి ఎక్కడ చేరదాం అనుకుంటున్నావు? బాగా విపరీతమైనటువంటి, హింసాత్మకమైన ఒక కార్యక్రమం చూసి పడుకున్నామనుకోండి. అలా పడుకుంటే నిద్రలో కూడా హింసే వస్తుంది. స్పర్ధలతో కూడినటువంటి విషయాలన్నీ బాగా విని, చూచి పడుకున్నామనుకోండి, అలాంటిదే వస్తుంది స్వప్నంలో. అందుకనే పూర్వకాలం పురాణమును చదివి, అటుపైన మూసి, గదిలో ఒక అగరొత్తును వెలిగించి, ఒక దీపం వెలిగించి పడుకోమని చెప్పేవారు. దైవస్మరణ చేస్తూ పడుకోవాలి. దైవస్మరణ చేస్తూ పడుకున్నటువంటివారు నిద్రలో దివ్య అనుభూతిని పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దానికి

ముందు preparationగా ఇలాంటి శ్రవణం చేశామనుకోండి, అద్భుతంగా ఉంటుంది. తెలియటమంటే అది.

దినచర్యలో రోజు ఎలా ప్రారంభించావన్నది ఎంత ముఖ్యమో, రోజు ఎలా ముగించావు అనేది కూడా అంతే ముఖ్యం. నీవు రోజు ముగించే విధానంలో నీవు జీవితం ముగించే విధానం ఉంది, గుర్తుపెట్టుకోండి. రాత్రి పదకొండు పన్నెండు గంటల వరకు పనికిరానటువంటి విషయములన్నీ చూసి నిద్రపోయేవాడు, అతని జీవితం చిట్టచివరికి అంత బాగా ముగియదు. ఎంచేతంటే, నువ్వు ఎలా మలిస్తే అలా మలచబడుతుంది జీవితం. నీ దినచర్య ముగింపు ఎలా ఉన్నదనేది చాలా ముఖ్యం. ముగింపుని బట్టి మళ్ళీ ప్రారంభం ఉంటుంది. నిన్న సరిగ్గా ముగిస్తే, ఈ రోజు ఉదయం బాగుంటుంది. నిన్న సరిగ్గా ముగించలేదనుకోండి, రాత్రి పూట ఎక్కువ తిన్నామనుకోండి, ఆ తర్వాత ఏవో కాలక్షేపం చేసామనుకోండి, నిద్ర చాల్లేదనుకోండి తిన్నదరక్క, నిద్ర చాలకపోతే, మరురోజు ఉదయం మొహం అదో మాదిరిగా ఉంటుంది. క్లుప్తంగా, త్వరగా భోజనం చేసి, సత్కాలక్షేపం చేస్తూ ముగించి, చివరికొక ప్రార్థన చేసి పడుకున్నామనుకోండి. మర్నాడు ఉదయం చాలా పెందలకడనే మెలకువ వస్తుంది. అలారం అక్కర్లేదు. వికసించి ఉంటుంది ముఖపద్మం. అంతేగానీ, పొద్దున్నే చిటపటలాడుతూ ఉండదు. ఇవన్నీ ఎక్కడ నుంచి వస్తాయి? మనకి దినచర్యలో భాగంగా ఏర్పరుచుకుంటే వస్తాయి.

తెలిసినవారు ఎక్కువగా కోరుకునేది దివ్య విషయముల యొక్క శ్రవణమే. ఇతర విషయముల యందు ఆసక్తి అంతంత

మాత్రమే. బుధతోషణములు అలా చేస్తూ ఉంటే పాపములన్నీ కరిగిపోతాయి. వినిశ్శోషణములంటే ఇలా చెరువులు ఎండి పోయినట్లు, సముద్ర మంత పాపాలు ఉన్నా, అవన్నీ కూడా అట్లా ఇంకి పోతాయటండి. *"దురితౌఘ విని శ్శోషణములు మంగళతర ఘోషణములు".* ఎందుకు మంగళవాయిద్యాలు వింటూ ఉంటాం? అవి మంగళకరమైనటువంటి ప్రజ్ఞల్నే వాతావరణంలో మిగిల్చి ఇతరములైన వాటిని పారద్రోలుతాయి. ఒక సన్నాయిగాని, ఒక వీణగాని, ఒక మృదంగంగాని, ఒక వేణువుగాని, వీటి ధ్వని వల్ల అసురశక్తులన్నీ కూడా పారిపోతాయి. *"ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసాం ఘంటారవంకురు".* ధ్వని వల్ల వాతావరణంలోకి అసుర శక్తులు రావచ్చు, దేవతా శక్తులు రావచ్చు. గురుమూర్తులు, యోగులు, సిద్ధులు, మహర్షులు కూడా రావచ్చు. రోజంతా నువ్వు చేసే ధ్వని ప్రధానంగా ఎలా ఉంది? మంగళకరమైన ధ్వనులు చేస్తున్నావా? అమంగళకరమైన విషయములు మాట్లాడుకుంటూ ఉన్నావా? ఆ ధ్వనిని బట్టే నీలో అసుర శక్తులు పెరుగుతున్నాయో, దేవతా శక్తులు పెరుగుతున్నాయో తెలుస్తూ ఉంటుంది.

*"గరుడగమను గుణభాషణముల్"*– గరుడగమనుడు ఎలా ఉంటాడో తెలుసా? గరుత్మంతునిపై ఎక్కి వస్తాడు కదా! గరుత్మంతుడు ఎక్కడున్నాడు? మనలో స్పందనాత్మక చైతన్యమే గరుత్మంతుడు. అతన్ని అధిష్ఠించి సహస్రారం నుంచి హృదయం వరకూ దిగివచ్చి నీకు దర్శనం ఇవ్వగలడు. అక్కడ నుంచి చెయ్యి అందించి, నిన్ను పైకి తీసుకెళ్తాడు. యోగంలో స్పందన క్రమంగా

నిన్ను ఉద్ధరించేట్టుగా తీసుకెళ్తుంది. ఆ స్పందనమే గరుత్మంతుడు. అది ఎక్కి, దిగివచ్చి, బొడ్డులో ఉండే జీవుడిని అలా చెయ్యిచ్చి అందుకుంటాడండి. అంచేత, "గరుడ గమన రారా" అంటే వచ్చేస్తాడు. ఎక్కడ నుంచి వస్తాడు? ఏడు లోకాల అవతల ఉంటాడట. ఎక్కడ? మనలో సహస్రారం పైన. ఒక్కసారి నువ్వు ఉచ్ఛ్వాస చేస్తే, అలా దిగి వచ్చేస్తాడు. అన్నీ ఏదో చేస్తూవుంటాం తప్ప, ఒక్కటైనా తెలిసి చేస్తామా? తెలిసి ఒక్కటీ చెయ్యం! ఒక ఓంకారం చెయ్యడానికి ఎంత గాలి పీలుస్తావు? మామూలుగా పీల్చిన దానికన్నా ఎక్కువగా పీలుస్తావు కదా! ఇదే గరుడుని యొక్క ముక్కు– మన ముక్కే. ప్రాణవాయువు ఇలా వెళ్లి, సహస్రారం నుంచి అలా మనలోకి దిగివస్తునట్టు, కంఠం లోంచి, హృదయంలోకి అట్లా దిగి వచ్చి, ఉదరవితానం వరకు కూడా వెళ్లి, అక్కడనుంచి మళ్ళీ అలా పట్టుకొని నిశ్వాస వాయువు. . . "ఓం" అంటే జరిగేదేమిటంటే ఆయనతో పాటు వెళ్లిపోవటం సహస్రారం వరకు. ఒక ఉచ్ఛ్వాస తీసుకొని, ఒక నిశ్వాసలో వాచికంగా కాని, మౌనంగా గాని ఓంకారం చేసుకుంటూ, దాంతో కలిసి వెళ్లిపోవచ్చు. ప్రతి ఉచ్ఛ్వాసతోను దైవం నీలో ప్రవేశిస్తునట్టు భావన చేయాలి. ప్రతి నిశ్వాస లోంచి నువ్వు దైవంతో కూడి సహస్రారం చేరినట్లు భావన చెయ్యాలి. అప్పుడు గరుడ గమనుడు ఎంత సున్నితంగా హాయి గొలుపుతూ, మనని తనతో తీసుకెళ్తాడో అర్థమవుతుంది. అలాంటి వాడు మనలోపలే, మనయందే వసించి ఉన్నాడు కాబట్టి, అతనిని గూర్చిన భాషణ చేస్తే ఆ ప్రజ్ఞ మనలో బాగా మేల్కొంటుంది.

మనం చేసేవి చాలా చేస్తాంగాని, అందులో ప్రతి చిన్నది కూడ పరిపూర్ణమే. ఓంకారము పరిపూర్ణమే. ఏడుసార్లు ఓంకారం చేస్తే అర్థమేంటి? ఒకసారి కాకపోతే మరొకసారైనా ఆ దిగివచ్చే దారితో, ఈ వెళ్ళే దారితో కలిసి వెళ్తున్నట్లు భావన చేస్తే. . . ఒక్కసారి ఓంకారం చెప్పి, ధ్యానంలో కెళ్ళి, సమాధి స్థితి కెళ్తారు యోగులు. *"నిత్యం ధ్యాయంతి యోగినః".* ఒక్క ఓంకారమే చాలు. ఇలా కూర్చొని, కన్నులు మూసుకొని, గట్టిగా గాలి ఒక్కసారి పీల్చి, "ఓం" అని కూర్చుంటారు. ఎంత సేపు? వారి వారి స్థితిని బట్టి. అది తొంభై నిమిషాలు కావచ్చు, మూడు గంటలు కావచ్చు, ఒక జామంతా కూర్చోవచ్చు. మరి ఆ గరుత్మంతుడు ఆ విధంగా మనలో దైవాన్ని కొనిరావడానికే ఉన్నాడా అన్నట్లుగా ఉంటుంది ఆ పద్యం. అలా ఆయన వచ్చి మనల్ని పట్టుకెళ్తాడు మనం భాషణం చేస్తూ ఉంటే.

"వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొక దొడ్డరాజు గలఁ డాతని కేవురు పుత్రు లగ్రజుం
డనఘుఁడు రుక్మినాఁ బరఁగు నందఱకుం గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణి నాఁ బ్రసిద్ధయై."

విదర్భదేశం అంటే? మళ్ళీ అందులో కూడా రహస్యార్థం పెడతారండి! ఒకరకంగా చెప్పాలంటే పెద్ద పెద్ద విషయాలు, చిన్న చిన్న పదాల్లో పడేస్తారు. విదేహ దేశమొకటుంది. విదర్భదేశం కూడా అలాంటిదే. నిరుక్త మనేటువంటి ఒక తాళం చెవి ఉంది. అది పట్టుకొని కొన్ని కొన్ని పదాలు మనం అన్వయించుకుని,

విప్పుకుంటే, అది విశిష్టమైన దేహముతో కూడిన జీవుల నగరం అని కూడా వస్తుంది. ఎందుకంటే, మరి రుక్మిణి అక్కడ పుట్టింది కదా! రుక్మిణి అంటే ఏమిటో చెప్పాను కదా! పుట్టుకతోనే బంగారు శరీరం ఉన్నటువంటి వ్యక్తి ఆమె– the golden robe. సహజంగా అమరత్వంతో కూడి ఉన్నటువంటి జన్మ. కారణ జన్మురాలు ఆమె. కృష్ణుని గూర్చి, లక్ష్మీదేవి అంశావతారంగా ఉద్భవించింది. మరి ఆమె ఉండేది విదర్భ దేశమే. అదొక అర్థం ఉంది.

అందులో భీష్మకుడనే రాజు. భీష్మకుడంటే చాలా దృఢమైన, నిశ్చలమైన, స్థిరమైన సంకల్పము కలవాడు, సత్పురుషుడు. "భీష్ముడు" అంటాం కదా ఆయన్ని, ఆయన పేరు దేవరాతుడు. శంతనుడి కుమారుడు. ఆయన భీష్మమైన ప్రతిజ్ఞ చేశాడు కాబట్టి భీష్ముడు అన్నాము. ఈయన పేరే భీష్మకుడు. ఆయన "దొడ్డ రాజు", అంటే పెద్ద రాజు, అంటే రాజ్యం పెద్దదని అర్థం.

"ఏవురు పుత్రులు" – ఏవురంటే ఐదుగురు. ఐదుగురు కుమారుల తర్వాత ఒక కుమార్తె పుట్టిందండి ఆయనకి. ఐదుగురు కుమారుల తర్వాత కుమార్తె పుట్టడం ఎలా ఉంటుందంటే, పంచ పాండవులు, ద్రౌపతి అన్నా కూడా అట్లాగే ఉంటుంది. ఐదు ఇంద్రియములు, అటుపైన చిత్తముతో కూడి ఉన్నటువంటి బుద్ధి, మనస్సు. ఆమె ఆరవది, ఆరవ సంతానం. ఐదుగురు మొగ సంతానం తర్వాత ఆరవ సంతానం స్త్రీ అయితే అది ఒక యోగం. అలాంటి వారికి యోగం అబ్బే అవకాశం ఎక్కువ ఉంటుంది. నువ్వు ఎన్నో సంతానమో దాన్ని బట్టి కూడా నీ యోగం ఎలాంటి స్థితిలో ఉందో పుట్టుకతో తెలుస్తుంది. అంచేత, ఈమె ఆరవదిగా పుట్టింది.

ఐదు తర్వాత ఆరోదంటే ఇంద్రియముల పైన ఉన్నటువంటిది. మనసు ఇంద్రియముల ద్వారా పనిచేస్తుంది. ప్రత్యేకమైన అస్తిత్వం ఉన్నది కాదు. ఆ మనస్సును అధిష్ఠించిన బుద్ధిని ఆరవ దానిగా చెప్తారు. అంటే ఆమె బుద్ధిలోకంలో ఉంటే ఇంకా ఐదుగురున్నారు మనస్సుతో కూడి, పంచేంద్రియాలు నిర్వహించటానికి. మన శరీరమనే రథానికి ఐదు ఇంద్రియాలు, ఐదు గుర్రాలు లేక ఐదుగురు కొడుకులు. అందులో పెద్దవాడు "అనఘు" డట. అది చూడండి! ఏ పాపం తెలియనివాడు. అంటే, పుట్టుకతో పాపి కాదు. "రుక్మి" అనే పేరుతో ఉంటాడు వాడు.

మనసు అద్దంలాంటిది, నువ్వేం చూపిస్తే అది చూస్తుంది. అద్దానికి ఏమీ అంటదు కదా! కానీ సహవాస దోషంచేత రుక్మి మరో విధంగా తయారవుతాడు. సహవాస దోషంచేత అహంకారి అవుతాడు తప్ప సహజంగా అహంకారి కాదు. మనస్సు సత్వగుణంలోంచి పుట్టింది. కావాలంటే తృతీయ స్కంధం భాగవతంలో చూడండి. మహత్తు లోంచి మూడు అహంకారములు పుడితే– రాజసికము, తామసికము, సాత్వికము అనే అహంకారాలు– అందులో సాత్విక అహంకారంలోంచి పుడుతుంది మనస్సు. అంటే, సహజంగా మనస్సు సత్వగుణ ప్రధానమైనది. అది దేనితో కలిస్తే అది అవుతూ ఉంటుంది. పాలలో యాలుకలు, పంచదార వేసుకుంటే పరమాన్నం అవుతుంది. ఇంత డికాషన్ పోస్తే చేదు కాఫీ అవుతుంది కదా! అలాగే, మనసు దేనితో చేరితే, దాని గుణములను ప్రతిబింబింప చేస్తుంది. స్వభావము వేరు, మనస్సు వేరు. మనసు ఆకాశము వైపు చూపితే, అది ఆకాశాన్నే ప్రతిబింబింప చేస్తుంది. చంద్రుని వైపు

చూపితే చంద్రుని చూపిస్తుంది. సూర్యుడి వైపు చూపిస్తే సూర్యుడిని చూపిస్తుంది. కలుషితమైన విషయాల వైపు తిప్పితే వాటినే చూపిస్తుంది. నువ్వేమి చూడమంటే అది చూపిస్తుంది, నువ్వేమి చూపిస్తే అది చూపిస్తుంది. దర్పణం కదా అది!

మనసు దర్పణం, అందువలన దానికి ప్రత్యేకంగా దానిదైన పాపమేమీ లేదు. సంగదోషం వలనే అంతా. మన మనస్సుకు కూడా ఇట్లా సంగదోషమే కలుగుతూ ఉంటుంది. మన చుట్టూ చేరినవాళ్ళు ఎలాంటివాళ్ళో, వాళ్ళని బట్టి ఉంటుంది మన మనస్సు. ఎంతసేపూ చిల్లర విషయాల్లో ఉండే వాళ్ళంతా చుట్టూ చేరిపోయారనుకోండి, మనం కూడా చిల్లరయిపోతాం కదా! సద్గురువు సమాశ్రయణంలో ఉన్నామనుకోండి, సద్గురువు అడ్డమైన మాటలు మాట్లాడడుగా! ఎవరి సాన్నిధ్యంలో మన మనస్సుకు ప్రశాంతత లభిస్తుందో, అలాంటి వారి సాన్నిధ్యంలో ఉండటానికి ప్రయత్నం చేయాలి తప్ప, నేను కూర్చున్నచోట అంత సద్విషయాలు లేవని complaint చేయకూడదు. నువ్వున్న చోట బాగుండకపోతే, బాగున్నచోటికి వెళ్ళు. కాళ్ళిచ్చాడుగా దేవుడు! ఎప్పుడూ ఇంట్లో ఏదో రణగొణ ధ్వనిగా ఉందనుకోండి, "రణగొణ ధ్వని, రావణ కొంప" అనే సామెత అంటూ ఉంటారు కదా! అంటే, ఇంట్లో రణగొణ ధ్వనిగా ఉంటే, ప్రశాంతంగా ఉండే ప్రదేశం ఉంటుంది కదా ఊళ్ళో, అక్కడికిపోయి కూర్చో. "గుళ్ళో కెళ్ళినా ప్రశాంతత లేదండి, అక్కడ కూడా గొడవ గొడవగా ఉంటుందండి" అంటే, అక్కడికి వెళ్ళకు, కొండెక్కి కూర్చో. లేకపోతే ఒక చెట్టు కింద కూర్చో బాగుంటుంది. ఏదో ఒకటి! నీకు

బుద్ధి ఉండాలి గాని ప్రదేశం కనపడదా! అసలు నీ లోపలే ఇలాంటి ప్రదేశం ఒకటి ఉంటే, ఇంక ఏ గొడవ లేదు, ఎక్కడికీ పోనక్కర్లేదు, అక్కడే ఉండవచ్చు. మట్టిలో మాణిక్యంలాగా ఉండరు? ఉంటారు. అందులోనే, అదంతా అంటకుండా అట్లా ఉండే ఉత్తమమైన సాధకులు ఉంటారు. అన్నీ అంటించుకుంటూ, అదే పరమార్థం అనుకునేవాళ్ళు ఉంటారు. రెండూ ఉంటాయికదా!

ఇక్కడ ఈ పద్యం చూస్తే ఏం అనిపిస్తుందంటే, మనకి మామూలుగా రుక్మి అంటే సినిమాలో ఒక విలన్ గా చూపించేస్తారు కదా! మన జ్ఞానం అంతా కూడా సినిమా జ్ఞానమే కదా! రుక్మిని సంహరించలేదు కృష్ణుడు, గొరిగొదిలేశాడు అంతే! రుక్మి దుస్సాంగత్యాన్ని గొరిగి వదిలేస్తాడండి కృష్ణుడు. మామూలుగా ఎక్కడో కోటిలో పదిమంది దుష్టులు ఉంటారు. మిగతా వాళ్ళంతా సాంగత్య దోషంచేత అలా తయారైనవాళ్ళే ఉంటారు. అంచేత, మహాత్ములు ఈ సాంగత్యం దోషం చేత కదా వీళ్ళిలా ఉన్నారని, అందర్ని మన్నిస్తారు, గౌరవిస్తారు, అందర్ని ఆదరిస్తారు. వాళ్ళు చేసేటువంటి తప్పులు ఎంచడము ఉండదు. కేవలం దుష్టుల విషయంలోనే కఠినంగా ఉంటారు. మిగతా వాళ్ళ విషయంలో కఠినంగా ఉండరు. ఎందుకుండరంటే, ఊసరవెల్లిలాగా ఎవరితో కూడి ఉంటే వాళ్ళ స్వభావం అంటేస్తూ ఉంటుంది మనకి కదా! ఎప్పుడూ రాజకీయాలే మాట్లాడుతున్న వాళ్ళతో ఉంటే, మనకీ అవే అంటేస్తాయి కదా! ఎప్పుడూ పదవులు, అధికారాలు వీటి గురించిన యావ ఉండే వాళ్ళతో ఉంటే, మనకీ అదే అనిపిస్తుంది.

ఎప్పుడూ డబ్బు గురించి మాట్లాడుకునే వాళ్లతో ఉంటే, మనకీ అదే అంటేస్తుంది.

అంటని స్థితిలో ఉన్నది రుక్మిణి. ఆమె బుద్ధిలోకంలో ఉంటుందటండి. బుద్ధిలోకంలో ఉండేవాళ్లకి ఎన్నిట్లో కూర్చున్నా ఏమీ అంటవు. అదీ తేడా. సద్గురువులు బుద్ధిలోకంలోనే ఉంటూ, ఈ లోకంలో తిరుగుతూ ఉంటారు, దిగిరారు. దైవము బుద్ధిలోకము దిగి క్రిందకి రాదు. అక్కడ నుంచి చేయి అందిస్తాడు "అందుకో" అని. దైవీస్వభావంలో ఉండేవారు హిరణ్య ప్రాకారము దాటి దిగిరారు. అందుకనే దేవతల్ని నేలమీద నిలబడలేరు అని చెప్తూ ఉంటారు. నేలమీద వరకూ రావచ్చు గాని అంటుకోలేరు. అలా ఒక insulation వారికుంది.

రుక్మిణి పరిస్థితి ఏమిటంటే, ఆమె ఇన్ని ప్రాకారాల మధ్య ఉన్నా, ఈమె వుండేది హిరణ్యప్రాకారము అంటే, బుద్ధిమయ లోకము. ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, బుద్ధిమయ లోకంలోనే ఉంటూ, మిగతా లోకాల్లోకి ప్రసరిస్తూ ఉండేటువంటి వాళ్ళు మహాత్ములు. వారు ఈ మనోమయ లోకాల్లోకి జారరు. మనసు బుద్ధితో కూడి ఉంటే, అప్పుడు మనసు వెలుగుతూ ఉంటుంది. అద్దాన్ని దీపం వైపుకి చూపిస్తే, అది దీపాన్ని చూపిస్తుంది. దీపాన్ని ఇంకా ఎక్కువ కాంతివంతం చేస్తుంది కదా! చీకటి వైపు చూపిస్తే, అసలు ఉన్నట్టు కూడా అనిపించదు, ఏం చూపించదు. అపరిశుద్ధమైన విషయం వైపు చూపిస్తే, మనసు అదే చూస్తుంది. రుక్మి, రుక్మిణి వారిద్దరి మధ్య వ్యత్యాసం అది. రుక్మి మనస్సు. రుక్మిణి మనస్సు పైన ఉన్నటువంటి బుద్ధి. బుద్ధి వెలుగే మనస్సు

మీద పడుతూ ఉంటుంది. బుద్ధి ఎక్కడ నుంచి వచ్చింది? జీవుని యొక్క సహజమైన వెలుగది. జీవుడు స్వయం ప్రకాశకుడే. మనమందరమూ స్వయంప్రకాశకులమే. అంటే, మణులవంటి వాళ్ళమన్న మాట. మణి సహజంగానే ప్రకాశిస్తుంది. అలా స్వయంప్రకాశకుడైన జీవుని బుద్ధి వెలుగది. ఆ వెలుగు మనసు మీద పడాలంటే మనసు బుద్ధి వైపు ఉన్ముఖమై ఉండాలి. మనస్సును బుద్ధి వైపుకు ఉన్ముఖం చెయ్యటమే సాధనం అంతా.

Aristotle అనే ఒక మహాత్ముడి దగ్గరకు శిష్యుడొకడు వచ్చి అడిగాడు, "నేను దైవాన్ని ఎలా చేరుకోగలను? నేను దివ్యమైన వెలుగుని ఏ విధంగా అనుభూతి పొందగలను?" అని. ఆయన అప్పుడు ప్రశ్నకు ప్రశ్నే సమాధానమని, "అద్దాన్ని మట్టి వైపు చూపిస్తే మట్టిని చూపిస్తుంది, ఆకాశం వైపు చూపిస్తే ఆకాశం వెలుగును ప్రతిబింబింపచేస్తుంది. నువ్వు ఎటు చూడదలుచుకుంటే అటు కనిపిస్తూ ఉంటుంది నీకు" అని చెప్తాడు. నీ మనస్సు ఆకాశం వైపు పెడితే, ఆకాశంయొక్క నీలపుకాంతిని ప్రతిబింబిస్తుంది. అంచేతే, ప్రార్థనలో మనసుని వెలుగు యందు ఉంచడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాం. దేవతా మూర్తులంటే ఏమిటి అర్థం? వెలుగుమూర్తులు అని అర్థం. దివము అంటే వెలుగు. ఆ దివమునకు రూపం లేదు. కాని దాన్ని నువ్వు ఒక రూపంలోకి తెస్తే, అది మూర్తి అవుతుంది. ఈ వెలుగు మూర్తిలో కూడా వెలుగుతుంది. మనస్సుని బుద్ధి అనే వెలుగు మీద లగ్నం చేశామనుకోండి, అప్పుడు మనస్సులో వెలుగు నిండుతుంది. అంతమాత్రం చేత ఉండిపోతుందా? అద్దాన్ని ఇట్లా ఆకాశానికి రోజంతా పెట్టి,

సాయంత్రం ఇటు చూపించామనుకోండి? అది ఏం చూపిస్తే అది చూపిస్తుంది? మనసుకి ప్రతిబింబము సహజగుణం అవ్వటం చేత, మనసు ఇంద్రియముల వైపు ఎక్కువ మొగ్గుతూ ఉండటం చేత, ఇంద్రియార్థముల వైపు జీవుడు పరుగెత్తడంగా ఉంటుంది. ఈ మనస్సు, బుద్ధితో అనుసంధానం చెందితే గొడవ లేదు.

ఇక్కడ కథలో రుక్మి భావాలు వేరు, రుక్మిణి భావాలు వేరు. రుక్మిణి కృష్ణుని కోరుకుంటుంది. అంటే, దైవాన్ని కోరుకుంటుంది. రుక్మి ప్రపంచాన్ని కోరుకుంటూ ఉంటాడు. అంచేత, రుక్మి రుక్మిణికి ఒక అవరోధం. అతడు సహజంగా అనఘుడే. *"అగ్రజుం డనఘుఁడు రుక్మి నాఁ బరఁగు"*. రుక్మి అని పిలుస్తారు వాడిని. అతను అనఘుడే, పెద్దవాడు. అందరికన్నా చిన్నది *"గడగొట్టు చెల్లెలై మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణి నాఁ బ్రసిద్ధయై"*. ఆమె రుక్మిణి అని పుట్టిందని చెప్తున్నారు.

"బాలేందు రేఖ తోఁచిన
లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను
బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్".

"ఇందు రేఖ" అంటే చంద్ర రేఖ. "బాలేందు రేఖ" అంటే, అమావాస్య తర్వాత మొట్టమొదట చంద్ర దర్శనం ఉంటుందే, అలా పుట్టింది. ఎంతైనా చంద్రకాంతి ఆహ్లాదంగా ఉంటుంది, లాలిస్తుంది. సూర్యకాంతి లాలించేదేముండదు కదా! తాపం ఎక్కిస్తుంది! కేవలం ఉదయించేవరకే, ఇంక అక్కడ నుంచి దేహానికి

తాపమే కదా! ఆయన మార్తాండుడు. సూర్యుడు పెరుగుతున్నకొద్దీ ఏం జరుగుతుందండి? గూళ్ళల్లో దాక్కోడమేగా? కానీ చంద్రుడు పెరుగుతూ ఉంటే? జీవుడు లాలింపబడుతూ ఉంటాడు కదా! చంద్రకళలు పెరుగుతుంటే ఆహ్లాదం కలుగుతుంది. సూర్యుడి తేజస్సు పెరుగుతూ ఉంటే తాపం పెరుగుతుంది.

*"బాలేందు రేఖ తోఁచిన లాలితయగు నపరదిక్కు లాగున"*

అపరదిక్కు అంటే పశ్చిమ దిక్కు. మనం ఈ పట్టణాల్లో ఉంటే, శుక్ల పక్షం ఎలా ఉంటుంది? చంద్రుని కళలు ఏ విధంగా పెరుగుతూ వస్తుంటాయి? కృష్ణ పక్షం ఎలా ఉంటుంది?– ఇవన్నీ మనకేమీ తెలీదు. అష్టమి నాడు సాయంత్రం చంద్రుడు కనిపిస్తాడా? అది కృష్ణపక్షమా, శుక్లపక్షమా అనేదాన్ని బట్టి ఉంటుంది. పదిహేను తిథుల్లో చంద్రుడు ఎప్పుడెప్పుడు, ఎక్క దెక్కడ ఉంటాడు? శుక్ల పక్షంలో ఎప్పుడెప్పుడు కనపడకుండా ఉంటాడు? ఇవన్నీ తెలియాలంటే ఊరు బయట ఉండాలండి. సూర్యోదయము, సూర్యాస్తమయము, చంద్రోదయము, ఇవన్నీ చూడగలిగేట్టుగా ఉండే ప్రదేశంలో ఉండటం కూడా ఒక అదృష్టమే. మనకిప్పుడు ఏం తెలియదు కదా! మామూలుగా చంద్రుడు ఉండే రూపాన్నిబట్టి తిథిని చెప్పవచ్చు. చవితి చంద్రుడు, తదియ చంద్రుడు, విదియ చంద్రుడు, పంచమి అట్లా చెప్పవచ్చు. ఒక్కొక్క కళ ఒక్కొక్క అద్భుతమైన అనుభూతినిస్తుంది. "పంచమి, పంచభూతేశీ, పంచసంఖ్యోపచారిణి"– అట్లా రాట్నం వేసేయ మంటే వేసేస్తాము! పంచమి తిథి ఎందుకంత ప్రశస్తమో? ఇట్లా మన చంద్రుడు పదహారు కళలలో సంచరిస్తూ ఉంటే, వాటికి తదనుగుణమైనటువంటి అనుభూతి మనోలోకాల్లోకి

కూడా దిగివస్తుంది. ఎంచేత? చంద్రకాంతి ఏమిటి? సూర్యుడు ప్రతిబింబించిన కాంతే కదా! ఆత్మతత్త్వం రకరకాల కోణాల్లో మనసు మీద పడుతూ ఉంటే, ఆ మనసు వెలుగుతూ ఉంటుంది. సూర్యుని కాంతి పరిపూర్ణంగా చంద్రబింబం మీద పడ్డప్పుడు పౌర్ణమి, రాకా ఇటువంటి తిథులు చెప్తాము. అప్పుడు ఆ మనసు పరిపూర్ణంగా ఆత్మతత్త్వంతో నిండి ఉంటుంది. మిగతా సమయాల్లో కొంచెం కొంచెంగా ఉంటుంది. అమావాస్య నాడు చంద్రుడు, మనసు ఏమీ ఉండదు కాబట్టి అది సరాసరి ఆత్మతత్త్వాన్ని పొందే అవకాశం ఉంది. ఇలా రకరకాలుగా తిథుల యొక్క అవగాహన ఉన్నది, సాధన ఉన్నది.

ఇక్కడ ఏం చెప్తున్నారు? ఒక చంద్రరేఖ ఏ విధంగా అపరదిక్కు నుంచి అట్లా పెరుగుతూ పూర్ణిమ తిథికి చేరుతుందో, *"బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్"* . పెరుగుతున్నకొద్దీ కళలు పెరుగుతున్నాయటండి. పిల్లలు పెరుగుతున్నకొద్ది కళలు పెరుగుతూ ఉన్నాయా లేదా? పిల్లలంటే పసిపిల్లలు, పిల్లలంటే మనం. మనలో కళ పెరుగుతూ ఉన్నదా? కళ తరుగుతూ ఉన్నదా? దేన్నిబట్టి కళ పెరుగుతూ ఉంటుంది? దేన్ని బట్టి కళ తగ్గుతూ ఉంటుంది? మనసు ఆత్మకు ఎంత ఉన్ముఖంగా ఉంటే అంత కళ పెరుగుతుంది. ఎంత విముఖంగా ఉంటే అంత కళ తగ్గుతూ ఉంటుంది. మనలో కళ ఆత్మతత్త్వమే లేక సూర్యతత్త్వమే. అబల అట్లా పెరుగుతూ పదహారేళ్ళు వచ్చేసరికి, బాగా ప్రతిపత్తి నుంచి రాకాంతం వరకు ఏ విధంగా చంద్రకాంతులు పెరుగుతూ పరిపూర్ణమవుతుందో అలా పరిపూర్ణంగా తయారయ్యింది ఆమె.

# రుక్మిణికి వివాహ యోగ్యత

కళతో, అందముతో, ఓర్పుతో ఉండేటువంటి ఒక పిల్ల ఇంట్లో పెరుగుతూ ఉంటే చాలామంది బంధువులు, మిత్రులు గమనిస్తూ ఉంటారు. మొగపిల్లవాడి కన్నా ఆడపిల్లని ఎక్కువగా గమనిస్తూ ఉంటారు. ఎంచేతంటే, పిల్లని బట్టి తగిన వరుడు కదా! అంతకన్నా మించిన కళ కలవాడు, సంస్కారము కలవాడిని ఇవ్వకపోతే ఆ స్త్రీ జన్మ చాలా దుఃఖపూరితమై పోతుంది. వరహీనం అంటారే, ఎప్పుడు వరహీనం అవుతుందంటే తన పురుషుడు తనకన్నా సమర్థుడు కాకపోతే ఆ స్త్రీకి జీవితం ఆనందంగా ఉండదు, పురుషుడు కూడా ఆనందంగా ఉండడు. తన కన్నా తన భార్యకు ఎక్కువ తెలిసిందనుకోండి, ఏం జరుగుతుంది? ఆవిడ చెప్పినట్లు వినాల్సొస్తుంది కదా! అది తనికీ మర్యాద కాదు, ఆమెకీ మర్యాద కాదు. అన్ని విషయాల్లోనూ ఆవిడ ముందుంటే సంఘంలో మర్యాద ఉండదు. సలహాదారిణిగా ఉండటమే తప్ప, ముందుండి నడిపించారనుకోండి, అంత బాగుండదు. పిల్లలు పెరుగుతూ ఉంటే, తల్లితండ్రులకి లోపల బాధ్యత పెరుగుతూ ఉంటుంది. ఈ పిల్లకి సరైన వరుడిని తేగలనా అని. జనకుడికీ అదే బాధ, భీష్మకుడికీ అదే బాధ. ఎవరికైనా అంతే. సంస్కారవంతమైన ఒక కన్యను పొందటానికి ఆశపడేవాళ్ళు చాలామంది ఉంటారు. ఆశ కాదు కదా, సంస్కారం కావాలి. ఈమె ఎలా పెరుగుతోంది?

"వేర్వేర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు
నబలలతోడ వియ్యంబు లందు
గుజ్జెనగూళ్ళను గొమ రొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెఱసి
రమణీయ మందిరారామ దేశంబులఁ
బువ్వుఁదీగెలకును బ్రోది వెట్టు
సదమల మణిమయ సౌధభాగంబుల
లీలతో భర్మడోలికల నూఁగు"

ఒక రోజు సీతాకళ్యాణం అంటుంది, ఒకరోజు పార్వతీ కళ్యాణం అంటుంది. ఆడపిల్లలు సహజంగా అట్లేవో బొమ్మల పెళ్ళిళ్ళ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. సంస్కారాలు పెరగాలంటే ఇలా ఉండేవి కార్యక్రమాలు. ఇప్పుడు ipadలు వచ్చేసిన తర్వాత ఎవరూ ఏంచేయలేరు! *"నబలలతోడ వియ్యంబు లందు"* అంటే, ఆ బొమ్మనే కాసేపు "మా అమ్మాయి", "మా అబ్బాయి" అంటుంది. ఆడుకుంటూ ఉంటారు. వియ్యమందుకుంటూ ఉంటారు. *"గుజ్జెనగూళ్ళను గొమ రొప్ప వండించి చెలులకుఁ బెట్టించు"* చిన్న చిన్న లక్కపిడతలతో వంటసామాగ్రి చేసి, ఇవాళ మా ఇంట్లో భోజనం, మీరందరూ రండి, ఇట్లా పిలుస్తూ ఉంటారు, ఆడపిల్లలు కదా!

ఇవన్నీ సహజమైన స్త్రీ గుణాలు. వండి, వడ్డించి, ఆనందించడ మనేది లేని స్త్రీ స్త్రీయే కాదు. అది స్త్రీ ఆకృతి గాని స్త్రీ కాదు. వండడం, వడ్డించడం, అందరూ తింటుంటే చూసి ఆనందించడం, ఇలాంటివి

లేని స్త్రీ, స్త్రీ కాదండి పురుషుడే. సందేహం లేదు. ఇప్పుడు ఈ రోజుల్లో మనుషులెలా తయారవుతున్నారంటే, ఇప్పుడు అందరూ పాంట్లు వేసుకుంటారు కాబట్టి నడుస్తూ ఉంటే స్త్రీయా, పురుషుడా అన్నది తెలియదు. పాశ్చాత్య దేశాలలో ఇప్పుడదే బాధ. మగ పన్లు చేస్తుంటే, ఆడవాళ్లకి మగతనం వచ్చేస్తుంది. మీసాలు కూడా వచ్చేస్తాయి. మనతో పాటు (మగవాళ్ళతో పాటు) సమానంగా వాళ్ళు రేజర్లు వాడుతూ ఉంటారు ఆ దేశాల్లో! మొట్టమొదటిసారి వెళ్ళినప్పుడు ఆశ్చర్యపోయాను ఇదేమిటని! మాస్టరుగారిని అడిగాను, "ఇదేంటి మాస్టరుగారు?" అంటే, " అవునోయ్! వాళ్ళు మొగవాళ్ళు కదా!" అన్నారు. ఏమిటి మొగవాళ్ళు? ఉద్యోగాలు చేస్తారు, పాంట్లు వేసుకుంటారు. అన్నీ మొగ పనులు చేస్తే మొగతత్త్వం వస్తుంది. మూర్తీభవించినటువంటి స్త్రీ పురుషుడైపోతే భవిష్యత్తులో జాతి ఎట్లా ఉంటుందో? ఎందుకంటే సృష్టికాధారమే స్త్రీ. సృష్టి సౌందర్యమే స్త్రీ. సృష్టి అనుభూతియే స్త్రీ. ఎందుకంటే అమ్మే అంతాను. అందుకనే మాస్టరుగారు కొంతమంది ఆడవాళ్ళు వస్తూ ఉంటే, "How are you my boy?" అంటుండే వారు వాళ్ళని. "ఎందుకిట్లా అంటారు మీ మాస్టారు?" అంటే "నీ నడక అట్లా ఉంది" అని చెప్పేవాడిని. "ఒక మొగ బాలుడు నడిచినట్టుగా నడుస్తుంటావు, అందుకని how are you my boy అని అన్నారు." ఇప్పుడు నెమ్మదిగా మనకీ అదే అవుతోంది. ఎందుకంటే మోజు కదా! పురుషుని వలె ఉండాలని స్త్రీ. పురుషులూ పురుషుల్లాగా ఉండి, స్త్రీలూ పురుషుల్లాగా ఉంటే ఇంకెందుకండి? అందుకనే కదా పురుషుడు, పురుషుడు పెళ్లిచేసుకోవచ్చా, అది చట్టం చేయచ్చా అని అడిగేటువంటి పరిస్థితులు వస్తున్నాయి.

*"రమణీయ మందిరారామ దేశంబులఁ బువ్వుఁదీగెలకును బ్రోది వెట్టు".* చిన్నతనంలో పూలతీగలు పెంచాలి అనే భావన ఉండే స్త్రీలో స్త్రీత్వం చాలా ఎక్కువ. పువ్వులు, పూలతీగలు పెంచటం, వాటికి దారాలు కట్టడం. . . మీరందరూ ఒక్కసారి చదువుకోండి, 'పురాణపురుషుడు'లో రాధను పరిచయం చేయడానికి మాస్టరుగారు శతగోపుడుండే గ్రామాన్ని వర్ణిస్తారు. అందులో ఉండే ఆడపిల్లలంతా ఊరు బయట ఉండేటువంటి కొండమీద ఏ విధంగా చక్కగా తీగలెక్కించి, చెట్లకి దారాలు కట్టి, వాటన్నిటికీ మల్లెతీగలెక్కించి, ఆ మల్లెపూలు ఊర్లో అంతా. . . ప్రతి ఇంటి దొడ్లలోనూ, ఇంటి ముందూ మల్లెపూల పందిరి, జాజి పందిరి, రాధామాధవం అనే పువ్వుల పందిరి, ఇట్లా సువాసనలతో కూడిన పూలపందిరిలంతా ఉంటే, ఆ వీధిలో నడిచి వెళ్తుంటే అటుపక్కనుంచి, ఇటుపక్కనుంచి ఎంత సువాసనలు వస్తాయండి? ఇలా మురికి వాసనలు వస్తాయా? ఎక్కడ పువ్వుకి ప్రాధాన్యత ఉన్నదో అక్కడ స్త్రీకి ప్రాధాన్యత ఉన్నది. మా విశాఖపట్టణంలో పువ్వులు దొరకవు. ఇప్పుడు కొంచెం దొరుకుతున్నాయి. రోడ్డు మీద వెళ్ళే వాళ్ళు మన ఇంట్లో compound wall దగ్గర పువ్వులు తీసుకెళ్ళిపోతూ ఉంటారు! పెంచడం నీ వంతు, కోసుకోవటం వాళ్ల వంతు! మాస్టరుగారు అంటుండేవారు, "విశాఖపట్నంలో మనకేముందోయ్! ఇక్కడ పండంటే చింతపండే కదా!" అనేవారు ఆయన. "పండా పాడా, చింతపండే! అదే తినాలి" అంటుండేవారు. ఈ పువ్వులు ప్రత్యేకంగా స్త్రీత్వానికి సంబంధించినవి. అందుకనే పూలతీగలు పెంచడం, పువ్వులు కోసుకోవడం, పూలమాలలు కట్టడం, ముగ్గులు వెయ్యటం, ఇలాంటివన్నీ స్త్రీ సహజగుణాలు. ఈ

రోజు ఎవ్వరూ ముగ్గులెయ్యలేరు కదా! పూలమాలలు కట్ట లేరు. ఆ పనులన్నీ మొగవాళ్ళు చేసుకుంటున్నారు కదా! కానీ, అందులో జీవన మాధుర్యం వేరు. చిన్న పనులు అనుకోబోకండి. ప్రతి నిత్యం నువ్వు పువ్వుతో ప్రతిస్పందిస్తుంటే, నీలో ఎంత సంస్కారం పెరుగుతుందో తెలుసా! పూలతోట పెంచటంలో చాలా సంస్కారం పెరుగుతుంది. మహాత్ములు సైతం పూలతోటలు పెంచుతారు. శిరిడి సాయిబాబా పూలతోట పెంచారు. మనం పెంచితే పువ్వే రాదు కదా! కొంతమంది పూలమొక్కలు వేస్తే పువ్వులు రావు తెలుసా! కొంతమంది పూలమొక్కలు వేస్తే విరివిరిగా పూస్తాయి. ఎందుకని? విత్తనాల్లో తేడా కాదు, పెంచే వాడిలో తేడా! పెంచేవాడిని బట్టి పువ్వు వికసిస్తుంది. పూలమొక్క ఆనందంగా పువ్వు లిస్తుంది. ఏముందండి ఇప్పుడు? ఎంతసేపూ డబ్బుకోసం పరిగెత్తటం తప్ప ఏమీలేదుగా? వస్తు సంపద తప్ప, ప్రకృతి సంపద ఏదీ లేదుగా? అలాంటి ప్రకృతి సంపద ఉన్న రాజకుమారి రుక్మిణి. *"రమణీయ మందిరారామ దేశంబులఁ బువ్వుఁదీగెలకును బ్రోది వెట్టు".* ఆ పువ్వులు పెంచడం, వాటి కన్నిటికీ అక్కడ మళ్ళు తీయడం. . .

*"సదమల మణిమయ సౌధభాగంబుల లీలతో భర్మడోలికల నూఁగు".* చక్కగా ఉయ్యాలలు ఉండేవి ఇదివరకు ఇళ్ళల్లో! ఆహ్లాద మైన సమయంలో, అంటే సాయంకాలం సమయంలో, చక్కగా ఉయ్యాల్లో కూర్చుని, ఊగుతుంటే ఎంత బాగుంటుందో ఎవరికన్నా తెలుసా ఈ రోజుల్లో? తెలియదు. సాయంకాలం ఎప్పుడు ప్రశాంతంగా ఉంటుందో తెలుసా? తెలియదు. అట్లతదియకి పొద్దున్నే ఉయ్యాల్లో ఊగుతారు ఎందుకు? మధ్యాహ్నం ఎందుకు

ఊగరు? అనుభూతి, ఆనందము, ప్రకృతి సౌందర్యము, ఇవన్నీ తెలిసే రోజులు పోయినాయండి. ఎంతసేపూ manufacturing, multiplying, money making, ఇందులో మునిగిపోయారు. నిజానికి ఇది జీవనం అనడానికి వీల్లేదు. రుక్మిణి అట్లా ఉయ్యాలలు ఊగుతూ ఉండేదట. మనకు సాయంత్రం చదువు, రాత్రి చదువు, ప్రొద్దున చదువు, తెల్లవారుజామున చదువు, ఎప్పుడూ చదువే! ఏమిటయ్యా అంటే ఇంజనీరింగ్, MBBS. మా రోజుల్లో B.A, B.Sc. లు ఎంత భయంకరంగా ఉన్నాయో, ఇప్పుడు B.Tech. లు, B.E.లు అట్లా అయిపోయినాయి– ఎవ్వడికీ ఉద్యోగాలు లేవు! బతకడానికి ఇంతకన్నా మార్గాలు లేవా? ఇరవై ఏళ్ళుగా చెప్తున్నాను ఇంజినీరింగ్ చెయ్యకపోతే చచ్చిపోతావా అని? అందరూ ఇంజినీర్లు అయితే దేశమేమైపోతుంది? మిగతా పనులు ఎవరు చేస్తారు? జీవితం అనుభవించడం అనే మార్గమొకటి ఉంది. జీవితాన్ని వైభవోపేతంగా చేసుకోవడానికి మార్గం ఉంది.

ఇలా పద్యం చదివి అర్థం చేసుకునే రోజులు లేవు కదా! భాషే రాదు కదా! తెలుగు జాతి, తెలుగు భాష మరిచినప్పుడు తెలుగు వైభవం వాడికి లేదంతే. *"నసీబ్ మే నహీ లిఖాహువా"* అని వాడి ముఖాన రాసిపెట్టి లేదు! దేశ భాషలందు తెలుగు లెస్స. మన దేశ భాషలు చాలా సంస్కారం కలిగినటువంటి భాషలు. అందులో ఎంతో కవిత్వం ఉంది. అసలు languages కి importance ఏముంది? ఏమీ లేదుగా. భాషేకదండి మనిషిని బ్రతికించినా, చంపినా! చక్కగా మాట్లాడగలిగినవాడు ప్రపంచాన్ని జయించవచ్చును. మాటలతో ప్రపంచాన్ని జయించుకొచ్చినవాళ్ళు

ఉన్నారు. మంచి మాటలు చెప్పి రాజ్యాన్ని కాపాడినటువంటి వారున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ విధంగా ఉంటుందండి ఆవిడ జీవితం.

"బాలికలతోడఁ జెలరేగిఁ బంతు లాడు
శౌరికా కీర పంక్తికిఁ జదువు సెప్పు
బర్హి సంఘంబులకు మురిపములు గఱపు
మదమరాళంబులకుఁ జూపు మందగతులు."

అంటే, పావురాలకి, చిలకలకి, వాటికేవో పద్యాలు చెప్పటం, పాటలు చెప్పటం, మాటలు చెప్పటం, వాటికి చదువు చెప్పుకుంటూ ఉండేదటండి. *"బర్హి సంఘంబులకు మురిపములు గఱపు"*. నెమళ్ళకు వయ్యారాలు నేర్పేదటండి రుక్మిణి. అంటే ఏమిటి? నెమళ్ళతో ఆడుకునేది. "నెమలికి నేర్పిన నడకలివి" అని మనం ఈ మధ్య పాట విన్నాం కదా! నెమలికే నడకలు నేర్పినటువంటి వాళ్ళు ఉన్నారు. దమయంతి లాంటి స్త్రీల కథలు మన పురాణాలలో ఉన్నాయి. ఋషిపత్నులు ఎంత మేధాసంపత్తి గలవారో! ఋషులే చెప్పుకుంటాం కానీ ఋషిపత్నులు ఋషులతో సమానమైన ప్రతిభ కలిగినవారు. చదువు రాని మొద్దులు కాదు. అక్షరాలు రాకపోవచ్చు. అక్షరాస్యత వేరు, చదువు వేరు. ఋషుల భార్యలందరికీ కుడా వేదవేదాంగములు, ఉపనిషత్తులు, ధర్మములు, సృష్టిరహస్యములు అన్నీ తెలుసు. అవసరమైతే వాళ్ళే పూనుకునేవాళ్ళు పనికి–గోళ గమనాలను ఆపేయ గలిగినటువంటి శక్తివంతులండి ఋషుపత్నులు. "రేపు సూర్యోదయం లోపల నీ భర్త చచ్చిపోతాడు" అని శాపమిస్తే, "రేపు సూర్యోదయం అయితే

కదా!" అంది ఒక ఆవిడ. "రేపు సూర్యోదయం లోపల నా భర్త చచ్చిపోతాడు కదా, కాబట్టి ఇక రేపటికి సూర్యోదయమే లేదు" అని చెప్పింది ఆవిడ. ఏం చేస్తారు చెప్పండి! తెలుగు సినిమా భాషలో చెప్పాలంటే, "బాబు! బాబు!" అని అందరూ దిగివచ్చి బతిమాలితే, "తల్లీ! ఎంత పొరపాటున ఇచ్చాడు శాపం, ఆయన చచ్చిపోతే మేం బతికిస్తాము" అని మాట ఇస్తారు.

నిశాని వేసేవాడికుండే లోకజ్ఞానం చదువుకున్నవాడికి లేదు. చాకలివాడికి తెలిసినంత పద్దు చదువుకున్నవాడికి ఈ రోజుల్లో తెలుసా? చదువుకున్న వాళ్ళు కంప్యూటర్ల మీద ఇన్ని చొక్కాలు, ఇన్ని లాగులు, ఇన్ని చీరలు, ఇన్ని పరికిణీలు అని లెక్కేసి చెప్తే, వాడు ''కాదమ్మా!'' అని చెప్పేస్తాడు. వాడి దగ్గర ఏమీ ఉండవు, కంప్యూటర్ ఉండదు. చదువుకున్న వాడికన్నా చాకలివాడు మేలు అనే సామెత లేదూ! మీరెన్ని లెక్కలన్నా వేసుకోండి, పుస్తకాలు పెట్టుకోండి, కాల్కులేటర్లు పెట్టుకోండి, మీరువేసిన లెక్క అవునో కాదో పాలవాళ్ళు, చాకలివాళ్ళు టక్కున చెప్పేస్తారు. "ఇన్ని రోజులు ఇన్ని శేర్లు పోయించుకున్నాం. ఈ రోజు రాలేదు. ఊళ్లో లేము, మాకొద్దని చెప్పాం.'' ఇట్లా మనం రోజుకో రకంగా పాలు పోయించుకొని, చివరకి వాడికి పేమెంట్ చేసే రోజున ఇంతయిందయ్యా అంటే, "లేదమ్మా! ఒక్కసారి చూడండి" అంటాడు వాడు. మా ఇంటి చుట్టూ ఇంకా ఉన్నారు ఇలాంటి వాళ్ళు. "లేదు తల్లి! ఒక్కసారి చూడండి" అంటాడు. అంటే ప్రతి దానికి పుస్తకాలు పెట్టుకొని లెక్కలు వేసుకొనే మన తెలివికన్న, వాళ్ళ తెలివిలో చురుకు ఎక్కువ. మరపు తక్కువ. మన విజయవాడలో బాబాయ్ హోటల్ ఉందనుకోండి. మన పాత

హోటళ్ళలో పదిమంది రకరకాలుగా ఆర్డరు చేస్తే, కొంతమంది ఉల్లిపాయలు కావాలని, కొంతమంది వద్దని, కొంతమంది మిరపకాయలు కావాలని, కొంతమంది జీలకర్ర కావాలని, కొంచెం అదెక్కువ కావాలి, ఇదెక్కువ కావాలి, నూనెక్కువ కావాలి, ఇన్ని ఆర్డర్లు సర్వరు తీసుకొని లోపలికెళ్ళి టకటక చెప్పేసి, మళ్ళీ అట్లా అన్ని ప్లేట్లు పట్టుకొచ్చేసి, అందరికి వడ్డించిన రోజులు పోయి, ప్రతి దానికి ఇట్లా రాసుకొని, ఒకటి చెప్తే, ఒకటి తెస్తూ ఉంటారు. ఏమయ్యింది? మేధస్సు పోయింది. మేధస్సు పెరగడం ముఖ్యం. మనిషి బాగా జీవించాలంటే మేధస్సు పెరగాలి. *"మేధాంమే ఇంద్రోదదాతు, మేధాందేవీ సరస్వతీ, మేధాంమే అశ్వినావుభౌ"* ఇట్లా వేరే మార్గాలున్నాయండి మేధస్సు పెరగడానికి. బట్టీ పడితే వస్తుందండి మేధస్సు? రాదు.

*"మదమరాళంబులకుఁ జూపు మందగతులు"*. హంసలకు నడకలు నేర్పేదిటండి. అసలే చాలా మదంగా నడుస్తుంటాయి రాజహంసలు. అంటే, హంసలతో, నెమళ్ళతో, పావురాలతో, చిలకలతో, రామచిలకలతో, గోరువంకలతో, పూల మొక్కలతో– ఇట్లా జ్ఞానం సంపాదించుకున్నారండి. లక్ష రూపాయలు కట్టి, ఎల్. కే. జి నుంచి ఏ. సి. లో వేసి, వాడికి ఏ. సి. స్కూలు, ఏ. సి. బస్సు కదా! వాడింటికి రాంగానే " అమ్మా బెడ్రూంలో ఏ. సి. ఉంది గాని, టాయిలెట్లో లేదే?" అని అడుగుతాడు వాడు. అక్కడ ఉండాలి కదా మరి ఏ. సి. ? ఎక్కడకెళ్ళినా ఏ. సి. పట్టుకొని తిరుగుతావా ప్రపంచంలో? అది నాసి జీవితం.

ఎందుకీ పద్యం చదివానంటే, అసలు వైభవోపేతమైనటు

వంటి ఒక జీవనం ఉన్నది. అది మనము అసలు ఉందని గుర్తిస్తే, ఏదో రోజు ఇట్లా ఏమన్నా బతగలమేమో చూసుకోండి. మాస్టరుగారు ఎప్పుడూ చెప్తుండేవారు, "ఈ పట్నాల్లో ఉండద్దు. దూరంగా పొలాల్లో చక్కగా పూలమొక్కలు పెంచుకొని మనం ఉంటూ, ఏదో వూళ్ళోకొచ్చి పనిచేసుకొని వెనక్కి వచ్చేస్తే, పొద్దున్నా, సాయంత్రం ప్రార్థనలు, ఏవన్నా ప్రవచనాలు, కాల క్షేపాలు చక్కగా చేసుకోవచ్చు." అట్లా చెప్తూ ఉండేవారు ఆయన. ప్రయత్నం కూడా చేశారు. కాకపోతే మనుషులు అలాంటి వాటికి అంత సంసిద్ధులు కారు.

ఆ విధంగా ఆవిడ పెరుగుతూ వచ్చిందండి. మనం రుక్మిణీ కళ్యాణం కథ ఇలా చెప్పుకుందాం అని నా ఉద్దేశ్యం. ఆవిడ ఏ విధంగా పెరుగుతూ ఉంటే, అక్కడ ఆయనకి ఏ విధంగా లోపల మార్పులు వచ్చినాయో తర్వాత పద్యం. అంటే, ఒక సంస్కారవంతమైన స్త్రీ పెరుగుతూ ఉంటే, ఇక్కడ ఈమెలో వచ్చేటువంటి మార్పుల్ని బట్టి, అక్కడ ఆమెని వివాహం చేసుకునే భర్తలో మార్పు వస్తుంది. అంటే సంబంధం ఉంది. ఇద్దరూ ఒక్కటే. ఒకరే ఇద్దరుగా పెరుగుతున్నారు. ఇద్దరూ ఒక్కటే రీతి. అందుకని, ఇట్లా కథ ఇద్దరిదీ కలిసి నడుస్తుంది, తరువాత ఒకచోట చేరుతుంది, కళ్యాణం నుంచి ఒకటే నడుస్తుంది. ఇలా ఉంటాయి భార్యాభర్తల జీవితాలు. మరిలాంటివి ఇటువంటి గ్రంథాల్లోనే కనపడతాయి. ఎందుకంటే, ఇది ఋషి దృష్టి. సృష్టి రహస్యాలు ఎరిగినవాళ్ళు కాబట్టి అలా ఉంటాయి వారి రచనలు, వర్ణనలు.

# దివ్య ప్రణాళిక

"దేవకీసుతుకోర్కి తీగెలు వీడంగ
వెలందికి మైదీగె వీడc దొడcగెc
గమలనాభుని చిత్తకమలంబు వికసింపc
గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపc
బొలcతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ
జలజాక్షి మధ్యంబు సన్న మయ్యె.

హరికిc బ్రేమబంధ మధికంబు గాc గేశ
బంధ మధిక మగుచు బాల కమరెc
బద్మనయనువలనc బ్రమదంబు నిండార
నెలcతయౌవనంబు నిండి యుండె."

శ్రీకృష్ణుడికి క్రమంగా దివ్య ప్రణాళిక ననుసరించి వివాహము, సంతానము అనేటువంటి కార్యక్రమము తనలో ప్రారంభం కాగా వాసుదేవుని "చిత్తకమలం". వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అను నాలుగు స్థితులలో, నాలుగు వ్యూహములుగా దైవముంటాడు. వసుదేవుడి కుమారుడైన శ్రీకృష్ణుడు వాసుదేవ మూర్తియే. అతడు ఒక దివ్య ప్రణాళికను, యుగప్రణాళికను అనుసరించి, ఒక

దివ్య ప్రయోజనాన్ని నిర్వర్తించడానికి భూమికి దిగివచ్చిన సర్వాత్మకుడైన నారాయణుడు. అతని అవతార ప్రయోజనాల్లో గృహస్థు ధర్మము, సత్సంతానమును వడయుట, ఇలాంటి కార్య క్రమాలు కూడా నిర్వర్తింపబడ్డాయి. *"యద్యదాచరతి శ్రేష్ఠః"* అని. రామావతారమునందు, కృష్ణావతారమునందు వర్ణాశ్రమ ధర్మాల్ని చక్కగా బాల్యము, కౌమారము, గార్హపత్యము, వానప్రస్థము– ఈ నాలుగు ఆశ్రమధర్మాల్ని చక్కగా నిర్వర్తించి వారు చూపించారు. అందులో భాగంగా ఆమెకు వయసు పదహారేళ్ళు నిండి, యౌవన వతి అవుతుండగా, ఇక్కడ దేవకీసుతునికి వివాహం చేసుకుందాం అనేటువంటి ఒక సంకల్పం, కోరిక కలిగింది – సత్కుల సంజాతి అయిన ఒక స్త్రీని వివాహం చేసుకోవాలి అని. దేనికి అలా వివాహం చేసుకుంటాం అంటే, ప్రజాపతి కార్యము అది. తాను దేహం ధరించినందుకు, తాను జీవులకు దేహం కల్పించడం అనేది యజ్ఞార్థము. అంచేత, సంతానమును పొందవలయును. అలా పొందటం వలన ప్రజాతంతువు విచ్ఛిన్నం కాకుండా ఉంటుంది. *"ప్రజా తంతుం మా వ్యవచ్ఛేత్సీః"* అని చెప్పి ఉపనిషత్తు వాక్యము ఒకటి ఉంది. తన జీవన ప్రయోజనాన్ని తాను నిర్వర్తించుకోవటం కోసం తనకి తల్లితండ్రులు దేహాన్ని సమకూర్చారు. ఆ ఋణం తీరాలంటే తానుకూడా సంతానాన్ని కనాలి. ఏవేవైతే మనం జీవితంలో అందుకున్నామో, అవన్నీ ఇతరులకు మనం తిరిగి అందించినప్పుడు కృతకృత్యుల మవుతాము. అలాంటి జీవకథను దైవము అవతారపురుషుడై దిగివచ్చినప్పుడు తదనుగుణంగా

తానుకూడా అలాగే నిర్వర్తిస్తూ ఉంటాడు. రాముడైనా, కృష్ణుడైనా చేసినపని అదే.

ఆయన చిత్తకమలం అంటే సహస్రారమునందు, ఆజ్ఞ యందు, హృదయమునందు, మణిపూరకమందలి ఊర్ధ్వ భాగమునందు– నాలుగు స్థానములలో భగవంతుని వ్యూహాలు ఉన్నాయి. అతడు సంతానం కోరినప్పుడల్లా ఆ వ్యూహంలోకి దిగివస్తాడు. సత్పురుషులు కూడా ఎప్పుడూ కామవాంఛతో, కామదృష్టితో చిత్తమునందు వశించరు. బుద్ధియందు వశిస్తూ ఉంటారు. కేవలం సంతానప్రాప్తి కొరకే ఆ చిత్తకక్ష్యలోకి దిగివచ్చి, మనస్సు ఆధారంగా పంచేంద్రియములు, శరీరము ఆధారముగా సంతానాన్ని అందించి, మరల తాము పోయి బుద్ధిలోకాల్లోకి చేరి స్థిరపడతారు. అంతేకాని, అదేపనిగా బాహ్యమునందు, ఇంద్రియములయందు, మనస్సుయందు, కామవ్యాపారము నందు తిరుగుతూ ఉండరు. కాని తానిప్పుడు వివాహం చేసుకోవలసిన సమయం వచ్చింది కాబట్టి తనయందు ఆ కమలం వికసింపగా, తాను సంసిద్ధుడౌతున్నాడు.

తనకు తగిన కన్య ఎవరు? రామునికి తగిన కన్యను విశ్వామిత్ర మహర్షి తీసుకెళ్ళి చూపిస్తాడు. కాని, కృష్ణకథంతా కూడా *"ఏకో నారాయణో హరి"* ఆయనే అంతా కదా! సర్వదేవతామూర్తి, సర్వగ్రహమూర్తి. అన్నీ స్వయంగా చూసుకోవలసిందే. కృష్ణుడిని నమ్ముట అంటే అంతా స్వయంగా చూసుకోవటానికి సిద్ధపడాలి. అంతా స్వయంగా చేసుకోవడం, do it your self అంటారు చూశారా, అదీ కృష్ణుడు! రామకథ ఎట్లా ఉంటుందంటే, ఆయన

వెళ్తూ ఉంటే ఋషులు, దేవతలు, ఆయన ఎరుకకి అందకుండానే ఆయనకి సహాయం చేసిపెడ్తూ ఉంటారు. అది రామకథ. కృష్ణుడు అన్నీ తెలిసినవాడు కదా, అందుకని ఆయనే చేసుకొచ్చాడు. ఎవరూ కోరి వచ్చి, సహాయం చేసింది లేదు. అందరికీ ఆయన సహాయము చేయటమేగా! కృష్ణ కథ లాంటిదే మన మాస్టర్ సి. వి. వి. యోగం కూడా! మనమే చేసుకుంటూ ఉండాలి. మాస్టరుగారు ఒక వాక్యం రాశారు: కృష్ణానుభూతి పొందిన తర్వాత మాస్టర్ సి. వి. వి. స్పర్శ కలిగిందట ఆయనకి. రెండిటికి తేడా ఏమీ లేదు అని ఆయనకి తెలిసిందట. అంటే ఏంటంటే, కృష్ణ తత్త్వంలో ఉండే ఒక విధమైన మాధుర్యంతో పాటు సాధక బాధకాలు కూడా మాస్టర్ సి. వి. వి. యోగంలో ఉండేవారికి ఉంటుంది. మన పని మనమే చేసుకుంటూ ఉండాలి. అదీ పద్ధతి.

కృష్ణుడు ఆ విధంగా భావించగానే అక్కడ ఏం జరిగిందంటే ఆమె ముఖము *"నింతికి ముఖకమల మొప్పె".* ఈయనలో వివాహం చేసుకుందామనే భావన కలిగేసరికి, అక్కడ పెళ్లి చేసుకునే యువతి మొహంలో కాంతి ఒకటి ఏర్పడుతూ ఉంటుంది. "పిల్లకి ముఖంలో కాంతి ఏర్పడుతోందమ్మా! పెళ్లి చేయాల్సిన సమయం వచ్చింది" అని పెద్దవాళ్ళు చెప్తూ ఉంటారు కదా! ఇంట్లో పిల్ల కాంతివంతంగా వికాసం చెందుతూవుంటే అర్థం ఏమిటంటే, ఈ కన్యను పెళ్లి చేసుకునే పెళ్లికొడుకు ఉంటాడే అతడిప్పుడు పెళ్లి చేసుకుందాం అనే భావనలో ఉన్నాడు అని. గుడ్డివాడు వెతుక్కున్నట్టుగా ఉండదు. బొత్తిగా ఏమీ తెలియనటువంటి జాతి మనది. పిల్లకి పెళ్లీడు వచ్చి, పెళ్లి కళ ముఖంలో కనిపిస్తోందంటే అర్థం ఏమిటంటే, ఈమెను గూర్చి విధి వ్రాసిన వ్రాతలో ఒక పెళ్లికొడుకు ఉంటాడు కదా,

ఆ పెళ్లికొడుకు పెళ్లి చేసుకుందాం అనుకుంటే, ఈ అమ్మాయికి ముఖంలో కళ వస్తుంది. అలా ఉంటుంది ప్రకృతిలో.

*"వెలఁదికి మైదీగె వీడఁ దొడఁగెఁ"* – ఆయన పెళ్లి చేసుకుందాం అని భావన కలగంగానే ఈమెలో అంగసౌష్ఠవము, శరీర సౌష్ఠవమంతా కూడా వివరంగా ఏర్పడుతూ వచ్చింది. ఆయన చిత్తకమలం వికసింపగానే, ఆమెకు ముఖ కమలం వికసించిందట. అంటే, కళ పెరిగింది. *"మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ బొలఁతికి జనుదోయి పొడవుసూపె"*. అంటే, ఇంక వివాహం దగ్గర పడుతుంది అనేసరికి పూర్ణమైనటువంటి అంగసౌష్ఠవమంతా తయారవుతూ ఉంటుంది.

*"శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ"*. ఇంక లాభం లేదు, పెళ్లి చేసుకోవాలనేటువంటి భావన. పెళ్లి చేసుకునే సమయం వచ్చిందో లేదో చెప్పండి అని జ్యోతిష్కుడి దగ్గర తిరుగుతూ ఉంటాం కదా! పెళ్లి చేసుకునే సమయం పెళ్లికొడుకుకి వచ్చిందా లేదా అది జ్యోతిష్కుడిని అడగకూడదు, పిల్లవాడిని అడగాలి. "ఏరా! నువ్వు పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నావా? అలాంటి భావం ఏమన్నా ఉందా?" అని అంటే, ఉన్నదని చెప్తాడు మొగవాడు. అంతేగాని, అట్లా గోడచాటుకెళ్ళి నిలబడి ముసిముసి నవ్వులు నవ్వడు కదా! కన్య అయితే "మీ ఇష్టం నాన్నా!" అంటుంది. అంటే, పెళ్లి చేసుకుంటానని అర్థం. "మీ ఇష్టం నాన్నా! మీ ఇష్టం అమ్మా!" అన్నదనుకోండి, అంటే పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉందని అర్థం. పెళ్లి చేసుకోటానికి ఒక కన్య, ఒక యువకుడు సిద్ధంగా ఉన్నప్పుడు ... జాతకంలో ఉండకపోతే అట్లా

అనిపించదు. అనిపిస్తే, జాతకంలో ఉంటుంది. ఈ మధ్య ప్రతి దానికీ జ్యోతిష్యం అంటున్నారు కదా! ఇదివరకు ఏ జాతకాలు చూసి చేసుకున్నారండి? లో భావం ఎక్కువ ముఖ్యం. అంతా వాడి మీద, వీడి మీద, జ్యోతిష్యం మీద, వాస్తు మీద, నాడీ గ్రంథాలమీద, చిలక జోస్యంమీద, పూనకాలమీద ఆధారపడే దుర్బలత్వం ఇప్పుడు వుంది. మంచి భావన కలిగితే, అదే సుముహూర్తం తెలుసా! నీ భావము నందు శుద్ధి ఉంటే, నీ సంకల్పము శ్రేయోదాయకమైతే, నువ్వనుకున్నదే ముహూర్తం. మాస్టరుగారు అలాగే పెట్టేవారు ముహూర్తాలు. మాటిమాటికీ తారాబలం, చంద్రబలం ఏం లేవు, "ఎందుకోయ్! మంచి ఆలోచనకి. అంతా మంచి సమయమే!" అనేవారు. ఇలాంటి గ్రంథముల వలన ఇదివరకు ప్రతి ఇంట్లో కూడా ఇవన్నీ సహజంగా తెలిసి ఉండేవి, ఇలాంటి ఆచారం ఉండేది. ఇప్పుడంతా అనాచారమే, ఏమీ తెలీదు. అందుకని ఈ పద్యం ఇలా చెప్పుకోవాల్సి వస్తోంది మనం! పూర్వకాలంలో ఇటువంటి పద్యానికి ఎక్కువ వ్యాఖ్యానం ఉండేది కాదేమో! మన మిప్పుడు కలియుగంలో ఉన్నాం కాబట్టి ప్రతి చిన్న విషయం వ్యాఖ్యానమే కదా!

ఇంక పెళ్లి చేసుకుందాం అని ఆయనకి దృఢ నిశ్చయం అయిపోయింది. ఆవిడ కూడా చాలా పరిపూర్ణంగా తయారై పోయింది. ఆమె నడుము సన్నగా అయిపోయింది. *"హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశబంధ మధిక మగుచు బాల కమరెఁ"* —బాలకు కేశబంధం అధికమయ్యింది. అంటే, జుట్టు బాగా పెరిగిందటండి. స్త్రీకి శిరోజములు అందానికి, అలంకారానికి ఒక ప్రధానమైనటువంటి వస్తువు. ఆ విధంగా జరిగిందట.

"తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూప బల గుణాదులు
విని కృష్ణుఁడు తనకుఁ దగిన విభుఁ డని తలఁచెన్."

రాజులిళ్ళకి వచ్చే అతిథి జనులు అక్కడ, ఇక్కడ తిరిగి వస్తుంటారు కదా! మనిళ్ళకి కూడా వస్తుంటారు. ఆ ఊర్నించి, ఈ ఊర్నించి వచ్చి, ఇంట్లో ఆడపిల్ల ఉన్నదని తెలిస్తే, ఫలానా చోట మంచి సంబంధముందండి అని చెప్తూ ఉంటారు. మీ అమ్మాయికి ఆ అబ్బాయి సరిపోతాడు అని చెప్పే ముత్తైదువలు, పెద్దవాళ్ళు ఉంటారు. అందుకనే, ఏ ఇంటికి బంధువుల రాకపోకలు ఉంటాయో, ఆ ఇంటికి చాలా శుభాలు జరుగుతాయి. ఎందుకంటే, మంచి సమాచారం ఆ ఊరు నుంచి, ఈ ఊరి నుంచి వస్తూ ఉంటుంది. పది ఇళ్ళకి మనం వెళ్ళాలి, పది ఇళ్ళ వాళ్ళు మనింటికి రావాలి. అప్పుడే ఇంటికి కళ. వైభవము డబ్బుతో రాదు, జీవన విధానం లోంచి వైభవం వస్తుంది. ఎవ్వరిళ్ళకీ మనం వెళ్ళము, మనింటికి ఎవ్వరూ రారు, అలా ఉందనుకోండి, ఆ ఇల్లు ఎందుకూ కొరగాని ఇల్లు అది. మనం పది ఇళ్ళకు వెళ్ళాలి, పదిమందిని మనింటికి పిలవాలి. అదీ పద్ధతి.

ఆ వయసుకి కృష్ణుడు వచ్చేటప్పటికి కృష్ణుని రూపం, కృష్ణుని బలం, కృష్ణుని యొక్క గుణములు అప్పటికే చాలా మోతమోగిపోతూ ఉండుండాలి కదా! చాలా అల్లరి చేశాడు. చాలా మంది రాక్షసులను సంహరించాడు. అతని అందం గురించి ఆ నోట, ఆ నోట అలా పాకుతూనే ఉంటుంది. ఆమె విన్నది. విని,

ఆలోచించుకొని, అతను నాకు భర్త అయితే బాగుంటుంది అని అనుకుందిటండి. రాముడు మిథిలలో ప్రవేశించినపుడు అలా నడిచి వెళ్తూవుంటే, అందరూ "అదిగో! ఆ విశ్వామిత్ర మహర్షితో వస్తున్న ఆ పసిబాలురలాగా కనిపిస్తున్నారే, వీళ్ళే ఆ మారీచుడు, సుబాహులను చంపేసి, యజ్ఞం కాపాడారు" అని చెప్పుకున్నారు. అందరూ మేడలు, మిద్దెలమీద నుంచి చూసి మిథిలా నగరంలో, "అబ్బ! ఎంత బాగున్నాడో" అని చెప్పుకున్నారు. ఆ నోటా, ఈ నోటా అంతఃపురంలో ఉన్న అమ్మవారికి తెలిస్తే, ఆమె చూస్తుంది. రాముడిని చూచి చూడంగానే, "ఇతను నాకు పెనిమిటి అయితే బాగుండును" అని అనుకుంది. అలాగ ఒక్కొక్కరకంగా అనిపిస్తుంది.

అందుకే చెప్తుంటాను, జాతకాలు పట్టుకొని వేలాడకండి, ఒకర్నొకరు చూసుకున్నప్పుడు అనిపించే భావానికి చాలా ప్రాధాన్యత ఇవ్వండి అని. ఒకర్నొకరు చూసుకున్నప్పుడు ఒకరి యందు ఒకరికి కలిగిన భావన ఉంటుందే, ఆ భావన నీకు జ్యోతిష పండితులు చెప్పలేరు. ఏదైనా దివ్యస్పర్శ ఉన్నటువంటి శాస్త్రజ్ఞులు చెప్పగలరు. అందరూ చెప్పలేరు. "జాతకాలు బాగా కుదిరినాయండి", మళ్ళా "కుదిరినట్టు లేదండి" అంటూ ఉంటాడు కదా! జాతకమే కాదు, చాలా విషయాల్లో కూడా. జాతకంలో అంతా ఉంటుంది. చూడగలిగే వాడు ఎలాంటివాడో? చూడగలిగేవాడి దృష్టిని బట్టి, అతని సంస్కారమును బట్టి జ్యోతిర్విద్య భాసిస్తుంది. అవన్నీ దివ్య విద్యలు. నీలో దివ్యమైనటువంటి సంస్కారం ఉంటే అన్నీ బాగుంటాయి. జాతకాలు కుదిరినట్టుగా కనబడకపోయినా,

వివాహాలు చేస్తే హాయిగా ఉన్నారు. "ఏం గురువుగారు! కుదిరిందా?" అంటే, "బాగా కుదిరినాయి. ముందు పిల్లవాడిని, పిల్లని చూడనివ్వండి. చూసి వాళ్ళేమన్నారో చెప్పండి" అని చెప్తాను. వాళ్ళిద్దరికి చూడంగానే, "ఈమె నాకు భార్య అయితే బాగుండును" అని దృఢమైనటువంటి భావన ఆ పిల్లవాడికి, అలాగే పిల్లకి కలిగిందనుకోండి, ఇంక శాస్త్రం అక్కర్లేదు. సర్వసాక్షి జీవుడు. జీవుడికి దృఢంగా అనిపించిందానికి మనం విలువ ఇవ్వకుండా కేవలం శాస్త్రానికే విలువ ఇచ్చాము. శాస్త్రం ఎంత నిష్కర్షగా చెప్పగలిగినా, చూడగలిగినవాడిని బట్టి కదా దర్శనం! ఒక్కొక్కసారి జాతకాలు కుదరకపోయినప్పటికీ "ఫర్వాలేదు. ఒకర్నొకరు పెళ్ళికొడుకు, పెళ్లికూతుర్ని చూసుకోనివ్వండి" అని చెప్తూ ఉంటాను. ఎందుకు అలా చెప్పాను? అలా అనిపించింది కాబట్టి చెప్పాను. అలా చూసుకుంటే వాళ్లకి బాగానే నచ్చింది. చూడండి మరి! "జాతకాలు బాగా కుదిరినాయి అండి. కాని, పిల్లవాడు ఒప్పుకోలేదండి" అని. . . ఇవన్నీ వస్తూ ఉంటాయి. జాతకాలు బాగా కుదిరితే ఒకళ్ళకొకళ్ళకి నచ్చాలిగా? నచ్చలేదే! జాతకాలు చూడడంకన్నా, పిల్లని పిల్లవాడు, పిల్లవాడు పిల్లని చూస్తే ఎలా ఉంటుంది. ఇక్కడ ఈమే తెలుసుకుందండి.

"ఆ లలన రూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ జేకొందు ననుచు హరియుం దలఁచెన్."

ఈమెను గూర్చి వినిపిస్తే, ఆమె రూపము, ఆమె బుద్ధి, ఆమె శీలము, ఆమె గుణము వాటిని గురించి చింతించి, *"బాలారత్నముఁ దన కిల్లాలుగఁ, జేకొందు ననుచు"* అని అనుకున్నాడట. అని ఆ విధంగా ఒకరొకరు చూడకముందే భావాలు. వినికిడి వల్ల. అంటే, చెప్పిన వాళ్ళనుబట్టి లెండి. కొంతమంది చెప్తే వినకూడదు. కొంతమంది చెప్తే తటస్థంగా ఉండాలి. కొంతమంది చెప్తే తప్పకుండా దాన్ని ఆచరించడానికి ప్రయత్నం చేయాలి. మన అనుభవంలోంచి ఇది మనకి తెలుస్తుంది. కొంతమంది మంచివాళ్ళే గాని instinctive గా wrong suggestions ఇస్తారు. వాళ్ళు చెప్పినట్టు చేస్తే, తలగోడకు కొట్టుకున్నట్టు అయిపోతుంది. కొంతమందివి అలా జరుగుతూ ఉంటాయి. కొంతమందివి కాస్త అటు ఇటుగా ఉంటాయి. కొంతమందివి కళ్ళుమూసుకొని వెళ్ళిపోవచ్చును. ఇలా ఎందుకు ఉంటారంటే, అది వారి వారిలో తలపుకు వచ్చేటువంటి పద్ధతిలో ఉంటుంది. అమ్మ అనుగ్రహం ఉన్నచోట ఏదైతే జరుగవలసిందో, దానికి సంబంధించిన సంకల్పమే వస్తుంది, మిగతావి రావు. అంచేతే, మనకనిపించినవన్నీ నిజం అనుకోకుండా, ఆరాధన పెంచుకుంటూ, అమ్మ పలికించినవల్లా కూడా తెలుసుకుంటూ ఉండాలి. అంబ పలుకు వేరు కదా! *"అంబ పలుకు జగదంబ పలుకు"* అంటుంటాడు కదా! అంబ పలుకుకన్నా మించిందేముంది? మన బుద్ధి వికాసం ఎలా ఉంటుందంటే, *"వినదగు ఎవ్వరు చెప్పిన వినినంతనే వేగపడక వివరింపదగున్"*. అంటే, by experience. చుట్టూ ఉండేవాళ్ళు కొంతమంది చెప్పేవి అవి బాగానే ఉంటాయి, అవుతూ ఉంటాయి. కొంతమంది చెప్పేవి అవ్వవు. కొంతమంది చెప్తే confusion

అవుతూ ఉంటారు కదా! అది వాళ్ళకుండేటువంటి పరిస్థితి. వాళ్ళు దుర్జనులు కాదు, సజ్జనులే, అది గుర్తు పెట్టుకోండి! కొంతమందికి తట్టవు, కొంతమందికి తడతాయి. కొంతమందికి వికెట్టు మీద బంతులు పడతాయి, కొంతమందికి పడవు. అందుకని, వింటూ ఉంటే తెలుస్తూ ఉంటాయి. వినే ఓపిక లేదు కదా! ఎంతసేపూ మాట్లాడేద్దామని తప్ప, విందామని ఎవడికీ లేదు ఈ రోజుల్లో!

ఈ విధంగా ఆయనా విన్నాడు, ఆవిడా విన్నది. వాళ్ళు ఎవరి దగ్గర్నుంచి విన్నారో, వాళ్ళు ఎలాంటి వాళ్ళో దాన్నిబట్టి కదా! ఏదో తంత్రమైతే తప్ప అందరూ కూడపలుక్కుని చెప్పరుగా! తంత్రమైతే కూడపలుక్కుని చెప్తారు అందరు. ఊళ్ళో పిచ్చివాడిని ఒకడిని ఏరి, అతడు చాలా తత్త్వవేత్త, రాజకుమార్తెకి అతనే తగిన వరుడని ఒక తంత్రం చేస్తారు. ఆ పిచ్చివాడే కాళిదాసు అవుతాడు తర్వాత. ఎందుచేత? ఆ రాజకుమార్తె భక్తి వలన. పిచ్చివాడేం చేసినా అతనిని ఒక మహా అవధూతగా మనం వ్యాఖ్యానం చేయవచ్చు, భాష్యం చెప్పవచ్చు. నీ దగ్గర జ్ఞానం ఉంటే, జరిగే ప్రతి పిచ్చి పనిని తత్త్వపరంగా దానికొక వ్యాఖ్యానం చెప్పచ్చు, ఒక భాష్యం చెప్పచ్చు, ఒక వివరం చెప్పచ్చు. అట్లా పిచ్చివాడు సభలో ప్రవేశించి ఏవేవో పిచ్చి పిచ్చి పనులు చేస్తూ ఉంటే, వాటన్నిటికీ తత్త్వపరమైనటువంటి వివరణ, పండితులందరు కుతంత్రం చేస్తే, తన కుమార్తె అమ్మ భక్తురాలు కాబట్టి ఇలాంటి వాడే తగిన వరుడు అని పెళ్లి చేస్తాడు తండ్రి. కుమార్తెకి తెలిసిపోతుందట రెండు రోజుల్లో, ఇతను నిజంగా పిచ్చివాడు అని. పిచ్చివాడని తెలిసి, బాధ పడి అమ్మ నడుగుతుంది "చిన్నతనం నుంచి నిన్ను నమ్ముకున్నాను. ఎందుకిలా చేశావు తల్లి?" అని. ఎందుకిలా చేసిందో, తర్వాత

ఘట్టంలో తెలుస్తుంది. మరి అలాంటి వాడిలోంచి వేదవ్యాసునితో సమానంగా అమ్మ పలికిందట!

అమ్మ పలుకు తెలియాలంటే అమ్మ ఆరాధన ఒక్కటి బాగుంటే చాలదు, స్త్రీ యందు నీకుండే దృష్టి బట్టి ఉంటుంది. అమ్మ అనుగ్రహం కావాలంటే, సృష్టిలో స్త్రీ యందు నీకున్న దృష్టిని బట్టి ఉంటుంది. తల్లి, సోదరి, భార్య, కుమార్తె– ఈ నలుగురు రూపాల్లోను – నీకు జీవితంలో తారసిల్లే ఇతర స్త్రీ రూపాలయందు నీవు ఎలాంటి భావన కలిగి ఉన్నావు అనేదాన్ని బట్టి అమ్మ నిన్ను అనుగ్రహిస్తుందా, అనుగ్రహించదా అనేది తెలుస్తుంది. అంతే కాదు, సత్సంతానాన్ని ఇస్తుందా? ఇవ్వదా? వంశాన్ని కొనసాగిస్తుందా? సాగించదా? ఇలాంటివన్నీ ఉన్నాయండి. అన్నీ ఇటువంటి పుస్తకాల్లోన్నే ఉంటాయి. స్త్రీ మూర్తి యందు చాలా పవిత్రమైన భావన ఉన్నవారికే పురోగతి, ఇతరులకు ఉండదు. భక్తుల కథలు చూసుకుంటే అన్నీ అలాగే ఉంటాయి, అమ్మ ఆరాధన, సాధన, ధ్యానము, జపము, తపమే గాక, సంఘంలో స్త్రీ యందు నీ దృష్టి, నీ ప్రవర్తననుబట్టి ఉంటుంది. ఇది ప్రాతిపదికగా అవి కూడా చెప్తున్నాను. ఆ విధంగా, వారిద్దరికీ ఒకరియందు ఒకరికి మనసు ఏర్పడింది.

"బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై."

రాజు చాలా సత్పురుషుడు కాకపోతే ఇలాంటి కన్య

పుట్టదు కదా! లక్ష్మి అంశతో కూడిన ఒక అమ్మాయి మనింట్లో పుట్టిందంటే, ఆ తండ్రి ఎలాంటివాడు అయ్యుండాలండి? ఎంతటి వాడు అవ్వకపోతే, అంత మంగళప్రదమైనటువంటి స్త్రీ అతనింట్లో పుడుతుంది. సంతానం కనాలంటే చాలా ఆలోచించాలి. స్త్రీ శిశువుని ఇచ్చేట్టయితే, నీలాంటి, నీ కళలున్న పిల్లనివ్వు తల్లీ! పురుష శిశువుని ఇచ్చేట్టయితే రాముడు లాంటి పిల్లవాడిని యివ్వు అని ప్రార్థన చేసుకోవాలి. ఆరాధనా ఫలితంగా నీ దయ ఎలా ప్రసరించినా నాకు ఆనందమే. కానీ, నీయొక్క ఆరాధకుడై ఉంటే చాలు ఆ జీవి, అలాంటి వాళ్ళు కావాలి సంతానం. అంతేగాని, మిగతా విషయముల యందు ఆసక్తి కలిగి, పశుప్రాయులై జీవించే వాళ్ళు ఎంతమంది పుడితే ఏమి లాభం తల్లితండ్రులకి? ఉత్తమ సంతానం మనకి ఉత్తమ గతుల్ని కలిగిస్తుంది. అధమమైనటువంటి సంతానం మనల్ని కాళ్ళు పట్టి కిందకి లాగేస్తుంది. ఒక్క జన్మతో కాదు, మూడు తరాలు తర్వాత కదా! మానవ జీవితం ఎంత ఆనందదాయకమో, అంత బాధ్యతయుతం కూడా. ఈ జీవితం మనకి కలిగినందుకు, మన వంశం యొక్క సంస్కారాన్ని మనం ఇంకా పెంచాలి. మన తల్లితండ్రుల కన్నా, ఇంకా మనం ఉత్తమంగా తయారయితే వాళ్ళకి ఉత్తర గతులు బాగుంటాయి. అన్ని విధాలా ఇకనుంచి రాబోయే సంతానం ఇంతకన్నా గొప్పగా ఉండేట్టుగా ఉండాలి. ఏదైనా మన స్పర్శ వలన దానికి ఉన్నతి రావాలి. ఏ పని నీ దగ్గరకి వస్తే, ఆ పని నీ ద్వారా అది జరిగినప్పుడు ఇంకొంచెం ఉన్నతి రావాలి. ఇక పడిపోవడం, నాశనమైపోవడం, మన కళ్ళ ముందే బొత్తిగా నశించడం జరగకూడదు. ఒక పూలచెట్టు నీ చేతిలో పెడితే, అద్భుతంగా పూలు పూసేట్లుగా చూడాలి. ఒక ఉద్యానవనాన్ని

అప్పచెప్పితే దాన్ని పెంచాలి. ఒక బాధ్యత అప్పజెప్పితే దాన్ని అలా పెంచాలి. అన్ని రకాలుగా అన్నిటినీ పెంచినవాడి జీవితం ధన్యం. వాడు సృష్టిని చక్కగా నిర్వర్తింపచేసినవాడు అవుతాడు. అన్నిటినీ నాసిగా తయారుచేసి, అన్నీ పాడు చేసుకున్నవాడు, వాడు పాడైపో వటమే గాక, వారి పూర్వీకుల్ని, వాడి తర్వాత వాళ్ళను కూడా పాడు చేసేస్తాడు. అల్లాంటి వాళ్ళు ఉన్నచోట వంశం కూడా కొనసాగదు.

వీళ్ళంతా *"శేముషీ సింధువులై"* అన్నాడు. శేముషీ సింధువులంటే, బుద్ధి ప్రధానంగా కలిగినటువంటి గుంపులట వాళ్ళందరు. ఏది ఇంటికొచ్చే బంధువులు. తంపులు, తగువులు పెట్టేవాళ్ళు కాదు. కొంతమంది ప్రత్యేకంగా పనికట్టుకొస్తుంటారు కదా! తగవులు పెంచి వెళ్లిపోతుంటారు ఇంట్లో. అలా కాకుండా, వచ్చిన వాళ్ళంతా మీ అమ్మాయిని కృష్ణునికివ్వు బాగుంటుంది అని చెప్పి ఆ రాజుకి చెప్పారందరూ. ఎంతోమంది చెప్పారు.

# శ్రీకృష్ణునికి రుక్మిణి పంపిన సందేశము

*"విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి"*– అక్కడొక దుర్యోధనుడు ఉన్నాడు. ప్రతి చోట ఒకడు ఉంటాడు కథలో ఖల్నాయక్ కదా! నాయకుడికి వ్యతిరేకంగా ఎవడు వాడు? అహంకార పురుషుడు. "నేను చెప్పినట్టు వినాలి. ఈ ఇంట్లో ఏదైనా నేను చెప్పినట్టే జరగాలి. వినండి. అమ్మ, నాన్న కూర్చోండి". *"జోమే కహూ వోకర్నాహై"* అనరు? అంటారు. ఏమిటది? కరుడుకట్టిన అహంకారం. వాడొకడున్నాడు, అలాంటి వాడు ఒకడు వచ్చేశాడు అడ్డంగా. *"దుస్సంధుడు రుక్మి"* వాడితో ఎవరూ మాట్లాడ్డానికే వీల్లేదు, మూర్ఖుడు. చేరి మూర్ఖుని మనసు రంజింపరాదు. ఒక మాట చెప్పడానికి వీల్లేదు. అలా కాదురా అంటే "ఆ!" అంటాడు. మాట్లాడనివ్వడు, గయ్, గయ్ మని అరుస్తాడు. అంటే వీళ్ళ తలకాయ ఎక్కడో ఏ గోడకో, ఎప్పుడో ఫెడీమని తగులుతుంది. అంతవరకు అలాగే ఉంటారు. అహంకారి కోరి తెచ్చుకుంటాడు కష్టాలు. ఏం సందేహం లేదు. తన అహంకారం వలనే తనకి కష్టాలు.

*"కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి"* –ఎందుకు విరోధము? ఎన్నడు అంతకుముందు కలుసుకోలేదు వాడు. కృష్ణుడు వీడిని ఒక మాట అన్నది లేదు, అపహాస్యం చేసింది లేదు, అవమాన పరిచింది లేదు, హేళన చేసింది లేదు. ఎందుకంటే వీడి friend ఒకడు ఉన్నాడు, వాడు శిశుపాలుడు. వాడికి పుట్టుకతోనే కృష్ణుడంటే

ద్వేషం. మరి వాడితో వీడు చేరితే వాడు ఎంతసేపూ కృష్ణుని గురించి ఏవో చెత్తమాటలన్నీ చెప్తూ ఉంటాడు. వాడు పచ్చి దొంగ. వాడు కాముకుడు. వాడది, వాడిది. వాడు నల్లగా ఉంటాడు. వాడికసలు stature లేదు. వాడికో అందం చందం లేదు. ఒక కిరీటం పెట్టుకోడు, నెమలిపింఛం పెట్టుకుంటాడు. వికారంగా ఉంటాడు. ఇలాంటివన్నీ నూరిపోస్తూ ఉంటే, వాడికి వాడి చెల్లెలిని ఇవ్వబుద్ధి కాదు. వాడు మనకొద్దు అని decide అయిపోయాడు. అంటే వీడి information అట్లా ఉంది. ఎన్నడూ అంతకముందు రుక్మి కృష్ణుడిని కలిసిన సందర్భమే లేదు. శిశుపాలుడికి ఎందుకు ద్వేషం? కృష్ణుని మేనత్త కొడుకే శిశుపాలుడు. ఆ శిశుపాలుడు పుట్టినప్పుడు మహావికారంగా పుట్టాడు. రెండు తలకాయలు, నాలుగు చేతులు, నోట్లో రెండు కోరలు, మిడిగుడ్లు, నల్లగా పుట్టాడు వాడు. తల్లితండ్రులు అలాంటి వాళ్ళా? కాదు. చాలా సంస్కారవంతులు. దుఃఖపడ్డారు. ఋషుల్ని, యోగుల్ని, సిద్ధుల్ని ఇంటికి పిలిపించి, "ఏమిటి మాకీ బాధ? వీడెవడు? వీడెందుకు వచ్చాడు? ఎందుకు పుట్టాడు? వీడిలాగే ఉంటాడా?" అని అడిగితే వాళ్ళు చూసి కారణజన్ముడని చెప్పారు. ఉందిగా వాడికి పుట్టడానికి కారణం! జయవిజయులలో ఒకడేగా వాడు! "కారణజన్ముడు. కాని ఇలా ఉండడు. ఇతన్ని ఎవరు స్పృశిస్తే, ఇతనికి సుందరమైన ఆకారం వస్తుందో, అతడి చేతిలోనే ఇతడు మరణిస్తాడు" అని చెప్తారు. శిశుపాలుడు సహజంగా సుందరుడే. ఈ వికారం కొని తెచ్చుకున్నాడు వాడు. "మేము కూడా చిన్నప్పుడు బాగానే ఉండే వాళ్ళం అండి" అని చెప్పుకుంటుంటాం కదా! మరిప్పుడు ఎందుకు బాలేదండి అంటే వికారాలు చేరిపోయినాయి మనలో. ఎందుకు

వికారం చేరింది? పనులు, చేతలు, భావాలు, మాటలు. ఇప్పుడు ఎలా అంటే, "ఎవరన్నా బంధువులు, వాళ్ళు, వీళ్ళు వస్తుంటారు కదా! వస్తే వాళ్ళు చేతుల్లోకి పిల్లవాడిని ఇవ్వండి. ఎవరి స్పర్శ వల్ల మరి ఇలా అవుతాడో, బాగుంటాడో తెలియదు" అంటారు. సరే అలా, అలా, వస్తూ అత్త ఇంటికి వస్తాడు కృష్ణుడు. కృష్ణుడంటే అత్తకి చాలా ఇష్టం. "నాన్నా! ఇదిరా వీడి పరిస్థితి. నీ చేతుల్లోకి ఒకసారి తీసుకోరా" అంటుంది. "ఇయ్యి అత్తా" అంటాడు. చేతిలోకి తీసుకోగానే మారిపోతాడు. మారిపోతే అత్తకి ఆశ్చర్యం, ఆనందం, దుఃఖం అన్నీ వస్తాయి. ఆశ్చర్యం ఎందుకంటే కృష్ణుని లీలలు తెలుసు. కృష్ణుడు ఎంతటివాడో తనకు తెలుసు. అలాంటి వాడి చేతుల్లోకి వాడి వల్ల మరి ఇలా జరిగింది. పిల్లవాడు అందగా డయ్యాడు, మామూలు రూపం వచ్చింది అని ఆనందం. తన మేనల్లుడి చేతుల్లోనే తన కొడుకు చచ్చిపోతాడు అని దుఃఖం. "నాయనా! ఇలాంటి శాపం ఉందిరా వీడికి. నువ్వే చంపేస్తావా నా కొడుకుని?" అని అడుగుతుంది. "నేనెందుకు చంపుతానత్తయ్యా? నేను చంపను" అంటాడు. "లేదురా! అలా చెప్పారు" అంటుంది. "అలా చెప్పారంటే మరి ఆలోచించాలి. వీడేమన్నా తప్పులు చేస్తే నేను ఊరుకుంటూ ఉంటాను. ఒక్కసారి వంద తప్పులు చేస్తే మాత్రం నేను ఊరుకోను అత్తా" అని చెప్తాడు. ఆ రాజసూయంలో ఒక్కసారి వంద తప్పులు చేసేస్తాడు శిశుపాలుడు. ఎందుకంటే, వాడు Nuxvomica పేషంటు! కృష్ణుణ్ణి చూడంగానే బోల్డు ఈర్ష్య వచ్చేస్తుంది లోపల నుంచి. అందుకని, అక్కడ ఒక్కొక్కటి ఒక్కొక్కటి చేస్తుంటే, కృష్ణుడు లెక్కపెడ్తూ ఉంటాడు. తొంభై తొమ్మిది అవ్వంగానే చక్రం పంపించేస్తాడు. పంపించేస్తే, ఆ

జ్యోతి తనలోకి వచ్చేస్తుంది. తన సేవకుడే కదా! అలాంటి వాడు శిశుపాలుడు.

మరి శిశుపాలుడితో సావాసం రుక్మికి. అందుకని వాడు మాట్లాడేవన్నీ వీడికి నచ్చుతాయి. ఎందుకంటే, జయ విజయులలో శిశుపాలు డొకడు. రెండవ వాడు దంతవక్త్రుడు. రావణకుంభకర్ణులు, హిరణ్యాక్షహిరణ్యకశిపులు ఎంతటి వాళ్ళు? వాళ్ళు మాట్లాడితే వశీకరణ శక్తి ఉంటుంది. పక్కవాడు easyగా నమ్మేయాల్సిందే! వాడు చిన్నప్పటి నుంచి కృష్ణుని గురించి ఇలా బోధ చేస్తూ ఉంటాడు. వాళ్ళతో కూడి ఉండటం చేత రుక్మి కృష్ణునికి రుక్మిణిని ఇవ్వను అంటాడు. మనమంతాకుడా ఒక సద్గురువు సమాశ్రయంలో ఏదో సత్సాధన మొదలు పెడితే. . . అసలు మనమే లోపల అంతంత మాత్రంగా ఉంటాం. దానికితోడు మనకి సాంగత్యం బాగా లేదనుకోండి. రుక్మి అంటే మనస్సేగా? బాగా లేకపోతే ఏం జరుగుతుందంటే, దీని నుంచి దూరమైపోతాం, దానికి మనమే అడ్డయిపోతాం. చిన్నప్పుడు metropolis వెళ్ళి మూడు నాలుగు రోజులు పని చేసుకొస్తే, విశాఖపట్నం రాంగానే, వస్తూ ఉంటేనే ఏదో చాలా చేసెయ్యాలనే భావన విపరీతంగా వస్తూ ఉండేది. ఒక్క మూడు రోజులు అవగానే పోయేది. ఎందుకంటే, మనకి సహజంగా ఆ భావన లేదు. మళ్ళీ వెళ్తే, మళ్ళీ వస్తూ ఉంటుంది. ఏమిటిది అంటే, మహానగరంలో విపరీతమైన రజస్సు ఉంటుంది. ఎందుకంటే, అందరూ తుర్రు బుర్రు అని తెగ తిరుగుతూ ఉంటారు, ఏవేవో చేసేస్తూ ఉంటారు, హడావిడిగా ఉంటారు, పొద్దున్నే పరిగెడ్తూ ఉంటారు, రాత్రి వరకు

చేస్తూ ఉంటారు. ఇవన్నీ చూస్తే మనం కూడా అట్లా ఉండాలేమో అనిపిస్తుంది. రజోగుణ సంపత్తి ఉండేవాళ్ళతో చేరామనుకోండి, మనలో రజస్సు పెరుగుతుంది, తమోగుణ సంపత్తి ఉండేవాళ్ళతో చేరామనుకోండి, మనలో తమస్సు పెరుగుతుంది. ఏం చేయక్కర్లేదు, పొద్దున్నే లేవక్కర్లేదు, ప్రార్థన ఆరింటికే చెయ్యక్కర్లేదు, పూజ అసలే చెయ్యక్కర్లేదు, స్నానం చెయ్యక్కర్లేదు, ఇట్లా అన్నీ టక టక వచ్చేస్తాయి.

నీలో జీవ సంస్కారంలో దైవమును చేరాలనే భావన ఉన్నా, ఆ భావన ఈ సాంగత్యదోషం చేత నీలో ఉండేటువంటి అహంకార పురుషుడు నీకే అడ్డుపడ్తాడు. అంటే, నువ్వే నీకు అడ్డుపడతావు. అదే చెప్తాడు కృష్ణుడు భగవద్గీత ఆరో అధ్యాయంలో: ''ఆత్మకి ఆత్మ శత్రువు, ఆత్మకి ఆత్మ మిత్రుడు, ఆత్మ చేత ఆత్మ ఉద్ధరించుకోవచ్చు, ఆత్మ చేత ఆత్మ పతనం చేసుకోవచ్చు.'' అదేంటి ఇన్ని ఆత్మలు ఉన్నాయా మనలో అంటే, బహుపాత్రాభినయం మనది. చిత్తంలో ఉంటాం, అహంకారంలో ఉంటాం, బుద్ధిలో ఉంటాం– మూడుచోట్ల ఉంటాం మనం. నాలుగవ వాసుదేవుడి సంగతి దేవుడెరుగు! సంకర్షణుడు, అహంకారపురుషుడు. ప్రద్యుమ్నుడు, అపుడో, ఇపుడో, ఎపుడో ఒకసారి బుద్ధి వెలుగుతూ ఉంటుంది మనకి కదా! అప్పుడు మనం ప్రద్యుమ్నుడు. ఈ ఇంద్రియాల్లో పట్టుకొని ప్రపంచంలో అట్లా తిరిగేస్తూ ఉంటాం కదా! గ్రామ సింహాల్లాగా అప్పుడు చిత్తంలో ఉన్నప్పుడు అనిరుద్ధుడు. తిరుగుడే కదా మనకి. తిరుగులేని తిరుగుడు తిరుగుతూ ఉంటాం! ఇలా మూడుగా ఉంటాం మనం. జీవుడు అప్పుడప్పుడు కొంచెం పోనీ

ఏదన్నా దేవుడిని చేరదాం అనిపిస్తే, "ఛీ నోర్ముయ్" అని చెప్తాయి మిగతావి. సాయంత్రం ప్రేయర్ చేసుకుందాం అంటే, ఫస్ట్ షో సినిమా ఎప్పుడూ ప్రేయర్ time కే ఉంటుంది కదా! ఫస్ట్ షోనా, ప్రేయరా చెప్పండి? ప్రేయరు ఎప్పుడూ ఉండేదే అని logic చెప్తాడు పక్కనుంచి. ప్రేయర్ ఎప్పుడు ఉండేదే, సినిమా వుండదు కదా అంటాడు! అంటే సినిమా ఎప్పుడూ ఉండదా? ఇది కాకపోతే ఇంకోటి ఉంటుంది. ఆ ప్రేయరు ఎప్పుడు ఉండేదే! నిజమే అనిపిస్తుంది. అట్లా వీడు రుక్మిగాడి పక్కన చేరి పాడు చేసేస్తూ ఉంటాడండి.

బుద్ధి, చిత్తము, అహంకారము, ఈ మూడిటిలో దేని బలం ఎక్కువగా ఉంది? వీడిట్లా అడ్డుపడిపోతే *"మత్తపుష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై"* అన్నాడు. ఇందులో రహస్యార్థమది. మన సాధనలో ప్రతి సాధకుడికి కాస్తోకూస్తో బుద్ధి వెలుగుతూ ఉంటే, ఇంద్రియ వ్యాపారములలో ఇరుక్కున్న చిత్తం దాన్ని ఆర్పేస్తూ ఉంటుంది. ఇంకొంచెం ఏమన్నా ఉంటే అహంకారం అణిచేస్తూ ఉంటుంది. ఈ ఇద్దరినే పురాణపురుషుడి కథలో కంసునికి కేశిగాను, దుర్యోధనునికి శకునిగాను చెప్తూ ఉంటారు. నీ పైవాడు లంచాలు తింటాడు, నీ కింద వాడు లంచాలు తింటాడు. నువ్వు ఒక్కడివి ఏం బాగుంటావ్? నువ్వు కూడా తినెయ్! ఇది కదా ఇప్పుడు సిద్ధాంతం. అట్లా ఉన్నా ఇబ్బంది కదా! ఊరంతా లంచాలు తింటుంటే నీవు మడి కట్టుకొని ఏం చేస్తావయ్యా? ఇబ్బందులు పడక. తినేసెయ్! అదే అరిగిపోతుంది! అట్లా బుద్ధికి బోధ చేయటానికి చిత్తం నుంచి, అలవాట్లు ఒక

పక్కనుంచి బోధన చేస్తుంటాయి. అహంకారం ఒక పక్కనుంచి ఈ సాధనలో వీడు పడితే తన సౌకర్యాలన్నీ పోతాయి అని ఆపేస్తుంది. అలా కంసుడు దేవకిని ఆపినట్టు, ఈ రుక్మిగాడు ఇంట్లోనే ఉంటాడు కదా! వాడు అట్లా ఆపాడు.

"అన్న తలంపు దా నెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే."

తన అన్న రుక్మిణి ఆలోచన తెలుసుకొని రుక్మిణి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుని పిలుస్తుంది. అగ్నిద్యోతనుడంటే సద్గురువు లాంటివాడు, హనుమంతుడు లాంటి వాడు. జీవుడిని దేవుడు దగ్గరికి చేర్చేవాడు. జీవుడు గురించి దేవుడుకి చెప్పేవాడు. వార్తలు జీవునికి చెప్పేవాడు. కట్టెలో నిప్పుంది, కట్టెలో అగ్ని ఉంది కదా! జ్వాలలో అగ్ని ఉంది. ఈ కట్టెలో ఉండే అగ్ని ఆ జ్వాలను చేరాలంటే, కట్టెలో ఉండే పదార్థం అడ్డేగా? హోమం చేస్తూ ఉంటాంగా! ఆ సమిధల్లో అగ్ని ఉందండి. *"సమిధాధానం కరిష్యే"* అంటాము. ఆధానము చేయటం. అందులో అగ్ని ఉంది. ఆ అగ్ని తనకి మూలమైనటువంటి జ్వాల గురించి తపన చెందుతూ ఉంటుంది. ఎవరు గనుక ఆ జ్వాల స్పర్శ తనకిస్తే, తను అందులో చేరుతుంది కదా! ఓ జ్వాల స్పర్శ సమిధలో ఉండే అగ్ని కందిస్తే, సమిధలో ఉండే అగ్ని, ఒక్కసారి ఉద్బుద్ధం అంతేగా! అదేగా హోమంలో చూస్తాం, అదే యోగం కూడా! తేజో సంపన్నుడైన,

అగ్నిస్వరూపుడైనటువంటి జీవుడు పదార్థము నందు ఇమిడి ఉన్నాడు. సమిధ యందు ఉన్నటువంటి అగ్ని వలె నిమిడీకృతమై ఉన్నాడు. ఈ నిమిడీకృతమైన అగ్ని జ్వాలగా మారుదామని తపన చెందుతూ ఉంటుంది. అంతంత జ్వాలలు మనం పొద్దున హోమంలో చూశామంటే, ఎక్కడనుంచి వచ్చినాయి అవన్నీ? మనం పెట్టిన కర్పూరంలోంచి వచ్చేస్తాయా? సమిధలో ఉన్న అగ్ని అది. అది జ్వాలయై ప్రజ్వలించి కాంతి వెదజల్లుతూ ఉంటే మనం అందరం అట్లా కళ్ళు, నోళ్ళు తెరిచి చూస్తూ ఉంటాం. తెగ ఫోటోలు తీసేస్తూ ఉంటాం కదా! ఎందుకు తీస్తారు కెమెరాలో ఫోటోలు? నాకు సైతం కొన్ని దేవతా మూర్తులు కనిపించినాయి అని చూపించడానికి. అది వాళ్లకి ఆనందం. కానీ ఆ జ్వాలని చూస్తేనే అనందం కదా! కట్టె పుల్లల్ని చూస్తే ఆనందమేముందండి? జ్వాలను చూస్తే ఆనందం. ఎక్కడ నుంచి వచ్చింది అది? కట్టెపుల్లనుంచేగా? ఎవరి వలన? ముట్టించేవాడు ఒకడు ఉండద్దు? ద్యోతనం చేసేవాడు ఒకడు ఉండద్దు అగ్నిని? వెలిగించే వాడు ఒకడు ఉండద్దు? సెనగలు నానేసుకొని తింటే బాగుంటాయి కదా! సెనగలు ఉన్నాయి, నీళ్ళున్నాయి, శెనగలు నీళ్ళల్లో వేసేవాడు ఒకడు ఉండాలి కదా! అని రాశారు మాస్టరు గారు. అలాగే సమిధలు ఉన్నాయి. జ్వాల, దానిలో ఉండే అగ్నిని ద్యోతనం చేసేటువంటి వాడు ఒకడు కావాలి. శెనగలు నీళ్ళల్లో వేసేవాడు ఒకడు ఉండాలిగా! రామాయణంలో హనుమంతుడు అగ్నిస్వరూపుడు, శివుడు కదా! వేదంలో అగ్నినే పురాణాల్లో శివుడంటారు.

అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుడిని పిలుస్తుంది ఆవిడ. పిలిచి ఆయనకి ఏం చెప్పిందంటే, *“అన్న తలంపు దా నెఱిఁగి*

*యన్నవనీరజ"* అంటే అప్పుడే వ్యక్తమైంది కదా! కొత్తగా పద్మం. అలాంటి స్త్రీ మూర్తి "కన్యకామూర్తి, కన్యకాపరమేశ్వరి" అంటుంటాం. *"యన్నవనీరజగంధి లోన నాపన్నత నొంది"* మనందరికి ఆపద ఎక్కడ నుంచి వస్తుందంటే, అహంకారం. అసలు మన అహంకారం మన సాధనకి అడ్డుపడుతోంది అని మనకి తెలియటమంటే, ఆ బుద్ధి బాగా ప్రచోదనం చెందిన బుద్ధే కదా! ఎప్పటికప్పుడు అహంకారమే పరిపాలిస్తుంది కదండి, భక్తులము అనుకునే వాళ్ళను కూడా! రోజూ నేను దైవం దగ్గరగా ఉండాలి, అహంకారం నన్ను కమ్మేయకూడదు అనుకునేవాళ్ళు ఎంతమంది ఉంటారండి సాధకులు? ''అసలు మాకు అహంకారం ఏముందండి?" అనుకుంటూ ఉంటాడు ప్రతివాడు కదా! ఉన్నదే అదిరా అని చెప్పాలి! ఎందుకంటే, కొంచెం పొడిస్తే వచ్చేస్తుంది! చూశారా, మనం "ఏమయ్యా! ఆనపకాయ లేతేనా?" అంటే "లేతేనమ్మా! కావాలంటే చూసుకోండి'' అంటాడు. ఇలా గిల్లుతాం కదా! గిల్లితే మన లేత గోరు ఊడిపోతుంది, అట్లా ఉంటుంది. కొబ్బరిపెంకల్లే ముదురు కదా! అందుకని ఎవరిని ఎవ్వరూ ముట్టుకోరు. మర్యాదగా ఉంటారు. ముట్టుకుంటే విషయాలు తేలిపోతాయి కదా!

మనకింత అహంకారం ఉందే అని నీకుగా నీవు భావించ గలిగితే, అప్పటికి నువ్వు కొంచెం ఎల్. కే. జీ లోంచి మామూలు స్కూలుకి వచ్చినట్లే! మనలో మనకి అహంకారం ఉందని గుర్తించాలి ముందు. ఎందుకంటే, ఎవరన్నా మాటంటే పడం. ఉన్నది అంటేనే పడం. నిష్కారణంగా అంటే అసలు పడం. వాడు ఒకటంటే

మనం పది అంటాం కదా! లేకపోతే, పది రోజులు గింజుకుంటాం కదా! అది అంతా అహంకారం. ఏదైనా అంటే పది రోజులు గింజుకున్నాడట అంటే, ఆ పదిరోజులు వాడు అహంకారేగా! అందుకని నిత్యం అహంకారంలో జీవిస్తూ ఉంటాం మనం. బుద్ధిలో జీవించేటువంటి వాడికి అహంకారం కలగాలంటే... అసలు అహంకారం ఒకటి మనకుంది, మన నిండా అదే నిండి ఉంది నిలువంతా, ఇది తగ్గాలి అన్న భావన మనలో పెరిగితే... క్రమంగా ముందు గుర్తిస్తే, first you recognise, ఆ తరువాత అలా నెమ్మదిగా ఆరాధన భగవంతుని దగ్గర చేరుకోవటానికి పెంచుతూ, నీలో ఉండే అహంకారమనే అవరోధాన్ని తీసేయమని కోరుకోవాలి. తను తీయలేడు. సద్గురువే ఉపాయం, ఎందుకని? అతడు అది నిర్మూలించుకున్నటువంటి వాడు. అహంకారాన్ని నిర్మూలించుకొని, దైవమే తానుగా ప్రకాశిస్తున్నటువంటివాడు. కర్పూరం లాంటివాడు. అలా తగిలించగానే వచ్చేస్తుంది లోపలి నుంచి. *"ఉప్పుకప్పురంబు నొక్కపోలిక నుండు, చూడ చూడ రుచుల జాడవేరు"* రుచులంటే వెలుగులని కూడా అర్థం. ఉప్పుని మంటలో వేస్తే చిటపట లాడుతుంది. కర్పూరాన్ని వేయండి, అట్లా జ్వాల వస్తుంది.

అంచేత, ఆయన్ని పిలిచింది. పిలిచి, *"నాపన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి"*. ఎవరు ఆప్తుడంటే, నిరహంకారి అయినటువంటి ఒక సత్పురుషుడు ఆప్తుడు. ఇంకో అహంకారిని తెచ్చుకుంటే లాభం లేదు. అహంకారుల వలన పనులు పాడైపోతాయి. అందుకనే diplomatsగా అలాంటి

వాళ్ళని పెట్టుకుంటూ ఉంటారు. "ఛీ! పో" అన్నా కూడా తుడిచేసుకొని వచ్చేటట్టుగా ఉంటాడు. ఆయన రాయబారి కదా! రాయబారంటే ఎవరు ఉండాలి? రాయబారిగా హనుమంతుడు ఉండాలి, లేకపోతే కృష్ణుడు ఉండాలి. చెప్పాల్సింది చెప్తాడు, ఏమన్నా అంటే పడ్తాడు, *"యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి"* ఇది సద్గురువు యొక్క ప్రవేశం. రామాయణంలో హనుమత్ ప్రవేశం లాగా రుక్మిణీ కళ్యాణంలో ఈ బ్రాహ్మణుడు అలాంటి వాడే! ఎంచేత? ఈమె గుణగణాలన్నీ ఆయనకు చెప్తాడు. ఆయన ఉన్ముఖతను సంపాదిస్తాడు. అక్కడ మాట తెచ్చి ఈవిడకి చెప్తాడు. హనుమంతుడదే చేస్తాడు. అక్కడికి వెళ్తాడు, రాముడి పరిస్థితిని వివరిస్తాడు, ఆమె పరిస్థితి తిరిగి వచ్చి రాముడికి వివరిస్తాడు. అనుసంధానం చేస్తాడు. సీత రాముడిని చేరేట్టుగా చూస్తాడు. అంతేగా! అలాగే బ్రాహ్మణుడు. నువ్వు వెళ్ళి ఈ విషయం కృష్ణునకు చెప్పమని చెప్తుంది.

"అయ్యా! కొడుకు విచారము
లయ్యయు వారింపఁజాలఁ డటు గాకుండన్
నెయ్య మెఱిఁగించి చీరుము
చయ్యన నిజ సేవకానుసారిన్ శౌరిన్."

అయ్యా! అంటే ఎదురుగా ఉండే ఆయన. *"అయ్యా! కొడుకు విచారములయ్యయు వారింపఁజాలఁ డటు"* వాడు తండ్రి మాట వినే కొడుకు కాదు. ఆ తండ్రా ఇతడిని వారించలేడు. తేడా వస్తే ఈయన్ని జైల్లో పెట్టేస్తాడు. అలాంటి కొడుకులుంటారు కదా! కాబట్టి మా నాన్న మా అన్నయ్యకి ఏం చెప్పలేడు. అదీ పరిస్థితి.

*"దటు గాకుండన్ నెయ్య మెఱిఁగించి చీరుము"* అది అలా ఉండగా నేను ఆయన యందు ప్రీతికొని ఉన్నాను అనే విషయాన్ని తెలుపు ఆయనకి. *"చయ్యన నిజ సేవకానుసారిన్ శౌరిన్".* తనని చాలా ఆరాధిస్తున్నవాళ్ళని, తనని ఆశ్రయించినవాళ్ళని, తనను కోరుకున్న వాళ్ళని అతడు తానుగా రక్షించుకుంటాడు కదా! అతడు శౌరి కదా! అతడు నిజ సేవక అనుసారి– అది కృష్ణుడు. తనను సేవించే వారిని తాను అనుసరిస్తాడు. ఎంతటివాడండి! అలాంటి వాళ్ళని సేవించాలి. ఎవర్ని సేవించడం చేత, వారు మనకు అనుకూలులై, మనలను కడతేరుస్తారో అలాంటి వారు సత్పురుషులు కదా! ఆయనకి వెళ్లి వెంటనే చెప్పు పరిస్థితి అని చెప్పింది రుక్మిణీదేవి.

"అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకానగరంబునకుం జని ప్రతీహారులవలనఁ దనరాక యెఱింగించి యన్నగ ధరుం డున్న నగరు ప్రవేశించి యందుఁ గనకాసనాసీనుం డయి యున్న పురుషోత్తముం గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవించిన ముసిముసి నగవులు నగుచు బ్రహ్మణ్యదేవుం డైన హరి తన గద్దియ దిగ్గన డిగ్గి బ్రాహ్మణుఁ గూర్చుండ నియోగించి తనకు దేవతలు సేయు చందంబునం బూజలు చేసి సరస పదార్థసంపన్నం బైన యన్నంబుఁ బెట్టించి రెట్టించిన ప్రియంబున నయంబున భాసురుం డైన భూసురుం జేరి లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు మెల్లన యిట్లనియె."

*"అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన"* – తనకు కృష్ణుని గూర్చి ఉన్నటువంటి ప్రేమ విషయాన్ని కూడా ఆయనకు చెప్పిందదండి. రహస్యవచనాలు చెప్పటమంటే అదే అర్థం. అందరికీ చెప్పుకోరు కదా అన్ని విషయాలు! అందులో ఉత్తమకుల సంజాతి, దైవాంశ సంభూతి. తనకి ఆయన గూర్చినటువంటి భావనలు, అనుభూతులు, ఇలాంటివన్నీ కొన్ని ఆయనకి చెప్పింది. సీతమ్మ కూడ కాకాసురుని కథలాంటి విషయాలు హనుమంతునికి తెలుపుతుంది.

ఆయన వెళ్లాడట. కబురు పెట్టాడట. ఆయన ప్రాసాదంలోకి తీసుకెళ్ళితే, అక్కడ మంచి ఆసనం మీద కూర్చున్నాడట కృష్ణుడు. రావటం రావటం ఆశీర్వదించాడట "కళ్యాణమస్తు!" అని. కళ్యాణమస్తు అని దీవించేశాడండి. అలా అంటే ఆయనకి అర్థమైపోయింది. అంత మేధాసంపత్తి పుష్కలంగా ఉన్నవాళ్ళు కదా! వచ్చినవాడు ఎక్కడ నుంచి వచ్చాడో తెలుసు కదా! చెప్తాడుగా లోపలికి వచ్చేటప్పుడే. ఇట్లా విదర్భదేశం రాజధాని కుండిననగరం నుంచి వచ్చాను, కృష్ణుని చూడడానికి వచ్చానని చెప్తాడు. అంతేగాని, అక్కడే ఆ కాపలా వుండేవాళ్ళకి అన్ని విషయాలు చెప్పేయలేరు కదా! కృష్ణుని చూడ్డానికి వచ్చాను, ఫలానా నగరం నుంచి వచ్చాను, ఫలానా రాజ్యం నుంచి వచ్చాను, నా పేరు ఫలానా, ఆయన దర్శనం కోరి వచ్చాను ఈ మాట చెప్పండంటే వాళ్ళు లోపలికెళ్ళి చెప్పారు. లోపలికెళ్ళి చెప్తే, ఈయన రమ్మన్నాడు. అక్కడనుంచి వచ్చారంటే, మనకీ interest కదా! మనం ప్రేమిస్తున్నటువంటి అమ్మాయి ఉన్న పేటలోంచి ఒక ఆయన

వచ్చాడనుకోండి, ఆ అమ్మాయి గురించి తెలిసే ఉంటుంది, పోని కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు అని పిలవచ్చుగా! ఆ రోజుల్లో అసలెవరైనా బ్రాహ్మణుడు వచ్చాడంటే పిలుస్తారుగా! ఆ రోజుల్లో బ్రాహ్మణులు అలా ఉండేవాళ్ళు, పిలిచేవాళ్ళు అలా ఉండేవాళ్ళు. ఈ రోజుల్లో బ్రాహ్మణులు అలా ఉండరు, పిలిచే వాళ్ళు కూడా అలాగే ఉండరు. ఎందుకంటే, వీడొచ్చాడంటే అన్నీ అబద్ధాలే మాట్లాడతాడు, బ్రాహ్మణుడు కదా! ప్రతి రోజు పెళ్లికుమార్తె అని ఒక invitation పట్టుకొస్తాడు, వివాహం మీరు సహాయం చేయండి అని అడగడానికి. ఎన్నిసార్లు చేస్తాడు? ఎంతమంది పెళ్లికూతుర్లుంటారు? అలా కదా పోగొట్టుకుంటారు విలువ!

సరే ఈయన లోపలికి రాంగానే, ఆశీర్వదిస్తే ఆయన ముసి ముసి నవ్వులు నవ్వేశాడటండి. కృష్ణుడు కుచేలుడొచ్చినప్పుడు ఏం చేశాడో ఈ బ్రాహ్మణుడు వచ్చినప్పుడూ అదే చేశాడు. కనుక సత్పురుషుడు వస్తే ఆసనం దిగాడు, చేయి పట్టుకున్నాడు, తీసుకొచ్చాడు, కూర్చోపెట్టాడు. ఒక దేవుడిని ఆరాధన చేసినట్టుగా ఆరాధన చేశాడు. ఆయనకిష్టమైన పదార్థలతో భోజనం పెట్టాడు, దగ్గరికి చేరాడు. కాళ్ళు వత్తుతున్నాడు. వత్తుతూ నెమ్మదిగా పలికాడట. అంటే, ఈ పెళ్ళనే కాదు, మాములుగా ఏ బ్రాహ్మణుడు వచ్చినా అదే చేస్తాడు కృష్ణుడు. బ్రాహ్మణుడు సద్బ్రాహ్మణుడైతే అతను ఏ విధంగా నిర్వర్తిస్తాడో ఇప్పుడు చెప్తాడు.

"జగతీసురేశ్వర! సంతోషచిత్తుండ
వైయున్న నీ ధర్మ మతిసులభము

వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ
బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు
గోరిక లతనికిఁ గురియుచుండు
సంతోషి గాఁ డేని శక్రుఁ డైన నశించు
నిర్ధనుండైనను నిద్రవోవు"

*"జగతీసురేశ్వర"* – జగతియందలి దేవతలకు ఈశ్వరుడు. బ్రహ్మమును ఎరిగినవాడు బ్రాహ్మణుడు. బ్రహ్మమును ఎరిగిన వాడు బ్రహ్మమే కదా! అంచేత, ఈయన జగతికి, దేవతలకు కూడా పూజనీయుడు. ఈయన రావటం రావటమే సంతోషంగా లోపలికొచ్చాడు. గదిలో ప్రవేశించగానే అలా కృష్ణుడు కూర్చుని ఉంటే ఇలా ఆశీర్వదించాడట. అంటే, వాడికేమీ అక్కర్లేదుగా! "ప్రభో! పాహిమాం, పాహిమాం" అంటూ రాలేదు కదా! అలా రాకుండా, ఇలా ఆశీర్వదించాడండి– "కళ్యాణమస్తు! పెండ్లి కొడుకువు కమ్ము!" అని ఆశీర్వదించాడంటే. . . వచ్చిన విధానం, ఆ ఠీవి అర్థమైపోయింది. ఈయన మన దగ్గర ఏదో కోరడానికి రాలేదు అని అర్థమైపోయింది. కోరడానికి వచ్చేవాళ్ళు ఒక రకంగా వస్తారు కదా! మంచి వార్త తీసుకొచ్చేవాళ్ళు ఇంకోరకంగా నడిచివస్తారు. దుర్వార్త తీసుకొచ్చేవాళ్ళు మరొక రకంగా నడిచి వస్తారు. నడకలోనే ఉంటుంది. అందుకని, ఏమంటున్నాడు, *"సంతోషచిత్తుండవైయున్న నీ ధర్మ మతిసులభము"* . నీ ధర్మం నాకు అర్థమైపోయింది. నువ్వు సంతోషివి, ఈయనకు ఏమీ అక్కర్లేదు, వచ్చింది నా కోసం. పెద్దవాళ్ళ దగ్గరికి కేవలం దర్శనం

కోసం, ఇతరమైనటువంటి అర్థ కామాలు లేక రావటమనేది వాడికి చాలా సంతోషం కలిగిస్తుంది. ఏం యిలా వచ్చారంటే, కేవలం మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను అంటే సంతోషం కదా! పైగా రాజు. అతని దగ్గరికి వచ్చేవాళ్ళందరూ అవి ఇవి అడగడానికేగా వస్తారు. *"సంతోషచిత్తుండవైయున్న నీ ధర్మ మతిసులభము".* సంతోషి మూడు లోకాల్లోను పూజ్యుడే అని చెప్తాడు వామనావతారంలో. *"సంతోషిగాకుంట సంసారహేతువు".* సంతుష్టుడు ఈ మూడు జగములకు పూజ్యుండు. సంతోషికెప్పుడు కలుగు శుభము అని వామనుడు బలిచక్రవర్తికి చెప్పాడు. నాకేం అక్కర్లేదు, ఊరికే వచ్చాను. ఏదో నువ్వు అందరికి ఇస్తున్నావని తెలిసి చూసిపోదామని వచ్చానంటాడు కదా! చూసిపోవడానికి వచ్చేవాళ్ళు తక్కువమంది ఉంటారు. ఇవ్వడం కృష్ణునికి అలవాటు. ఆసనం మీద అందుకే కూర్చుంటాడు. కృష్ణుడి సభ పేరు సుధర్మ. అద్భుతమైన సభ అది. అందులో కనక సింహాసనాసీనుం డయి ఉన్నాడు. అప్పుడు వెళ్ళాడు ఈ బ్రాహ్మణుడు. ఏం అడగలేదు, ఆశీర్వదించాడు. *"వృద్ధసమ్మత మిది".* వృద్ధులంటే తెలివిలో బాగా పండినటువంటి వాళ్ళు. తెలివంటే పిచ్చి తెలివి కాదు, దైవమును గూర్చిన తెలివి.

*"వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు".* నిజమైన బ్రాహ్మణుడు ఎవరు అంటే, ఏం దొరికితే దాంతో సంతోషించి బతుకుతాడండి. ఈ గుణం ఎవరికుంటే వాళ్ళకు బ్రాహ్మణ గుణం ఉన్నట్టే! *"యదృచ్ఛా లాభ సంతుష్టః"* అంటాడు కృష్ణుడు. *"బ్రాహ్మణుండు తన ధర్మమున నుండుఁ*

*దరలఁ డా ధర్మంబు".* ఎవడు బ్రాహ్మణుడు? తన ధర్మమునందంటే, బ్రహ్మమునందే ఉంటాడు. లావాదేవీలు, కోర్టుకేసులు, లిటికేషన్లు, ఈ గొడవలుండే బ్రాహ్మణులు ఎంతమందుంటారండి? చాలా మందుంటారు కదా! ఆశ్రమాలే అట్లా ఉన్నాయి కొన్ని కొన్ని. ఆశ్రమాలకు పీఠాధిపతిగా ఎప్పుడూ లాయర్నే పెట్టుకుంటారు తెలుసా! ఈ మధ్యే మార్చారు. అదేమిటంటే, "బోల్డు లిటికేషన్సు ఉన్నాయి సార్! ఎవడు చూస్తాడు?" అగస్త్యపీఠం అది. అగస్త్యుడికి లావాదేవీలేంటి? *"తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబుగోరిక లతనికిఁ గురియుచుండు".* వాడికి కావాలసిన వన్నీ జరిగిపోతూ ఉంటాయి. కొంతమందికి జీవితం జరిగిపోతూ ఉంటుంది. వాళ్ళు వెతుక్కోరు దేనికీ. కొంతమంది వెతుక్కుంటూ, అడుక్కుంటూ బ్రతుకుతూ ఉంటారు.

*"సంతోషి గాఁ డేని శక్రుఁ డైన నశించు నిర్ధనుండైనను నిద్రవోవు సంతసించెనేని".* నిజమైన బ్రాహ్మణునకు అది లేదే, ఇది లేదే అని ఉండదు. బ్రహ్మములో ఉండేవాడికి లేకపోవడమేమిటి? ఇలాంటి వాళ్ళు బ్రాహ్మణులంటే.

"సంతసించెనేని సర్వభూత సుహృత్త
ములకుఁ బ్రాప్తలాభ ముదితమాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ
హీనులకును వినతు లే నొనర్తు."

అలాంటి వాళ్ళ కాళ్ళు పట్టుకుంటాడు కృష్ణుడు. ప్రతి వాడి కాళ్ళు పట్టుకోడు సుమా! కాళ్ళు పట్టుకుని వత్తుతూ, ఈ మాట చెప్పాడండి ఆయన:

"ఎవ్వనిదేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు వాఁడు మత్ప్రియుం
డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య! నీవు లే
నవ్వులు గావు నీతలఁపునం గలమే లొనరింతు ధీమణీ!"

అప్పుడు అడిగాడు, "ఏ దేశం నుంచి వచ్చారు? ఏ పని మీద వచ్చారు? ఏం చేస్తారు? మీకు ఎవరి వల్ల మేలు కలుగుతుందో చెప్పండి. మీరు ఏ రాజ్యంలో ఉన్నారో ఆ రాజు నాకిష్టుడు" అని చెప్తున్నాడు. నీ బోటివాడు అలాంటి రాజ్యంలో ఉన్నాడంటే, ఆ రాజు అర్హత కలిగి ఉన్నాడన్నమాట. కాబట్టి ఆయనకేమన్నా ఆపద ఉంటే చెప్పు, చేసిపెడ్తాను. అలా ఉంటుంది పన్నా. ఆయన కోసం రాలేదని తెలిసిపోయింది కదా! "ఈ సముద్ర మధ్యము నందు ప్రవేశింప శక్యముకాని పట్టణమునకు ఏల వచ్చితిరి?" అని అడిగాడు. ద్వారకా నగరం ఎక్కడుంది? ఆయన సముద్రంలో కట్టుకున్నాడు. "ఇక్కడకొచ్చి నన్ను కలవాల్సిన అవసరం మీకే మొచ్చింది? చెప్పండి" అని అడిగాడు.

"అని యిట్లు లీలాగృహీతశరీరుం డైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ సురవరుం డతనికి సవినయంబుగా ని ట్లనియె. దేవా! విదర్భదేశాధీశ్వరుం డైన భీష్మకుం డను రాజు గలం డా రాజు కూఁతురు రుక్మిణి యను కన్యకామణి గల దయ్యిందువదన నీకుం గైంకర్యము సేయం గోరి వివాహమంగళ ప్రశస్తం బయిన యొక్క సందేశంబు విన్నవింపు మని పుత్తెంచె నవధరింపుము."

*"లీలాగృహీతశరీరుం"*– కృష్ణుడు లీలకి ధరించాడు శరీరం. కృష్ణుడు అడిగితే, ఆయన సూటిగా చెప్పేశాడు. మరి వచ్చినవాడు నిప్పు కదా! ఎంత సూటిగా చెప్పాడు!

"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
దేహతాపంబులు దీఱిపోవు
నే నీశుభాకార మీక్షింపఁ గన్నుల
కఖిలార్థంబు కలుగుచుండు
నే నీచరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో
న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లసన్నామ మేప్రొద్దు భక్తితోఁ
దడవిన బంధసంతతులు వాయు."

ఏమిటి రుక్మిణీదేవి సందేశం? *"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు."* ఇది నా పరిస్థితి. నిన్ను చూడడానికి నా కన్నులున్నాయి అని చెప్పింది, అన్ని. అఖిలమైనటువంటి అర్థములు చేకూరినట్టే నిన్ను చూస్తే. నీ పాదసేవ చేసుకుంటే మొత్తం సృష్టికంతటికీ కూడా పొందినంత ఆనందం. భగవంతుని చరణసేవ. . అంటే భగవంతుడు అని కదా ఆమె దృష్టి! కృష్ణుడంతటి వాడని తాను గమనించి, గ్రహించి తానెలాంటి ఆరాధనచేసి తనకోసం జీవిస్తుందో, సందేశం పంపించిందండి. నీ నామంతో తలుచుకుంటే... "అలక్ నిరంజన్" అంటారు చూశారా! ఏమీ ఒక్క బంధముకూడా ఉండదు. కేవలం నీ నామంతో, "కిమ్మిన్ నాస్తి" అంటారు చూశారా! " Nil, None,

Not level" అంటాం కదా! Style గా అంటాం మనం! భక్తిగా అంటామా, పాడా! ఆవిడ ఆ మాట భక్తిగా అన్నది. ఎందుకంటే, అట్లా రుచి చూస్తుంది రోజూ. "కృష్ణా!" అనుకుంటే ఏవిధమైన బాధ లేదు, ఏదీ బంధమున్నట్టు అనిపించదటండి. ఆయన్ని తలుచుకుని, చరణ సేవ చేస్తున్నట్టుగా, పాదసేవ చేస్తున్నట్టుగా భావిస్తుంటే మొత్తం భువనం అంతా గూడా దాని మీద ఒక ఆధిపత్యం, ఉన్నతత్త్వం. ఇలా పలికిందండి ఆవిడ:

"నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీచిత్తచోర!"

నమ్మి ఉన్నది కాదు, నచ్చి ఉంది. చిత్తము *"నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది నీయాన నాన లేదు".* ఇంకో మార్గం లేదు. ఇంకో గతి లేదు. ఇలాంటి పద్యం ఒకటి చదువుకుంటే, లోపల కృష్ణునిమూర్తిని దర్శిస్తూ, ఎంత శమము కలుగుతుందో తెలుసా! ఉపశమనం అంటామే, అలాంటి ఓ దివ్యమంగళమైనటువంటి ఓ రూపాన్ని లోపల దర్శనం చేసి, అట్లా చూస్తుంటే ఎలాంటి భావం రావాలో కూడా తెలీదు కదా! ఇలాంటి భావాలు వస్తాయి నిజంగా ఉన్నతోన్నతమైనటువంటి భక్తిలో ఉండే వారికి. ఎంత బాగుంటుందండి పద్యం! చెవుల పరిస్థితేమిటి? కన్నుల పరిస్థితేమిటి? చరణ సేవ చేస్తే పరిస్థితేమిటి? నామస్మరణం వల్ల ఏం జరుగుతుంది? దాని వలన తన చిత్తం

ఏ విధంగా అంకితమైపోయిందో! ఇంకింతకన్నా ఇంకేం లేదు. ఒకటి నచ్చితే, ఇంకోటి మళ్ళీ నచ్చడం అనేది ఉండదు కదా! పరిపూర్ణంగా ఒక దాని యందు నచ్చుట అనేటువంటిది జరిగితే ఇంక ఆ చిత్తం ఎటూ పోదు. *"నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది నీయాన నాన లేదు"*

*"కరుణఁ జూడుము కంసారి!"*– కంసుడిని వధించావు కదా! *"ఖలవిదారి!"* – ఖలులుని సంహరిస్తావు. *"శ్రీయుతాకార!"* శ్రీయుతమైనటువంటి ఆకారం కృష్ణునిది. అంటే, పరమ శుభంకరమైనమూర్తి అది. అంతకన్నా అందమైన మూర్తి అంతకు ముందు లేదని ఋషులు వర్ణించారు. ఇకముందు కూడా ఉండదేమో అని వాళ్ళు ఒక అనుమానం కూడా వ్యక్తం చేశారు. అలాంటి మూర్తి కృష్ణమూర్తి. *"శ్రీయుతాకార! మానినీచిత్తచోర!".* ఎవరి మనస్సు నిర్మలము, శుద్ధము, సౌందర్యము, సున్నితము, సుకుమారము అయి ఉంటుందో అలాంటి వారందరూ కూడా మానినిలే! ఆ చిత్తాలన్నిటినీ కూడా ఆయన హరిస్తాడు. మానినిచిత్తచోరుడు శ్రీకృష్ణుడు. తనకి అర్పణ చేసినటువంటి చిత్తాన్ని, తాను చక్కగా హరించేటువంటి ఒక గుణం కలిగిన వాడు శ్రీకృష్ణుడు అయి ఉండడటం చేత, నా పరిస్థితి ఇది. నేను ఈ విధంగా నీ యందు మరులుకొని ఉన్నాను, నచ్చి ఉన్నాను అని చెప్పి ఒక భావన వ్యక్తం చేసింది.

"ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యా రూప తారుణ్య సౌ
జన్య శ్రీ బల దాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే

కన్యల్ గోరరు కోరదే మును రమా కాంతాలలామంబు రా
జన్యానేకప సింహ నావలననే జన్మించెనే మోహముల్."

ఇప్పుడు నేను ఈ విధంగా కోరుకుంటున్నానంటే, ఆ! దానికేముందిలే చాలామంది కోరుకుంటారు, అని ఇది నాకు తెలుసు అని చెప్పింది రుక్మిణీదేవి. ఇన్ని గుణాలున్న వాడిని నిన్ను ఏ కన్యలు కోరరు? అందరూ కోరతారు. ఎన్ని గుణాలు చెప్పింది? ధన్యుడవు నువ్వు. లోక మనోభిరాముడివి. లోకాల్నే మోహింప చేసేటువంటి వాడివి కదా! కులమా, ఉన్నత కులం. విద్యాయా, చతుష్షష్టి విద్యలు పరిపూర్ణంగా తెలిసినటువంటివాడు. రూపమా, వర్ణింపరానటువంటి అంత అందమైన రూపం. సౌజన్యమా, చాలా సౌజన్యుడు. ఎంత సౌజన్యుడో అంత కఠినుడు కూడా శ్రీకృష్ణుడు. బలము ఎలాంటి బలం? చిటికిన వేలు మీద కొండను నిలబెట్టిన బలం కదా! బలమొక్కటేనా, "శ్రీ బలము" . అంటే సరస్వతి, లక్ష్మి, దుర్గ మూడు బలాలు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తుల బలమంతా ఉంది. దానము, రాజ్యం జయించి తను తీసుకోలేదుకదండి. "తాతా! నువ్వేలుకో" అని ఇచ్చేశాడు. ద్వారకా నగరానికి నిజానికి స్వామి కృష్ణుడే. కానీ, ఆసనం మీద ఇంకొకడిని కూర్చోపెడ్తాడు కదా! తను కూర్చోడు. అతడు రాజు కాని రాజు. రాముడు సింహాసనం ఎక్కుతాడు. కృష్ణుడు రాజసింహాసనం ఎక్కడు. "మనకేలా?" అంటాడు. అవసరమైతే ఉందాం. ఎప్పుడూ రాజ్యపాలన గురించి కాంక్షించిన వాడు కాదు. ఎన్నెన్ని సామ్రాజ్యాలు జయించాడో, ఎవర్నో కూర్చో పెడతాడు దాని మీద! అది కృష్ణుడు! తన తండ్రి వసుదేవుడు రాజ్యం వదిలేసి ప్రజలతో ఉన్నాడు కదా! తనకెందుకు

రాజ్యం? జీవుల హృదయములే ఆయన పరిపాలించే రాజ్యం. కృష్ణుని రాజ్యం మట్టి, ఇటుక, భవనాలు, కోశాగారాలు ఇవి కావు. మనుషులు అతని రాజ్యం. మనుషుల హృదయాల్లో ఉండి, మనుషుల్ని ఏలుకునేటువంటివాడికి ఇంక రాజ్యాలెందుకండి? వాళ్ళవన్నీ ఈయనవేగా! "నా వన్నీ ఇంక నీవేలే అనేస్తుంటారు" మరి అంతేగా. అలా అని వాళ్ళని కోరతాడా? కోరడు. వాళ్ళకే ఇస్తాడు. ఎవర్నీ ఏమీ కోరడుగా? అందరికి అన్నీ ఇవ్వటానికే. అందరి హృదయాలు పరిపాలిస్తాడు. అదే అంటాడు ఏసు కూడా. "నువ్వు రాజాధిరాజువట కదా?" అని అడుగుతాడు రోమన్ సైన్యాధికారి. అవునంటాడు. "ఏదీ నీ రాజ్యం?" అంటాడు. ఇది మట్టితో కూడిన రాజ్యం కాదు, భూమి కాదంటాడు. It is not of earth. ఈ భూమి కాదు నా రాజ్యం అంటాడు. జీవుల హృదయమే ఆయన రాజ్యం. వాటికాయన రాజు. ఈ రోజు మానవ జాతిలో ఎనభై శాతం మంది ఆయన సేవకులే కదా! దివ్యతత్త్వమది. అలాంటిదే కృష్ణ తత్త్వం.

కృష్ణుడు సౌజన్యమూర్తి, అమితమైన శౌర్యము, కరుణ. ఒకటుండి ఒకటి లేకపోవడం కాదు. ఇటువంటి వాటితో శోభిస్తుంటావు కదా నువ్వు! *"నిన్ను నే కన్యల్ గోరరు".* అసలు ఒక కన్య పెళ్లి చేసుకుందామంటే ఒక మోడల్ ఏమిటంటే అదే! It is an ideal model. అందరికీ దొరకదుగాని, మన కర్హత ఉండొద్దు అనుకుంటారంతే కదా! అర్హతని బట్టి కదా దొరుకుతాయి! ఆశీస్సులు దొరుకుతాయా? దొరకవు. ఎవరు ఎవరికి ఏ విధంగా లభ్యమయ్యారంటే, వారి వారికి అదే ప్రాప్తం అని అర్థం చేసుకోవాలి. అంతే కదా! ఇంకొంచెం ప్రాప్తించాలంటే

ఇంకొంచెం సంస్కారాలు పెంచుకుంటూ ఉండాలి. ఈ జన్మకింతే, ఈ మొగుడే అనుకోవటమే! పై జన్మకి better luck! Viceversa కదా! సంస్కారములు బట్టి.

నిన్ను కోరుకోని వాళ్ళు ఎవరు ఉండరు అని చెప్పింది. మొగవాళ్ళే కోరుకుంటారు ఆయన్ని. మొగవాళ్ళే ఆడవాళ్ళై పోతుంటారు ఆయన దగ్గర కదా! అందుకని ఆ సంగతి నాకు తెలుసునని చెప్పింది రుక్మిణీదేవి. నిన్నే కోరడం వింతేం కాదులే, అది సహజమే అని! "ముని రమా కాంతాలలామంబు రాజన్యానేకప సింహ నావలననే జన్మించెనే మోహముల్" . నిన్ను ఏ కన్య కోరదు? లక్ష్మీదేవే నిన్ను కోరుకొని వచ్చి నిన్ను చేరింది కదా! నువ్వు ఈ రాజుల మధ్య ఒక సింహం లాంటివాడివి. నీ యందు నాకు మోహం కలగటంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు అని చెప్పింది.

"శ్రీయుతమూర్తి యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్" .

*"పురుషసింహమ! సింహము పాలి సొమ్ము"* నేను సింహము పాలి సొమ్మును. నన్ను వాడు కోరుకుంటున్నాడు. "గోమాయువు" అంటే నక్క. సింహం సొమ్మును నక్క కోరుకుంటే ఎట్లా ఉంటుందండి? *"సింహము పాలి సొమ్ము గోమాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు"*. వాడు బాగా మత్తెక్కి

ఉన్నాడు. వాడికి ఉచ్చం, నీచం తెలియదు. ప్రతీది కోరుకుంటూ ఉంటాడు. నా సంగతి వాడికి తెలియదు. నేను నీ సొమ్ముని. ఎవరు ఎవరి సొమ్మో తెలియకుండా ప్రతీది ముట్టుకోకూడదు కదా! ద్రౌపతి స్వయంవరానికి కృష్ణుడు కూడా వెళ్తాడు స్నేహితులతో. మత్స్య యంత్రాన్ని ఎవరూ కొట్టలేకపోతారు. బలరాముడు అడుగుతాడు "నువ్వు కొట్టలేవా అది?" అని. అప్పుడు కృష్ణుడు చెప్తాడు "నేను ఇక్కడికి చూడ్డానికి వచ్చాను. ఏమన్నా తేడాలు పడితే సర్దవలసి ఉంటుంది", తేడా పడ్తుంది, సర్దుతాడు. ఎవరు ఎవరి సొమ్మో కదా! అన్నిటికీ ఆశ పడకూడదు. తక్కువ సంస్కారం ఉన్నటివంటివాడు ఎక్కువ సంస్కారం ఉండే స్త్రీకి ఆశ పడడం మూర్ఖత్వం. బలవంతం చేయటం మరీ మూర్ఖత్వం, పశుత్వం. అంటే, తక్కువ సంస్కారం ఉండే వాడిని, ఒక ఎక్కువ సంస్కారం ఉండే స్త్రీ మోహించదు. మోహించిందిట అంటే దాని సంస్కారం కూడా అంతే ఉంటుంది. ఏం సందేహం లేదు. సంస్కారాలు సమతూకంగా సరిపోతేనే ఒకరియందు ఒకరికి మొహం కలుగుతూ ఉంటుంది. " ఇలా అయిందేంటండి? అలా అయిందేంటండి?" అంటే అది అంతే!

వీడు *"యధమాధముండు"* అంటోంది రుక్మిణి అధములలో అధముడు. నీ ప్రతాపం తెలియక, ఏమిటేమిటో వాగుతున్నాడు ఇక్కడ చేరి. ఇంట్లో చేరాడు. అన్నయ్య friendకదా! వెకిలి వేషాలన్నీ వేస్తూ ఈవిడకి ఛీ అని అనిపించేట్టుగా ఉండి ఉండాలి కదా! ఒక సంస్కారవంతమైన కన్యను ఏ సంస్కారం లేనివాడు వెకిలిగా చూస్తూంటే ఏమీ మాట్లాడకుండా, వీడొక నీచుడు అనుకుంటుంది. అంతేకదా! అంతేగాని, వాడి జోలికి

పోదు. ఎందుకంటే, "అశుద్ధము మీద రాయేస్తే మన మీదే చిందుతుందని" సామెత కదా! ఉన్నాడు, పైగా అన్నయ్య friend. ఏం చేస్తుంది చెప్పండి? అట్లా ఒకడు తగలడ్డాడు ఇక్కడ. వాడు నాకోసం ఆశపడుతున్నాడు. వాడొక నక్కలాంటి వాడు. నువ్వు సింహంలాంటి వాడివి. అంచేత, నీకు చెప్పుకుంటున్నాను అని చెప్తోందండి.

"వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్."

ఎంత మాట చెప్పిందో! పూర్వజన్మల్లో నేను కనుక ఎన్నో వ్రతాలు చేసి ఉంటే... దేని గురించి? జగత్కల్యాణుడైనటువంటి హరిని కాంక్షించి. అందుకనే, పెళ్లీడువచ్చిన అమ్మాయిని విష్ణుపూజలు చేసుకోమని చెప్తూ ఉంటారు. అందుకనే వరుడు కూడా విష్ణు స్వరూపుడుగా భావన చేసి కన్యాదానం చేస్తూ ఉంటారు. సర్వశుభప్రదమైన మూర్తి విష్ణుని యొక్క మూర్తి. జగత్కల్యాణమూర్తి అయిన హరిని కాంక్షించి నేనే గనక వ్రతములు చేసి ఉండి ఉంటే, *"దేవ గురు ద్విజన్మ బుధ సేవల్"*– దేవతలకు గురువులకు, బ్రాహ్మణులకు సేవలు చేసి ఉండి ఉంటే, పెద్దవారిని గౌరవించి, మన్నించి, పూజించి వారికి సేవలు చేసి ఉంటే, దానధర్మాదులు చేసి ఉంటే... ఎప్పుడు? అంతకుముందు జన్మలో. ఇలాంటివేమైనా చేసి హరిని కాంక్షించి నేను చేసి ఉంటే *"వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక"*. అంతే!

అలా ఉండాలండి. మన బట్టే కదా మనకు దొరికే బంగారం. అంతేనా! మనం ఇత్తడై, పుత్తడి కోరుకుంటే కుదరదు కదా! అందుకని, నేనీ విధంగా చేసి ఉంటే... చేశానని ఆవిడకి చాలా నమ్మకం. ఎంచేత? ఆమె అప్పటికే రుక్మిణి. అలాగే మనమంటుంటాం, "ఏం పూలు పూజ చేసిందో? అంత మంచి భర్త దొరికాడు" అంటుంటాం కదా! హరిన్ కాంక్షించి నేగనక పూజలు చేసి ఉంటే నా పూర్వ జన్మలలో, దేవతలకు, గురువులకు, పెద్దవారికి, తెలిసినవారికి సేవలు చేసి ఉంటే, దానములు, ధర్మములు చేసి ఉంటే నాకు *"వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక నిర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్."*

ఈ నీచులందరూ ఉన్నారు కదా! ఈ నీచులంతా యుద్ధంలో వధింపబడుదురుగాక. నన్ను దేవకీనందనుడు చేకొని, వెళ్ళును గాక అనే పద్యం చెప్పిందండి.

"అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్."

రాక్షస వివాహం ఆవిడే చెప్పింది. ఈ దరిద్రంలోంచి నన్ను ఎత్తుకుపో అని చెప్పిందండి. మనం అదే కోరుకోవాలి. మన చుట్టూ ఉన్నది అదే కదా! అహంకారపురుషుడు, వాడి సైన్యం, వాడి భావాలు, వీటి మధ్య కూరుకుపోయి శ్లేష్మంలో ఈగల్లా

కొట్టుకునేవాళ్ళం. ఈ నాలుగు పద్యాలు మనం కంఠోపాఠం చేసి రోజూ రాత్రి చదువుకున్నామనుకోండి... రుక్మిణి అలా కోరింది, ఓహో! ఆహా! అనుకోడం కాదు. అంతకన్నా చాలా ఘోరం మన పరిస్థితి కదా! ఇప్పుడు ఆవిడలాగా అంతకు ముందు జన్మలో వ్రతాలు చేశామా? పూర్వ జన్మల నుంచి కృష్ణుడిని కాంక్షించామా? ఏమో? దాన్నిబట్టి కదా! కృష్ణుని మీద కాంక్ష స్త్రీలకే ఉండక్కర్లేదు, ఎవ్వరికైనా ఉండవచ్చు. పరమేశ్వరుని మీద జీవులందరికీ కాంక్ష ఉండవచ్చు. నా పూర్వపుణ్యము, ఇది వరకు చేసిన కృత్యములు, ప్రస్తుతమున్నటువంటి మథనము, నీ యందు చేరవలెను అన్నటువంటి తపన. ఇవన్నీ సత్యం కావాలని కోరుకునే ప్రార్థన ఇది. రుక్మిణి చేసిన ప్రార్థన. కృష్ణుని గూర్చి ఎలా కోరుకుంది? ఇలా కోరుకొని వీళ్ళందరిని తీసేసెయ్యి అని చెప్తోంది. రేపు వచ్చేసెయ్ అని చెప్తోంది. అంతేకాదు, తర్వాత ఇంకా చెప్తుంది. *"రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే యంకువ సేసి."* నాకు తెలుసు నువ్వు ఒక్కడు చాలు కదా! "నువ్వు నీ బలగాన్ని తెచ్చుకో. ఎందుకైనా మంచిది" ఇట్లా చెప్పలేదు. అలా చెప్తే తక్కువ చేసినట్టు అవ్వదండి ఆయన్ని? బలరాముడు "నేను కూడా రానా?" అంటే వద్దంటాడు. "వెళ్ళి, ఒక్కడినే అన్నీ చూసుకొని వస్తాను" అని చెప్తాడు కృష్ణుడు తెలుసా! ఎందుకైనా మంచిది తమ్ముడు కదా అని బలరాముడు వెనకాల వస్తాడు గాని అవసరమేముండదు కదా! ఆయనకి తమ్ముడు మీద ప్రేమ. ఆ విధంగా రాక్షసవివాహం ప్రతిపాదించింది.

Most modern lady అండి రుక్మిణి! నువ్వు రావటమే తరువాయి, నీతో వచ్చేస్తాను అంది. *“చేకొని పొమ్ము వచ్చెదన్”*.

ప్రతి రాత్రి నన్ను లేపుకుపో అని దైవాన్ని అడగాలండి. మంచో, చెడో ఆయన లేపుకుపోతే సరిపోతుంది. అదేకదా integration అంటారు పరమగురువులు. నిన్ను పరమాత్మలో ఐక్యం చేసుకున్నట్లుగా భావం చేసుకుంటూ నిద్రపొమ్మంటారు వాళ్ళు. అది theory, సిద్ధాంతం. ఇది మధురమైనటువంటి మార్గం. అందుకనే, సూత్రాలు ఉంటాయి, ఇట్లా కమనీయంగా చెప్పుకోవటం ఉంటుంది. ఈ కమనీయంగా చెప్పుకోవడం కోసమే ఇది రాశాడు వేదవ్యాసుడు. ఇందులో ఉండేటువంటివి ధర్మసూత్రాలే, జీవుడు దైవాన్ని చేరేటువంటి సందర్భాలే. ఆ విధంగా ఇలాంటివి చదువుకుంటే మనలో తెలియకుండానే కొన్ని మంచి సంస్కారాలు కూడా ఏర్పడతాయి.

నేను వచ్చేస్తాను, నువ్వు ఎత్తుకపో– ఆవిడే చెప్పేసింది సలహా కూడా రాక్షస వివాహం అని. ఎత్తుకుపోవడం అంటే రాక్షస వివాహం. ఎందుకని? నేనే ఎత్తుకుపొమ్మని చెప్తున్నాను, బలవంతంగా ఎత్తుకుపోవటం కాదు. స్త్రీ ఒప్పుకున్నప్పుడు పురుషుడు ఆ విధంగా ఎత్తుకుపోతే తప్పు లేదు, అది ధర్మం. ఎందుకని? తన మనసుని ఆ విధంగా అర్పణ చేసేసింది కాబట్టి నువ్వు ఆ విధంగా నన్ను ఎత్తుకుపో అని చెప్పింది. *“అంకిలి సెప్ప లేదు”* – అంకిలి సెప్ప లేదంటే అడ్డమేమీ చెప్పట్లేదు నేను, నా పక్కనుంచి ఏ విధమైనటువంటి అభ్యంతరం లేదు, నువ్వు ఎత్తుకుపోతానన్నా సరే. మా అమ్మ, నాన్నలను ఒప్పించి, మా

అన్నయ్యను ఒప్పించి, ఆ తర్వాత పెళ్లి చేసుకో, ఇటువంటివన్నీ నేను అడగట్లేదు నిన్ను, ఇలా sraight route చెప్పేస్తున్నాను అని చెప్పింది. *"అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో"* అంటే రేపే! ఎందుకంటే, రేపటికే పెళ్లి పెట్టేశారు వాళ్ళు. *"పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్"* అంటే జరాదేవి అనుగ్రహంచేత జరాసంధుడు వరప్రసాదియై, ఒక రకమైనటువంటి మరణం లేని స్థితిలో ఉంటాడు. చీల్చేస్తే మళ్ళీ అతుక్కుపోతాడు అంచేత, జరాసంధుడు అతడు. జరాదేవి అతని కుడి ఎడమలను కలిపి వుంచుతుంది. చీల్చినా అతుక్కుపోయేట్లు వరమిచ్చింది. ప్రజ్ఞ, పదార్థముల సమ్మేళన ప్రజ్ఞ జరాదేవి. వరప్రసాది అవ్వటం చేత జరాసంధుడు అహంకారి అయినాడు. ఇక శిశుపాలుడు ఉగ్రుడు, కాముకుడు, దురహంకారి, ఈర్ష్యాళువు, నిస్సంతోషి, నిత్య శంకితుడు. దుర్గుణములన్నీ సంఘములుగా వచ్చి అతనిలో చేరినవి. వీరంతా భావరూపములో మనలోనే వున్నారు. వీటి మధ్య మనం బితుకుబితుకుమంటూ బతుకుతూ వుంటాం.

మనలో ఉండే సమస్తమైన అసుర భావములన్నీ కూడా నీవే హరించు అని మనం ప్రార్థన చేయాలనే రహస్యం రుక్మిణీ దేవి ప్రార్థనలో మనకు గోచరిస్తుంది. రాక్షస వధ చేసి కదా రాముడు అమ్మవారిని తెచ్చుకుంటాడు! ఎక్కడైతే అజ్ఞానం ఉందో. . . నాలో ఉన్నటువంటి అజ్ఞానపు భావములు, ప్రవర్తనలు, అవన్నీ నీవే నిర్మూలించి నన్నేలుకో అనేది లోపల కథ. మన లోపల జరాసంధుడు లేడా? శిశుపాలుడు లేడా? నక్క బుద్ధులు ఉంటాయి కదా! అహంకారం ఉంటుంది కదా! అజ్ఞానం ఉంది కదా!

మదము, మాత్సర్యం, కామం, క్రోధం, మొహం, లోభం ఇవన్నీ ఉన్నాయి కదండి! అవి ఎప్పటికప్పుడు పుడుతూనే ఉంటాయి. *"సద్యోజాతాయ నమో నమః"* అన్నారు కదా! మన సమ్మతితో సంబంధం లేకుండా మనలో ఎప్పుడూ పుడుతూ ఉంటాయి ఇవి. ఇవన్నీ నిర్మూలించుకోవటం నా వల్ల కాదు, నీ వల్ల అవుతుంది, అది నాకు తెలుసు. కాబట్టి నువ్వు వచ్చి, వీళ్ళందరిని నిర్మూలించి, నన్ను పట్టుకుపో. ఇంక నీకు ఎవరి permission అక్కర్లేదు, ఎవరి అనుమతి కావాలండి దైవం దగ్గరికి చేరడానికి?

*"భద్రాది రాముని భజనకు తరలుచుండ బంధుమిత్రుల ఆజ్ఞ బడయనేల"* అన్నాడు రామదాసు. భజనకు వెళ్తున్నాడట. భజనకి వెళ్తుంటే "ఏమయ్యా! ఇంట్లో చెప్పావా?" అంటే, భజనకి వెళ్తుంటే ఇంట్లో చెప్పటం ఎందుకండి! సినిమాకి వెళ్తుంటే చెప్పాలి. నేను భజన కెళ్తున్నానని చెప్పక్కర్లేదు. అంటే, నువ్వు దైవాన్ని ఆరాధన చేయటానికి ఇంకొకళ్ళ అనుమతి ఎందుకు? నీవు దైవాన్ని చేరడానికి ఇంకొకళ్ళ అనుమతి ఎందుకు? నువ్వు దైవం వాడివే కదా! నువ్వు సింహం పాలిట సొమ్ము. ప్రతి జీవుడు కూడా సింహం పాలిట సొమ్మే. అందరూ దైవంయొక్క సొత్తే. అందరూ జీవులు కూడా దైవమునకు సంబంధించినవారే, దైవం నుండి వచ్చినటువంటివారే. కాకపోతే, వారిలో ఉండే అజ్ఞానము నందు తరగతులు ఉంటాయి. బాగా అజ్ఞానంలో ఉండేవాళ్ళు, కొంత జ్ఞానంలో ఉండేవాళ్ళు ఉంటారు. ఈ అజ్ఞానాన్ని నిర్మూలించి నీవే నన్ను ఉద్ధరించుకో అని చెప్పటం ఈ ప్రార్థన.

రుక్మిణీదేవి కృష్ణుని పెళ్ళి చేసుకోవటంకోసం చేసింది ఈ ప్రార్థన. మనం వేరే ప్రార్థనలు చదువుకుందాం అనుకోబోకండి.

ఇది మన ప్రార్థనే. అందుకనే, చిన్నప్పుడు ఈ ప్రార్థనలన్నీ పాఠ్యాంశాలుగా ఇచ్చేవారు. దురదృష్టంకొద్ది secularism పేరున ఇలాంటి అత్యద్భుతము, పవిత్రము, సంస్కారవంతమైన విషయములన్నీ కూడా పాఠ్యగ్రంథాలనుంచి మనమే తొలగించుకున్నాము. మన ప్రభుత్వం అంటే మనం ఎన్నుకున్న ప్రభుత్వం కదా! సవినయంగా చెప్పిందండి. *"చేకొని పొమ్ము వచ్చెదన్"* –నేను వస్తాను, నువ్వు తీసుకెళ్ళు అని.

"లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దే వచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి
కాని తే రా దని కమలనయన!
భావించితేని నుపాయంబు సెప్పెద
నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు"

*"లోపలి సౌధంబులోన వర్తింపంగఁ దే వచ్చునే నిన్ను"* అని నువ్వు అనుకుంటావేమో... ఎక్కడో అంతఃపురంలో ఉంటుంది కదా! జీవుడు ఎక్కడున్నాడు? ఎక్కడో లోపలుంటాడు కదా! వాడి చుట్టూ చాలా ఆవరణలు ఉన్నాయి వాడికి. లోపలి సౌధంలోనేగా జీవుడున్నాడు! అదే లోపల. అదే చెప్తున్నాను, భాగవతం చదువుకోవడం రెండు రకాలు. మనమంతా కూడా లోపల సౌధంలో, హృదయంలో ఉన్నటువంటి స్పందన లోపల,

సూక్ష్మస్పందనంగా, చైతన్యవంతుడై, స్పందనాత్మక చైతన్యంగా ఉంటూ ఉంటాము. దాని చుట్టూ త్రిగుణాత్మకమైనటువంటి ఆవరణ ఉంటుంది. దాని చుట్టూ అహంకారం ఉంటుంది. దాని చుట్టూ బుద్ధి ఉంటుంది. బుద్ధి తర్వాత మనసు ఆవరణ ఉంటుంది. ఆ తర్వాత పంచేంద్రియముల ఆవరణ ఉంటుంది. ఆ తర్వాత రక్తమాంసాలతో కూడిన శరీరం ఉంటుంది. ఇది సౌధం. లోపల, లోపల చాలా గదులున్నాయి. రాజకుమారి అంటే ఎంత లోపల ఉంటుంది? మనమంతా సహజంగా రాజకుమారులము, రాజకుమారిలము.

మనముండేది అయోధ్య, అంటే వధ్యము కానటువంటి ప్రాకారముల మధ్య ఉండే హృదయము అయోధ్య. రామాయణంలో అయోధ్యే ఈ రుక్మిణీకళ్యాణ ఘట్టంలో కుండిన. అలా లోపల ఉన్న జీవుడిని ఎలా తెస్తాడండి? గట్టిగా పీకితే చచ్చిపోతాడు తెలుసా! యముడికి తెలుసు ఎలా తియ్యాలో మనల్ని. “అమ్మమ్మ! ఇప్పుడు కాదు సార్!” అంటే, అలాగే అని నవ్వుతూ తీసేస్తాడు, అయిపోతుంది. లేదా, నువ్వుమరీ గొడవ చేస్తే, మత్తిచ్చి తీసేస్తాడు. ఆయన మత్తిచ్చి తీయడమే మనకి తెలివి లేకపోవడం, అదే ఎక్కువగా ఉంటుంది. మనకి తెలివి వచ్చే లోపల బయట ఉంటాం! “వద్దని చెప్పాను కదా!” అంటే, “time అయిపోయింది నాన్నా! తీసేశాం” అంటాడు. మరి ఇంక నువ్వు లోపలికి వెళ్ళలేవు కదా! నీకు లోపలికెళ్ళడం చేతనయితే ఇంక గొడవేముంది! నీకు లోపలికెళ్ళడం చేతకాలేదు, బయటకి రావడం చేతకాలేదు. ఈ జన్మకి చేత కాదు, కాబట్టి నేను తీసేశాను. బయటకి రావడం

చేతనయిన వాడిని యముడు ముట్టుకోడు, వాడే వస్తాడని తెలుసు. ఎంత బాగుంటాయో తెలుసా మన కథలు! ఎక్కడా లేదండి ఇలాంటి వాఙ్మయం. నాకు తెలిసింది చాలా కొంచెమే! అయినా చాలా బాగుంది వింటుంటే. నాకే బాగుంది చెప్పుకుంటుంటే!

*"దెత్తునేనిఁ గావలివారలఁ గలబంధువులఁ జంపికాని తే రా దని"*– ఇట్లా తేవాలంటే కాపలా ఉండేవాళ్ళు, లోపల బంధువులు ఉంటారు కదా! పెళ్ళంటే ఇంటి నిండా జనముంటారు కదా! శుభమా అని పెళ్లిచేసుకుంటూ, ఇంట్లో జొరబడి, ఇంట్లో వాళ్ళందర్నీ చంపేస్తే ఏం బాగుంటుందండి? బాగుండదు కదా! అని భావిస్తావేమో *"గాని తే రా దని కమలనయన! భావించితేని నుపాయంబు సెప్పెద"* – రుక్మిణీదేవి మనమనుకున్నంత అమాయకురాలేమీ కాదు! ఆయన కెంత తెలుసో, ఆమెకు కూడ దాదాపు అంత తెలుసు! వారిరువురు సమవుజ్జీలు. తత్తుల్యం. తనకీ తెలుసు కదా! కాకపోతే, బయటపడదు అంతే. ఇల్లంతా నడిపించే ఇంటావిడ బయటపడదండి, ఇంటాయన్ని ముందుపెడుతూ ఉంటుంది. ఊరికే మనమే అంతా అనుకుంటాడు, కానీ కాదు. ఒక విధంగా మొగవాడు వెర్రి వెధవ. నడిపించేది వెనకాల ఉంటుంది కదా! అది వెనకాల చూడగలిగినవాడే ద్రష్ట. ముందు కథ అందరూ చూస్తారు. వీడు ఆడింపబడుతున్నాడా, ఆడుతున్నాడా అనేది లెక్క కదా! అసలు అమ్మవారికి తెలియని తెలివితేటలు ఏముంటాయి అండి? ఉంటాయా? ఆడవాళ్ళకుండే తెలివితేటలు మొగవాళ్ళకి ఎక్కడ ఉన్నాయండి? లేవు. ఏమనుకోకండి! అదృష్టవశాత్తు మొగవాళ్ళు తక్కువగానే ఉన్నారు, ఆడవాళ్ళే ఎక్కువ మందున్నారు

ఇక్కడ! సృష్టి స్త్రీదండి. మొత్తం సృష్టి నిర్మాణం చేసిందే స్త్రీ. ఆమె పోకడలు ఆయనకే తెలుస్తాయి, ఇంకెవరికీ తెలియదు. ఎప్పటికప్పుడు, any day భార్య is a surprise to భర్త. అమ్మో! అనిపిస్తుంది. అట్లా ఉంటారు.

ఇక్కడ ఈవిడ చెప్తూ ఉన్నది. మా ఇంట్లో ఒక ఆచారముంది. కులదేవత అయిన పార్వతీదేవి అమ్మవారి గుడి ఊరుబయట ఉంది. పెళ్లికూతురికి పెళ్లి చెయ్యడానికి ముందు కులదేవత దగ్గరకు తీసుకెళ్ళి, అమ్మవారికి పూజ చేయిస్తారయ్యా పెళ్లికూతురి చేత.

"నెలమి మావారుఁ బంపుదు రేను నట్లె
పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!"

పురము వదలి వస్తుందట ఆమె. ఎంత ప్రాజ్ఞురాలండి? పురము వదలి రావటం అంటే అంతరార్థం తెలుసా? శరీరం వదలి వస్తుందని. ఎంత అద్భుతమండి! ఇది మనం చేయలేము. ఇంతవరకు జీవుడికి సంబంధించినవన్నీ చెప్పుకున్నాం కదా! ఇది ఆవిడే చేయగలదు. పురము వెలువడి వస్తావా? వస్తే, నువ్వు సి.వి.వి. గారి యోగంలో పండినట్టే. దాని కోసమే ఈ గొడవంత. మనది గొడవే ఎక్కువ, సాధన తక్కువ. ఇలా పురంబు వెలువడి రావడం కోసమేనండి మాస్టరుగారు అవతరించారు. మనమంతా మన, మన పురముల నుండి బయటకి వచ్చి, దేవుడికి మొక్కేట్టుగా... పురములలో ఉండి దేవుడికి మొక్కడం ఒక పద్ధతి. పురముల

బయటకి వచ్చి దేవుడికి మొక్కటం ఒక పద్ధతి. అట్లా నేను బయటకి వస్తాను, అప్పుడు సులభం కదా! అప్పుడు నువ్వు అంతఃపురంలో ప్రవేశించి, ఈ గోలంతా లేదు. ఎంత సులువు చెప్పిందో చూడండి!

ఎవ్వరి చేతను బాధింపపడని, పరాక్రమమైన చరిత్రకలిగిన వాడు శ్రీకృష్ణుడు. ఆయన తలుచుకుంటే ఆయన్ను ఎవరూ ఆపలేరు. నువ్వు లోపలికొచ్చి కూడా నన్ను తీసుకెళ్ళగలవు. లోపలికొచ్చి తీసుకెళ్ళాలంటే ఈ హింసా కార్యక్రమం ఉంటుంది. బంధువుల్ని, మిత్రుల్ని చంపితే బాగుండదు. ఈ జైద్యుడు, గీద్యుడు వీళ్ళందరిని వేసేసుకోమని చెప్పింది. ఎందుకని? వాళ్ళందరూ ఎట్లాగో రాజులు, సైన్యంతో వచ్చారు. వాళ్ళందరికి వాళ్ళ వాళ్ళ అంతస్తుకు తగినట్టుగా విడుదులు ఏర్పాటు చేస్తారు, వాళ్ళు అందులో ఉంటారు. అంతఃపురంలో ఉండరు కదా! బంధువులు, ఆప్తులు, మిత్రులు వీళ్ళంతా లోపల అంతఃపురంలో ఉంటారు. మిగతా వాళ్ళందరికి విడిదే. లోపల వాళ్ళను నువ్వు చంపక్కర్లేదు. నేనే బయటకి వచ్చేస్తాను. ఆ సమయంలో నువ్వు నన్ను పట్టుకెళ్ళిపో బాగుంటుంది అని చెప్పింది.

ఈ లోపలి సౌధం, అందులోంచి బయటకి రావడం, లేదా అందు లోపలికి రావడం. లోపలి సౌధంలోకి రాగలవాడు గురువు. నీ లోపలికొస్తాడు. లోపలికొచ్చి, మూలాధారం వరకు వెళ్తాడటండి. ప్రవేశించి, అన్ని శుభ్రంగా ఏరిపారేస్తాడు – పుచ్చులు, చచ్చులు, బొద్దింకలు, ఈగలు, దోమలు, చచ్చిపోయిన ఎలుకలు అన్నీ ఉంటాయి కదా! చచ్చిపోయిన ఎలుకలు అంటే తీరని తీవ్రమైన కోరికలు– వాసన కొడ్తూ ఉంటాయి లోపల.

లోపలికొచ్చి ఇలాంటివన్నీ ఖాళీ చేసేస్తాడు. మీకు తెలీదుగాని, సద్గురువు చాలా చాకిరీ చేస్తాడు. అంతా మనమే వెలిగిపోతున్నాం అని అనుకోబోకండి. ఆయన మనకి ఎంత చాకిరీ చేశాడో మనకే తెలియదు, అట్లా చేస్తాడు. అంతా అయిపోయి, చిట్టచివరికి పరీక్ష pass అయినప్పుడు అప్పుడు తెలుస్తుంది మొదటి నుంచి గురువు ఎంత చాకిరీ చేస్తే మనం పరీక్ష pass అయ్యామో. Moderation మార్కులుకూడా వేసినట్టు కనిపిస్తుంది, గురువుగారే! ఎందుకంటే, దేవుడితో మాట్లాడి, "ఒక రెండు మార్కులు కలపవయ్యా బాబు! ఇంక అంతకన్నా వాడి వల్ల కాదు. నా వల్ల కావట్లేదు" అని కూడా చెప్తాడు. ఎందుకు వస్తుందండి moderation? టీచర్లు చెప్పినా students రాయలేకపోతున్నారు. ఇంకా చెప్తారు, అయినా రాయలేదు. Percentage of pass తక్కువుగా ఉంది. Teacher "ఏదో రెండుమార్కులు వెయ్యండి సార్! బతికిపోతారు" అని చెప్తారు కదా! అట్లా మనకోసం సద్గురువు కూడా దేవుడితో బేరాలు ఆడుకుంటూ ఉంటాడు. తను చేయగలిగినంత చేసి, ఇంతకన్నా వీడిలో చేయటానికి వీలు పడదని తెలిసి, ఇంక ఇక్కడ వదిలేసి, అక్కడ పట్టుకుని, అక్కడ దైవానికి చెప్తాడు. He is an arbitrator between the divine and the disciple. That is the Master. That is the Teacher. That is Sadguru. సద్గురువు చేసే చాకిరీ మనకి తెలియదు. ఏదో మనం చాలా చేస్తున్నాం, ఈయనేదో ఉలకట్లేదు, పలకట్లేదు అని మనం అనుకుంటాము. మనకి తెలిసి చెయ్యడు. "అన్నీ నీకు తెలిసే చెయ్యాలట్రా! బోడి!" అన్నట్టుగా ఉంటుంది. "బోడి!

నీకెందుకురా! నీకేం తెలియాలిరా!" అని అనేవారు కదా మాస్టరు గారు! నీ బొంద! నీకేం తెలుసు? నీకు తెలిసే లోపల పని అయిపోతే సరిపోతుంది కదా!

ఇలా లోపలికి ప్రవేశించి, మన లోపల ఉండేవన్నీ ఎన్నెన్ని మారుస్తారండి! నిన్న పొద్దున చెప్పాను కదా "key frame good" అని! ఈ మొత్తం రూపం అంతా మార్చేస్తారు లోపల. పాలు పెరుగు అయిపోతుంది. పెరుగు వెన్న అయిపోతుంది. అలా అయిన తర్వాత కాని తెలియదు "ఓహో! ఇలా జరిగింది. మరి మనకు తెలియకుండా ఎలా జరిగింది?" అని. మనకు తెలియకుండా ఎలా జరిగిందంటే, సద్గురువు నీకు నొప్పిలేకుండా, నీకు నోటీసులు ఇవ్వకుండా చేయిస్తూ ఉంటాడు. ఎందుకని నువ్వు పిలిచావు? పిలిస్తే, పనివాళ్ళ కన్నా బాగా చేస్తాడండి పని సద్గురువు మనకు. అందుకే పుట్టాడుట. "నిజ సేవకానుసారిన్" అందికదా ఇంతకుముందు! తనని సేవించేవాళ్ళకి సేవకుడిలా పని చేసిపెడతాడు. అర్జునుడు చేసే యుద్ధంలో అసలు దెబ్బలన్నీ కృష్ణుడే కదండి తింటూ ఉంటాడు! అలా లోపలికి వెళ్లి, ఒక సద్గురువు ఎన్నో రకాలుగా జీవుడిని సంస్కరించి, దైవానికి ''చూడు మా candidate ఎలా ఉన్నాడో!" అని చూపిస్తాడు. "చూద్దాం! ఈ పనిలో పెట్టు, ఆ పనిలో పెట్టు. వాడేం చేస్తాడో చూస్తాను" అంటాడు. అంటే, recommendation candidate కుదరదు. అలా శిక్షణ ఇచ్చుకొని, దైవానికి చూపించి, సద్గురువు "శెభాష్!" అనిపించుకుంటాడండి. దైవం మెప్పుకి శిష్యుడిని బాగుచేసుకుంటూ ఉంటాడు గురువుగారు. ఆయన బాధలు మనకేం తెలియదు కదా!

ఎంతసేపూ "ఏం గురువు గారు! నాకింకా ఇది కాలేదు, నాకింకా అది కాలేదు". నీ గోల నీది, నా గోల నాది అన్నట్టుగా ఉంటుంది! గురువుగారి గోలేమో నీకు అమరత్వం ఇద్దామని. మన గోలేమో ఇంకో రూపాయి వస్తే బాగుంటుందని, ఇల్లు కట్టుకుంటే బాగుంటుంది, అమ్మాయికి పెళ్ళైతే బాగుంటుంది, పెళ్ళైతే పిల్లలు పుడ్తే బాగుంటుంది. "పిల్లలు లేరండి మా అమ్మాయికి!" నీ పిల్లలై పోయింది, ఇప్పుడు నీ పిల్లలకి పిల్లలు! ఆ పిల్లలకి పిల్లలు– ఇక ఈ యోగం ఎప్పటికయ్యేనండి! లోపల పుట్టాలి కదా! ఈవిడ (రుక్మిణి) లోపల పుట్టిన మనిషి. గుర్తుపెట్టుకోండి. తానుగా పురం నుంచి బయటకి రాగలదు అనే దాంట్లో ఒక విశేషమైన అర్థమున్నది– నీకు ఆ బాధ అక్కర్లేదు. నేను బయటకి వస్తాను అని చెప్పింది.

"ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!"

చూడండి ఎలా చెప్పిందో! ఇంక చివరి stroke అన్నమాట అది. *"ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై"* – తమలో ఉండే అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేసి, ఆత్మానుభూతి పొందాలనుకునే మహాత్ములందరు కూడా *"గౌరీశుమర్యాద"* – గౌరీశుడు అంటే, శివుడువలె అని అర్థం. *"నెవ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే"* – గంగ నీరు విష్ణు

పాదం నుంచి పుట్టిందని కదా! ఆ నీరు ఎక్కడ పడాలి అనే పరిస్థితి వస్తుంది. "ఎక్కడో పడడమెందుకు, నా శిరం మీదే పడేటట్టుగా చూడు. నా శిరస్సు మీద పడి, ఆ తర్వాత భూమి మీద పడ్తే భూమి బతికి బట్టకడుతుంది" అని భగీరథుడుడికి శివుడు చెప్పాడు. శివుడి గొప్పదనం అది. గంగావతరణం కథ మనందరికి చూచాయిగా తెలుసు. అదీ ఇట్లా చదువుకుంటే చాలా ఉంటాయి అందులో. ఆ గంగావతరణ అప్పుడు శివుడు చాలా ముచ్చట పడ్డాడట, "విష్ణు పాదం నుంచి వచ్చినటువంటి నీరు కదా! నా నెత్తి మీద పడనీయి" అని. ఇలా ఉంటుంది శివ కేశవుల యొక్క అనుబంధం.

*"నెవ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే"*– విష్ణుదేవుని పాదముల నుండి పుట్టిన పవిత్ర జలములతో మునగాలనేటువంటి వాంఛ కలిగి ఉంటారట. అది ఒక మహా చైతన్య స్రవంతి, ఆకాశగంగ. మనం ఒక గాయత్రి మంత్రం చేస్తుంటే, అలా మహా చైతన్యం దిగి వస్తుందండి– భర్గోదేవ మండలం నంచి, సవితృ మండలం నుంచి, సూర్యమండలం నుంచి, నీ శిరస్సులోంచి అలా నీలోకి దిగి వచ్చి, నీ హృదయమంతా కూడా ఒక పెద్ద సరస్సుగా ఏర్పడుతుంది. చెయ్యటంలో స్ఫూర్తి కావాలి. స్ఫూర్తి లేకపోతే మిగతావన్నీ వస్తాయి. స్ఫూర్తి ఉంటే గాయత్రి చాలు. మనం చేసేవాటిలో ఒక్కటి చాలు – "ఓం" చాలు, గురుప్రార్థన చాలు, గాయత్రి చాలు– దేనికదే పరిపూర్తి.

అలా అందరు వాంఛిస్తారు కదా! నీయందు నాకున్నటువంటి ఆత్మీయ భావము ఇంక నువ్వు లేకపోతే ఇది ఒక "యనుకంపన్" ఆవిడకి. *"అనుకంపన్"* అంటే ఇంక తాళలేనటువంటి స్థితి.

*"తందనాలతో పొద్దు పోవలెనా తాళజాలరాదు జాగేలరా"* అని త్యాగరాజ స్వామి రాస్తాడు. "ఇంక చాల్లే! ఇంక నావల్ల కాదు", ఇట్లా కబురుపెట్టింది. *"విలసింపనేని"* – నేను నీ దగ్గరగా. *"వ్రతచర్యన్"* – నేను వ్రతదీక్ష తీసుకుంటాను, ఈ గాడిదెకు దొరికే ప్రసక్తే లేదు. *"వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్ నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!"* – వంద జన్మలయినా నీ గురించే తపస్సు చేసి నిన్ను పొందుతాను తప్ప. . .

పార్వతీదేవీ అలాగే చేసింది తపస్సు. ఎంతెంత తపస్సులు చేస్తే దొరుకుతారండి అలాంటి వాళ్ళు! సప్తధాతువుల్లోంచి ఓజస్సు పుట్టించి, ఆ ఓజస్సులో కూర్చొని తపస్సు చేసి, ఆ తపస్సు లోంచి అట్లా ఒక్కొక్క స్థితి పొందుతూ... లలితా సహస్రనామంలో వరసగా పదహారు నామాలుంటాయి. ఇలాంటి వాళ్ళని మనం అందుకోకపోతే ఇంక ఎవరిని అందుకుంటాం అనే పరిస్థితి శివుడికి కలిగింది. ఎందుకంటే, ప్రపంచము మీద శివుడు అప్పటికే విసిగిపోయి ఉంటాడు. దక్షయజ్ఞంతో విరక్తి వచ్చేస్తుంది. అసలే వైరాగ్యం ఆయనకి. అలా ఉన్నప్పుడు ఒకావిడ వచ్చింది. నాతో నీకు వద్దని చెప్తూ ఉంటాడు శివుడు. ఎందుకంటే అది అగ్ని. అయినప్పటికీ పెట్టుకుంది సతీదేవి. అదేదో ఒక tragedy అయిపోయింది. సరే, ఆ tragedy అవ్వగానే మళ్ళీ ఇంకో ఆవిడ తయారైంది. ఆవిడే ఇలా వచ్చింది. వస్తే, once beaten twice shy కదా! వద్దంటాడు. విష్ణుమూర్తి, బ్రహ్మదేవుడు, ఋషులు వీళ్ళెవ్వరు శివుడి దరిదాపుల్లోకి రావటానికి కూడా భయ

పడతారు. అటువంటి అగ్ని తేజస్సది. ఆవిడ మహా పర్వతానికి పుట్టినటువంటిది. హిమవత్ పర్వత పుత్రి కదా! హిమవత్ పర్వతం అంటే భూమి మీదే పెద్ద పర్వతం, ఎంతో స్థిరమైనటువంటిది పార్వతి, నగజ. నగమంటే కదలనిది, స్థిరమైనటువంటిది. భక్తిలో స్థిరత్వానికి పార్వతీదేవే చెప్పుకోవాలి. అలా ఇక్కడ అమ్మవారు చెప్తోంది – వంద జన్మలైనా సరే! నువ్వు అందుకోకపోతే, నేను వెంటనే దేహం వదిలేస్తాను, మళ్ళీ వ్రతం చేస్తాను. మళ్ళీ అందు కోవా, మళ్ళీ వదిలేస్తాను. మనం కూడా అదే చేయాలి. ఈ జన్మకి అవ్వలేదు, పై జన్మకి కూడా ఇదే చేస్తాను. ఆ జన్మకీ అవ్వలేదు, ఆ పై జన్మకీ అదే చేస్తాను. ఎన్ని జన్మలైనా సరే నిన్నే పొందుతాను తప్ప, ఇంకోటి పొందాలనే ఆసక్తి లేని స్థితి ఎవరికైతే ఉంటుందో వారిని భక్తులు అంటారు. అంచేత, ఆ విధంగా చేస్తాను సుమా అని చెప్పింది.

"ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రంబులకలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని
తనులత వలని సౌందర్య మేల
భువనమోహన నిన్ను బొడగానఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల
దయిత నీయధరామృతం బానఁగా లేని
జిహ్వకు ఫలరససిద్ధియేల"

మనక్కూడానండి, ఏదో ప్రార్థన చేస్తాం, బెక్కుతూ

ఉంటుంది. ఎన్నాళ్ళు పోయినా, ఒక వినపడడంగాని, ఒక కనపడడంగాని లేకపోతే దుఃఖం రావద్దండి! ఇవాళ ప్రార్థన, కానీ నాకు ఏ విధమైన అనుభూతి లేదు, ఒక వినపడింది లేదు, ఒక కనపడింది లేదు, ఒక అనిపించింది లేదు, ప్రార్థన అయింది. బాధ రావద్దండి? నిక్కచ్చిగా చెప్పండి. అది ప్రార్థన ఎట్లా అవుతుంది? ఒక గంట సేపు ప్రార్థన చేస్తే, ఒక పూజ చేస్తే, లోపల ఏమి వినిపించలేదు, కనిపించలేదు, ఏమి అనిపించలేదు. ఏడుపు రావద్దండి! ఏడిస్తే బాగుండదని బయటకి ఏడవంగాని, లోపల ఏడవద్దూ! లోపల వినిపించాలి చెవులకి. లోపల కనిపించాలి కన్నులకి. లో స్పర్శ తెలియాలి చర్మానికి. లోపల దివ్యసాన్నిధ్యం కలిగినప్పుడు వచ్చే సుగంధములు వాసన చూడగలగాలి ముక్కు. లో రుచులు పొందాలి నాలుక. అలా నీ కొరకు తయారుకాకపోతే ఎందుకు అంటోంది ఆవిడ.

*"ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులకలిమి యేల"*– ఇంక చెవులకు ఎన్ని రవ్వదుద్దులు పెట్టినా ఏం ప్రయోజనం చెప్పండి! *"పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని తనులత వలని సౌందర్య మేల"* – ఎందుకండి ఆ శరీరం? ప్రహ్లాదుడు కూడా ఇలాంటి పద్యాలు చెప్తాడు, *"కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే......... తరళ సలిల బుద్బుదంబు గాక"*– ఈ శరీరం ఊరికే ఇట్లా నీళ్ళతో నిండినటువంటి ఒక సంచి లాంటిది, ఒక బుడగలాంటిది. అందులో ఆయన ఉంటే, అందులో ఆయన మాట్లాడుతుంటే, ఆయనే నడిపిస్తూ ఉంటే ఆనందం. లేకపోతే, ఎందుకీ శరీరం waste అని భక్తుడికి

అనిపిస్తుంది. ఎంత సౌందర్యంగా ఉంటే ఏమిటి శరీరం? రుక్మిణి కన్నా సౌందర్యవతులు లేరు. అలాంటి ఆమె చెప్తోంది, "ఎందుకీ సౌందర్యం నాకు?" అని. తనులత, తీగలాంటి శరీరమండి. మనమో! వద్దులెండి ఎందుకొచ్చింది! అంటాం.

"నీవు పొందని జన్మంబు" అని చెప్పి చెప్పానుకదా నిన్న! భక్తులకలా ఉంటుంది –దైవానుభూతిని ఇవ్వకపోతే ఇదంతా వృథా, నా చూపు వృథా, నా చేయి వృథా, నా ముక్కు వృథా. *"భువనమోహన నిన్ను బొడగానఁగా లేని చక్షురింద్రియముల సత్త్వ మేల"*– నిన్ను చూడలేనటువంటి కన్నుల యొక్క గొప్పతనం ఏమిటి? ఆ కళ్ళు ఉండి ఏమి ఉపయోగం? వాటిని చూసి మురిసి పోడానికి ఏముంది అక్కడ? మురిసిపోవటానికి ఏమీ లేదు. *"దయిత నీయధరామృతం బానఁగా లేని జిహ్వాకు ఫలరససిద్ధియేల"* – నీ పెదవుల యొక్క అమృతాన్ని కోరలేనటువంటి జిహ్వా అనవసరం.

"నీరజాతనయన! నీ వనమాలికా
గంధమబ్బలేని ఘ్రాణ మేల
ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని
జన్మమేల యెన్ని జన్మములకు."

లోపల కృష్ణుడు అలా త్రిభంగియై చూస్తూ, నీలమోహన, నీలమేఘశ్యాముడై, చక్కగా నవ్వుతూ, ఇలాంటి సంపెంగ దండ లోపల వేస్తున్నాడనుకోండి... లోపల అలాంటి వనమాలి. వనమాలి ఎప్పుడూ ధరించి ఉంటాడు. లోపల వనమాలి ఉంటే నీకు వాసన తెలియట్లేదా! బాగా కృష్ణ ధ్యానం చేస్తే, లోపల

ఇల్లంతా తులసీదళాలతో నిండిపోయినంత వాసన వస్తుంది. ఎందుకని? ఆయన తులసీ దళమునందు ప్రీతి కలిగినంటివాడు. తులసీదళములు ఎప్పటివి? నాలుగు రోజులు fridgeలో పెట్టి, వేసుకున్నవి కావు. అప్పటికప్పుడు చెట్టునుంచి కోసిన పువ్వులకు, నాలుగు రోజులు fridgeలో పెట్టిన పువ్వులకు చాలా తేడా ఉంటుంది. మనకి దరిద్రంగా ఉన్నప్పుడు అట్లా fridgeలో పెట్టుకొని, ఇంక రేపు మాడిపోతాయి అనుకొనేవి ఇవాళ దేవుడికి పెడుతూ ఉంటాం కదా! లేకపోతే అది వాడిపోతుంది, మనం కొన్నాం, మనకి డబ్బుల ఖర్చు! ఇదే గోల తప్ప, దేవుడికి ఓ మంచి పువ్వు పెడదాం, వాసన ఉండే పువ్వు పెడదాం అని ఉండదు కదా!

సువాసన లేని పుష్పము పూజకి పనికి రాదు. ఆ పుష్పాలు ఎంత స్వచ్ఛంగా ఉండాలి? ఎంత నిర్మలంగా ఉండాలి? భగవంతుడు " ఏరా! న్యాయమేనా ఇది?" అని అడిగితే ఏం చెప్తారు? ఎందుకురా! ఒక ఆకు తీసిపెట్టు. పత్రం, పుష్పం, ఫలం, తోయం – ఉద్ధరిణి నీళ్ళు పోయరా! అది కూడా fridge లోంచి తీసిపోయకు! fridge లో నీళ్ళు, mineral water నాకు అక్కర్లేదురా! అప్పటికప్పుడు భూమిలోంచి పుట్టినటువంటి నీళ్ళు ఒక చక్కని మేలిమితో కూడి ఉంటాయి. అవి పోయి, అదిచాలు నాకు. లేదు, మొక్కకి పూలు లేవు, అలాంటి ఊరు, అలాంటి నెల అది. అప్పుడు ఆకులు పెట్టు. ఏం! ఆకులతో అందంగా అలంకరించుకోకూడదా! శివుడు చాలా కరుణామయుడు. ఆయనకి పాపం మన బాధలు తెలుసు. ఈ పూలకోసం వీళ్ళేం బాధ పడతారులే, అందుకని బిల్వపత్రం నాకు అన్నిటికన్నా చాలా ఇష్టం

అని చెప్పేశాడండి. ఒక బిల్వపత్రం పెట్టి, కోటికన్యా ఫల దానం అని చదువుతూ ఉంటాం కదా! నాకే డోకు పుడుతూ ఉంటుంది! ఎందుకంటే, ఒక ఆకేసేసి, ఒక కోటి కన్యలు మనం దానం చేసినటువంటి ఫలం పొందాలట! అంత ఆశపరులమండి మనం! భయంకరం కదా! చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. అంటే, బిల్వపత్రమైనా సరే. . . అది కూడా మనం ముందు రోజు కోసేసి, fridge లో పెట్టి, మరునాడు దేవుడికి పెడితే, నా దృష్టిలో అది భక్తి కాదు. భక్తి చాలా పెద్ద రసవత్తరమైన subject అది. ఆయన బిల్వపత్రం అడగడు, నీళ్ళు అడగడు, లింగం పెట్టమనడు. నువ్వు పెట్టుకున్నావు. నువ్వు పెట్టుకొని, సవ్యంగా చేసుకుంటే నీకు అనుగ్రహం. పెట్టిన గంటలో వాడిపోయే పూవులు... నిన్ననే నీళ్ళు పోసేస్తాం గంధంలో. బొట్లు పెడతాం, అది మిగిలిపోతుంది. మళ్ళీ దాంట్లోనే నీళ్ళుపోసి, తీసి మళ్ళీ పెడతామా! గంధంలో నీళ్ళు పోసినప్పుడే గంధం సువాసన వస్తుంది. మళ్ళీ ఇంకోసారి గంధం పెట్టాలంటే, గంధం పొడిలో నీళ్ళు పోయాలి. అసలు న్యాయం చెప్పాలంటే అప్పటికప్పుడు తియ్యాలి గంధం. మా తాతలు, తల్లులు అట్లా తీసుకునేవాళ్ళు గంధం. స్తోత్రం చేసుకుంటూ గంధం చేసుకోవచ్చుగా! మీకేం సార్! చాలా చెప్తారు. "చెప్పేవాడికేం! చాలా చెప్పచ్చు కదా! ఏది టైము! ఒక రాయి పడేసి, ఒక గంధం చెక్క ఇస్తే, అట్లా గంధం తీస్తారు. గంధము చల్లదనాన్ని ఎవరికి? దేవుడికి కాదు మనకి! ఆయనకి సుగంధం మనం సమర్పిస్తే, మనకి చల్లదనం. మరి ఇవన్నీ ఏం తెలుసండి? ఏం తెలీదు కదా! భక్తి అంటే ఎట్లా? అక్కడ ఒక సజీవమైన రూపం, దేదీప్యమానంగా ఉందనుకొని, చాలా వినమ్రతతో, భక్తితో, శ్రద్ధతో, ఆర్ద్రతతో

పూజ చేస్తే, స్తోత్రం చేసేటప్పుడు కళ్ళు మూసుకుంటే, నవ్వుతూ కనిపిస్తాడు. లేదు జరిగేది చూడలేక, “అపచారం స్వామి! మరి ఇంతకన్నా నా వల్ల కాదు” అని కళ్ళు మూసుకొని ఒకసారి ఏడ్చేసి, స్తోత్రం చేస్తే, “ఆ! ఫర్వాలేదు. ఏం చేస్తాం! కలియుగం కదా! సరిపెట్టుకుంటానులే” అంటాడు దేవుడు. అలా ఉంటుంది. ఆయన అన్నీ సరిపెట్టుకుంటాడు. ఆయన సరిపెట్టుకుంటాడని మనం సరిపెట్టకూడదు. సత్పురుషుడు, సజ్జనుడు ఎప్పుడూ అన్నీ అట్లాగే సరిపెట్టుకుంటూ ఉంటాడు. అపచారం చేసినా సరిపెట్టుకుంటాడు కదా!

అంచేత, ఆవిడ అడుగుతోంది, *“నీకు దాస్యంబు సేయని జన్మమేల యెన్ని జన్మములకు”*– నీకు దాస్యం చేసే జన్మమే నాకు కావాలి. ఎన్ని జన్మలైనాసరే నీకు దాసుడుగా ఉంటే చాలు. దాసుడికుండే అదృష్టం మిగతా వాళ్లకి లేదు. ఆంజనేయస్వామి ఉన్నారు కదా! భగవంతునికి దాసునిగా ఉండటంలో ఉండేటువంటి ఆనందం ఇంక దేంట్లోంచి రాదు.

**“అని యిట్లు రుక్మిణీదేవి పుత్తెంచిన సందేశంబును రూపసౌందర్యాది విశేషంబులును బ్రాహ్మణుండు హరికి విన్నవించి కర్తవ్యం బెద్ది సేయ నవధరింపు మని సవరణగా మఱియు ని ట్లనియె.”**

“పుత్తెంచిన” అంటే సందేశమిస్తే. అంటే, గురువుగారు ఒక annex పెట్టాడు. ఆవిడ చెప్పాల్సింది ఇలా చెప్పింది అని చెప్పి, ఆయన చెప్తున్నాడు ఇప్పుడు.

"పల్లవ వైభవాస్పదములు పదములు
కనకరంభా తిరస్కారు లూరు
లరుణప్రభా మనోహరములు కరములు
కంబుసౌందర్య మంగళము గళము
మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు
చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసి తార్ధేందు పటలంబు నిటలంబు
జిత మత్తమధుకర శ్రేణి వేణి

భావజాశుగముల ప్రాపులు చూపులు
కుసుమశరుని వింటి కొమరు బొమలు
చిత్తతోషణములు చెలువ భాషణములు
జలజనయనముఖము చంద్రసఖము."

ఎందుకంటే, ఆమె తరపున ఈయన వకాల్తా పుచ్చుకుంటాడు. గురువుగారు కదా! నువ్వేదో తమాషాగా అనుకుంటున్నావేమో! ముఖం చూస్తే చంద్రుడిని చూడక్కర్లేదు. *"చిత్తతోషణములు చెలువ భాషణములు"* – మాట్లాడుతుంటే చెవులకి ఎంతో ఇంపుగా ఉంటుందట. పెళ్ళయ్యేంతవరకు ఇంపుగా ఉండి, ఆ తర్వాత కంపుగా ఉంటుంది మామూలుగా చాలా మందికి! "చిత్తతోషణములు" అలా వింటూ ఉంటే అట, అసలు ఎంత ఆనందం కలుగుతుందంటే ఇంటావిడ మాట్లాడకపోతే బాధ కలుగుతుందట! అట్లా ఉంటాయి మాటలు. ఇంక చాల్లే అన్నట్టుగా

ఉండవు. అలా వినకుండా తప్పించుకునేట్టుగా ఉండవు. రుక్మిణీదేవి ఎంత బాగా మాట్లాడుతుందో తెలుసా, విన్నావో నీ చిత్తం అలా ఆనందంలోకి వెళ్ళిపోతుంది. పద్యం వెనకనుంచి వస్తున్నాను.

*"కుసుమశరుని వింటి కొమరు బొమలు"* – మన్మథుని యొక్క బాణాల్లాగా ఉంటాయటండి ఆవిడ కనుబొమ్మలు. చూడంగానే కనుబొమ్మలే చాలా ఆకర్షణీయంగా ఉంటాయట. తర్వాత కనులు! మన్మథునికి ఆశ్రయం ఇచ్చేట్టుగా ఉంటాయట. అలాంటి కన్నులు. ఆమె కుమారుడేగా మన్మథుడు! అలాంటి కన్నులున్నాయి, చూసుకో! అని చెప్తున్నాడు కృష్ణుడికి. అలాగే మిగతా దేహ సౌందర్యమంతా కూడా చాలా చక్కగా వర్ణిస్తాడు. వర్ణించి, ఇలాంటి కన్య ఎక్కడా ఉండదని తెలియపరుస్తాడు. తెలియపరిచి,

"ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనకుం దగు దీవు మాయుపా
ధ్యాయుల యాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము లేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తు గాని వి
చ్చేయుము శత్రులన్ నుఱుముసేయుము చేయుము శోభనం బిలన్."

*"అంగనకుం దగు దీవు"* – ఆవిడకి నువ్వే సరైనటువంటి పతి. నీకు ఆమెయే సరైనటువంటి సతి. *"ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనుకుం దగు దీవు మా యుపాధ్యాయుల యాన"* అన్నాడు. మా గురువుగారు మీద ఒట్టు వేసి చెప్తున్నాను అన్నాడు. ఈయనే ఇట్లా ఉన్నాడంటే ఇంక ఈయన గురువుగారు ఎట్లా ఉంటాడో కదా! ఈయనకి ఎంత సేవ చేస్తాడు కృష్ణుడు! ఎందుకు చేశాడో కూడా చెప్పాడు కదా! ఎలాంటి వాడివో నువ్వు నాకు తెలిసిపోయింది

అన్నాడు కదా! నువ్వేమడిగినా చేస్తాను అన్నాడు కదా! అందుకని చెప్తున్నాడు. *“మా యుపాధ్యాయుల యాన పెండ్లి యగు”* – ఇద్దరికి పెళ్లి అవుతుంది. తప్పదు. భవిష్యవాణి చెప్పేశాడండి. *“జాడ్యము లేల”* – ఎందుకు ఆలస్యం చేస్తావు? *“శోభనం బిలన్”* అన్నాడు. భూమి మీద జగత్కళ్యాణమై నటువంటి ఒక కార్యాన్ని నిర్వర్తించు. ఆమెను నువ్వు వివాహం చేసుకోవటం జగత్ కళ్యాణం. అంతేకాదు గుర్తుపెట్టుకోండి, సంప్రదాయబద్ధంగా ఒక వివాహం జరిగితే అది జగత్ కళ్యాణ మైనట్లు తోడ్పడుతుంది. అది మన వివాహక్రతువులో ఉన్నది. సంస్కారవంతమైనటువంటి పద్ధతుల్లో వధూవరులు వివాహం చేసుకుంటే దాని వలన జగత్తుకు చాలా శుభం జరుగుతుంది. అలాంటిది ఇలాంటి రుక్మిణీకృష్ణుల వివాహం జరిగితే అది జగత్తుకు కళ్యాణంగా ఉంటుందని చెప్పడంలో పెద్ద ఆశ్చర్యమే లేదు. ఈయన అన్నాడు, తొందరగా మీ వారిని తీసుకొని నువ్వు వచ్చి, *“శత్రులన్ నుఱుము సేయుము”* – పొడి పొడి చేసేయ్ శత్రువులందర్ని. *“చేయుము శోభనం బిలన్”* – భూమి మీద ఒక అత్యంత శుభమైన కార్యం నిర్వర్తించు. ఒక జీవుడిని ఒక దైవం అనుగ్రహించడం, అది భూమికే ఒక అద్భుతమైనటువంటి సందర్భం. ఒక మనిషి మహాత్ముడయితే అది భూమంతా సంతోషించేటువంటి ఒక సందర్భం.

ఒక్క మనిషి మహాత్ముడైతే! మహాత్ముడవడం అంటే భగవంతునిచే పొందబడిన వాడైతే. అలా అయితే the entire planet celebrates అని రాస్తారు పరమగురువులు. భూమి, భూమ్మీద ఉండే ఋషులు, అందరూ పండుగ చేసుకుంటారటండి,

మనం birthday celebrate చేసుకున్నట్టు! ఎంత అద్భుతంగా celebrate చేసుకుంటారోట. Prophecy is fulfiled. ఎందుకంటే, ఈ మానవ జాతిలో ప్రతి ఒక్క మానవుడు దైవాన్ని చేరినప్పుడల్లా కూడా అది భూమి పులకరించేటువంటి ఒక సన్నివేశం. అందుకని, ఇలాంటి శోభనం అందచేయి ఆమెనందుకొని. ఇందులో రెండు రకాలు: కన్యగా ఆమె పొందదగినటువంటిది కళ్యాణం జరగటం వల్ల శుభం. రెండవది జీవిగా పరమాత్మ అనుగ్రహం పొందినటువంటి సందర్భంలో జగత్ కళ్యాణం జరుగుతుంది.

"అని యిట్లు పలికిన బ్రాహ్మణునివలన విదర్భరాజతనయ పుత్తెంచిన సందేశంబును రూప సౌందర్యాది విశేషంబులును విన నవధరించి నిజకరంబున నతని కరంబు పట్టి నగుచు నయ్యాదవేంద్రుం డి ట్లనియె."

చెప్పినవన్నీ చాలా ఓపిగ్గా, ఉత్సుకతతో విన్నాడండి కృష్ణుడు. బ్రాహ్మణుడు చెప్పే ప్రతిమాట చాలా ఉత్సాహంగా విన్నాడు. ఎందుకని? ఆమెను వివాహం చేసుకుందామని తను అనుకోవటం ముందు చదువుకున్నాం కదా! తను ఎవర్నైతే వివాహం చేసుకుందామని అనుకుంటున్నాడో ఆమె పంపించినటువంటి సందేశము తనకి ఎంత కర్ణప్రియంగా ఉంటుందండి! మనం ప్రేమించిన అమ్మాయే మనకి కబురు పెట్టింది, "ఎలాగైనా సరే నన్ను పెళ్లి చేసుకో. నువ్వు పెళ్లి చేసుకోకపోతే నేను బతకలేను" అని. మామూలుగా చూస్తే, అంతకన్నా ఏం కావాలండి ఎవరికైనా!

రుక్మిణీదేవి చెప్పినట్లుగా ఇంతలా ఎవరూ చెప్పరు అనుకోండి! కృష్ణుడు అంతకు ముందే నిర్ణయం చేసుకున్నాడు. ఎందుకని? ఆమె ఏ విధంగా కృష్ణుడి గురించి విన్నదో, కృష్ణుడు కూడా ఆమె గురించి విన్నాడు. అప్పుడే అనుకున్నాడు. ఇప్పుడు ఈయన వచ్చాడు. ఎన్నో విషయాలు చెప్పాడు. అవి విన్న తర్వాత ఆయన చేయి ఈయన చేతిలో పెట్టుకున్నాడు. అది ఎంత అదృష్టం ఆ బ్రాహ్మణుడికి!

"కన్నియమీద నా తలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా కెన్నఁడు నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే మున్నె యెఱుంగుదుం బరులమూఁక వధించి కుమారిఁ దెత్తు వి ద్వన్నుత! మ్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చు కైవడిన్. "

నాకు రుక్మిణీదేవి పైన చాలా గాఢమైనటువంటి తలంపు ఉంది అని చెప్పేశాడు. "కూరుకు రాదు" – నిద్ర రావడంలేదటండి ఆయనకి! అంటే confidential గా చెప్పాడు, చేతిలో చేయేసుకుని చెవిలో చెప్పినట్టు! ఏ రోజు రాత్రి నిద్ర రావట్లేదుట, ఈవిడే గుర్తుకు వస్తోందట. *"నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు"* – తెలియందేముంది! బావమరిది మూర్ఖుడు, మామగారు బలహీనుడు. ఏం చేస్తావు! అప్పుడే పుట్టిన అగ్ని భయంకరంగా ఎట్లా దహించేస్తుందో అట్లా, ఈ మూకనంతా దహించేసి... ఆమె ఎనిమిది పద్యాలుచెప్తే, ఈయన ఒక్క పద్యంలో ఇదెందుకు స్వామి, నేను అందుకే చూస్తున్నాను, పద పోదాం అని రథంలో అగ్నిజ్యోతనుని తీసుకుని వెళ్ళిపోతాడు.

## శ్రీకృష్ణుడు విదర్భకు పయనమగుట

"వచ్చెద విదర్భభూమికిఁ
జొచ్చెద భీష్మకుని పురము సురుచిరలీలం
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్."

మెఱపులా వచ్చేస్తాడు. చదువుకుంటే ఇలాంటి పద్యాలు చదువుకోవాలండి, జన్మ తరిస్తుంది. లోపల సంస్కారాలు పెరుగు తాయి, కల్మషాలు కరుగుతాయి. అడ్డం వచ్చిన వాళ్ళందరిని కూడా చీరేస్తాను. ఏం చేస్తాడు? *"దెచ్చెద బాలన్ వ్రేల్మిడి"* – వేలు ఇచ్చి ఆమెను తీసుకొచ్చుకుంటాడటండి. నా చెయ్యి పట్టుకో. నేను తీసుకొచ్చేస్తాను. వచ్చిన వాళ్ళందర్ని చెక్కేస్తాను.

ఇది కూడా మరి ఆత్మపరంగా చాలా అద్భుతమైనటువంటి వైభవం. భక్తుడు భగవంతుడి గురించి ఎంత ఆరాటపడుతుంటాడో, భగవంతుడు కూడా భక్తుడి గురించి ఆరాటపడుతూ ఉంటాడు. తన వాళ్ళు తన దగ్గరికి రావాలని కోరుకోరండి తండ్రి! "వద్దామను కున్నాను నాన్నా! విమానం... ఏమిటో! airlines. Technical defect sir! late అయింది" అని చెప్తే, "ఫర్వాలేదు నాన్న! జాగ్రత్తగా ఉండు" అని చెప్తుంటాడు ప్రతి తండ్రి. ఏవేవో అడ్డు వచ్చేస్తుంటాయి కొడుక్కి తండ్రి దగ్గరకు రావడానికి. తండ్రి సహాయం చెయ్యడా? తన దగ్గరికి వద్దామనేటువంటి కుమారుడికి

ఆ తండ్రి సహాయం చేస్తాడా, చెయ్యడా? ఏదో అంతా మనదే కష్టం అనుకుంటాం మనం. కాదు. మన కష్టం మనం ఏర్పాటు చేసుకున్నదే. ఆయన ఇవన్నీ ఎలా చూడగలడో అలా చూస్తుంటాడు అక్కడనుంచి. "టికెట్ దొరకట్లేదు నాన్న" అంటే ఇటుపక్క open చేసేసి, ఈయనే బుక్ చేసేస్తాడు ticket. "నీకు ఫలానా flight లో seat దొరికింది, వచ్చేసెయ్యి" అని చెప్తాడు, తండ్రి కదా! అటు నుంచి వాడు ఇబ్బంది పడుతున్నాడట అంటే, ఇటు కూర్చుంటా డండి ఊరికినే? కూర్చోడు కదా! అంతలా తాపత్రయ పడతాడు భగవంతుడు గుర్తుపెట్టుకోండి. మనకెంత ఆరాటం ఉంటుందో, అంతకన్నా ఎక్కువ ఆరాటం అటు పక్కన ఉంటుంది. నువ్వు ఒక్క అడుగు వేస్తే నేను పది అడుగులు వేస్తానురా అంటాడు. ఆ ఒక్క అడుగూ కూడా వెయ్యము మనం! ఆ ఒక్కటీ వెయ్యకుండా, వేసేశామని feel అయితే, నేను ఎట్లా చావను! ఇప్పటికే పది అడుగులు వేసేశాను, ఏడి అన్నట్లుగా ఉంటాము మనం! నువ్వు వెయ్యలేదురా! ఊరికే feeling లో ఉన్నావు అని చెప్తాడు! ఎంత బాగా చెప్తాడండి – "నాకు ఎప్పటినుంచో ఉంది. ఏనాడయితే ఆమె నా గూర్చిన భావన మొదలుపెట్టిందో ఆనాటినుంచి నాకు ఉంది. "ఏనాడు మనస్ఫూర్తిగా భగవత్ ఆరాధనకని మనం సంకల్పం చేస్తామో, ఆనాటి నుంచి మన లోపలే సర్వసాక్షి అయి చూస్తూ ఉంటాడు, కావలసిన సహాయం చేస్తూ ఉంటాడు, నీలో ఉండేటువంటి సంసిద్ధతను బట్టి సద్గురువును కూడా పంపిస్తాడు. ఎన్ని రకాలుగా సహాయం చెయ్యాలని చూస్తాడో! అన్నీ అజ్ఞానంతో తోసిపుచ్చుతుంటే కూడా ఓపిగ్గా ఇంకా వేచి ఉంటాడు. సహాయం చెయ్యడానికి సంసిద్ధుడై ఉంటాడు.

*“కన్నియమీద నా తలఁపు గాఢము కూరుకు రాదు”* – ఆయనా నిద్రపోడు. భక్తుల విషయంలో భగవంతుడు నిద్రపోడు. చాలా అపారమైన కరుణ కలిగినవాడు, ప్రేమ కలిగినవాడు. ఆయనకు మన ప్రార్థనలు తెలియవనుకోకండి. మన ప్రార్థనలో ఉండే శుద్ధి, భక్తి తెలియదనుకోకండి. అది ఆర్ద్రతతో చేస్తున్నావా? యాంత్రికంగా చేస్తున్నావా? యథాలాపంగా చేస్తున్నావా? అవన్నీ కనబడతాయి. ఎవర్ని మోసపుచ్చుదామని చేస్తున్నావు? నిన్ను మోసపుచ్చుకుంటావా?

ఎప్పటినుంచో నాకు ఆమె మీద కోరిక ఉన్నది. ఎందుకంటే, ఆమె పరిపూర్ణంగా, ఆమె చెప్పిన సమస్త విషయములు, ఈ ఎనిమిది పద్యములలో ఉండేవన్నీ కూడా అక్షర సత్యములు. అవి అక్షర సత్యములు అవ్వడం చేత, నాకు ఎప్పటినుంచో ఈమెను నేను చేసుకోవాలని ఉంది, ఈమెను నేను దక్కించుకోవాలని ఉంది. ఈ భక్తుడిని నేను రక్షించుకుంటాను అని భగవంతుడు నిర్ణయం చేసుకుంటాడు. దానికి అడ్డువస్తూ ఉంటారు. ఒకరు భక్తి చేస్తుంటే అతడి పూర్వకర్మము, అతడి అజ్ఞానము, అతడి అహంకారము, అతడికున్న కోరికలు, అతనికున్న విముఖతలు, అవన్నీ అడ్డు వస్తాయండి. “ఇవి అడ్డు వస్తాయని తెలియదా!” అంటున్నాడు. ఈ రోజున మనం భగవంతునికి సమర్పణ చేసుకుందాం అనే భావన చాలా గాఢంగా కలిగి, ఏదో ప్రారంభం చేశామనుకోండి, మన లోపల ఉన్న దైవం అప్పుడు training మొదలు పెడతాడు. ఆ ప్రేరణ ఇచ్చేదే ఆయన. ఆ ప్రేరణ ఇచ్చిన తర్వాత, నీకు నీలో ఎన్ని అవరోధాలు ఉంటాయో – అజ్ఞానం, అహంకారం, కోరిక,

విముఖత లేక ద్వేషము. అటుపైన ఇందులోనే (శరీరం) శాశ్వతంగా ఉండి పోవాలనే కోరిక. ఇలా ఉంటాయి. మనకి మనలోనే అడ్డుపడేవి ఉన్నాయి. ఇవన్నీ నీకున్నటువంటి గాఢమైనటువంటి ఆసక్తి – దానినే fiery aspiration అంటారు, దాన్నే తపస్సు అంటారు – అలా ఉన్నప్పుడు, నీకు ఇవి అడ్డుపడుతూ ఉంటాయి కదా! ఆ అడ్డుపడేవాటిని నిర్మూలించడానికి ఒకపక్క నువ్వు కృషి చేస్తుంటే, దైవం మరొక పక్కనుంచి కృషి చేస్తూ ఉంటాడు.

ఆమె రకరకాలుగా కార్యక్రమాలు, దానాలు, ధర్మాలు, వ్రతాలు, పెద్దలకి సేవలు, ఎన్నో చేసుకుంటూ వచ్చింది, ఎన్నో జన్మలనుంచి. చేసుకుంటూ రావడం చేత ఆమెకు బాగా దృఢమైన నమ్మకం కలిగింది. ఆమె చేసే ఆ కార్యక్రమాల్లోంచి ఆమె ఉండే దేహము విదర్భ అవుతుంది. దేహము విదర్భ కావాలి. విదర్భ అంటే చెప్పానుగా అత్యంత పవిత్రమైన ప్రదేశము. నీవు చేసే అనంతమైన పుణ్యకార్యముల చేత దేహం పవిత్రమౌతూ ఉంటుంది. భావనల చేత పవిత్రీకరింపబడుతుంది. సద్భాషణములు చెయ్యడం చేత పవిత్రీకరింపబడుతూ ఉంటుంది. సత్కార్యములు, సద్భాషణములు, సద్భావములు అలా జరుగుతున్నాయనుకోండి, అప్పుడు ఈ శరీరం పవిత్రంగా పరిణమిస్తుంది. అలా పవిత్రీకరింపబడిన దేహం నీకు ఉన్నప్పుడు అప్పుడు నువ్వు విదర్భదేశంలో ఉన్నట్టు. అలా విదర్భదేశం వస్తాడు. *"వచ్చెద విదర్భ భూమికిఁ"* – అన్ని చోట్లకి కుదరదు. *"జొచ్చెద భీష్మకుని పురము"* – కుండినపురము ఉంది కదా, అంటే హృదయంలో ప్రవేశిస్తాను. ఎందుకని? భక్తుడు తన ఆరాధనా మార్గంలో హృదయం చేరువలోకి వస్తాడు.

అలా రావడం చేత, *"సురుచిరలీలం దెచ్చెద బాలన్ వ్రేల్మిడి"* – హృదయంలో ప్రవేశించి, చెయ్యిచ్చి... అప్పుడైనా కాస్తోకూస్తో అవరోధాలు ఉంటే అక్కడ... నేను వచ్చేశాను కదా ఇంక! ఏ అవరోధం ఉన్నా వాళ్ళందరినీ చిత్తుచిత్తు కింద చితక్కొట్టేస్తాను అన్నాడు. ఎంత బాగుంది చెప్పండి! రుక్మిణీ కళ్యాణము అలా ఉంటుంది!

"అని పలికి రుక్మిణీదేవి పెండ్లినక్షత్రంబు దెలిసి తన పంపున రథసారథి యైన దారుకుండు శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకంబులను తురంగంబు లం బూన్చి రథమాయత్తంబు చేసి తెచ్చిన నమోఘ మనోరథుండైన హరి తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి యేకరాత్రం బున నా నర్తకదేశంబులు గడచి విదర్భదేశంబునకుం జనియె నందుఁ గుండిన పురీశ్వరుం డైన భీష్మకుండు కొడుకునకు వశుండై కూఁతు శిశుపాలున కిత్తునని శోభనోద్యోగంబులు చేయించె నప్పుడు."

రేపు వస్తాను, పై సంవత్సరం వస్తాను, ఇంకో పదేళ్ళ కొస్తానని అన్నట్టుగా భగవంతుడు ఉండడు. పెండ్లి నక్షత్రంబు అడిగాడండి ఎప్పుడు పెళ్ళని. రేపే! అంచేత, ఏం చేశాడు? *"పెండ్లి నక్షత్రంబు దెలిసి తన పంపున రథసారథియైన దారుకుండు"*– ఆయన రథసారథిని దారుకుండు అని పిలుస్తారు. రథాన్ని సిద్ధంగా ఉంచమని చెప్పాడట. ఆ రథానికి ఎలాంటి గుఱ్ఱాలున్నాయి? శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకంబులను నాలుగు గుఱ్ఱాలు ఉన్నాయి. పరమాత్మ రథంలో బయలుదేరాడంటే నాలుగు గుఱ్ఱాలు

ఉంటాయట. అవి అహంకారము, బుద్ధి, చిత్తము, మనస్సు. ఈ నాలుగులో ప్రవేశించి బయలుదేరాడని అర్థం. నాలుగు గుఱ్ఱాల కథ ఇది. అంతఃకరణములను ఆశ్రయిస్తాడు. ఎందుకంటే, పరమాత్మ అంతఃకరణలో కూర్చోడు. అంతఃకరణములకు అతీతంగా ఉండేటువంటి బ్రహ్మము. అంతఃకరణములను ఆశ్రయించి, చతుర్భుజుడై, చతుర్ముఖుడై, చతుర్బాహువులు కలిగినటువంటివాడై అని అంటూఉంటాం కదా! నాలుగు. అందులోనే జీవుడుంటాడు. తాను అది ధరించాడు. రథమెక్కడమంటే రెండు అర్థాలున్నాయి. మామూలుగా బయట నాలుగు అద్భుతమైన గుఱ్ఱాలతో కూడినటు వంటి రథం. అది కృష్ణుడెక్కే రథం. పరమాత్మ, జీవాత్మని సంరక్షించడానికి, అనుగ్రహించడానికి అతను కూడా రథారూఢుడై మన దగ్గరకి వస్తాడండి. అందుకనే కనిపిస్తాడు. ఆయన కూడా నీతో మాట్లాడాలని అనుకుంటాడు కదా! మనసుకు ఆధారంగా చిత్తం ఉండాలి. అదొక శాల్తీ కనిపిస్తుండాలి, అదే అహంకారం. మొత్తమంతా వెలుగు నిండి ఉండాలి, అది బుద్ధి. అందుకని ఈ నాలుగు గుఱ్ఱాలతో కూడిన రథమెక్కాడు.

*"తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి"*– అట్టి బ్రాహ్మణోత్తముడిని కూడా తనతో పాటు రథ మెక్కించుకున్నాడు. *"సమోఘ మనోరథుండైన హరి"* – రథంలో బయలుదేరాడన్నమాట. *"రథారోహణంబుఁ జేసి యేకరాత్రంబున"* – ఎంత వేగంగా వచ్చి ఉండాలండి! ఎక్కడ ద్వారక? ఎక్కడ విదర్భ? విదర్భ అంటే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్,

ఈ రెండు కలిసే చోటది. అలాంటిది ఎక్కడుంది ద్వారక? గుజరాత్ అవతల నీళ్ళలో. అక్కడనుంచి బయలుదేరి, గుజరాత్ దాటి, మహారాష్ట్ర దాటి, మధ్యప్రదేశ్ పొలిమేరల వరకు రావాలి. అలా రావాలంటే superfastలో పద్దెనిమిది గంటలు పడ్తుంది. ఈయన తెల్లారేసరికల్లా వచ్చేశాడు బ్రాహ్మణుడిని కూడా తీసుకుని.

ఆయన అలా వస్తుంటే ఇక్కడ కొడుకు ఎలాగూ పెట్టాడు కదా ఒక పెటారం, పెళ్లి చెయ్యాలని. ఆయన బ్రహ్మవేత్త. పెళ్ళికి అన్ని సంభారాలు తీసుకుంటూ, పెళ్ళికి ఉద్యుక్తుడయ్యాడు బ్రహ్మ జ్ఞాని అయిన భీష్మకుడు. బ్రహ్మజ్ఞాని కాకపోతే అలా కూతుర్ని ఎత్తుకుపోతే యుద్ధం చెయ్యొద్దండి! తాను అడ్డుపడడు. అటుపైన అమ్మవారి ప్రార్థన ఉంది. అటుపైన రుక్మిణిని కృష్ణుడు తీసుకువెళ్లడం, అడ్డువచ్చిన వాళ్ళందరిని సంహరించడం ఉంది. బావమరిదికి తలగొరగడం ఉంది. ఆపైన కళ్యాణం. ఇంత కథ ఉంది. అంచేత, రుక్మిణీసాధన, రుక్మిణీభావన, అందోళనా భావము, ఇవన్నీ తెలుసుకున్నాం. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటాడు. కృష్ణుడు బయలుదేరాడు. మనము కూడా మన ఊళ్ళకు బయలు దేరుదాము. పై సంవత్సరం భగవత్ అనుగ్రహంగా దీనిని కొనసాగించుకుందాం.

రథమంటే ప్రాణంతో కూడిన శరీరం. దానికి నాలుగు గుఱ్ఱాలు కూర్చాడట అంటే అది సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగను, సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత కుమారులుగను, ఈ విధంగా ప్రతిసారి భగవంతుడు అవతరణం చెంది భక్తుడు దగ్గరకు వచ్చినప్పుడు... అప్పటికప్పుడు నాలుగు వ్యూహములను తాను ఏర్పాటు చేసుకొని,

రథమెక్కడమంటే దేహాన్ని ధరించి, భక్తుడికి దర్శనమిస్తూ ఉంటాడు అనేటువంటి ఒక సంకేతార్థంగా చెప్పుకోవడం జరిగింది. ఈ కథలో మనకి అంతర్గితమైన, సాధనాపరమైన విశేషాల్ని కూడా మనం బాగా విరివిగా చెప్పుకుంటూ వచ్చాం ఇన్నేళ్ళుగాను. అలాగే కొనసాగిద్దాం!

# రుక్మిణి అంతరంగం

ఆ విధంగా రుక్మిణీదేవి పంపినటువంటి బ్రాహ్మణుడు కృష్ణుని యొక్క అనుగ్రహాన్ని పొంది, అనుమతిని పొంది, కృష్ణుడితో పాటుగా రథమెక్కి విదర్భరాజధానికి పయనమై వస్తూ ఉండగా...... బయలుదేరిన బ్రాహ్మణుడు అసలు అక్కడకి చేరాడో లేదో, చేరి చెప్పాడో లేదో, కృష్ణుడు సాన్నిధ్యం ఇచ్చాడో లేదో– ఇచ్చినప్పటికీ బ్రాహ్మణుడు చెప్పినదానికి సమ్మతించాడో లేదో, ఇలాంటి ఆలోచనలు రుక్మిణీదేవికి వస్తాయి. ఒక పని మీద, అదీ చాలా ముఖ్యమైనటువంటి పనిమీద, తనకు ప్రాణ సంకటమైనటువంటి పనిమీద పంపించినప్పుడు వెళ్ళినవాడు ఏం చేస్తున్నాడో, ఏం జరుగుతోందో అనే ఒక ఉత్కంఠత పంపించిన వారిలో ఉండడం సహజం. రుక్మిణీదేవి పరిస్థితి ఏమిటంటే, ఇంక రేపోమాపో పెళ్ళి అని నిశ్చయమైంది. రాజులందరూ వచ్చి విడిది చేశారు. శిశుపాలుడికి మద్దతు ఇవ్వడానికి జరాసంధాదులు వచ్చారు. శిశుపాలుడు వచ్చాడు. సాళ్వరాజులు, వాళ్ళందరూ కూడా వచ్చారు.

ఈ విధంగా రాజులందరూ వచ్చేశారు. వారి వారి సైన్యాల్ని కూడా తీసుకొచ్చారు. ఎందుకంటే, కృష్ణుడేమైనా వస్తాడేమోనని వాళ్ళకొక అనుమానం ఉన్నది. అంచేత, కృష్ణుడు వస్తే, యుద్ధం చేసి, అతన్ని నిర్జించి, రుక్మిణీదేవిని శిశుపాలుడికిచ్చి పెళ్ళి చెయ్యాలనే ఒక సంకల్పంతో అక్కడ ఒక సంఘమున్నది. దానికి నాయకుడు జరాసంధుడు. ఆ జరాసంధుడు, కంసుని

సంహరించిన సందర్భంలో కృష్ణుడి మీద వైరంపూని, కృష్ణుడిపై దండెత్తి, మథురానగరంపై పదిహేడుసార్లు దండయాత్ర చేస్తే, పదిహేడు సార్లు శ్రీకృష్ణుడు జరాసంధుని సైన్యాన్నంతా వధించి పంపించేస్తూ ఉంటాడు. అంటే, ఒక్కొక్కసారి వచ్చినప్పుడల్లా సైన్యాన్ని వధించి, జరాసంధుని వదిలేస్తూ ఉంటాడు. అప్పుడు మళ్ళీ కూడకట్టుకొని, మళ్ళీ వస్తూ ఉంటాడు, మళ్ళీ కృష్ణుడు ఓడిస్తూ ఉంటాడు. ఇలా పదిహేడుసార్లు ఓడించి, పద్దెనిమిదోసారి తాను ఓడిపోయినట్టుగా, పారిపోయినట్లుగా వెళ్లి ద్వారకలో, ద్వారకా నిర్మాణం చేసుకొని ఉంటూ ఉంటాడు కృష్ణుడు. అంచేత, పదిహేడు సార్లు ఓడిపోయినటువంటి జరాసంధునికి కృష్ణుడంటే భయంగా ఉంటుంది. అయినప్పటికీ, కృష్ణుని యందు వైరం ఉంటుంది. అతనికి తోడు శిశుపాలుడు. అలాగే, సాళ్వుడనే మరొక రాజు. వీళ్లందరికీ దన్ను రుక్మిణి అన్నయ్య అయిన రుక్మి అనే మరియొక యువరాజు, భీష్మకుని కుమారుడు. ఆ విధంగా వీళ్ళందరూ వారి వారి బలగాలతో వచ్చి ఉంటారు. వివాహానికి సమయం ఆసన్నమైంది. ఇంక ఒకటి రెండురోజుల్లో పెళ్లి జరుగుతుంది.

కిందటి సంవత్సరం మనం చెప్పుకున్న కథలో రుక్మిణీ దేవి ఇలా జరుగుతుందని తెలిసి, అగ్నిద్యోతనుడికి ఏం చెప్పి పంపించిందంటే, ఇలా వీరందరూ వస్తారు. నీవు వచ్చి నన్ను స్వయంవరంలో వరించినాగాని యుద్ధం జరుగుతుంది. రాజప్రాసాదంలో యుద్ధం జరిగి, నా పెళ్లి కారణంగా బంధుజను లందరూ మరణించడం అనేది నాకు ఇష్టం లేదు. కాబట్టి స్వయంవరానికి ముందు మా కుల ఆచారం ప్రకారం నేను

ఊరి వెలుపల ఉన్న పార్వతీదేవి గుడికి బయలుదేరి వెళ్తాను. ఆ సందర్భంలో నీవు నన్ను రాక్షసవివాహంగా ఎత్తుకొని వెళ్ళి వివాహం చేసుకోమని కబురుపెడుతుంది. కాబట్టి ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కృష్ణుడు వస్తున్నాడా, రావడం లేదా? వెళ్ళిన బ్రాహ్మణుడు ఏమయ్యాడు? ఇటువంటి సందేహాలతో ఈసారి మనకి కథ ప్రారంభమవుతుంది. అంతవరకు మనం వచ్చాం కిందటిసారి గురుపూజల్లో.

కృష్ణుడు బయలుదేరి వెళ్ళాడు అని తెలియంగానే బలరాముడు కూడా సందర్భాన్ని సమయోచితంగా ఆలోచించి, మనం కూడా తోడు ఉంటే బాగుంటుంది అనుకుంటాడు. ఎంచేతంటే, చాలామంది రాజులు అక్కడికి వస్తారు, ఈ కార్యాన్ని ప్రతిఘటిస్తారనే ఉద్దేశ్యంతో బలరాముడు ఈ విధంగా భావన చేశాడు.

"హరి యొకఁ డేఁగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతు లెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గర మగుఁ దోడు గావలయుఁ గంసవిరోధికి నంచు వేగఁ దా
నరిగె హలాయుధుండు కమలాక్షునిజాడ ననేకసేనతోన్."

కృష్ణుడు ఒక్కడే వెళ్ళాడు. చైద్యుడంటే శిశుపాలుడు. చైద్యరాజు ఆయన. అతనికి *"హితానుసారులై"* మగధరాజులంటే జరాసంధుడు ఆదిగా గల రాజులు. *"నరపతు లెందఱేని"* – చాలామంది వచ్చారు వాళ్ళు. *"కుమారికఁ దెచ్చు చోట సంగరమగు"* – తప్పక యుద్ధమవుతుంది అని బలరాముడు చాలా నిశ్చయమైన అభిప్రాయం కలిగి ఉంటాడు. బలరాముడు

చాలా పెద్ద సేనలని తీసుకొని, కృష్ణుడు వెళ్ళిన దారిలోనే తానూ వెళ్ళటం జరిగింది.

"ఆ లోపల నేకతమున
నాలోల విశాల నయన యగు రుక్మిణి త
న్నా లోకలోచనుఁడు హరి
యాలోకము చేసి కదియఁ డని శంకితయై."

లోపల ఎంత భక్తి, ఎంత విశ్వాసము, ఎంత సమర్పణ బుద్ధి ఉన్నా, ఒక్కొక్క క్లిష్టమైన సన్నివేశంలో భక్తుల హృదయంలో రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. ఉన్నాడో, లేడో అనిపిస్తూ ఉంటుంది. *"కలడు కలండనువాడు కలడో లేడో"* అని అన్నాడు గజేంద్రుడు. అంటే, సన్నివేశము యొక్క గంభీరతను బట్టి, ఎప్పుడూ భగవత్ భక్తి యందే ఉంటూ, భగవంతునికే సమర్పణ చెంది ఉన్న సందర్భంలో కూడా భక్తుడికి లోపల రకరకములైన భయాందోళనలతో, ఆత్రుత, ఆవేదనలతో కూడినటువంటి భావాలు వస్తాయనేది సత్యం. రుక్మిణీదేవి మనిషిని పంపించింది. పంపించిన మనిషి ఏం చెప్పాడో, అక్కడ ఏం జరుగుతోందో, ఒప్పుకున్నాడో, ఆయన ఒప్పు కోలేదో, వస్తున్నాడో, రావట్లేదో, అసలు తాను చెప్పిన కబురు చాలా అధర్మంగా ఉందని అనుకున్నాడో, ఇలాంటి భావాలన్నీ రావడం సహజం కదా! "ఏకాంతం" – ఒంటరి. ఎందుకంటే, రాజప్రాసాదంలో ఎవరెవరి భవనాలు వాళ్ళకుంటాయి. రాజకుమారి భవనంలో రాజకుమారి, రాజకుమారి చెలికత్తెలు ఉంటారు. లేకపోతే, ఒక కొలను ఉంటుంది. అందులో కొన్ని పద్మాలు ఉంటాయి. ఒక

ఉద్యానవనం ఉంటుంది. అందులో కొన్ని నెమళ్ళు తిరుగుతూ ఉంటాయి. కొన్ని పెంపుడు పావురాలు ఉంటాయి. కొన్ని మామూలు పక్షులవీ ఉంటూ ఉంటాయి. ఇలా రకరకాలుగా ఒక రమ్యమైన, హృద్యమైనటువంటి, ఒక సుందరమైన భవనంలో సామాన్యంగా ఒక రాజకుమార్తె ఉండడం అనేది ఆచారం. అలాగే రాణిగారికి ఒక భవనం ఉంటుంది. రాజుగారికి ఒక రాజభవనం ఉంటుంది. రాజకుమారుడుంటే ఆయనకీ ఒక భవనం ఉంటుంది. ఇదంతా ఏంటంటే, వారివారి వైభవానికి ప్రతీకగా ఉంటాయి. అందరూ ఒక హాలులో పడుకొని నిద్రపోయేట్టుగా ఉండదు! ఎవరి స్వతంత్రత వారికి ఉంటుంది. ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళాలంటే, ముందుగా కబురు పంపించడం, ఇలా ఉంటాయి.

ఆవిడ *"ఏకతమ"* అంటే ఒక్కతే ఉంటుంది ప్రాసాదంలో. *"విశాల నయన యగు రుక్మిణి తన్నా లోకలోచనుఁడు హరి"*– అంతా చూడగలిగినవాడు ఆయన, సమస్తము చూడగలిగిన కన్నులు కలవాడు. *"న్నాలోకలోచనుఁడు హరి"* – ఆలోకమును చేసి అంటే, బాగా ఆలోచించి... అంతా తెలిసినవాడు, అతడు ఆలోచనచేసి అసలు బయలుదేరాడా, లేదా? రుక్మిణీదేవికి ఆయనకి ఏమీ తెలియనిది లేదు అనే ఒక నిశ్చలమైన భావము ఒకటి ఉన్నది. అయినప్పటికీ, కదిలాడో లేదో? ఎందుకంటే, తను చెప్పింది నచ్చిందో లేదో? కదలటం దాన్నిబట్టి ఉంటుందికదా! తానెంత ప్రేమించినా అతని మనస్సుయందు ఏమున్నదో అనే భావన చేత ఆ విధంగా అనుకుంది. *"విశాల నయన యగు రుక్మిణి"* – చాలా పెద్ద కన్నులు కలది, బాగా చూడగలిగింది అని అర్థం. పెద్దకనులకు సాముద్రికంలో సంకేతం ఏంటంటే వారి చూపు బాగా గ్రహిస్తుంది

అని అర్థం. అందుకనే, పెద్దకనులు ఉన్నట్లుగా వర్ణిస్తుంటారు. “పద్మనయనంబుల వాడు” అంటూ ఉంటాం. “నల్లనివాడు, పద్మనయనంబులవాడు” అంటే, సాముద్రికమునకు ఇది ఒక సంకేతము. పెద్దకనులు ఉంటే వాళ్ళకి గ్రహింపు బాగుంటుంది అనే ఒక అవగాహన. ముఖంలో కన్ను ప్రధానం. ఆమెవి చాలా పెద్ద కన్నులు, అవగాహన కలిగిన మనిషి. మొత్తం లోకాలన్నీ చూడగలిగిన వాడు ఆయన. ఏం ఆలోచన చేస్తున్నాడో అనే ప్రశ్న పుట్టింది ఆమెకి. *“యాలోకము చేసి కదియఁ డని శంకితయై”* –ఆలోచించి, ఇంకా కదల్లేదేమో అనికూడా ఆలోచన చేసేసింది, అలా భావన చేసుకుంది.

“లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁ డు
ద్విగ్నంబయ్యెడిమానసంబువినెనోవృత్తాంతమున్బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో.”

*“లగ్నం బెల్లి”* అంటే రేపే పెళ్లి. మామూలుగా ఇలాంటివి మనం చెప్పుకున్న దానికన్నా, పోతనామాత్యులు రాసిన పద్యం చదివితేనే రుచి కదా! పోతన పద్యాల్లో ఉండే రుచి ఎలా ఉంటుందంటే, మన హృదయంలో ఉండే కల్మషాలన్నీ కూడా కరిగించేట్లుగా ఉంటాయి. ఆ పద్యాల్లో ఉండే భక్తి, అందులో ఉండే భావము. రేపే పెళ్లి. వివాహము దగ్గర పడ్డది.

*“ఏలా రాఁడు గోవిందుఁ డుద్విగ్నం బయ్యెడి మానసంబు”* – మనసులో చాలా కల్లోలము, గాబరా వస్తోంది, భయమేస్తోంది. ఏం జరుగుతుందో, ఏమిటో? పెద్ద పరీక్షండి. రేపు results

వస్తాయి అండి. చాలా కష్టపడి చదివాం కదా! ఈ పరీక్ష pass అయితే గట్టెక్కినట్టు, pass కాకపోతే మళ్ళీ రాయటానికి లేదు. రుక్మిణీదేవి పరీక్ష ఎలాంటిదంటే, మళ్ళీ ఇంకొకడిని ప్రేమిద్దాం, వీడు కాకపొతే ఇంకోడని, ఈ attempt లో pass కాకపోతే ఇంకో attempt లో pass అవుతామని అన్నది కాదు! అది pass అవ్వాలి, వేరే మార్గం లేదు. పూర్వకాలంలో honors అనే course ఉండేది. నేను చేశాను అది. ఒక్కసారే పరీక్షకి వెళ్ళాలి. Pass అయితే అయినట్టు, లేకపోతే నాలుగేళ్ల చదువు ఏమీ కాదు. మరి అలాంటి చదువు చదువుతున్నప్పుడు అందులో పది పరీక్షలు పెట్టి, అన్నిటిలోను నలభై రావాలి, average యాభై రావాలి అని పెట్టారనుకోండి, ఎంత tension ఉంటుందండి! పోని, పరీక్ష పోతే మనిషి చచ్చిపోడు కదా! ఇది ప్రాణాలు అర్పించినటువంటి సందర్భం కదా ప్రేమంటే! ప్రేమ గురించి నేను చెప్పక్కర్లేదు కదా! బాగా సినిమాలు చూస్తున్నారు. ప్రేమ విఫలమైపోతే చాలా కష్టం, ఆ జీవితం బాగా దెబ్బతింటుంది. అందులోను చాలా సంస్కారవతి అయినటువంటి స్త్రీ కథ.

ఆమె హృదయం ఉద్విగ్నం అయిందంటే లోపల ఎంత తపన చెందుతోందో! *"ఉద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్"* – అసలు విన్నాడో, లేదో! ఎంతోమంది ఉన్నారు కృష్ణునికి, నేనొక్కత్తనే కాదు. చిన్నప్పటి నుంచి ఆయన వెంట పడ్డవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇంతవరకు ఆయన ఎవరినీ పెళ్లిచేసుకోలేదు కదా! ఇదే మొదటిది కదా! అప్పటికే బలరామకృష్ణుల గూర్చి దేశంలో చాలాచోట్ల అందరూ వింటూ వచ్చారు. ఈవిడ కూడా వినబట్టి కదా, ఆ విధంగా నారదుడు

రాజసభలో చెప్పటం చేత, తాను విని, మనస్సునందు ఆరాధన మొదలు పెట్టింది. బంధువులు, హితులు అందరూ కూడ ఆయన గురించి చెప్తూఉంటే, విని, ఆయన గూర్చిన ఆరాధన లోపల మొదలు పెట్టింది. అయితే నాకు ఆయనే పతి అవ్వాలి అనే భావనలో. అతను విన్నాడో, లేదో?

*"బ్రాహ్మణుం డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె"* – ఈ వెళ్ళిన ఆయన ఏమయ్యాడు? అసలు మనకేం కబురు లేదు, కాకర కాయ లేదు. వెళ్ళినవాడు ఏం చెప్పకపోతే, ఏరా కబురు లేదు, కాకరకాయ లేదు అని అంటూ ఉంటాం కదా! కబురంటే మంచి కబురు, కాకరకాయ అంటే చేదు కబురన్న మాట. కాబట్టి కబురుతో వస్తాడా, కాకరకాయతో వస్తాడా అన్నట్లుగా, ఇక్కడ ఏం జరిగిందంటే, వెళ్ళినవాడు ఏమయ్యాడో తెలీదు. ఆయన తిరిగివచ్చిన సందేశ మేమీలేదు, పంపించి కూడా చాలా రోజులైంది.

*"నాయత్నంబు సిద్ధించునో"*– నేను చేసిన ప్రయత్నము సిద్ధిస్తుందో, సిద్ధించదో! *"భగ్నంబై చనునో"* – అది నేను మీకు చెప్పక్కర్లేదు కదా! భగ్నమైపోయిందేమో, విఫలమైపోయిందేమో! *"విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో"* – బ్రహ్మదేవుడు ఏ విధంగా లిఖించి ఉన్నాడో, మనకి తెలియదు కదా! అదే తెలిస్తే మనకి గొడవేముంది! అది తెలియకే ఇంత ఇబ్బంది పడ్తున్నాం! తెలిస్తే, suspense లేదు. ఏదైనా సినిమాలో suspense ఉంటేనే రక్తి కలుగుతుంది కదా!

రుక్మిణీదేవికి కూడా పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అలాంటి సందర్భంలో ఏం చేస్తారండి? ఎవర్ని నమ్ముకున్నారో

వారిని బాగా ఆశ్రయించి, ఆరాధన చేసుకుంటూ ఉండాలి. ఆ విధంగా ఏకాంతంలో భావన చేసిందటండి. అంతటితో ఆగలేదు.

మళ్ళీ ఇంకో భావన వచ్చింది. *"ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో"* – చాలా ఘనుడు ఆయన, అభూసురుడు. సామాన్య మైన వాడు కాదు. వెళ్ళినవాడు ఏదో సత్తు కేసు అనుకోండి. అందుకనే, ఎప్పుడన్నా, ఎవరినన్నా కబురిచ్చి పంపించా లంటే, అసలు వాడిని ఎన్నుకోవడంలోనే ఉంది నీ గొప్పతనం. రాముడు ఉంగరం ఇచ్చి ఎవరిని పంపించాడు? అందరికీ ఇవ్వలేదుకదా! చాలామంది వానరులు వెళ్లారు, చాలా ధీశాలులు, బలశాలులు వెళ్లారు, సమర్థులు వెళ్లారు. వాళ్ళకెవ్వరికీ ఇవ్వలేదు. హనుమంతుడికే ఇచ్చాడు. ఇదిగో ఇతన్ని దక్షిణ దిశగా పంపిస్తున్నాను అన్నాడు సుగ్రీవుడు. అంతే, తన చేతి ఉంగరం తీసి, "ఈ ముద్రిక చూపించు" అన్నాడు. అంటే ఏమిటి? తప్పక అతను దర్శిస్తాడనేటువంటి ఒక విశ్వాసం. అమ్మను తప్పక దర్శిస్తాడనే విశ్వాసం ఉండబట్టి కదా రాముడు ముద్రిక ఇచ్చాడు! అలాగే రుక్మిణీదేవి చాలా చక్కని అర్హత కలిగిన వాడు, పుణ్యాత్ముడు, మహాత్ముడు, జ్ఞాని, తెలిసినవాడు... ఆయన పేరులోనే ఉంది కదా అగ్నిద్యోతనుడని! అగ్నిద్యోతనుడంటే, అతను ఎప్పటికప్పుడు అట్లా అగ్నిశిఖ అధిగమించినట్టుగానే ఉంటుంది. అద్భుతమగు చైత్యనం గలవాడు. యోగి. ఇరువురను కలపగల ధీమంతుడు. అతడు భాషిస్తూ ఉంటే వినువారి హృదయం పొంగిపోతూ ఉంటుంది. కృష్ణుడే ఆనందించాడు కదా!

అలాంటి వాడిని పంపిస్తే, *"ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో"*– ఎలా వెళ్లాడాయన?

ఆయనకేమన్నా ఈవిడ గుఱ్ఱాలు arrange చేసిందా? లేదు. రథమేర్పాటు చేసిందా? రాజకుమారి కదా, అవీ ఇవీ ఏర్పాటు చేయద్దూ! అవన్నీ ఏర్పాటు చేస్తే ఊళ్ళోవాళ్లకి తెలిసిపోతుంది. రుక్మిణీదేవి ఒక సద్బ్రాహ్మణుడిని రథమిచ్చి పంపించిందట అంటే, వెంటనే ఆరా తీయరండి! రహస్యంగానే పంపించిందికదా! రహస్యంగా పంపించినప్పుడు, అతను ఎట్లా వెళ్తాడు? అతను కాలినడకన వెళ్ళాడు కదా! కాలి నడకన అలా నడుచుకుంటూ కొండలు, మిట్టలు దాటిపోయినట్టుగా మనం కథలో చదువు కున్నాం. అలా వెళ్ళాలంటే, ఎన్ని రోజులు పడుతుందండి? అతను వెళ్ళాడో, దార్లో ఏ పులి అన్నా మింగేసిందో? పులి మింగచ్చు, పాము కాటువేయవచ్చు, అసలు ఈయన వెళ్ళాడా? వెళ్ళగలిగాడా? మార్గంలో ఎక్కడన్నా, ఏ అపాయనికైనా గురైపోయాడా?

*"నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో"* – అదొకటి ఉంది కదా! "నా పరిస్థితి ఇది, నువ్వు ఇలా చేస్తే బాగుంటుంది" అని మనమొక సందేశం పంపించాం. అది ఆయనకి నచ్చాలి కదా! తప్పని అనిపిస్తుందేమో! ఎందుకు తప్పు? రెండు రకాలుగా తప్పు అని అనిపిస్తుంది. ఒక స్త్రీ సామాన్యంగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పదు. అవతలవాడికి మరీ బొత్తిగా ఎన్ని రకాల సంకేతాలు ఇచ్చినా అర్థం చేసుకోలేకపోతే, ఈ చవటకి తెలియట్లేదని ఏమన్నా చెప్తే చెప్తుందేమోగాని, మామూలుగా స్త్రీ చెప్పదు. స్త్రీ తత్త్వంలో అది లేదు, స్త్రీ నైజంలో అది లేదు. ఎందుకంటే, పురుషుడు positive pole. నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని పురుషుడు చెప్పగలిగినట్లుగా స్త్రీ చెప్పలేదు. స్త్రీ receptive pole, వింటుంది. విని కూడా నవ్వుతుంది తప్ప

చెప్పదు. అందుకనే చూడండి మనకి పెళ్లిళ్లు చేసే పెద్దవాళ్ళు కుడా "ఏమ్మా! ఈ వివాహం ఖాయం చెయ్యనా?" అని అడిగితే ఏం చెప్తుంది? ఇష్టమైతే "మీ ఇష్టం నాన్నా!" అంటుంది. నా కిష్టం లేదు. తప్పకుండా చెయ్యండి. ఇంకోటి వద్దు. ఇట్లా మాట్లాడదు. తొందర పడటం అనేది స్త్రీ లక్షణం కాదు, అది పురుషలక్షణం గుర్తుపెట్టుకోండి. త్వరపడని పురుషుడు, త్వరపడే స్త్రీ జీవితంలో చాలా తప్పులు చేస్తుంటారు. Traffic signని కన్నడంలో మనం "నింతుహోగి" అంటాం కదా! "నింతుహోగి" అంటే ఆగి, చూసి, వెళ్ళమని. అందుకని, ఆగి చూసి వెళ్ళటం అనేది స్త్రీ లక్షణం.

అలాంటిది ఇక్కడ ఏం జరిగిందండి? రుక్మిణీదేవి జీవిత సన్నివేశం అంతా తిరగపడిపోయింది. ఎందుకంటే, ఇంట్లో అలాంటి అన్నయ్య ఒకడు ఉన్నాడు. వాడు అర్థం చేసుకునే పరిస్థితిలో లేడు. చెల్లెలి మనసు తెలిసి, పెళ్లి చెయ్యాలనే ఉద్దేశ్యం అతనికి లేదు. అతడికో ముఠా ఉంది కదా! అతడికో మిత్ర సంఘముంది. వాళ్ళందరూ ఏ నిర్ణయం చేస్తే వీడికి అదే లెక్క. వాళ్ళ స్నేహంకోసం తన చెల్లెల్ని బలిచేయడానికి సిద్ధంగా ఉన్నాడు. అదీ పరిస్థితి. తాను ఈ విధంగా కబురు పంపిస్తే... ఇదేమిటి ఈ అమ్మాయి? ఇలా ఎవరన్నా పంపిస్తారా? సంస్కారవంతులు ఇలా కబురు పంపిస్తారా? పైగా రాజకుమారి. అలా చేస్తుందా? రెండోది, స్వయంవరం కదా! తానొచ్చి కూర్చున్నప్పుడు తన మెడలో దండ వేసి అతన్ని వరిస్తే ఇంక ఇబ్బందేముంది? కాని ఇబ్బంది ఉంది. ఎందుకని? ఏ ఇంట్లో పెళ్లి జరగాలో ఆ ఇంట్లో హింస జరుగుతుంది. ఆమె ఎంత ఆలోచించింది! పెళ్లి మండపంలో హింస జరిగి నెత్తురు పారితే ఏం బాగుంటుంది? ఎంచేతంటే,

నువ్వు స్వయంవరానికి వచ్చినప్పుడు నిన్ను నేను వరించినా, అక్కడుండే వాళ్ళు పడనీయక అప్పటికప్పుడు కత్తులు దూస్తారు. కాబట్టి ఈ విధంగా, నేను నీకు ఈ సలహా ఇస్తున్నాను అని కూడా చెప్పిందావిడ. ఇట్లా రెండు రకలుగా ఆమె చెప్పి పంపించటం చేత ఆవిడకి లోపల కొంచెం భయమొచ్చింది. *"ఇది విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో".* వచ్చాడేమో? వచ్చి ఇంకా కబురు రాలేదేమో? ఎందుకంటే, రేపు వివాహమంటే, ఇవ్వాళ్టికి రావాలిగా!

*"విచ్చేసెనో యీశ్వరుండనుకూలింపఁ దలంచునో తలఁపఁడో"*– అదొక పెద్ద విషయం. ఈ సృష్టి అంతా ఈశ్వరాధీనమై నడుస్తూ ఉంటుంది కదా! ఈశ్వరాధీనమై నడిచే సృష్టిలో ఇలా జరగాలని జీవుడు కోరుకోవడం ఒకటుండగా– జరగడం, జరగకపోవటం అనేది ఈశ్వరుని యొక్క సంకల్పం బట్టి ఉంటుంది తప్ప, ఆ జీవుల సంకల్పం బట్టి ఉండదు. జరిగితే ఈశ్వర సంకల్పం. జరక్కపోయినా ఈశ్వరసంకల్పమే! ఈశ్వరుడు నేను అనుకున్నట్లుగా అతను సంకల్పించి ఉన్నాడా, లేక ఆయన మరొకరకంగా ఉన్నాడో నాకు తెలీదు కదా! చాలా పనుల్లో ఈశ్వరానుకూలత మనకి తెలియదు కదా! మన కర్తవ్యం మనం చేస్తూ ఉంటాం. నా తమ్ముళ్ళిద్దరూ ఇవాళ నాకన్నా గంటన్నర ముందు విశాఖపట్టణంలో బయలుదేరారు. ఇక్కడికి నాకన్నా రెండున్నర గంటల ముందు వచ్చేస్తాము అని ఉద్దేశ్యపడ్డారు. ముందు వచ్చి, ఏదో పక్కన పుణ్యక్షేత్రాలు చూసుకొని వచ్చేయచ్చు అని అనుకున్నారు. అది తమాషాగా ఎలా జరిగిందో చూడండి! వాళ్ళకే నవ్వు వచ్చింది. "మీకన్నా ముందు వెళ్లిపోదాం

అనుకున్నాం మాస్టారు. మీకన్నా ముందైతే బండి ఎక్కాం తప్ప, మీకన్నా అరగంట వెనగ్గా విజయవాడ వచ్చాం" అన్నారు. ఇట్లా ఉంటాయి మనకి. చిన్న చిన్న విషయాల్లోనే మనకి ఈశ్వరుని యొక్క సంకల్పం మరొక రకంగా ఉన్నదని తెలుస్తూ ఉంటుంది కదా! కొన్ని పనులు అవుతూ ఉంటాయి, కొన్ని పనులు కావు. ఇది వరకు ఇదే పని ఇలా అయ్యింది, అదే పని ఈసారి అలా అవ్వదు. దీన్ని ఎవరు చెప్పగలరు? అంచేత, రుక్మిణీదేవి ఇలా అంటోంది. ఇవన్నీ ఇలా ఉండగా కృష్ణుడికి ఇష్టముందా?

*"యీశ్వరుం డనుకూలింపఁ దలంచునో తలఁపడో?*
*యార్యామహాదేవియున్ నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో"*
అని అటు వెళ్ళిపోయింది అమ్మవారు. "ఆర్యాయై నమః" అని అంగపూజలో చేస్తుంటాం కదా! అసలు అమ్మవారికి నా గురించిన భావన ఎలా ఉందో? అసలు నన్ను రక్షించాలని ఆవిడకి తెలుసో, తెలియదో! మొత్తం జగత్తంతా రక్షిస్తుండేవాళ్ళు, ఇంత particular గా ఇప్పుడు రుక్మిణీదేవి పెళ్లి గురించి ఆలోచన చేసే పరిస్థితి ఉందో లేదో అక్కడ కదా! అంటే, ఎలా ఉంటాయో భావాలు చూడండి. ఒక పక్క తను నమ్ముకున్న ప్రేమికుడు, తను కోరుకున్న పురుషుడు. మరొక పక్క ఈశ్వరుడు, ఇంకొక పక్క అమ్మవారు. సంకల్పం అంటే అమ్మవారే! *"రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నాభాగ్య మెట్లున్నదో"*– అంతే కదా చివరికి! ఎటు తిరిగి మన భాగ్యం ప్రకారమే మన పనులు అవుతాయి తప్ప ఇంకోటి జరగదు. మన భాగ్యం ఎట్లా ఉంటే పనులు అట్లా జరుగుతాయండి. అదే ఇంకొంచెం చేదుగా చెప్పుకోవాలంటే, మన మొహాన ఏం రాసిపెట్టుంటే అట్లా జరుగుతూ ఉంటుంది. అంతేగా! మన

రాత మార్చేవాడు ఎవడున్నాడు? నువ్వే రాసుకున్నావు. నువ్వు ఇదివరకు చేసిన పనుల వల్ల ఆ రాత ఏర్పడుతుంది. ఇప్పుడు ఆ పని మార్చలేవుగా! ఇప్పుడు నీకు జరగటం జరక్కపోవటం అనేది ఇదివరకు నీవు చేసిన దాన్నిబట్టి ఉంటుంది. ఆ కారణం చేత ఆవిడ చివరికి ఏమనుకుందంటే, నా తలరాత ఎట్లా ఉందో? నా భాగ్యం ఎట్లా ఉందో? అనేటువంటి ఒక భావన చేసుకుంది. అలా కాసేపు నిట్టూర్పు విడుస్తూ ఉంటుంది.

ఆ పైన మళ్ళీ ఇంకో భావన కలుగుతుంది. "పోఁ డను బ్రాహ్మణుండు"– ఈ బ్రాహ్మణుడు అసలు వెళ్ళే ఉండడు, ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడు. ఈ రోజుల్లో మనం పని చెప్తే, వాళ్ళు ఇంటికెళ్ళిపోతారు కదా! ఇంటికెళ్ళిపోయి ఈయన మరునాడు మళ్ళీ కనపడినా, వాడికి గుర్తుండదు మనం చెప్పిన పని. ఏమయ్యా ఏం చేశావంటే, మర్చిపోయాను సార్! అనడు, ఇది అంత చిన్న విషయం కాదనుకోండి. అసలు ఈయన వెళ్ళాడో, లేదో? ఆయనకే నచ్చలేదేమో కదా!

"పోఁ డను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికి వాసుదేవుఁడున్
రాఁడను నింకఁ బోయి హరి ర మ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁడను రుక్మికిం దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁ డను గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్."

*"పోఁడను బ్రాహ్మణుండు"* ఎట్లా వస్తాయో చూడండి భావాలు? ఆందోళనలో ఉన్నప్పుడు మనిషికి రకరకాలుగా భావాలు వస్తాయి. *"పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికిన్"* – వీటికి అంటే ఇంటికి. *"వాసుదేవుఁడున్ రాఁడను"* –

ఇంక ఆయన రానన్నాడేమోలే, మనకేం తెలుసు? రానన్నాడేమో! లోపల భయం చేత, ఆందోళన చేత, ఆత్రుత చేత ఇలా అనిపిస్తూ ఉంటుంది. పోని, ఇంకొకళ్ళని ఎవరినన్నా పంపిద్దామంటే, ఇంకెవరూ బంధువులు కూడా ఆవిడకి లేరట. పంపించడానికి సమయము లేదు, ఒకటి. రెండోది, పోనీ, పంపించి చెబ్దామా అంటే ఇంకొకళ్ళెవరు బంధువులు కూడా లేరావిడకి. ఎందుకంటే, అంతా అన్నయ్య security check లో ఉంటారు. ఏదైనా, ఈయన వేదబ్రాహ్మణుడు కాబట్టి ఈయన జోలికి ఆయన పోయుండడు. అందుకనే, ఈయనని పట్టుకుంది ఆవిడ. ఈ సందర్భంలో ఇంకొకళ్ళని ఎవర్నన్నా పంపిద్దామా అంటే ఇంకెవ్వరు లేరట.

రుక్మిణికి వాళ్ళ అన్నయ్య రుక్మి ఉన్నాడు కదా! వాడు అనుకున్న పని వాడు చేసేసుకోవచ్చు. ఎంచేతంటే, కృష్ణుడు ఇంకా రాలేదు కదా! *"దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు నున్నాడు"* —ఆ శిశుపాలుడికి ఇవ్వాలనేటువంటి మహా ఉత్సాహంతో ఉన్న తన అన్నయ్య రుక్మికి ఇంక ఏ విధమైన అడ్డంకి లేదు. ఇంక యథేచ్ఛగా, వాడు అనుకున్నట్టుగా నిర్వర్తించుకుంటాడు.

*"గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్"* – ఇంక మనసు అటుపోయింది. ఎందుకంటే, రేపు పొద్దున అమ్మవారి గుడికి వెళ్తుంది. అప్పుడు కదా విషయం తెలుస్తుంది! ఒకవేళ ఇక ఏదన్నా జరిగితే, ఇక అదే last chance కదా! కనపడితే అక్కడ కనపడాలి ఆయన కదా! *"గౌరి కీశ్వరికి నావలనం గృపలేదు నేఁ డనున్".* ఇంతవరకు కబురు రాలేదండి! రేపు పెళ్లి. అంటే, రేపు పొద్దున గుడికెళ్తాం. తలంటు పోసుకొని, ఆభరణాలు ధరించుకొని అమ్మవారి గుడికి వెళ్తారన్నమాట. ఆ వెళ్ళేదార్లోనో,

వచ్చేదార్లోనో ఆయన కనపడాలి, తనని తీసుకెళ్ళాలి. ఇంతవరకు ఏ కబురు లేదు. అలాంటి పరిస్థితుల్లో ఎలా ఉంటుందండి! చిన్నప్పుడు ఈ పద్యాలన్నీ మాకు పాఠంగా ఉండేవి. ఈ పద్యాలను కంఠస్తం చేస్తుండేవాళ్ళం. *"ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో"*, ఇలాంటి మంచి పద్యాలన్నీ కంఠస్తం చేయించేవారు. అంత చక్కనైన పద్యాలన్నీ మనకి ఊరికే అర్థం తెలిస్తే చాలన్నట్టుగా ఉండేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కూడా లేవనుకుంటా.

ఈ పద్యం చదువుకుంటే భావనలోకి ఎంత బాగా చక్కగా మనం ప్రవేశించ గలుగుతున్నామో చూడండి! అందుకని చదువుకోవాలి బమ్మెర పోతన మహాత్ముని యొక్క పద్యాలు. తెలుగు రానివారు, తెలుగుదేశంలో పుట్టడం చాలా దురదృష్టం– సందేహం లేదు. ఎప్పుడూ చెప్తూ ఉంటాను. ఎందుకంటే, పోతన పద్యాలు చదువుకోలేరుగా వాళ్ళు! పోతన పద్యాలు చదువుకోకుండా తెలుగుదేశంలోనే పుట్టానుట అంటే ఒక మహోన్నతమైన అవకాశాన్ని అట్లా చేజేతులా జార విడుచుకుంటారని అర్థం. భాగవతం సంస్కృతంలో రాసి ఉండచ్చు. కాని తెలుగులో రాసినదాంట్లో ఉండేటువంటి రసము, భక్తిరసము ఇంక ఎక్కడా కనపడదు. ఇంక ఏ గ్రంథంలోనూ కనపడదు. అంచేత, భాగవతం అంటే తెలుగు భాగవతమే! అది తెలిసిన వారికే తెలుస్తుంది దాని రుచి. అందులో ఇలాంటి పద్యాలు కోకొల్లలు ఉంటాయి మనకి. ప్రతి ఘట్టంలోనూ ఉంటాయి. వీటన్నిటినీ పూర్వకాలంలో వాళ్ళు కంఠస్తం చేసేవాళ్ళు. పొద్దున లేచిన దగ్గరనుంచి కార్యక్రమాలు చేసుకుంటూ వరుసగా ప్రహ్లాద ఉపాఖ్యానం, వామనోపాఖ్యానం,

గజేంద్రమోక్షం, రుక్మిణీకళ్యాణం మొదలైనవి చదువుకోవడం ఉండేది. పుస్తకాలు పట్టుకొని చదువు కోవడం కాదు, నోటికొచ్చేస్తుండేవి. చిన్నప్పుడే అమ్మమ్మలు, తాతమ్మలు, తాతలు పక్కల్లో పడుకోబెట్టుకొని పిల్లలకి నేర్పించేవాళ్ళు. మేమంతా అలానే నేర్చుకున్నాం. *"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై"*. ఇప్పుడు అలా చెప్పటానికి తండ్రికీ రాదు, తాతకూ రాదు కదా!

మనం ఒక సద్గురువు పరంపరకు సంబంధించి, ఆయన ఆశ్రయంలో జీవించి జీవితాల్ని వికసింపచేసుకుందాం అనుకునేటువంటి వాళ్ళందరంకూడా తప్పక ఇలాంటి చేతనోద్ధారకమైన పద్యాలు చదువుకోవాలి. అంటే, అవి మన చేతస్సును చక్కగా ఉద్ధరిస్తాయి. మనలో ఉన్నటువంటి కల్మషాలన్నీ తీసేస్తాయి. ఇలాంటి పద్యాలు చదువుకోవాలి. చదువుకోవాలంటే, మనకి రాదు కాబట్టి టీక కూడా ఉంటుంది. టీక ఉన్నది తెలుసుకుంటే మనం కొంచెం కుస్తీపట్టచ్చు. కొన్నాళ్ళు అట్లా చేస్తే ఆ తర్వాత నెమ్మదిగా పద్యాలు విడమరచి చదువుకుంటే అర్థమైపోతాయి పోతన పద్యాలు. ఇప్పుడు నేను చదువుతుంటే మీకు అర్థమౌతున్నాయి కదా! ఎక్కడ ఆపాలో తెలియకుండా చదివామనుకోండి, ముందుది వెనకాల, వెనకది ముందు కలిపేస్తే, అప్పుడు అర్థం కాదు. లేకపోతే పద్యాలు బాగా అర్థమవుతాయి. కొన్ని కొన్ని పద్యాలు క్లిష్టంగా ఉంటాయి. ముందు అర్థమయ్యే పద్యాలన్నీ బాగా చదువుకోవచ్చు. అర్థం కానివి టీకతో చదువుకోవచ్చు. ఇలా కొంత ప్రయత్నం చేయచ్చు. ఇలాచేస్తే ఏం జరుగుతుంది అంటే, ఒక్కటి కచ్చితంగా చెప్పగలను. మనం ఎంతో సాధన చేసి, మనలో ఉండేటువంటి ఈ

చైతన్యాన్ని శుద్ధపరుచుకొని, కిల్బిషాలన్నీ వదిలించుకుందామనే ప్రయత్నం ఉంటుందే, అవి కేవలం వీటి పారాయణ వల్ల, చాలా అర్థవంతంగా పారాయణ చేస్తే కరిగిపోతుంది. అంత అద్భుతమైన పద్యాలు ఇవి. ఎంచేత, *"పలికించెడివాడు రామభద్రుండు"* కదా! సాక్షాత్తు శ్రీరాముడే ఇదంతా రాశాడు, నేను ఊరికే వాహికగా ఉన్నాను. I am only a medium అన్నాడు శ్రీ పోతన. గుర్తుపెట్టుకోండి మాస్టరు సి. వి. వి. గారు వచ్చిన తర్వాత ఈ mediums వచ్చినాయి అని అనుకోబోకండి. ఎప్పుడూ భక్తులందరూ భగవంతుని mediumలే. భగవంతుడికి భక్తుడు వాహిక. అలాంటి వాహిక లోంచి ఇలాంటి పద్యాలు మనకి జాలువారినప్పుడు... అది పలికింది భగవంతుడే. అందుకనే, అన్నమాచార్యుల కీర్తనలు కూడా మనకి అంత బాగుంటాయి. ఎంచేత? ఆయనే కూర్చుని రాయించుకున్నాడు కాబట్టి.

"చెప్పదు తల్లికిం దలఁపుజిక్కు దిశల్ దరహాస చంద్రికం
గప్పదు వక్త్రతామరస గంధసమాగత భృంగ సంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొన దురోజ పరస్పరసక్త హారముల్
విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్."

ఒక కన్యకు అత్యంత సన్నిహితమైన వారు ఎవరండి? ఒక most confidential, చాలా అంతరంగికమైన విషయాలు తెలియపరచాలంటే ఒక కన్య ఎవరికి చెప్పుకుంటుంది? అందరి తోను చెప్పుకోలేదు కదా! చాలా సన్నిహితమైన స్నేహితురాలు ఉంటే చెప్పుకుంటుంది. లేదా తల్లికి చెప్పుకుంటుంది. ఎందుకని? తల్లే దగ్గర, తండ్రి కాదు. తల్లి ఎలా ఉండాలంటే, తన సంతానం

తనతో communicate చేయటానికి ఉత్సహించేట్టుగా తయారు చేసుకోవాలి పిల్లల్ని. అంతేగాని, అమ్మకి చెప్తే కోప్పడుతుంది అని ఉందనుకోండి, అమ్మకి చెప్పడం మానేశారంటే పిల్లలు ఆ తల్లి పోషణ సరిగ్గా లేదని అర్థం. తల్లికి చెప్పకుండా తండ్రికి చెప్తున్నారంటే... తండ్రి దగ్గర అవ్వటం అనేది ఎప్పుడు జరుగుతుందంటే, తల్లి అంత దగ్గరగా చేరదీయక పోవటం వల్ల. తల్లి క్రమశిక్షణ పేరున మాటిమాటికీ వద్దు, కాదు, కూడదు, ఇట్లా చెప్తూ ఉందనుకోండి అప్పుడు నెమ్మదిగా పిల్లలు తండ్రి పంచన చేర్తారు. మామూలుగా ఏదైనా పిల్లలు తల్లికే చెప్పుకుంటారు. మొట్టమొదట తల్లి, తర్వాత తండ్రి.

ఇక్కడ ఏం జరుగుతోంది? *"చెప్పదు తల్లికిం దలఁపుజిక్కు దిశల్"* –రకరకాలుగా చిక్కుగా లోపల భావాలు వస్తున్నాయి కదా! కొన్ని భావాలు ఇప్పుడు చెప్పాం కదా! మూడు, నాలుగు పద్యాలు. అమ్మా! నాకిట్లా బాధ కలుగుతోందమ్మా, నేనిట్లా చేశాను అని చెప్పదు, ఒకటి. ఆవిడ అర్థం చేసుకుంటుందో లేదో, రెండు. ఆవిడకి tension వస్తే, ఆమె వెళ్లి నాయనకి చెప్పేస్తే? లేకపోతే, తల్లికి కొడుకు దగ్గర. అందుకని కొడుకుకి చెప్పేస్తే అదంతా పాడైపోతుంది. మాములుగా ఏం జరుగుతుందంటే, తల్లికి కొడుకు, తండ్రికి కూతురు దగ్గరగా ఉంటూ ఉంటారు. తండ్రి కూతురు మీద ఎక్కువ పెట్టుకుంటూ ఉంటాడు. తల్లి కొడుకు మీద ఎక్కువ పెట్టుకుంటూ ఉంటుంది. సహజగుణాలివన్నీ. అందుకని ఏదైనా ఉంటే తల్లి కూతురుతో share చేసుకుంటుంది, కూతురు తల్లితో share చేసుకుంటుంది. తల్లి కోపిష్టిది అనుకోండి, ఇంక వాళ్ళకి పాపం దారుండదు. తండ్రి కోపిష్టి అనుకోండి, తల్లి

అన్నా ఉందనుకోవాలి. ఇద్దరూ కోపిష్టి అనుకోండి, ఇక ఏం చేయలేం! ఇంక ఊళ్ళో చెప్పుకోవాలి అంతే! అలాంటి పరిస్థితి కలగకూడదు కదా! పిల్లలకి అలాంటి పరిస్థితి కలగకూడదంటే, తల్లితండ్రులు వాళ్లతో ఎలా ఉండాలండి? They must be the friendliest parents. స్నేహితులను మరిపించేట్లుగా ఉండాలి తల్లితండ్రులు తప్ప, ఆంక్షలు పెట్టి, క్రమశిక్షణ అనే బాధలు పెట్టి, మానసికంగా వారికి భయం కలిగించి, లేకపోతే సాన్నిహిత్యాన్ని కోల్పోయినట్లయితే అటుపైన ఆ పిల్లలు ఈ తల్లితండ్రులతో ఏమీ చెప్పుకోరు. చెప్పుకోకపోవటం వల్ల పిల్లలు ఏ దిశగా వెళ్తున్నారో, తల్లితండ్రులకు కూడా తెలియదు.

ఇప్పుడు ఏం జరిగింది? ఈవిడ రాజకన్య. రాజులకి రహస్యమెక్కువ. అదొకటి ఉంది కదా! అందుకనే, రాజరహస్యం అంటూ ఉంటాం. ఒకటి గుర్తుపెట్టుకోండి. సుక్షత్రియుడు లోపల ఏం ఆలోచిస్తున్నాడో ఎవ్వరికి ఏం తెలియదు. పురాణాలు చదువు కుంటే బాగా తెలుస్తాయి. భారతం చదువుకుంటే అందులో వ్యాసుడు చెప్తాడు. బ్రాహ్మణుడి ఆలోచనంతా బయటే ఉంటుంది, రాజు ఆలోచనంతా లోపలే ఉంటుందని ఒక కథ చెప్తారు ఉదంకోపాఖ్యానంలో. ఇప్పుడు ఆ కథలోకి వెళ్ళవద్దు, మనకు ఈ కథ సాగాలి కాబట్టి. అందుకనే, రహస్యగోపనము అనేది రాజుల్లో చాలా ఎక్కువ. అందుకనే రాజరహస్య మంటారు. వాళ్ళు ఏదీ బయటకి చెప్పరు. వాళ్ళు బయటకి చాలా ప్రశాంతంగా నవ్వుతూ ఉంటారు. లో లోపల చాలా అలోచిస్తూ ఉంటారు. దానికి విరుద్ధంగా ఉంటాడు బ్రాహ్మణుడు. బయటకి ఢాం ఢూం అంటూ ఉంటాడు. లోపల చాలా ప్రశాంతంగా ఉంటాడు. ఎందుకంటే,

చిన్న చిన్న చిరాకులకు ఊరికే టపాకాయ పేలినట్టుగా పేలిపోతూ ఉంటాడు. కొంచెం ఉప్పు ఎక్కువైతే అరుస్తూ ఉంటాడు, కొంచెం కారం తక్కువైతే అరుస్తూ ఉంటాడు. కొంచెం ఏదో జరగాల్సిన పని చిన్న చిన్నవే సరిగ్గా జరగకపోతే ఢాం, ఢూం అంటూ ఉంటారు. వీళ్లంతా బయటకి ఢాం అనేవాళ్ళు, లోపల హాయిగా ఉంటారు. బయటకి చాలా calmగా ఉండేవాళ్ళకి సముద్రం లోపల ఉండే అలజడి ఉంటుంది. అందుకనే మనకి సామెత చెప్తారు, గంభీరమంటే సముద్రమే అని. అది లోతుల్లో విషజంతువుల దగ్గర నుంచి అన్నిటిని లోపల దాచుకొని, బయటకి ఆహ్లాదంగా మనకి అలల్ని ఇస్తూ, చల్లని గాలినిస్తూ ఉంటుంది. లోపలంతా హాలాహలం. ఇప్పుడు ఈ రుక్మిణీదేవి అంతా లోపల పెట్టేసుకుంది రాజకన్య అవ్వటం చేత !

అంటే, కొంచెం అట్లా దీనంగా మొహం పెట్టుకుందనుకోండి. "ఏమిటే? అలా ఉన్నావు?" అని అడుగుతారు కదా! అందుకని, బయటకి నవ్వుతూ "దరహాస చంద్రికలు", అంటే చిరునవ్వు చిందిస్తూనే ఉందండి బయట. లోపల ఇంత బరువు పెట్టుకొని, బయటకి చిరునవ్వులు చిందిస్తూ ఉందిట.

*"గప్పదు దరహాస చంద్రికం వక్త్రతామరస గంధసమాగత భృంగ సంఘమున్ రొప్పదు"* – అంటే ఏమిటో? ఆమె అందానికి తన చుట్టూ ఉన్న ఉద్యానవనాల్లో ఉండే ఆ తేనెటీగలు, అవి ఇవి వచ్చి చేర్తుంటే, ఆ ముంగురులకు అవి కూడా తోలదట. *"నిద్రం గైకొనదు"*– సమస్య ఉంటే నిద్రపోయేవాళ్ళు ఎట్లా ఉంటారు చెప్పండి! సమస్యుంటే వాడు నిద్రపోయాడట అంటే వాడికి సమస్య కాదని అర్థంకదా! ఏమిటి సమస్య? తన జీవన సమస్యే.

జీవన మరణ సమస్య అంటారు చూశారా! life and death issue ల్లాంటివి వచ్చినప్పుడు నిద్రపోలేరు కదా! ఇంట్లో ఎవరికో అంత గొప్పగా లేదట, కొంచెం ఇబ్బందిగా ఉంది, ఏమో ఏం జరుగుతుందో అన్నట్టుగా ఉండేవారు నిద్రపోరుకదా! "నిద్రఁ గైకొనదు" – నిద్రరాదు. *"ఉరోజ పరస్పరసక్త హారముల్ విప్పదు"* –గుండెల మీద పడినటువంటి హారాలు చాలా ఉంటాయి, రాజకుమారి కదా! రేపు పెళ్లి అవుతుందట అంటే, ఇవ్వాళ చాలా సింగారం చేస్తారు. ఆ గొలుసులన్నీ చిక్కుబడిపోయినాయి. ఆ చిక్కులు తీసుకోవట్లేదట. ముంగురుల చుట్టూ తేనేటీగలు తిరుగుతున్నాయట. భ్రమరములంటాము, వాటిని పంపించదట, అమ్మతో చెప్పుకోదట.

*"సక్త హారముల్ విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్"* –కృష్ణుడు వచ్చే మార్గము వైపు సూపు. "సూపు" అంటే మనకొక ఇల్లుందనుకోండి. అక్కడ gate దగ్గర ఇంటాయన వస్తుంటే ఇంటావిడ gate వైపే చూస్తూ ఉంటుంది కదా! ఇప్పుడు flat లు కాబట్టి ఆ గొడవ లేదు! కనపడదు gate లోకి వస్తే! మామూలుగా ఏం జరుగుతుందండి? అట్లా gate వైపే చూస్తూ ఉంటారు మనకి కావాలసిన వాళ్ళు వచ్చేవరకు కదా! అలా మనసు పెట్టుకుంటారు. మాములుగా ఎలా ఉంటుందంటే, ఇప్పుడు మనం ఇంట్లో కూర్చున్నామనుకోండి. మన పిల్లవాడే ఉద్యోగం చేసుకొని ఇంటికి వస్తున్నాడనుకోండి! ఈ రోజుల్లో ఉద్యోగాల నుంచి అందరూ late గా వచ్చేవాళ్ళే కదా! ఎవరూ ఐదు గంటల కల్లా office మూసుకుని ఇంటికి వచ్చే రోజులు లేనేలేవు. రాత్రి ఎనిమిదింటిదాకా, తొమ్మిదింటిదాకా, పదింటిదాకా. ఎందుకండి

అంతసేపు ఉద్యోగాలు? వాడు వస్తున్నాడు అంటే... ఇంట్లో ఉండే వాళ్ళు అబ్బాయి వస్తున్నాడండి అని వాళ్ళ అమ్మగారు, మా ఆయన వస్తున్నారండి అని hornనే గుర్తుపట్టేస్తారు. అన్నీ అదే కారణం. ఈ horn వాళ్ళకి తెలుస్తుంది తెలుసా! అట్లాగే ఎవరి భర్త scooter sound భార్యకి తెలుస్తుంది, భర్త car horn భార్యకి తెలుస్తుంది. అట్లా ఉంటాయి కదా! ఎంచేత? వాళ్ళ కోసం చూసేటువంటి ఆ ఎదురు చూపుందే, అది కారణంగా వాళ్ళు ఉండడం భౌతికంగా ఇక్కడ ఉంటారు గాని, కారో, scooter లోపల సందు తిరిగి వస్తుందో అక్కడే ఉంటుంది మనకి. ఇక్కడకొచ్చి gate దగ్గర horn కొట్టినా వినని వాళ్ళు ఉన్నారనుకోండి, లోపల అలాంటి ఇంట్లోకి వెళ్ళటంకన్నా అలా వెళ్ళిపోతే సుఖం కదా! అంటే, మనం ఇంటికి వచ్చామో లేదో దానికి పెద్ద తేడా లేదనుకోండి, అలాంటి ఇల్లు ఎందుకండి?

ఇక్కడ విషయమేమిటి? కృష్ణుడు వస్తున్నాడేమో అని రాజప్రాసాదాల పైకెళ్ళి అక్కడ నుంచి అలా చూస్తూ ఉంటుందట. *"కృష్ణమార్గగత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్"*. ఇది మనకి చాలా ముఖ్యమైనటువంటి విషయం. కృష్ణుడు వచ్చే మార్గం ఒకటి ఉంది కదా! మనలో కూడా కృష్ణుడు వచ్చే మార్గమున్నది. ఆ మార్గం వైపు కన్నులు తిప్పి చూస్తూ ఉండడం అనేది సాధన. ఆ మార్గమెలా ఉంది? నీ శిరస్సు లోంచే దిగివస్తాడు. నీ సహస్రారమందు నారాయణుడై ఉన్నవాడు, నీ లోపలికి వాసుదేవుడై దిగి వచ్చిన వాడు, అతడు హరియై నీకు హృదయంలో దర్శనం ఇస్తాడు. అంచేత, నువ్వు ఎటు చూస్తూ ఉండాలి? అంతరంగం చేరి, అంతరంగమందు ఊర్ధ్వముఖుడవై ఉండాలి. అంటే, కన్నులు

మూసుకొని నీవు హృదయంలో ఉన్నట్టుగా భావన చేసుకొని, ఈ ఊర్ధ్వము అయినటువంటి శిరస్సు నుండి కృష్ణుడు వచ్చేటువంటి కాంతుల కోసం వేచి ఉండాలి. ఎందుకంటే, కాంతి దర్శనం అవుతుంటే, ఆ తర్వాత కృష్ణ దర్శనం అవుతుంది. కృష్ణుడంటే కనపడని వాడు అని అర్థం. కనపడని వాడు ఎలా కనిపిస్తాడు? అతని కాంతి దర్శనం అయితే అతను వచ్చినట్లు లెక్క. కృష్ణ కాంతి అంటే నల్లనీలం లాగా ఉంటుంది కదా! అలాంటి కాంతి నువ్వు చూడటం అనే విషయమునందు నీకు బాగా రుచి కలిగితే, ఇంక ఇవన్నీ సరిగ్గా ఉందా, లేదా? ఈ దండ, ఈ గుండి సరిగ్గా పెట్టుకున్నామా లేదా? సరిగ్గా దువ్వుకున్నామా? ముందుకు పడి పోయిందా? ఇవన్నీ ఉండవు కదండి భక్తుడికి! అంటే, భక్తుడు భగవంతుని కోసం ఎదురు చూస్తున్నాడనుకోండి... అంటే, రుక్మిణీదేవి, కృష్ణుడు. ఆమె భక్తురాలు, ఆయన భగవంతుడు. భగవంతుడిని పిలిచింది భక్తురాలు.

అగ్నిద్యోతనుడు గురువులాంటివాడు కదా! అతడి ద్వారా కబురు పంపించింది. సద్గురువే కదా సంధానకర్త! కిందటి సారి కూడా మీకిక్కడ చెప్పాను. ఆయన బ్రహ్మగారు. అంటే, మనకి విష్ణువుతో పెళ్లి కుదురుస్తాడు. అంచేత, ఆయన చేతే కబురు పంపించింది. ఆయన చక్కగా ఆయన కార్యం నిర్వర్తించాడు. తప్పక నువ్వు స్వీకరించవలసిన స్త్రీ ఆమె అని, యువతి ఆమె అని, కన్య ఆమెని. ఆయన అలాగే అన్నాడు కదా! కాబట్టి, తండ్రి కుదిర్చిన తర్వాత అటుపైన జరగవలసిందేమిటంటే, భగవత్ స్పర్శ కోసం గురువు సహకరిస్తూ ఉంటాడు. మనకి భగవత్

స్పర్శ కలగాలనేటువంటి తపన మనకన్నా మన సద్గురువుకు ఎక్కువుంటుందండి. అదొకటి గుర్తుపెట్టుకోండి. ఎందుకని? తను ఇద్దరి మధ్యా మధ్యవర్తిగా వర్తిస్తున్నాడు కదా! మధ్యవర్తిగా వర్తిస్తున్నటువంటి సద్గురువు తనని ఆశ్రయించిన ఒక సదాచార సంపన్నుడైన శిష్యునికి భగవత్ స్పర్శ కలగాలనేటువంటి సంకల్పం చేయటమే కాకుండా, తదనుగుణమైన ప్రయత్నం కూడా చేస్తూ ఉంటాడండి.

మనం సద్గురువును ఆరాధన చేసి, బ్రహ్మము నందు లగ్నం చేస్తాం మనస్సు. *"గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః".* సద్గురువు ద్వారానే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, దానికి అతీతమైనటువంటి బ్రహ్మమును నేను దర్శనం చేసుకుంటాను. వారందరి రూపంలోనే నాకు నా గురువు సాక్షాత్కరించి, నాకా మార్గాన్ని దర్శనం చేసే విధానాన్ని నేర్పాడు అని తెలుసుకుని ఉండాలి.

ఇప్పుడు ఈమె ఏం చేస్తోంది? అలా కృష్ణుడు వచ్చే దారి పక్కకు చూస్తోంది అంటే రెండు రకాలుగా చెప్పుకోవచ్చు మనం. ఒకటి, అలాగ ఇందాక చెప్పినట్టుగా ఆ దారి వైపే బాగా రాజప్రాసాదంలో పైగవాక్షానికి వెళ్ళిపోయి, ఆ ఉన్నతమైన గవాక్షం లోంచి, రాజమార్గంలో ఎవరొస్తున్నారో చూస్తూ ఉన్నది అని. రెండోది, లోపల శ్రీకృష్ణుని యొక్క స్పర్శ కోసం వేచి ఉండడం. మూడవది, మనకి అలా జరగటం కోసం మనం అంతరంగమనే దాంట్లో ప్రవేశించి, దైవాన్ని ఆశ్రయించినవాడు బాహ్యమందు ఎలా ఉంటాడో అనే విషయం కూడా ఒకటి చెప్తోంది ఈ పద్యం మనకి.

అంటే, మాటిమాటికీ అమ్మతో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండదు. ఎప్పుడైతే భగవత్ దర్శనమునందు బాగా అనురక్తి కలిగి, ఒక విహ్వాలమైనటువంటి స్థితి ఉన్నదనుకోండి, ఊరికే కూర్చుని పోచు కబుర్లు చెప్పుకోము కదండి!

మనకిది ఊరికే past time– అప్పుడప్పుడు గురువుగారు కార్యక్రమం చెయ్యకపోతే, ఆయనేమన్నా అనుకుంటాడేమో అని ఒక పరిస్థితి! లేదా, ఏదో కొంత దానియందు అనురక్తి ఉంది గాని, ఇంక మిగతా విషయములయందు కూడా మనకి అనురక్తి ఉంది. ఏం సందేహం లేదు! వేలువిడిచిన బావమరిది కూతురు పెళ్లికెళ్లామనుకోండి మనం! అనురక్తేగా! సంఘమందు అనురక్తి ఉన్నప్పుడు, దైవమునందు అనురక్తి ఉన్నప్పుడు, ఆ రెండిటికి తేడా ఈ పద్యాల్లో తెలుస్తుంది. ఆవిడ ఏం చేస్తోంది? సరిగ్గా తల దువ్వుకోవట్లేదు. అలాగే, నగలు సర్దుకోవట్లేదు. వాళ్ళతోను వీళ్ళతోను ముచ్చటించటంలేదు, ఏమి చేయట్లేదు. ఎందుకంటే, అనురక్తి ఎక్కువగా ఉంది.

అశోకవనంలో అమ్మవారిని హనుమంతుడు చూస్తాడు. ఎలా ఉంటుంది ఆవిడ? నారచీరలు ధరించి, నగలన్నీ చెట్లకి పెట్టేసి, శిరోజములు కూడా సంస్కరించుకోకుండా, అట్లా రామస్మరణ చేస్తూ, తదేక దృష్టితో ఉన్నటువంటి అమ్మవారిని చూస్తాడు హనుమంతుడు! అంటే, భక్తుల లక్షణాల్లో ఇల్లాంటివి, అంటే బాహ్యమైనటువంటి విషయములయందు ఆసక్తి తగ్గుతూ, అంతరంగ పరమైనటువంటి విషయములయందు ఆసక్తి పెరిగి ఉండడం చేత, బాహ్యవిషయములందు శ్రద్ధగా వాటియందు

వర్తించడమనేది ఉండదు అని చెప్పుకుంటానికి ప్రాతిపదికగా ఇలా ఒక పద్యం ఇచ్చారు.

"తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడువదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జనదన్న మేమియుం
గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్."

ఆవిడకి కళ్ళవెంట నీళ్ళు వస్తున్నాయట. అవి తుడుచుకోవట్లేదట. *"కొప్పుఁ జక్కఁగా ముడవదు"* – పెళ్లికూతురు ఎన్ని రకాలుగా అలంకారం చేసుకోవాలి? అయినా ముడుచుకోదు. *"నెచ్చెలిం గదిసి ముచ్చటకుం తగదు"* – రాజప్రాసాదంలో చాలామంది చెలులు ఉంటారు. వాళ్లతో చాలా కబుర్లు సరదాగా చెప్పుకోవాలి కదా! ఎవర్నీ పిలవదట, ఎవరితోను మాట్లాడదట. *"అన్న మేమియుం గుడువదు"* – అవన్నీ ఏర్పాటు చేసేస్తారండి. మనమంతా ఇంతింత చిన్న చిన్న ఇల్లు కాబట్టి అందరం అక్కడే ఇరుక్కుంటాం. రాజప్రాసాదం కదా! రాకుమారి గారికి భోజనం అంటే ఓ పదిమంది వచ్చేస్తారు. అన్నీ అక్కడ పెట్టేస్తారు, వాళ్ళు వెళ్ళిపోతారు.

*"దన్న మేమియుం గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్ నొడువదు"* – పెద్ద వాళ్ళందరూ ఇంట్లో పావురాలు పెంచుకుంటారు కదా! రామదాసు కథ విన్న తర్వాత ఎవరూ పావురాలు పెంచడం మానేశారు! పావురాన్ని14 రోజులు పంజరంలో పెడితే, పధ్నాలుగు ఏళ్ళు జైల్లో పెట్టారని మనవాళ్ళు ఏదో ఒక విషయం చెప్పారు. ఉన్న కథ నాకు తెలియదు గాని

పావురాలన్నీ బతికిపోయినాయి! ఇదివరకు ఏం చేసేవారు? ఓ పావురాన్ని పెంచి, దానికి పద్యాలు చెప్పించి, అది ఆ పద్యం తెలియచెప్తుంటే తను వింటే ఆనందం కదా! మనం మాములుగా ఒక పది పావురాలు పట్టుకొని, ఓ పంజరంలో పెట్టుకొని, దానికి "రామ రామ" అని నేర్పిస్తే అది "రామ రామ" అంటే, మనం విని ఊరుకుంటామా? వచ్చిన ప్రతివాడికి అది వినిపించాల్సిందే! అట్లా రుక్మిణీదేవి పద్యాలు చెప్పేది పావురాలకి. చెప్తే, అవి మళ్ళీ తిరిగి ఆ పద్యాలు చెప్పేస్తుండేవి. అలాంటిది ఇప్పుడు చేయటం మానేసిందటండి. *"గీరముఁ జేరి"*– కీరమంటే పావురం. *"పద్యమున్ నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్"* – ఎవ్వరితోనూ ఇంక ఏమీ లేదని అనుకుని, అట్లా దీనంగా, మౌనంగా ఆయన రాకకోసం ఎదురుచూస్తూ అలా ఉండిపోయిందట.

"మృగనాభి యలఁదదు మృగరాజ మధ్యమ
జలముల నాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి
పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన
హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ
తొడవులు దొడవదు తొడవుతొడవు"

*"మృగనాభి యలఁదదు మృగరాజ మధ్యమ"* – చక్కగా అద్దుకోదట బొట్టు. *"జలముల నాడదు జలజగంధి"* అంటే నీళ్ళ

పోసుకోవటం కూడా interest లేదు. *"ముకురంబు సూడదు ముకురసన్నిభ"* – చాలాసార్లు అద్దంలో చూసుకోవాలి కదా పెళ్లికూతురు! పెళ్ళికూతురు కాకపోయినాగాని, యుక్తవయస్సు వచ్చినటువంటి కన్య ఎన్నిసార్లు అద్దంలో చూసుకుంటుంది? ఈ రోజుల్లో ముసలాళ్ళే అద్దాల్లో చూసుకుంటూ ఉంటారు కదా! ఎక్కడ అద్దం కనబడితే అక్కడ మన్ని చూసుకోవడం అనేది మనం చేస్తూనే ఉంటాం కదా! Lift లో అద్దం, bedroom లో అద్దం, bath–roomలో అద్దం, drawing room లో అద్దం, trainలో అద్దం. అన్నీ చోట్లా అద్దాలే కదా! ఎందుకంటే, బాగా చూసుకుంటాం మన్ని మనం అని! అంటే ఆత్మదర్శనం అన్నమాట! అలా ఏర్పాటు చేసినా ఇక్కడ పెళ్ళికూతురు అయినప్పటికి కూడా ఈమె *"ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి"* – పూలు పెట్టుకోవట్లేదు.

*"వనకేళిఁ గోరదు వనజాతలోచన హంసంబుఁ బెంపదు హంసగమన"* – ఆ కొలనులో హంసలు ఉంటాయి. ఆ హంసలతో ఆడుకోవడం, దానికేదో పెట్టడం, హంసల్ని పోషించడం అనేటు వంటి ఒక కార్యక్రమం ఉంటుంది బాగా మనకి సంపద ఉంటే. కొంతమంది ఏదో చిన్న చిన్న గ్లాసుతొట్టెలు పెట్టుకొని అందులో చేపల్ని పోషిస్తూ ఉంటారు కదా! అంచేత, హంసల జోలికి పోవట్లేదు. వాటికేమీ అన్నం పెట్టట్లేదు, వాటిని పట్టించుకోవటం లేదు.

*"లతలఁ బోషింపదు లతికాలలితదేహ"* – చాలా లతవంటి సున్నితమైన, సన్ననైన దేహం కలిగినటువంటి రుక్మిణీదేవి, ఆ లతల దగ్గరికి వెళ్ళటం గాని, వాటిని సవరించటం గాని, వాటి

పువ్వుల్ని చూడడం గాని, వాటికి పోషణ చేయటం గాని చెయ్యట్లేదు. వీళ్ళందరూ ఏమిటంటే వాళ్ళు చెయ్యక్కర్లేకపోయినా, వాళ్ళు ఉల్లాసంగా ఉంటే మామూలుగా ఇలాంటివి చేస్తారు. ఇంతమంది పనిమనుషులున్నా మన పని మనం చేసుకుంటూ ఉంటాం మనకి ఉల్లాసంగా ఉంటే కదా! నీరసంగా ఉంటే, ప్రతి పని పనిమనిషి చేస్తుంది కదా అని వదిలేస్తూ ఉంటాం! పనిమనిషి ఉంటే, మన పని మానేయమని ఎవరన్నా చెప్పారా! ఇది పనిమనిషి చేస్తుంది కదా అని అనుకుంటుంటే, మన పని పనిమనిషి చేసిందానికిను, మన పని మనం చేసుకున్నదానికిను చాలా తేడా ఉంటుంది. మనము ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్నామనుకోండి, మనమే చేసుకుంటాం. ఇక్కడ పరిస్థితి ఏమిటి? చాలామంది ఉన్నప్పటికీ, ఈమె ఉత్సాహంగా చేస్తుండేది ఇది వరకు ఇవన్నీను. పావురంతో మాట్లాడటం, హంసల్ని పెంచటం, పూలమొక్కల్ని పోషించటం – ఇప్పుడు అవన్నీ మానేసింది.

*"తొడవులు దొడవదు తొడవుతొడవు"*– మామూలుగా మాటిమాటికి బట్టలు మార్చాలి కదా! స్త్రీలు ప్రత్యేకించి పురుషులకన్నా చాలాసార్లు వస్త్రాలు మారుస్తూ ఉంటారు. ఎందుకంటే, అలంకార గుణం అది. అది వాళ్ళకి సహజంగా ఉండడం చేత. మగవాళ్ళు ఒకసారి దుస్తులు వేసే లోపల, వాళ్ళు మూడు సార్లు దుస్తులు మారుస్తారు. వీళ్ళు సన్యాసల్లే పొద్దున వేస్తే, రాత్రి వరకు ఇందులోనే ఉంటారు. వాళ్ళు పొద్దున వేసింది మధ్యాహ్నం వెయ్యరు, మధ్యాహ్నం వేసింది సాయంత్రం వెయ్యరు, సాయంత్రం వేసింది రాత్రి కట్టరు. అందులో functions ఉన్నాయంటే, ఇంక చెప్పనే అక్కర్లేదు కదా! ఏవో రకరకాలుగా

మారుస్తూ ఉంటాం, అదొక సరదా. వస్త్రధారణమనేది స్త్రీ తత్త్వంలో ఉంది. అమ్మవారివన్నీ ఆవరణలే కదా! ఆవరణలకు పెట్టింది పేరు అమ్మవారు. ఏ ఆవరణాలు లేనివాడు అయ్యవారు, ఆయన దిగంబరుడు. ఆయనకు ఆవరణాలు ఏమీ లేవు. ఆవిడే ఆయనకి ఆవరణ. స్త్రీల విషయంలో మాటిమాటికీ వస్త్రాలు మార్చటమనేది న్యాయమే, అది గుర్తుపెట్టుకోండి. ఆ విషయంలో మనం కుల స్త్రీలను ఏ విధంగాను అపహాస్యం చేయాల్సిన అగత్యం లేదు. అది సహజమైన గుణం. అలా మార్చాలి కదా! అందులో పెళ్ళికూతురు కదా! అందులో చిన్నవయస్సులో ఉన్నటువంటిది కదా! ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా మార్చుకోవాలి. "తడవుతడవు" మార్చాల్సినటువంటి "తొడవులు" ఏమీ అసలు మార్చటం లేదు.

"తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవుమాలి యనుచు."

ఆ కమలాలు ఉండేటువంటి ఆ గృహంలోకి వెళ్లదట. *"గారవించి తన్నుఁ గరుణఁ గైకొన కరుణతో"* – తనను అందుకోవటానికి వనమాలి... "వనమాలి" అంటే తులసిమాల ధరించినవాడు. పుష్పమాల వేరు, వనమాల వేరు, తులసిదళం అది. ఆ బృందావనంలో కుంజవనం. కుంజవనం, బృందావనం అక్కడ ఏం పెంచుతారంటే, తులసిచెట్లు పెంచుతుంటారు. కృష్ణుడు వస్తాడని ఆ గోపికలందరూ ఎప్పుడూ వాటి దళాలన్నీ తీసి, దండలుగా కడ్తూ ఉండేవాళ్ళు. కృష్ణుడు ఎప్పుడూ పుష్పమాలలు

వేసుకోలేదు, తులసీమాలనే వేసుకున్నాడు. అంచేతే, ఆయన్ని వనమాలి అన్నారు. తులసిని అనుగ్రహించటం చేత విష్ణువుకి కూడా వనమాలి అని పేరు వచ్చింది. తులసి పేరు బృంద. అందుకని బృందావనము అన్నారు. తులసి అంటే పవిత్రమైనది అని తెలియచేస్తుంది, ఆమె పేరు బృంద. జలంధరుడి భార్య. ఆమె మహాపతివ్రత. లోక కళ్యాణార్థం ఆమె యెడల విష్ణువు ఒక రకంగా ప్రవర్తించి, అటుపైన అనుగ్రహించి, శాశ్వతంగా ఎప్పుడూ తన భక్తురాల్ని ధరిస్తున్నట్లుగా వనమాలి వేసుకుంటూ ఉంటాడు. అందుకనే,

*"వనమాలీ గదీ శార్‌ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ*
*శ్రీమన్నారాయణో విష్ణు ర్వాసుదేవో అభిరక్షతు."*

అనేటువంటి ఒక్క శ్లోకం 108 శ్లోకాల్లో అది ఒక్కటి చేసుకున్నా చాలని చెప్తారు. అది మహామంత్రం. అట్లా ఎప్పుడూ రక్షిస్తూ ఉండుగాక! అని విష్ణువును ప్రార్థించే చిట్ట చివరి శ్లోకం. అలాంటి వనమాల వేసుకునే ఈ కృష్ణుడు సాక్షాత్తు మహావిష్ణువే. "తగవు" అంటే ఇది న్యాయమైనది. అంటే, ఇలా రుక్మిణి చెప్పినట్లు చేయటం తగును అనిపించట్లేదేమో ఆయనకి. అతనికి "తగవు మాలి" అన్నది. *"గరుణన్గైకొన్న"* – నేను కవి కాదు, పండితుడిని అంతకన్నా కాదు కాని కరుణ అన్న పదము వీటిలో చాలా సందర్భోచితంగా కనిపిస్తున్నది. ఎందుకంటే, కరుణ ఎక్కడ ఉంటుందంటే, రక్షించడం, ఆదుకోవడం అనేటువంటి, ఒక లక్షణం కలిగిన వాడు దైవం. ఆర్తితో పిలిస్తే ఆదుకోవాలి. మరి తప్పా, రైటా అనే ప్రశ్న కాదక్కడ. తప్పా, రైటా అని మీమాంస చేస్తే అతను

దైవం కాదు. తప్పో, రైటో! ఆర్తితో పిలుస్తోంది. తప్పైతే తర్వాత సరిదిద్దుకుంటాను. ముందు రక్షిస్తాను. రైటైతే ఎలాగు రక్షించాలి. అందుకనే, "కారుణ్యపయోనిధి" అంటాం రాముడిని కదా! కారుణ్యపయోనిధి కదా దైవము. అందుచేత, కరుణ ఉన్నచోట ఇక్కడ రైట్లు, తప్పులు ఏమున్నాయండి! మీకు ఎదుటి వాడియందు దయ, కరుణ, ప్రేమ ఉంటే, అప్పుడు నువ్వు తప్పులు చూడవు. విభీషణుడు శరణు కోరితే తప్పా, రైటా? చూచాడా రాముడు. చాలామంది రక్షణ ఇవ్వటం తప్పన్నారు. హనుమ రైటంటూ కారణాలు తెలిపాడు. రాముడు ''తప్పో, రైటో! ముందు శరణు ఇస్తాను, అది నా లక్షణం అన్నాడు.'' అందుకనే శ్రీరామ రక్ష! సర్వ జగద్రక్ష! దైవము కారుణ్యమూర్తి అవ్వటం చేత శరణు కోరిన, శరణు ఇవ్వాలి. కరుణ లేకపోవటం చేతనే ఇది న్యాయం కాదు అనే ఉద్దేశ్యంతో ఈయన రావడం లేదు అనేటువంటి భావనతో ఏమీ అలంకరించుకోకుండా, అన్యమైన విషయములయందు ఏ మనస్సు పెట్టకుండా ఆ విధంగా కృష్ణుడు గూర్చి భావన చేస్తూ, అతడు వస్తూ ఉండే దారివైపు చూస్తూ ఉండిపోయింది.

"మలఁగున్ మెల్లనిగాలికి బటురట న్మత్తద్విరేఫాళికిం
దలఁగుం గోయిలమ్రోఁతకై యలఁగు నుద్యత్కీరసంభాషలం
గలఁగున్ వెన్నెలవేఁడిమి న్నలఁగు మాకందాంకుర చ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానల శిఖా దోదూయమానాంగియై."

*"మలఁగున్ మెల్లనిగాలికిన్"* – అలా చల్లగా గాలి వస్తే కృష్ణుడు వచ్చాడేమో అని కంగారు పడిపోతోందిట. ఓ చల్లని గాలి ఉన్నట్లుండి వచ్చిందనుకోండి, అవన్నీ చిహ్నాలు

భగవంతుడు రావటానికి. Fan పెట్టుకొని continous గా చల్లటి గాలి తెప్పించుకుంటూ కృష్ణుడు వచ్చేశాడనుకుంటే అది అవివేకం! ఇలా బాగా ఉక్కగా ఉన్నప్పుడు, మధ్యలో తెలియకుండా ఉన్నట్టుండి ఒక్కసారి అలా పిల్లగాలి వచ్చి వెళ్లిందనుకోండి, అందరికి సేద తీర్చిందనుకోండి, అది భగవంతుని యొక్క ఆగమనంగా తెలియాలి. అలాగే, అంతరంగమందు ధ్యానం చేసేవారికి కూడా లోపల అలాంటి స్పర్శ లభిస్తూ ఉంటుంది. అప్పుడు అది భగవంతుని యొక్క సాన్నిధ్యము కలుగుతోంది అనే భావన ఒకటి చక్కగా ఏర్పడుతుంది. *"నృత్తద్విరేఫాలికిం దలఁగుం"* –తుమ్మెదలు చేసే అల్లరికి ఏ మాత్రం disturb కావట్లేదట. మనకు తుమ్మెదల వరకు అక్కర్లేదు, దోమలు చాలు కదా! తుమ్మెదలు వచ్చి, అలా ఘుంకారం చేస్తూ మన చుట్టూ తిరుగుతున్నాయి అనుకోండి. . . అంతకన్నా మించి దోమ తిరిగింది అనుకోండి, మనకి వెంటనే, చాలా త్వరగా, ఆ ధారణ, ఆ ఏకాగ్రత తగ్గిపోతుంది కదా! అది జరగట్లేదట ఆవిడకి. *"గోయిలమ్రోఁతకై యలఁగు"* – కోయిల కూస్తే చిరాగ్గా ఉంటుందటండి ఆవిడకి. మామూలుగా కోయిల కూస్తే బాగుండాలి కదా! కాని అంతకన్నా ఉత్తమోత్తమమైన విషయములయందు మనసు లగ్నమై ఉండడం చేత ఈ మామూలుగా బాహ్యప్రపంచంలో ఆహ్లాదం కలిగించేవేవీ ఆమెకు ఆహ్లాదం కలిగించట్లేదు అని అర్థం.

*"యలఁగు నుదృత్కీరసంభాషలం"* – తను వెళ్ళి పలకరించకపోతే పావురాలు వచ్చి పలకరిస్తున్నాయి. వాటికి అలవాటు చేయటం చేత, అది ఏం చేస్తుందంటే మనం వేరే ధ్యాసలో ఉన్నప్పుడు అవి వచ్చి పలకరిస్తుంటే మనకి ఎలా ఉంటుంది?

కోపం వచ్చేసేది పావురాళ్ళ మీద. *"గలఁగున్ వెన్నెలఁవేడిమి"* – వెన్నెల వేడిగా ఉంటుందటండి. వెండి వెన్నెల జాబిలి అంటాం కదా! అది వేడిగా ఎవరికి ఉంటుందో తెలుసా? బాగా తాపముతో బాధ చెందుతున్న వారికి వెన్నెల వేడిగా ఉంటుంది. *"న్నలఁగు మాకందాంకుర ఛ్ఛాయకుం"*– ఉద్యానవనంలో మామిడి చెట్టు నీడలో నిలబడటానికి కూడా ఆవిడికి ఇష్టంగా ఉండడం లేదట! మనసులో భావన అనేటువంటి శిఖలు అంటే జ్వాలలు, మనసు నిండా చాలా విపరీతంగా మదనపడుతూ *"మనోభవానలశిఖా దోదూయమానాంగియై"* – లోపల అలా నిప్పులా మంటలు మండుతున్నట్టుగా ఉంటే వెన్నెల ఏమి నచ్చుతుంది? పావురాల మాటలు, కోకిల పాటలు ఏమి నచ్చుతాయి? ఇలా తుమ్మెదలు తిరుగుతూ ఉంటే చుట్టూ చూసి ఆనందించేటువంటి పరిస్థితి ఎక్కడుంది? ఏమీ లేదుగా!

ఈ విధంగా, ఇంక ఆవిడ ఒకే ఒక భావమునందు మనసు లగ్నము చేసి, ఇంక ఇతర భావములు లేనటువంటి ఒక స్థితిలోకి వచ్చేస్తుంది. అనన్యచింతన అంటాం కదా! ఆహ్లాదకరమైన విషయములందు ఆసక్తి లేదు. తనయందు తనకి ఆసక్తి లేదు. ప్రకృతి యందు ఆసక్తి లేదు. పరిసరముల యందు ఆసక్తి లేదు. ఏమిటయ్యా ఆసక్తి అంటే ఆయన రావాలి, నన్ను తీసుకెళ్ళాలి. వస్తే కోరుకోవలసింది అదే! ఏదో పదిహేను నిమిషాలు ప్రేయర్ చేసి, నా duty నేను చేశాను, వస్తే వచ్చాడు, లేకపోతే లేదు, నాకు పనులు ఉన్నాయి, చేసుకుందాం అనుకునే పద్ధతుల్లో ఉంటే అది భక్తి కాదు కదా! "అయ్యో! ఈ పూట ప్రార్థన అయిపోయింది. మనకేమీ మాస్టరుగారి స్పర్శ అనిపించలేదే" అనేది కావాలి. ఇలా ప్రార్థనలు

అయిపోతూ ఉన్నాయి, పది సంవత్సరాలు, ఇరవై సంవత్సరాలు, ముప్పై సంవత్సరాలు అయిపోయింది, నలభై సంవత్సరాలు అయిపోయినవాళ్ళు ఉన్నారు. నా వరకు మాస్టరు గారు పరిచయమై నలభై నాలుగో సంవత్సరం నడుస్తోంది. "ఏమైందిరా? ఏమన్నా అయిందా? ఇట్లా స్పర్శ లభించిందా లేదా? ఇంతేనా? ఇంతకన్నా ఏమీ లేదా?" – నా అంతటి వాడిని చేస్తానన్నారు కదా మరి సాధకులైనవాళ్ళకి ఈ భావాలన్నీ రావద్దండి! ఏదో ఇట్ల సరదాగా భోజనాలు చేసి... విజయవాడ వాళ్ళు భోజనాలు బాగా పెడతారు. మనం భోజనాలు చేసేస్తాం, వెళ్ళిపోతూ ఉంటాం. మనని ముప్పొద్దులా మేపుతారు అంటారు చూశారా అట్లా, మనకి మార్గంలో భోజనాలకి కరువు లేకుండా మాస్టరుగారు బాగా అనుగ్రహించారు. ఇది ఇప్పుడే కాదు, మొదట్నుంచి ఉంది. మాస్టరు ఇ.కె.గారి చిన్నతనంలో కూడా "అక్కిడికెళ్తే భోజనాలు బాగుంటాయి. అవి తినేసి పోదాం రా!" అని పట్టుకెళ్ళారు ఆయన్ని ఒకరు! వీటితోనే తృప్తి పడిపోతామా? భక్తుడనే వాడు అలా తృప్తి పడడు. యోగ సాధకుడు అలా తృప్తి పడిపోతే ఇంక నీకు యోగప్రక్రియ ఎలా జరుగుతుంది? మనం బోల్డు కార్యక్రమాలు పెట్టేసుకొని, అందులో మనమే మునిగిపోయి, ఏది చెయ్యాలో అది చెయ్యకుండా మిగతావన్నీ చేస్తున్నామనుకోండి! ఆయన పేరున railway station కెళ్ళి, train ఎక్కకుండా, ఇంక మిగతా పనులన్నీ చేస్తూ ఉంటే, railway station లో ఎంత కాలముంటే ఏం లాభం? Train ఎక్కలేదు కదా! ఎన్ని train లు వచ్చినాయి, ఎన్ని train లు వెళ్లిపోయినాయి? అంటే, ఎన్ని ప్రేయర్ల కాలం ఉదయపు సంధ్య, సాయంసంధ్య వచ్చాయి? ఎన్ని

ప్రేయర్లు జారిపోయినాయి? ఎన్ని ప్రేయర్లు జరిగినాయి? ఒక్క ప్రేయర్ చాలదండి గట్టిగా! కానీ, అలా ఎందుకు ఉండడంటే ఈ తపన లేక. అందుకనే మాస్టర్ సి.వి.వి. గారు భక్తి లేని యోగము సిద్ధించదు అని చెప్తారు. దేనికి నువ్వు యోగము చేస్తున్నావు? దైవముతో యోగము చెందడానికి యోగం చేస్తున్నావు.

జీవుడు దైవంతో ముడిపడి, శాశ్వతంగా దైవమే తానుగా, తానై దైవమేమో అనే ఒక అనుభూతిని పొందుతూ జీవించే వరకు కూడా అతడు తృప్తి పడకూడదే! మనం తృప్తిగా బతికేస్తున్నామంటే ఇంక మనకి అప్పుడు కృష్ణుడు రాడు కదా! ఇక్కడ కృష్ణుడు అంటాం, ఇంకోచోట విష్ణువు అంటాం, ఇంకోచోట శివుడంటాం, మరోచోట అమ్మవారంటాం. పేరేమి పెట్టుకున్నా, దైవీతత్త్వము నీ యందు బాగా ఏర్పడాలంటే నీ స్వభావము దైవీస్వభావమై పోవాలి. అలా దైవీస్వభావమైపోకుండా ఉండటానికి కారణమేమిటంటే, మనం బాగా బయట ప్రపంచంలో విస్తరించుకోవటమే. క్లుప్తంగా కుటుంబ పోషణము, వృత్తి, సంఘధర్మము – ఈ మూడు క్లుప్తంగా నిర్వర్తించుకుంటూ, నీ కార్యం నువ్వు చేసుకుంటూ ఉంటే అదో పద్ధతి. ఎక్కడ function ఉన్నా మనం వెళ్లిపోవాలనే పద్ధతుల్లో... మనకి సంఘం చాలా పెద్దది. ఎన్నో కేంద్రాలున్నాయి. అన్ని చోట్లా పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి కదా! అన్ని చోట్లా బారసాలలు జరుగుతూ ఉంటాయి, అన్ని చోట్లా ఉపనయనాలు జరుగుతూ ఉంటాయి, అన్ని చోట్లా షష్టిపూర్తులు జరుగుతూ ఉంటాయి, అన్ని చోట్ల గురుపూజలు జరుగుతూ ఉంటాయి. ఎన్నిటికెళ్తావు? గురుపూజలకి వెళ్ళు, ఇంక మిగతావన్నీ తీసెయ్యి. ఎంచేతంటే, వాళ్ళు పిలవటం సహజం. నీకేది ముఖ్యము? ఇది

కాక బంధువులుంటారు. మన సంఘానికి సంబంధం లేకుండా, మనకి బంధువులు ఉంటారు, మిత్రులుంటారు. సంఘంలో మనకి లావాదేవీలకు సంబంధించినటువంటి మనుషులుంటారు. వీళ్ళందరి కోసం మనం తిరిగామనుకోండి, అప్పుడు ఏమై పోయింది? అలా వెళ్లి రావడంలో మూడు నాలుగు రోజుల్లో ఏం జరిగింది మనలో? సాధన జరుగుతుంటే ఎక్కడ తిరుగుతున్నా ఫరవాలేదు. ఎక్కడ తిరుగుతున్నా, లోపల అతన్నే స్మరిస్తున్నాను అన్న భావన ఉందనుకోండి ఎక్కడ తిరిగినా ఒకటే. అంతరంగ సాధన అతి ముఖ్యం అని తెలియాలి.

# శుభసూచనలు

"ఇట్లు హరి రాక కెదురుచూచుచు సకల ప్రయోజనంబుల యందును విరక్తయై మనోజానలంబునం బొగిలెడి మగువకు శుభంబుఁ జెప్పు విధంబున వామలోచనభుజంబు లదరె నంతఁ గృష్ణ నియోగంబున వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచిన నతని ముఖలక్షణంబుపలక్షించి యా కలకంఠి మహోత్కంఠతోడ నకుంఠితయై మొగంబునం జిఱు నగవు నిగుడ నెదురు సని నిలువంబడిన బ్రాహ్మణుం డిట్లనియె."

ఇంతకుమించి ఇతర విషయములయందు అంత రక్తి లేదు. *"మనోజానలంబునం"* అంటే మనస్సులో పుట్టినటువంటి మంట, జ్వాలలు. *"మనోజానలంబునం బొగిలెడి మగువకు"* – బాగా ఆ మంటల్లో మండిపోతున్న ఆమెకు *"శుభంబుఁ జెప్పు విధంబున వామలోచనభుజంబు లదరె"*. ఎడమ కన్ను, ఎడమ భుజము, ఎడమ తొడ అదిరినవట! కుడి భాగము అదిరితే మొగవాళ్ళకు శుభము. ఎడం భాగం అదిరితే ఆడవాళ్లకు శుభము. ఇక్కడ ఈవిడికి ఏం జరిగింది? వామలోచనము, వామభుజము అదిరింది. ఏదన్నా కార్యము జరుగుతుందా లేదా అని తెలియటానికి ఇవి సూచనలు. కుడి కన్ను అదిరిందనుకోండి మొగవాడికి శుభ సూచకం. ఎడం కన్ను అదిరిందనుకోండి స్త్రీకి శుభసూచకం. కుడి భుజం అదిరిందనుకోండి పురుషుడికి శుభ సూచకం. ఎడమ భుజం అదిరిందనుకోండి స్త్రీకి శుభసూచకం. అలా కన్ను,

భుజము, తొడ, ఇవి మనం ఏదైనా కొన్ని విషయముల యందు చాలా ఆత్రుతతో ఉన్నప్పుడు ఇవి అదిరితే, మనకి కొంత ఆనందం కలిగిస్తుంది. ఎంచేతంటే, ఏదైనా ఒక పనియందు మన మనసు లగ్నమై ఉన్నప్పుడు, ఈ ప్రపంచంలో మనం గమనిస్తుంటే కొన్ని సందేశాలు వస్తూ ఉంటాయి. అలా మనం ఎదురు చూస్తున్నప్పుడు ఒక ఆవు అలా వెళ్లిందనుకోండి శుభసూచకం. ఒక జంతువు ఎడమ నుంచి కుడి కెళ్ళిందనుకోండి అది శుభ సూచకం. అది తెల్లటి జంతువు అనుకోండి, మరీ శుభసూచకం. ఇట్లా కొన్ని కొన్ని శకునాలు మనకు చెప్తూ ఉంటారు. ఇటువంటివన్నీ కూడా మనకి పురాణాల్లో తెలుస్తూ ఉంటాయి.

*"సంతఁ గృష్ణు నియోగంబున వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచిన"*– ఈవిడకు వామ భాగములు అదరటమే తడవుగా వెంటనే ఆయన కనిపించాడండి. అగ్నిద్యోతనుడు, బ్రాహ్మణుడు వచ్చాడు. *"నతని ముఖలక్షణంబుపలక్షించి"* – ఇంకా ఆయన మాట్లాడలేదు. మనకి ఆత్రంగా ఉంటుంది కదా! అంచేత, ఆయన ముఖం చూసింది ఓసారి, శుభసందేశం ఇచ్చేట్టుగా ఉందా, మరొకరకంగా ఉందా అని.

*"యా కలకంఠి మహోత్కంఠతోడ నకూఠితయై మొగం బునం జిఱునగవు నిగుడ నెదురు సని నిలువంబడిన బ్రాహ్మణుం డిట్లనియె"* – ఆయన కనపడంగానే గభాలున వెళ్ళిపోయింది. మామూలుగా రాజకుమారి అయితే కదలదు, వాడేవస్తాడు కదా అని. మనకి బాగా ఆత్రంగా ఉన్నప్పుడు మనం వెళ్ళిపోతాం కదా! మాకు పూర్వకాలంలో ఇంటికి పేపర్ వచ్చేది. పరీక్షresult ఇంటి కొచ్చిన paper లో చూసుకోవచ్చు. కానీ మేము అందరమునూ

అక్కడ ఆంధ్రపత్రిక ఆఫీసు దగ్గరకి వెళ్ళిపోయేవాళ్ళం! పొద్దున్న లేచిన దగ్గర్నుంచి, అక్కడ ఒక 200, 300 మంది ఆ paperలు print అవుతుంటే, మొదటి paper ఒకరు పట్టుకుంటే, ఒక paper చుట్టూ ఎంతోమంది చేరిపోయి, నానా గొడవ పడిపోయేసరికి, సరిగ్గా చూసుకోకుండా "నువ్వు pass అవ్వలేదురా!" అని ఒకడు చెప్తే, ఈ లోపల వీడు బాధ పడిపోతుంటే, "అరె! తప్పు చూశాను రా! నువ్వు pass అయ్యావురా!" అని మళ్ళీ చెప్పి... నాకయింది అట్లా! అందరం అక్కడ ఆంధ్రపత్రిక ఆఫీసుకి వెళ్ళిపోయాం. అందరం అక్కడ చూశాం. "నువ్వు SSLC తప్పావురా! నీ number లేదు" అన్నాడు. అదేంటి number లేకపోవటమేంటి? స్కూల్ లో class first అనే పేరు నాకు. Number లేదంటే ఎంత అన్యాయం అయిపోతాం! దిగులుగా తిరిగి వచ్చేస్తున్నాను. Ravindra Cool Drinks దగ్గరికి వచ్చేసరికి మళ్ళీ వాడే పరిగెత్తుకుంటూ వచ్చేశాడు. మీకందరికి తెలుసు కదా రవీంద్ర Cool Drinks! "Sorry రా! నేను ఇట్లా తప్పుగా చూశాను, నువ్వు pass అయ్యావు" అన్నాడు. వీడి దుంపదెగ అనుకున్నా. అక్కడి నుంచి ఇంటికి కాస్త ఆనందంగా వెళ్లాం. ఎందుకు ఆంధ్రపత్రిక ఆఫీసుకి వెళ్ళడం? ఇంటికి paper వస్తుంది కదా! ఇంటికి paper వస్తుంది. నీ number నువ్వు చూసుకోవచ్చు. కాని ఆత్రం అలా ఉంటుంది కదా! అందుకని ఈవిడ అలా గబగబా పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయి, ఆయన ముందు నిలబడ్డదండి. *"బ్రాహ్మణుం డిట్లనియె"* – ఆయన అన్నాడట.

"మెచ్చె భవద్గుణోన్నతి కమేయధనావళు లిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై

వచ్చిన నైన రాక్షసవివాహమునకుం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా!"

నిన్ను మెచ్చుకున్నాడు తల్లీ! అన్నాడు. ముందు ఆ మాట కదా చెప్పాలి! "నేను ఎలా వెళ్ళానంటే, ఇలా చాలా కష్టపడ్డాను, దారంతా ముళ్ళు గుచ్చుకున్నాయి" అని అలా... చాలామంది అసలు విషయం చెప్పకుండా, వెళ్ళిన పని అయిన తర్వాత చెప్పకుండా, వీడంతా దానికి buildup ఇస్తూ ఉంటాడు. కాని నిజంగా సత్పురుషుడైతే ఏం చేస్తాడో తెలుసా? ముందు శుభ వార్త చెప్పి, తర్వాత మిగతా విషయం చెప్తాడు. హనుమంతుడు ఏం చెప్పాడు రాముడిని చూడంగానే? హనుమంతుడు రాముడు ముందు దిగి, దండం పెట్టి, సీతను చూశాను అని చెప్పాడు. అప్పుడు బాగుంటుంది కాని "మరి నేను ఇలా వెళ్ళాను. మేమంతా ఇట్లా కోతులమధ్య discussion. చివరికి అందరు నన్ను వెళ్ళమన్నారు. నేను వెళ్ళాను. ఇక్కడ వెతికాను, అక్కడ వెతికాను. ఇట్లా రావణాసురుడి మందిరంలోకి వెళ్ళాను. చాలా మంది కన్యలున్నారు. అందులో వెతికాను, ఇక్కడ వెతికాను" అవన్నీ చెప్తూ ఉంటే ఈ వినేవాడికి ఎట్లుంటుందండి! అలా చెప్పేటంటి వాళ్ళు కుసంస్కారులు. ఎదుటివారిని ఉత్కంఠలో పెట్టి ఆనందించే బుద్ధి ఉంటుందే. . . రేపు పొద్దునకి పిల్లవాడికి ఇవ్వటానికి గిఫ్ట్ ఇంటికి తెచ్చాం అనుకోండి. వాడు "ఇవ్వాళే ప్యాకెట్ తీసి చూపించవా నాన్నా" అంటే "రేపు చూడాలి" అన్నారనుకోండి! రేపు చూడడమేంటి? ఇప్పుడు చూడకూడదా! వాడికి ఎప్పుడు ఆనందం కలిగితే అప్పుడు– అది ముఖ్యం. వాడు ఆనంద పడడానికేకదా ఒక gift తెస్తాం! అలా మంచి విషయం

ఊరించి, ఊరించి చెప్పకూడదు. ముందు చెప్తే వాడు ఉపశమనం చెందుతాడు, ఆనంద పడతాడు. అప్పుడు నువ్వు ఎన్నయినా చెప్పవచ్చు. అందుకనే *"మెచ్చె భవద్గుణోన్నతికి"* అన్నాడు. ఉన్నతమైన నీ గుణాలకి చాలా మెచ్చుకున్నాడు తల్లీ అని అన్నాడు.

*"కమేయధనావళు లిచ్చె నాకుఁ దా వచ్చె సుదర్శ నాయుధుఁడు"* – వచ్చేశాడు అంటున్నాడు. అదిచాలదు! అది అనంగానే ఆవిడ ఎంత పొంగిపోతుందో, ఆనందపడుతుందో. ఇలాంటి పద్యం చదువుకుంటేనే మనకి హృదయము పొంగుతుంది. ఎప్పుడు హృదయం పొంగుతుందో, అప్పుడు హృదయంలో కల్మషాలన్నీ పోతాయి. అందుకే కళ్ళ వెంట నీళ్ళు వస్తాయి కదా! అసలు ఇలా కళ్ళ వెంట నీళ్ళు వచ్చే ఘట్టాలు ఎన్ని ఉంటాయి జీవితంలో? అందుకనే నలదమయంతుల కథ, హరిశ్చంద్రుడి కథ, రాముని కథ, యుధిష్ఠిరుని కథ చదువుకుంటూ ఉంటే కవులు రాసినవి, వాళ్ళు వేసే పదజాలమంతా నీ లోపల నుంచి అలా పొంగుకొస్తుంది దుఃఖం. అప్పుడు కల్మషాలన్నీ పోతాయి. మనకి తోచిందేదో మన భాషలో చెప్పేశామనుకోండి అది వేరు. ఇలా చెప్పగలమా! ఎంత బాగుంది చూడండి పద్యం.

నీ సర్వస్వం ఫలించింది. దైవమే వచ్చేస్తే ఇంక మనకి ఫలించనిది ఏముంది? ఇన్నాళ్ళు ఇన్ని జన్మలుగా మనం చేసుకున్నటువంటి పుణ్యము, దాని వలన మనకి ఏర్పడినటువంటి భాగ్యము ఏమిటంటే అది సంస్కారం. అలాంటి సంస్కారములతో కూడి, నువ్వు అతనిని గూర్చి చేస్తున్నటువంటి ఆరాధనల యొక్క ఫలితమంతా కూడా... జన్మ జన్మల ఫలముల భాగ్యమది. ఆ

భాగ్యము ఈ రోజుతో నీకు ఫలించింది. వచ్చేశాడు, ఉన్నాడు అక్కడ అని చెప్పాడు.

అప్పుడు అమ్మవారు రుక్మిణీదేవి ఇలా అంటోంది:

"జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీకృపన్ బ్రదికితిన్ నీయంత పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!"

అలాంటి బ్రాహ్మణుడికి ఏమిస్తే ఋణం తీర్తుందండి! గురువుకి ఏమిస్తే ఋణం తీరుతుంది? రుక్మిణీదేవికి ఎలాంటి వార్త ఈయన తెచ్చి ఇచ్చాడు. తోడ్కొని వచ్చాడు కదా! చూడండి ఎంత గొప్ప విషయమో! సద్గురువు యొక్క ప్రయత్నం చేత సదాచార సంపన్నుడైనటువంటి శిష్యునికి భగవత్ దర్శనం జరగటమనేది మనకి ముఖ్యం. తోడ్కొని తీసుకొచ్చాడు కదా! ఎవరు ఎవర్ని తోడ్కొని తీసుకొచ్చారండి? నిజం చెప్పండి. భగవంతుడే బ్రాహ్మణుడిని రథంలో ఎక్కించుకొని వచ్చేశాడు కదా! "పద వెళ్దాం నా రథంలో" అన్నాడు అంతే తప్ప, "నేను వెళ్తాను, నువ్వు తర్వాత రా" అని చెప్పలేదుగా! "నువ్వు ఎలా నడిచి వచ్చావో, అలాగే నడిచి వచ్చేసేయ్. ఈ లోపల నేను వెళ్ళిపోతాను" అని చెప్పలేదు కదా దేవుడు! అంటే, ఎంత శ్రమ పడ్డాడు సద్గురువు? సద్గురువు దైవమునకు ఒక భక్తుని, ఒక శిష్యుని యొక్క సద్గుణములన్నీ తెలియజెప్పి, అతడు నీ కరుణకు అర్హుడు అని చెప్పి అక్కడ వాదిస్తాడు మన కోసం. అదే చెప్తాడు అక్కడ, కిందటి గురుపూజల్లో మీరు వింటే! "నీకు సరియైనటువంటి భార్య ఆమె. అతనికి ఆమె,

ఆమెకు నీవు ఇంక అంతకన్నా లేదు" అని చెప్పి విపరీతంగా రుక్మిణీదేవి గుణాలు పొగుడుతాడు కదా! అట్లాగే సద్గురువు మనల్ని దైవము దగ్గర సమర్థిస్తూ ఉంటాడు. మన వద్దకు వచ్చి, మనకి ప్రోత్సాహం ఇస్తూ ఉంటాడు. ఈ కార్యక్రమమంతా అలా జరిగి జరిగి, జీవుడు, దేవుడు వీరిరువురూ ఒకటయ్యారనుకోండి, అప్పుడు ఆ గురువుకి ఏమిస్తే ఋణం తీర్తుంది!

*"జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి"* – నీతో పాటు తీసు కొచ్చావు. *"నా సందేశముం జెప్పి నన్ నిలువంబెట్టితి"* – నేను బతికాను, ఇదే జరగకపోతే నేను ఉండేదాన్ని కాదు అంటుంది. *"నీకృపన్ బ్రతికితిన్ నీయంత పుణ్యాత్మకుల్ గలరే"* – ఇంతకన్నా పుణ్యాత్ము లెవరుంటారు నాకు. *"నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర"* – ఇలా తెచ్చాడు కాబట్టి మనం ఇలా మెడలోంచి తీసి ఇచ్చేశామనుకోండి, అట్లా ఇచ్చేయగలమా! ఏం చేస్తే తీరుతుందండి? నీ ప్రాణం నిలబెట్టినవాడికి నువ్వు ఏమిస్తే అవుతుంది? ఏమిచ్చినా సరిపోదు కదా! అందుచేత, నేను ఇవ్వగలిగిన దానిని కాదని ఒప్పుకుందన్నమాట. నీకు నేను ఏమి ఇవ్వగలిగిన దానిని కాదు. అంచేత, మనస్ఫూర్తిగా దండం పెట్టుకుందండి.

*"నం జలిఁ గావించెద భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!"* – నువ్వే నా బంధువు అనుకున్నాను, నీకే అన్నీ నేను చెప్పుకున్నాను. "చింతామణి" అంటే ఏ కోరిక అడిగితే ఆ కోరిక తీర్చేది చింతామణి. అది భూమి మీద శంబల గ్రామంలో ఉంది. అప్పుడప్పుడు శ్రావస్తి గుహలకు పట్టుకొస్తూ ఉంటారు. అది సనత్కుమారుడి ఆధీనంలో ఉంది. అప్పుడప్పుడు మైత్రేయుడి

ఆధీనంలోకి తీసుకొస్తారు. Nicola Roerich అనే ఆయన దాన్ని దర్శించి బొమ్మ వేశాడు. ఆ చేతిలో చింతామణి పట్టుకొని మైత్రేయ మహర్షి బయటకి వస్తుంటే, వెనుక మరువు, దేవాపి మహర్షులు గుహలోంచి బయటకి వస్తున్నట్టుగా ఉంటుందది. ఇలాంటి చింతామణి ఏం చేస్తుందది? నువ్వేం కోరితే అది ఇస్తుంది. చింతామణి, కామధేనువు, కల్పవృక్షము ఇవన్నీ కోరిన కోరికలు తీర్చేవి. అవి మహాత్ముల దగ్గర ఉంటాయి.

ఆమె ఇప్పుడు ఈయన్ని ఏమని పొగిడిందంటే, నువ్వు నాకు ఉన్నటువంటి ఒకే ఒక బంధువువి, సద్బంధువువి. సద్బంధువంటే? అందరి బంధువులు సద్బంధువు లవుతారా? "సత్" అంటే దైవము, సత్యం. అదే శివము, సుందరము. అలాంటి సత్సంబంధంగా నువ్వు నాకు బంధువు, సద్బంధువు. సత్యము ఆధారంగా ఇప్పుడు మనం బంధువులుగా ఉన్నాం. మనమంతా బంధువులమే! మాస్టరుగారు అనేవారు "అందరూ ఒకరికొకరు బంధువులే" అని. ఎంచేత? సత్యమునందు ఆసక్తి గొని, ఆ మార్గములో నడవాలనే నిర్ణయం చేసుకున్న వాళ్ళం కాబట్టి. బంధువుల కన్నా ఆత్మబంధువుల యందు ప్రీతి ఎక్కువ ఉంటుంది, గురుబంధువులయందు ప్రీతి ఎక్కువ ఉంటుంది. అందులోనూ, ఈయన చింతామణి, "సద్బంధుచింతామణి!" అంచేత, నేను నీకు దండం పెట్టగలను నాయనా! అంతకన్నా నేను ఏం చేయలేను అని చెప్పింది. అప్పుడు ఆ విధంగా ఆవిడకి ఉత్కంఠ అంతా తీరిపోయింది. ఆనందం బాగా పెల్లుబుకింది.

# భీష్మకుడు రామకృష్ణుల నాహ్వానించుట

"అని నమస్కరించెనంత రామకృష్ణులు తన కూఁతు వివాహంబునకు వచ్చుట విని తూర్యఘోషంబులతో నెదుర్కొని విధ్యుక్త ప్రకారంబునం బూజించి మధుపర్కంబు లిచ్చి వివిధాంబరాభరణంబులు మొదలైన కానుక లొసంగి భీష్మకుండు బంధుజన సేనాసమేతులైన వారలకుఁ దూర్ణంబున సకల సంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి విడియించె నిట్లు కూడిన రాజుల కెల్లను వయో వీర్య బలవిత్తంబు లె ట్లట్ల కోరిన పదార్థంబు లెల్ల నిప్పించి పూజించెనంత విదర్భపురంబు ప్రజలు హరి రాక విని వచ్చి చూచి నేత్రాంజలులం దదీయవదన కమల మధుపానంబు సేయుచు."

*"రామకృష్ణులు తన కూఁతువివాహంబునకు వచ్చుట విని"* – బలరాముడు, శ్రీకృష్ణుడు తన కుమార్తె వివాహ సందర్భంగా వచ్చారని విన్నాడు భీష్మక మహారాజు, రుక్మిణీదేవి తండ్రి. *"తూర్యఘోషంబులతో నెదుర్కొని"* – తూతులు పట్టుకొని అంటే మేళం, వాయిద్యం, ఈ రాజులు, వచ్చినవాళ్ళందరినీ మేళతాళాలతో వాళ్ళను ఆహ్వానించడం అన్నమాట. *"నెదుర్కొని విధ్యుక్త ప్రకారంబున"* – అంటే ఎలా చెయ్యాలో ఆ విధంగా. *"యథావిధిగా పూజించి మధుపర్కంబులిచ్చి"* – మధుపర్కంబులంటే తియ్యని

పానీయము ఇచ్చి, *"వివిధాంబరాభరణంబులు"* ఇచ్చి అంటే వస్త్రాలు ఆభరణంబులు కూడా ఇచ్చారట. వచ్చిన ప్రతివాళ్ళకీ ముందే gifts ఇచ్చేశారండి. తీయని పానీయం ఇస్తూ, వాటితోనే బట్టలు పెట్టేశారు. ఆభరణాలు కూడా పెట్టేశారు. వచ్చిన రాజబంధువు లందరికినీ *"కానుక లొసంగి భీష్మకుండు బంధుజనసేనా సమేతులైన వారలకుఁ"* . ప్రతి రాజు ఆయన వెంట ఆయన బంధుజనం, సేనలు, వాళ్ళందరికి సంపూర్ణంగా *"సకల సంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి"* . ఇంత మంది ఉండటానికి చూపించాలిగా చోటు, విడిది కదా! ఊరికే పిలిస్తే కాదుకదండి. పెళ్ళికి పిలిస్తే అయిపోయిందా? వచ్చిన వాళ్ళందరికీ చోటు చూపించాలి. ఉన్నంతలో ఏదో రకంగా వాళ్ళని సత్కరించాలి. ఈయన రాజుగారు కాబట్టి ఆ విధంగా ఏర్పాటు చేశాడు వచ్చిన వాళ్ళూ రాజులే!

*"నివేశంబులు కల్పించి విడియించి"* అంటే, విడిదిలో వాళ్ళు సుఖంగా వసించేట్టుగా చూసేంతవరకు... "అదుగోనండి మీ room, అటువెళ్ళిపోండి" అని చెప్పటం కాదు. *"విడియించె నిట్లు కూడిన రాజుల కెల్లను వయోవీర్య బలవిత్తంబు లెట్లట్ల కోరిన పదార్థంబు లెల్ల నిప్పించి పూజించె"* – వాళ్ళకి ఏమేమి కావాలో బాగా కనుక్కొని, తరిచి తరిచి అడిగి, అన్నీ ఇచ్చి పూజించాడటండి. *"అంత విదర్భపురంబు ప్రజలు"* – ఆ విదర్భపురంలో ఉండే ప్రజలందరికీ రామకృష్ణులు వచ్చారు అనే వార్త పొక్కి, వాళ్ళందరూ వాళ్ళని చూడటానికి వచ్చారు. *"వచ్చి నేత్రాంజలులం"*– కళ్ళతోనే, చూపులతోనే దండాలు పెట్టేస్తున్నారట. దగ్గరగా కనపడరు కదా!

అందుకని చూపులతోనే దండం పెట్టేశారు. *"నేత్రాంజలులం దదీయ వదన కమల మధు పానంబు సేయుచు"* – వాళ్ళిద్దర్ని చూసి, అలా అమృతం తాగినట్లుగా ఆనందిస్తున్నారట.

కృష్ణుడు కదా! చాలా వింటారు చిన్నప్పటినుంచి రక రకాలుగా ఈయన చేసిన లీలలు. మొట్టమొదట సారి శ్రీకృష్ణుడు మధురాపురం వెళ్ళినప్పుడు అక్కడ మేడల్లో, మిద్దెల్లో ఉండేవాళ్ళు ఆయన్ను చూసి "వీడే ఆ అందగాడు! ఆ పూతన పాలు తాగి, దాన్ని చంపేశాడు." అట్లా ఎన్ని పద్యాలు రాస్తాడో పోతన! అవి చదువుతుంటేనే అలా ఒళ్ళంతా గగురుపొడుస్తుంది. అటు వంటి పద్యాలు ఇక్కడ చెప్తున్నాడు. వీళ్ళందరూ చూసి, ఇట్లా అనుకుంటున్నారన్నమాట. ఏమనుకుంటున్నారంటే, *"తగు నీ చక్రి విదర్భరాజసుతకుం"* –ఈయనే రుక్మిణికి తగినవాడు. ప్రజలకి వాళ్ళ opinions వాళ్ళకి ఉంటాయి కదా! అందర్నీ చూస్తారు కదా, వింటారు కదా! ఈయన గురించి చాలా విన్నారు, అందుకని వచ్చారు. చూడంగానే ఆనందం వేసింది. ఆ రూపముఖంలోంచి వచ్చినటువంటి ఆ సౌందర్యాన్నంతా చూసి అట్లా కళ్ళతోనే తాగేశారు.

"తగు నీ చక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి నింతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా దర్పాహతారాతియై
మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్."

ఈ శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవికి సరియైనవాడు. అట్లాగే

రుక్మిణీదేవి శ్రీకృష్ణునికే సరియైన భార్య. *"నింతమంచి దగునే"* – అంతా మంచి జరుగుతుంది ఆయనకి. చాలా బాగుంది కదా! అంటే, మనం ఊరికే made for each other అంటాం కదా! సంవత్సరం తర్వాత చూస్తే మొగుడు, పెళ్ళాం కొట్టుకుంటూ ఉంటారు! అంటే, made for each other for fight అని తర్వాత రాసుకోవాలి కదా! ఇక్కడ made for each other for ever! రుక్మిణీ దేవి కృష్ణుని మీద అలిగిందిటా అన్నది లేదు. రుక్మిణిని శ్రీకృష్ణుడు కోపపడ్డాడట అనేది లేదు. ఏముండవు?

*"దాంపత్య మీ యిద్దఱిం దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా"* అన్నాడు. ఓహో! వీళ్ళిద్దరికీ నిజంగా దాంపత్యాన్ని ఏర్పాటు చేసినటువంటి ఆయన విధాత ఒకడు ఉన్నాడు కదా! ఆయన చాలా నేర్పరి. ఎంతలా కూర్చాడో! ఎంచేత? యదుకులంలోంచి ఆయనలా పుట్టుకొచ్చాడు. ఈ విదర్భలో ఈవిడిలా పుట్టుకొచ్చింది కదా! వీళ్ళిద్దరూ కలిసేట్టుగా తయారు చేశాడు. మధ్య రాయబారం నడిపించాడు. ఇదంతా జరిగింది బ్రహ్మలిఖితమే కదా! కాబట్టి ఆయన చాలా నేర్పరి అంటున్నారు.

*"దర్పాహతారాతియై మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్"* – ఈ అహంకారుల యొక్క అహంకారాన్నంతా హరించి... "దర్పాహతారాతియై" అంటే, ఈయనొచ్చాడు కదా! బోల్డుమంది candidates వచ్చారు. ఎంతోమంది రాజులొచ్చారు. శిశుపాలుడికి మద్దతుగా అందరికన్నా కొంచెం బాగా భయంకరమైనటువంటి అహంకారంతో ఉన్న జరాసంధుడు వాళ్ళున్నారు కదా! వాళ్ళందరి యొక్క అహంకారాన్ని హతం చేసి, *"మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్"* – రుక్మిణీదేవికి ఇతడే

మగడవుతాడు. వాళ్ళందరి అహంకారం ఖచ్చితంగా తీసేస్తాడు రేపు అని చెప్పుకుంటున్నారు వాళ్ళు. *"మాపుణ్యమూలంబునన్"* – అది మేము చూస్తాం మా పుణ్యం, అలాంటి పుణ్యం మాకుంది. అంటే రుక్మిణీకళ్యాణం మనం చెప్పుకుంటున్నాం, వాళ్ళు చూస్తారు కదా!

రుక్మిణీదేవి పాత్ర మనకి తలమానికమైన పాత్ర. భగవంతుడినే పెళ్ళాడిందట అంటే ఎంత గొప్ప విషయం! అలాగే గోదాదేవి చెప్తాం. అలాగే అమ్మవారు సీతాదేవి. అలాగే పార్వతీదేవి, శివుడిని మెప్పించి పెళ్లి చేసుకుంది. ఈ కథల్లో దేనిచేత మెప్పిస్తారు వాళ్ళని? అందం చేత మెప్పించలేదు, శక్తి చేత మెప్పించలేదు. కేవలం భక్తి చేతనే. కేవలం భక్తి చేత తప్ప ఇంక దేనిచేత కుదరదు. భగవంతుడిని మెప్పించలేం. అందుకనే *"సర్వేశ్వరుండగు శౌరికింకరు చేయుధనముకలదే భక్తిధనముగాక"* – నేనింత శక్తివంతుడిని అని చెప్పటానికి ఏం లేదు. ఆయన సర్వశక్తిమంతుడు కదా! నేనింత అందమైన దానిని అని చెప్పటానికి ఏంలేదు. అన్ని అందాలు ఆయన దగ్గరే ఉన్నాయి. నా దగ్గర ఎన్ని గుణాలున్నాయి అని చెప్పటానికి ఏం లేదు. అన్ని గుణాలు ఆయన నుంచి వచ్చినవే. కాబట్టి దేంతో మెప్పిస్తావు? ఆయన దగ్గర లేంది నీదగ్గర ఏముందని మెప్పిస్తావు ఆయన్ని? ఆయన్ని మెప్పించటానికి నీ దగ్గర ఉండవలసింది భక్తి ఒక్కటే. భక్తి చేతనే భగవంతుని మెప్పించవచ్చును. *"మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్టామి నారద"* – నన్నెక్కడ ఆర్తితో, భక్తితో ఆరాధన చేస్తూ ఉంటారో అక్కడ నేనుంటాను. Logic

ఉండేచోట, intellectuals ఉండే చోట, పాండిత్యం ఉండేచోట, శక్తిసామర్థ్యాలు ఉండేచోట మన కంత interest లేదు అని చెప్పాడు దైవం. ఈమె దేనిచేత మెప్పించింది? తన భక్తి చేత రుక్మిణి ఆ విధంగా భగవంతుడిని మెప్పించి, తన ఇంటికి రప్పించుకొని, ఆయన చేత తోడ్కొని పోబడింది.

ఈ రోజుతో రుక్మిణి మనసు చల్లబడ్డదండి. అది ముఖ్యం కదా! ఆరాటంలో ఉన్నటువంటి అద్భుతమైన ఒక భక్తురాలి యొక్క మనస్సు చల్లబడ్డది. వస్తే ఏంచేస్తాడో ఆవిడకే తెలుసు. అసలు రావడంవరకే కదా మనకి! వస్తాడో రాడో అని కదా! వచ్చేశాడు. ఇంక రేపేముంటుంది? తయారౌతుంది, గుడికి వెళ్తుంది. తిరిగి వస్తూ ఒక్కొక్కళ్ళని ఓర కన్నుతో చూస్తుంది. కనపడతాడు. ఇవన్నీ రేపు చెప్పుకుందాం.

ఆ రోజు రాత్రి విదర్భ రాజధాని అంతా కూడా ఒక రకమైనటువంటి ఆనందంలో ఉంది. రుక్మి, జరాసంధుడు, శిశుపాలుడు, సాళ్వుడు వీళ్ళందరికీ లోపల గుబులు మొదలైంది. ఎంచేత? వీళ్ళు ఎవరు వస్తే మనం సిద్ధంగా ఉండి పిల్లను కాపాడుకోవాలి అని అనుకుంటున్నారో అలాంటి వాడు వచ్చేశాడు. కాబట్టి మర్నాడు వాళ్ళందరునూ చాలా సంసిద్ధులై ఉండాలి. ఎందుకంటే, ఊహించని విధంగా ఆయన కార్యాన్ని నిర్వర్తిస్తాడు. కృష్ణుడి యొక్క గొప్ప విశేషమేమంటే expect the unexpected అని. You cannot expect the unexpected. ఏదైనా జరగవచ్చు, ఎలా అయినా జరగవచ్చు అని భావన. ఏం జరుగుతుందో తెలియదు. ఇలాంటి ఉత్కంఠతో వాళ్ళందరూ నిద్రలోకి వెళ్ళటం జరిగింది.

# రుక్మిణీదేవి గౌరీపూజ

ఆ మరునాడు పొద్దున్నే రుక్మిణీదేవి గౌరీపూజ చేయడానికి దేవాలయానికి బయలుదేరే సందర్భం ఏర్పడింది.

"సన్నద్ధులై బహుశస్త్రసమేతులై
బలసి చుట్టును వీరభటులు గొలువ
ముందట నుపహారములుఁ గానికలుఁ గొంచు
వర్గంబులై వారవనిత లేఁగఁ
బుష్ప గంధాంబర భూషణ కలితలై
పాడుచు భూసురభార్య లరుగఁ
బణవ మర్దళ శంఖ పటహ కాహళ వేణు
భేరీ ధ్వనుల మిన్ను పిక్కటిలఁగ

దగిలి సఖులు గొలువఁ దల్లులు బాంధవ
సతులుఁ దోడ రాఁగ సవినయముగ
నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క
బాల చికుర పిహిత ఫాల యగుచు."

రుక్మిణీదేవి అమ్మవారి దేవాలయానికి వెళ్తున్నది. నగరం బయట ఉంటుంది ఆ దేవాలయం. ఆ దేవాలయానికి రాజ కుమారి వెళ్తున్నది. చాలా శస్త్రాస్త్రములతో security ముందు నడుస్తోంది. ఈ నృత్యాలు, కార్యక్రమాలు నిర్వర్తించేటువంటి స్త్రీలు ప్రతి సంఘంలో కూడా కొంతమంది వారవనితలు అంటూ

ఉండటమనే ఆచారం ఉన్నది – అప్పటికీ ఉంది, ఇప్పటికీ ఉంది. ఈ వారవనితలను దేవాంగనలు, దేవునికి సమర్పింపబడ్డవారని అంటారు. వారందరు రకరకాల హారములు, కానుకలు పళ్ళాల్లో పెట్టుకొని, గుంపులు గుంపులుగా వాళ్ళముందు వెళ్తున్నారటండి. *"బుష్ప గంధాంబర భూషణ కలితలై"* – బాగా పువ్వులు పెట్టుకొని, సుగంధ పరిమళములు వెదజల్లేట్లుగా రాసుకొని, అలాంటి సుగంధ పరిమళాలన్నీ కూడా ఒక పళ్ళెంలో పెట్టుకొని, బాగా అలంకరించుకున్న వారు చక్కని దివ్యమైన, దైవీసంబంధమైన పాటలు పాడుకుంటూ వెళ్తునారు. *"భూసురభార్య లరుగఁ"* – వారి వెనకాల బ్రాహ్మణ స్త్రీలు, ముత్తైదువులు అందరూ కూడా చక్కగా పూజకి కావలిసిన సామాగ్రినంతా పళ్ళాల్లో తీసుకొని నడుస్తున్నారట.

*"బణవ మర్దళ శంఖ పటహ కాహళ వేణు భేరీ ధ్వనుల మిన్ను పిక్కటిలఁగఁ"* – వారి వెనకాల అన్నిరకాల మంగళవాయిద్యాలు, మీరు ఊహించుకున్న అన్ని రకాల మంగళ వాయిద్యాలతో వెళ్తున్నారు. మంగళవాయిద్యాలు ఎందుకు వాయిస్తారంటే ఇతర శబ్దములు, పొర్లు మాటలు, ఇలాంటివి వినపడకుండా ఉండడానికి. పెళ్ళప్పుడు కూడా మనకి ముహూర్తం సమయంలో ఎవడో ఎక్కడో తుమ్మచ్చు కదా! ఇంకొకడు దగ్గచ్చు కదా! మరొకడేమో "అది కాదు గాని" అని మాట్లాడుతూ ఉండచ్చు. పెళ్ళికొచ్చిన వాళ్ళంతా పెళ్లి చూడరు కదా! ఏవో పొర్లు మాటలు ఉంటాయి. లేకపోతే పక్కనుంచి ఏదో అరవచ్చు. ఒక పిల్లి కూత వినపడచ్చు కదా! లేక ఒక కుక్క ఏడుపు వినపడచ్చు. కొన్ని పక్షుల కూతలు శుభశకునాలు. కొన్ని పక్షుల కూతలు అంత శుభశకునాలు కావు.

ఇలాంటివన్నీ ఏవీ వినపడకుండా ఉండాలనుకున్నప్పుడు మనం ఏం చేయాలి. ఇంక వేరే శబ్దాలు వినపడకుండా ఉండేట్టుగా మనమే శుభశబ్దాలు ఏర్పాటు చేసుకోవాలి. మంగళవాయిద్యముల ముఖ్య ఉద్దేశ్యం అదే. శుభకార్యమప్పుడు ముందు ఏం చేస్తారంటే, మంగళవాయిద్యాలు ఏర్పాటు చేసుకుంటారు. ఇతర అమంగళమైనటువంటి శబ్దములు వినపడకుండా ఉండటానికి, ఒకటి. అమంగళమైనటువంటి విషయాలేవీ కూడా ఈ కార్యక్రమం లోకి చొరపడకుండా ఉండటానికి, రెండు. అందుకని మృదంగం ఇలాంటివి ఉన్నాయే ఇవన్నీ శివపరమైనటువంటివి. ఆ తర్వాత వేణువు, వీణ ఇలాంటివన్నీ విష్ణుపరమైనటువంటివి.

ఇలాంటివన్నీ రకరకాలుగా ఏర్పాటు చేసుకొని వాళ్ళు ముందు నడుస్తూ ఉంటే *"దగిలి సఖులు గొల్వఁ"* – చెలికత్తెలందరూ కూడా ఆవిడని జాగ్రత్తగా అలంకారం చేసుకుంటారు కదా! అవన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదో, అవన్నీ వాళ్ళు చూసుకుంటూ ఉంటారన్నమాట. *"దల్లులు బాంధవసతులుఁ దోడ రాఁగ"* – ఆమె యొక్క తల్లులు అంటే తల్లి, తల్లి యొక్క సోదరీమణులు, లేక తండ్రి తాలూకు వాళ్ళు, మాతృసమానురాలైన వాళ్ళందరూ కూడా తోడుగా వస్తుంటే *"సవినయముగ నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క బాల చికుర పిహిత ఫాల యగుచు".* "బాల చికుర పిహిత ఫాల యగుచు" అంటే చిగురు ఆకులతో కూడినటువంటి లతల్లాగా చిన్న చిన్న ముంగురులు ఉంటాయి చూశారా! అవన్నీ నుదురు మీద పడుతున్నాయి అన్నమాట. అంటే, కొంతమందికి సహజంగా అలా ఉంటాయి. కొంతమంది

పీక్కుని పెట్టుకుంటూ ఉంటారు! ఈ కన్ను మీద పడి, వెనక్కిలా అంటూ, లేకపోతే ఇటు పడితే, ఇలా అంటూ ఉంటారు! కన్ను మీద పడకూడదు. కంటికి ఏదీ అడ్డు ఉండకూడదు.

ఇంకో ముఖ్యమైన విషయం చెప్పదల్చుకుందేమిటంటే “నగరు వెడలి నడిచె” – పురము వదిలి వెళ్ళిందండి. ఇక్కడ ఆ ఉద్దేశ్యం అలా కాకపోయినా మనం అర్థం చెప్పుకోవాలి. మన సాధనపరంగా మనం చూసుకుంటున్నప్పుడు నీ నగరం వదిలి వెళ్లి పిలిస్తే తప్ప నగజాతకు మొక్కలేవు, అంటే అమ్మవారికి మొక్కలేవు. అమ్మ తొమ్మిదో ఆవరణంలో ఉంటుంది. ఎనిమిదో ఆవరణ వరకూ నువ్వు ఉంటావు. ఎనిమిదో ఆవరణలో అహంకార పురుషుడు. ఏడో ఆవరణలో బుద్ధి ననుసరించి, ఆరో ఆవరణలో మనసును పట్టుకొని, మిగతా ఐదు ఆవరణలలోనూ పంచభూతాలతో కూడినటువంటి శరీరంలో జీవిస్తూ ఉంటాడు. మన పంచభూతాత్మకమైన దేహం– అవి ఐదు ఆవరణాలు – పదార్థము, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం. అది దాటి ఆరో ఆవరణ మనస్సు. ఏడవ ఆవరణ బుద్ధి. ఎనిమిదో ఆవరణ నేనున్నాను అనుకునే జీవుడు. ఈ మొత్తం ఆవరణలోనే వాడు జీవిస్తూ ఉంటాడు. తొమ్మిదవ ఆవరణలోకి వెళ్ళటమంటే ఈ ఎనిమిది ఆవరణలను దాటి వెళ్ళాలి.

అందుచేతనే, ప్రధానంగా దేహాత్మ భావముండేవాళ్ళు ఆరాధనలు చేయలేరు అని చెప్తారు. నీకు దేహాభిమాన మున్నదను కోండి నువ్వు ఆరాధనకి తగవు. ఆరాధన చేసేవాళ్ళు ఎట్లా ఉంటారు? నిద్ర లేదు రాత్రి అని ఉండదు వాళ్లకి. పొద్దున ప్రార్థన

చేసుకుంటూ ఉంటే ఇట్లా బెజవాడలో నిన్న రాత్రి నిద్రపట్టలేదు అని ఉండదు. నిన్న భోజనం పడలేదు అని ఉండదు. నిన్న చదువుకున్నాం కదా పద్యాలు! ఎలా ఉంది ఆవిడ? ఆవిడ నిద్రపోలేదు, అన్నము తినలేదు, ఈ బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా కృష్ణుని చూచే మార్గం మీద తదేకమైన దృష్టి పెట్టుకొని ఉన్నది కదా! దానికి ఇక్కడ నేను అనుసంధానం చేస్తున్నాను. అలా ఉంటేనే నగరు వదలగలరు. మాకు అమ్మవారి దర్శనమైంది అంటామే, తన్మయ స్థితిలో దర్శనాలు అవుతాయి. తన్మయ స్థితి అంటే మనం కరిగిపోయిన స్థితిలో – కాసేపు ఒక్క క్షణం పాటు, ఆ తర్వాత మళ్ళీ మనం పురంలోకి వచ్చేస్తాం.

నిన్న మనం చదువుకున్న పద్యాలన్నిటిలో అమ్మవారి భక్తి యొక్క పరాకాష్ఠ ఎలా ఉన్నది అనే విషయాన్ని మనం గమనించి ఉన్నాం. ఆ బాహ్యమైనటువంటి విషయములు ఎంత అద్భుతమైనవాటికి కూడా ఆకర్షింపబడక, కృష్ణుని గూర్చియే భావన చేస్తున్నటువంటి సందర్భంలో, అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణుడు వచ్చి సందేశ మందిస్తాడు, "కృష్ణుడు వచ్చాడు" అని. తానిప్పుడు వచ్చినవాడి దగ్గరకు వెళ్ళాలి కదా! తనని చేరాలి, తనవంతు ప్రయత్నం తను చేయాలి. ఆయన వంతు ప్రయత్నం ఆయన చేయటానికి సిద్ధంగా ఉన్నాడు. ఇది ఒక భక్తుడికి, భగవంతునికి మధ్య జరిగేటువంటి ఘట్టాలుగా కూడా మనం తీసుకొని చెప్పుకుంటేనే మనకి ఉపయోగపడుతుంది. లేకపోతే, రుక్మిణీదేవి కృష్ణుని చేరటమనేది ఆ స్థితిలో ఉండేటువంటి ఒక ప్రజ్ఞకు అంత కష్టం కాదు. మనకు అన్వయించుకుంటూ మనం

చెప్పుకుంటూ ఉంటాం కాబట్టి అన్ని విషయాలు, ఈ విధంగా బయటకి నడిచి రావాలంటే అందరి యొక్క ఆశీర్వచనంతో నడిచి వస్తుంది, ఒకటి. ఆవరణలు దాటి వస్తోంది, రెండు.

ఇంకొక ముఖ్య విషయ మేమిటంటే రుక్మిణీదేవి విషయంలో, "నన్ను నువ్వు తీసుకువెళ్ళుగాని మా ఇంట్లో వాళ్ళకి ఏ కష్టం కలిగించకు" అని చెప్పింది కిందటి సంవత్సరమే కదా! మా అన్నయ్య ఒకడు ఉన్నాడు దీనికి అడ్డంగా. అందుకని సులభంగా జరగదు. అంతమాత్రం చేత అంతఃపురంలో కొట్లాటలు వద్దు. కోటలో యుద్ధం వద్దు. పెళ్లి చేసుకునే సందర్భంలో కోటలో యుద్ధం వద్దు. కోట అంటే మన శరీరమే. యోగం మనం చేసుకుంటున్నా మనుకోండి దేహానికి ఇబ్బంది కలగకుండా యోగం చెయ్యాలి. అంటే, దేహాన్ని శుష్కింపచేయటం, దేహాన్ని రొష్టు పెట్టడం, దేహాన్ని బాగా నలగకొట్టేయటం, దాన్ని బాగా అశ్రద్ధ చేయటం అలా చేయకూడదు. ఎలా చెయ్యాలంటే నీలో స్ఫూర్తి పెరుగుతున్నకొద్దీ, కొన్ని మామూలుగా నువ్వు చేయవలసినటువంటి పోషణలు చేయకపోవడం వేరు, నువ్వే కావాలని మానేయడం వేరు. ఇలా భాగవత ఉపాఖ్యానం మనం చెప్పుకున్నట్టు ఆ చెప్పుకోవడంలో బాగా తన్మయత్వం చెంది, ఫలహారవేళ దాటిపోయిందనుకోండి, లేకపోతే భోజనం వేళ దాటి పోయిందనుకోండి, అలా దాటిపోటం వేరు. అవన్నీ మానేసి కూర్చుందాం అని కూర్చోటం వేరు. ఈ రెండిటికి చాలా తేడా ఉంది. నీవు దైవానికి దగ్గరగా వెళ్తూ ఉండటం చేత కొన్నికొన్ని విషయముల యందు, దేహము దాని యొక్క హక్కులను కోరదు. హక్కులను కోరదు, అది సహకరిస్తూ

ఉంటుంది. అలాంటి సహకారాన్ని అందుకుని, నీవు సాధనలో ముందుకు వెళ్తూ ఉండాలి తప్ప, దాన్ని శుష్కింపచేసి, దాన్ని రొష్టుపెట్టి, దాన్ని బాధ పెడితే అవ్వదు.

ప్రకృతిని బాధ పెట్టి పురుషుడి దగ్గరకి చేరలేము. నీలో ఉండే ఆవరణములన్నీ కూడా నీకు సహకరించాలి, అది ఒకటి. రెండవది, దైవారాధన చేసుకునే వారు, దైవాన్ని చేరుకోవాలనే తపన కలిగిన వారు ఇంట్లో వారెవ్వరికీ కూడా ఇబ్బంది కలిగించకూడదు. ఇంట్లోవారికి ఇబ్బంది కలిగించే సాధన చేయకూడదు. పొద్దున్నే మూడింటికే లేచి, నేను కూర్చుని సాధన చేస్తాను అన్నావనుకో, చేసుకో – కాని దాని వలన ఇంకొకళ్ళకి ఇబ్బంది కలగకూడదు. నాకప్పుడు వేడి నీళ్ళు కావాలి కదా, కాబట్టి ఇంట్లో ఎవరన్నా వేడి నీళ్ళు పెట్టివ్వటానికి వాళ్ళు లేవాలని, లేకపోతే, మనకి లేవంగానే కాఫీ తాగకపోతే జరగదు కదా, అందుకని మన కాఫీ కోసం ఇంటావిడ కూడా నాలుగింటికే, మూడున్నరకో లేవాలని, ఇలా పెట్టుకున్నామనుకోండి, అలా కుదరదు. నీ యోగ సాధన ఇంకొకరికి ఏ విధమైనటువంటి అసౌకర్యములు కలిగింపరాదు, ఒకటి. నీ యోగ సాధన నీ దేహం యొక్క పరిపూర్ణ సహకారంతో నిర్వర్తించుకోవాలి, రెండు. అంటే, నీ లోపలి ప్రకృతినిగాని, నీ చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రకృతినిగాని, నీవు హింసించి యోగం చేయటానికి వీల్లేదు. అలా చేస్తే అది పాషండ మార్గమన్నారు. అలా భీష్మించుకొని చేస్తే అది పాషాండ మార్గం. ఆ మార్గంలో ఎక్కువ దూరం పోలేమని చెప్తారు.

అందుకనే, సనాతన ధర్మంలో బౌద్ధమతం పాషండమతం అని చెప్పారు. ఎంచేతంటే, నీవింట్లో కూర్చొనే దైవ సాన్నిధ్యాన్ని

పొందవచ్చు అని భార్య చెప్తూ ఉండగా, భార్యని, పిల్లవాడిని, రాజ్యాన్ని, తల్లితండ్రుల్ని, అందర్ని దుఃఖపెట్టేటువంటి పద్ధతుల్లో ఇల్లు వదిలి వెళ్లి, చాలా సంకల్పబలంతో తపస్సు చేసి సిద్ధిపొందిన తర్వాత బుద్ధుడికి ఏం తెలుస్తుందంటే, అదంతా చేయకుండానే ఇది జరిగి ఉండేది, మనం ఇంట్లోనే కూర్చుని చేయవచ్చును అని తెలిసింది. అందుకనే, సనాతన ధర్మంలో ఆ మార్గాన్ని అంతగా మనం ఆచరించము. ఋషిప్రోక్తమైన మార్గంలో అన్నిటినీ మన్నించుకుంటూ వెళ్ళడమే – నీ ప్రారబ్ధకర్మను నువ్వు ఏ విధంగా మన్నించాలో ఆ విధంగా మన్నించుకుంటూ, నీ సాధన నువ్వు చేసుకుంటూ ఉండడమే. *"కర్మతంత్రుఁ డగుచుఁ గమలాక్షుఁ గొల్చుచు నుభయ నియతవృత్తి నుండెనేనిఁ జెడును గర్మమెల్ల శిథిలమై మెల్లన ప్రభలమైన విష్ణుభక్తి చెడదు"* – క్రమంగా కర్మ జారిపోతూ ఉంటే, దైవభక్తి పెరుగుతూ ఉంటే, నీవు దైవానికి చేరువయ్యే మార్గంలో నీకు అన్నీ అనుకూలంగా తయారవుతాయి. ఏవి ప్రతికూలంగా ఉన్నాయో అవన్నీ అనుకూలం చేసుకుంటూ ముందుకు సాగాలి తప్ప, ఎక్కడెక్కడివి విధ్వంసం చేసుకుంటూ ముందుకు సాగితే అది యోగం కాదు, అది ఒక భీభత్సమైనటువంటి మార్గం. అందుకని, మన ఋషుల యోగమార్గంలో భీభత్సం లేదు, ప్రశాంతతే ఉంటుంది. ప్రశాంతంగా సాగుతూ వెళ్తూ ఉంటారు.

ఈ *"నగరు వెడలి నడిచె"* అని, ఈమె వెళ్ళడమంటే ఈ విధంగా మనం యోగపరంగా అర్థం చేసుకోవాల్సింది. "తన గృహము" – తన గృహమంటే తన దేహమే ఒక గృహము. గృహమునందు ఉన్నటువంటి ఆవరణములన్నిటిని చక్కదిద్దు కుంటూ వెళ్ళాలి. వాటికి వేటికీ ఇబ్బంది కలగకూడదు, అదొకటి.

రెండొవది, తనవారెవ్వరికీ తన వలన ఇబ్బంది కలగకూడదు. మనం యోగసాధన చేస్తుంటే, మన ఇంట్లో వాళ్ళందరూ మన ప్రవర్తన వలన దుఃఖపడ్తున్నారనుకోండి... వారికి ఇబ్బంది కలగని ప్రవర్తనద్వారా మనకి యోగం సాగాలి తప్ప, వారిని ఇబ్బంది పెట్టే పరిస్థితుల్లో సాగకూడదు.

అందుకని, రుక్మిణీదేవి కబురుపెట్టింది – రాజప్రాసాదంలో వద్దు, కోటలోపల వద్దు, కోట బయటకి వస్తాను నేను, నన్ను నువ్వు తీసుకెళ్ళు అనడంలో అర్థమేమిటంటే మనం కూడా అలా ప్రయత్నం చేయాలండి. మన ప్రయత్నం ఎలా ఉండాలి? ఇంకా మనకు ఈ ఆవరణలే దాటలేమనే వాళ్ళని అవన్నీ చీల్చేసి తీసుకెళ్ళవలసిన అవసరం లేదు భగవంతుడికి. అలా చేయరు కూడా. ఎందుకంటే, హింస అనేటువంటిది కార్యక్రమంలో లేదు. అహింస అనేటువంటిది ప్రధానం. హింసింపబడకుండా సాధన సాగాలి. పండితే హింస లేదుగా! పండకపోతేనే హింస. నల్లగా, ఇంత లావుగా ఉండేటువంటి ఒక పెద్ద చెట్టు కొమ్మలోనుంచి తెల్లటి మృదువైన పువ్వు వస్తుంది కదా! దాన్నించి పువ్వు అదే వచ్చిందా, నువ్వు పీకితే వచ్చిందా? దానంతట అదిగా వస్తే, అది రాల్తే నువ్వు పుచ్చుకోవాలి. పీకకూడదు ఎక్కడ నుంచి కూడా. రాలిన పువ్వులే పూజకు వాడేవారు. అలాగే, ఫలములు వృక్షంలోంచి ఏ విధంగా బయటకు వస్తున్నాయి? వృక్షం లోంచి క్రమంగా ఒక పుష్పం లాగా పుట్టి, అందులోంచి ఒక పిందెవచ్చి, ఆ పిందె పెరిగి పెద్దదై, ఆ తర్వాత అది పండిన తర్వాత అది రాలిపోతుంది కదా! అలా ఇవన్నీ ఎన్ని ఆవరణములు దాటుకొని, ఫలంగాని, పుష్పంగాని,

వృక్షంలోంచి బయటకి వచ్చింది. ఎక్కడైనా హింస ఉన్నదా అందులో?

ఇలా ఎంత సున్నితంగా ఏర్పడుతూ వస్తుందో తెలియాలంటే ఒక పూలమొక్క పెంచాలి, ఒక పండు మొక్క పెంచాలి. ఇప్పుడు ప్రస్తుతం మనం కలికాలం, రాక్షసజాతి ఉండటం చేత కోసి, పిల్లల్ని బయటకి తీస్తున్నాం. డాక్టర్ల convenience ప్రకారం కదా! ఎప్పుడు బయటకి వస్తే అప్పుడు సహకరించి, బిడ్డను బయటకి తీయటం కాదుగా ఇప్పుడు! ప్రకృతి సహకారమును అనుసరించి, అది ఎప్పుడు బయటకి వస్తే అప్పుడు పుట్టినవాళ్ళు ఇదివరకు అంతానూ. ఇప్పుడు అందరూ కూడా morning time డాక్టర్స్ convenient కాబట్టి ఆ time లో పుట్టుకొస్తారు! ఎందుకంటే, కోసి తీస్తున్నాం! కోసి తీసే విధానం ప్రకృతి సహజం కాదు. కోసి తీస్తే ఎట్లా ఉంటుంది? సరే, అది అలా ఉంచండి. ఊరికే మీకు చెప్తున్నాను. మన పరిస్థితులు ఎలా మారిపోతున్నాయో మనకి తెలియాలి కదా! ఏ విధంగా ఒక పుష్పము వృక్షం నుంచి చక్కగా వచ్చి, ఆ తర్వాత బయటపడుతుందో, ఏ విధంగా ఒక ఫలం ఆ విధంగా వృక్షం నుంచి వస్తుందో, అలాగే ఒక జీవుడు తల్లి గర్భంలోంచి ఆ విధంగా వస్తాడు. దానికనుగుణమైనటువంటి పద్ధతులన్నీ వదిలేసి, మనకి time లేదు కాబట్టి, అర్ధరాత్రి నేను పురుడు పోయలేనండి అని చెప్పేయటం ఒక పద్ధతి. అసలు ముందే చెప్పేస్తారు సిజేరియన్ మంచిది అని! All children are cesarean children. అందరు cesearసే ఇప్పుడు! Caesar అన్న పేరు ఎలా వచ్చిందో తెలుసా? ఇట్లా scissoring చేసి తీసారట మొట్టమొదటిలో ఒకడిని. Scissoring, cesarean

అంటే the product that came out of scissoring, కత్తిరించి తీశారు. అలా వచ్చాడు Julius Caesar. అప్పటినుంచీ ఈ cesarean అనేటువంటి విషయం మనకి వచ్చేసింది. అందుకని, ఇప్పుడు scissoring గే ఎక్కువ అన్నిచోట్ల! పాశ్చాత్య దేశాల్లో ఇప్పుడిప్పుడే cesarean లోంచి బయటకి వచ్చేద్దాం, let it be natural అని మళ్ళీ వెనక్కొస్తున్నారు వాళ్ళు. వాళ్ళేం చేస్తే మనం అది చేస్తాం తప్ప, మనకుండే జ్ఞానం మనం ఎన్నడో వదిలేశాం, మరిచిపోయాం, దార్లోనే అక్కడ పారేశాము!

అలా ప్రకృతి సహజంగా లోపల దివ్యదేహం ఏర్పడటం అనేది ఒక కార్యక్రమం. మనం అది మర్చిపోకూడదు. అసలు ఈ గురుపరంపర యోగంలో మనం చేరాటానికి ముఖ్య మేమిటంటే మన యందు ఒక పుష్పం పుట్టాలి, లేకపోతే ఒక పండు పండాలి. అలా పండడానికి చేసే సాధనలో. . . సాధన ఎంత శ్రద్ధాభక్తులతో చేసినా, అది రజోగుణ ప్రవృత్తితో కూడిన విపరీతమైన సాధన కాకూడదు. విపరీతమైతే ఏమవుతుందంటే దేహం ఇబ్బంది పడుతుంది, ఒకటి. రెండొవది, నీ చుట్టూ ఉండేవాళ్ళు ఇబ్బంది పడతారు. ఈ రెండూ లేకుండా సాగిందే సాధన. అలా జరిగిందను కోండి, దానికి మళ్ళీ ఫలితాలుంటాయి, పర్యావసానా లుంటాయి. మనం consequences అంటాం కదా! నీవు నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా, నీవు యోగసాధన పేరున కొంచెం ఒక extremistగా, ఒక fundamentalistగా పనిచేస్తున్నా వనుకో... అతివాదమంటారు దాన్ని. అతివాదం ఉండకూడదు యోగంలో, సామ్యవాదం ఉండాలి, సమభావం ఉండాలి.

ఈ రుక్మిణీ కళ్యాణంలో ఇలా అన్వయించుకొని, రుక్మిణి పరిస్థితుల్లో మన్ని పెట్టుకొని చెప్పుకుంటే తప్ప ఈ కథ మనకి బాగా అర్థం కాదు. అందుకని, ఆమె కబురు పంపించింది, " నేను నగరంలోంచి బయటకి వస్తాను స్వామీ! నువ్వు నన్ను తీసుకెళ్ళు" అని. మనం కూడా పురంలోంచి బయటికి వచ్చి, ఏ హృదయమన్నా చేరకపోతే, అంతకన్నా కిందనుంచి మనని పీకలేడు. పీకితే, చచ్చిపోతాడు జీవుడు. హృదయమన్నా చేరాలి, భ్రూమధ్యం చేరడం ఉత్తమము. చేరితే, ఆయన సహస్రారం ద్వారా ప్రవేశించి నిన్ను అందుకుంటాడు. సహస్రారం ద్వారా ప్రవేశించేటువంటి దివ్యప్రజ్ఞ హృదయం వరకు రాదు. ఇది ఒక యోగ ప్రక్రియ. మనం కొన్ని ఆవరణలు దాటి సిద్ధంగా ఉండాలి. అప్పుడు కొన్ని ఆవరణలలో అతడు ప్రవేశించి, మనల్ని అందుకుంటాడు అని తెలియాలి – అది యోగం. నువ్వు ఒక అడుగేస్తే, నేను పది అడుగులు వేస్తానని చెప్తాడు. ఆ ఒక్క అడుగు గురించే మాట్లాడుతున్నాను.

పువ్వు రాకముందే చెట్టులోనుంచి పీకలేవు కదా నువ్వు! ఇంకా పిందెగా ఉండగానే నువ్వు తీసుకున్నా నీకు అది ఉపయోగపడదు. పిందె క్రమంగా వికసించి, పుష్పం అవ్వాలి. ఆ పుష్పం కూడా సులభంగా మనం ఇలా ముట్టుకుంటే చేతిలోకి వచ్చేట్టుగా ఉంటే అప్పుడు మొక్కకి నొప్పి కలగదు కదా! ఇలా మనం గిల్లేసి తీస్తుంటాం కదా! కొన్ని కొన్ని రావు, అప్పుడు అలా లాగుతూ ఉంటాం! యోగప్రక్రియ అలా జరగకూడదు. అది ఎలా ఉండాలి? Iam ready, I offer myself, నీ పూజకి నన్ను నేను సంసిద్ధంగా ఉంచుకున్నాను అనే పద్ధతిలో పువ్వు ready గా ఉంటుంది. ఆ రోజుకి వదిలేస్తే సాయంత్రం కిందపడిపోతుంది –

పూలమొక్కల నుంచి పువ్వులు కిందపడ్డట్లు. పారిజాతాలన్నీ కిందే పడుతుంటాయి. అవి ఎక్కువసేపు ఉండవు. సంసిద్ధమైనవన్నీ మూలం నుంచి బయటకి వచ్చేస్తాయి. మన జీవప్రజ్ఞ ఎక్కడో మట్టిలోకి తలక్రిందులుగా పడుంటుంది. ఎన్ని చెప్పినా, ఎన్ని సంవత్సరాలనుంచి యోగం చెప్పుకున్నా– ఎంతసేపూ మనకి మన సంపాదన, మన కూడబెట్టుకోవడాలు, మన ఆస్తులు, వాటిని పెంపొందించుకోవడాలు, అది ఇక్కడ పెట్టాలా, అక్కడ పెట్టాలా, ఎంత ధర ఉంది, ఈ గోలే! బయట విషయాల్లోనే అలా ఉంటే ఇంక దేహం విషయాల్లో ఎలా ఉంటాము?

దేహపదార్థం నుంచి నీవు క్రమంగా దైవస్ఫూర్తితో ఊర్ధ్వగతి చెందుతూ ఉంటే, కొన్ని ఆవరణలు నీకుగా నువ్వు దాటాలి. కొన్ని ఆవరణలు నువ్వు దాటితే, కొన్ని ఆవరణలు నేను దాటుకొని వచ్చి, నిన్ను అందుకుంటాను అనే విషయం ఈమె *"నగరు వెడలి నడిచె నగజాతకును మ్రొక్క"* అన్న దాంట్లో ఉందండి. అమ్మవారికి పూజ చేసేటప్పుడు నవ ఆవరణ పూజ చేస్తారు కదా! అందుకనే దుర్గ అష్టమి నాడు అహంకారాన్ని బాగామర్దిస్తుంది. నవమి నాడు మహర్నవమి అది. అమ్మవారికి చేరువ అవుతాము. దశమి నాడు చేరిపోతాం. ఇప్పుడు ఈ విధంగా ఆవిడ బయటకి వచ్చింది.

"మఱియు సూతమాగధవందిగాయక పాఠకజను లంతంత నభినందించు చుం జనుదేర మందగమనంబున ముకుంద చరణారవిందంబులు డెందంబునఁ దలంచుచు నిందుధరసుందరీ మందిరంబు సేరి సలిల ధారాధౌత కరచరణారవిందయై వార్చి శుచియై గౌరీసమీపంబునకుం

జనియె నంత ముత్తైదువ లగు భూసురోత్తముల భార్యలు భవసహిత యైన భవానికి మజ్జనంబు గావించి గంధాక్షతంబు లిలిడి వస్త్రమాల్య భూషణాదుల నలంకరించి ధూపదీపంబు లొసంగి నానావిధోపహారంబులు సమర్పించి కానిక లిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి రప్పుడు."

ఆవిడకు కృష్ణస్మరణ ఒకటే program కదా! *"సూతమాగధ వందిగాయక పాఠకజను లంతంత నభినందించుచుం జనుదేర"* – పొగడ్తలు పొగడేవాళ్ళుంటారు, వందిమాగధులు. రాజులకి ఎప్పుడూ చుట్టూ పొగడేవాళ్ళు కొంతమందుంటారు. మనవాళ్ళు కూడా యథాశక్తి ఏర్పాటు చేసుకుంటూ ఉంటారులెండి! మన్ని విమర్శించే వాళ్ళని మన దగ్గర పెట్టుకోము కదా! మన్ని పొగడేవాళ్ళనే మన చుట్టూ పెట్టుకుంటూ ఉంటాం. పాటలు పాడే వాళ్ళు పాడుతున్నారట, వేదపాఠాలు చదివేవారు చదువుతున్నారట, అభినందించేవాళ్ళు అభినందిస్తున్నారట. *"మందగమనంబులు"* – నెమ్మదిగా. *"ముకుంద చరణారవిందంబులు డెందంబునఁ దలంచుచు"* – హృదయమునందు భగవంతుడి యొక్క పాద పద్మములను బాగా స్మరణ చేసుకుంటూ, *"నిందుధరసుందరీ మందిరంబు"* చేరి. "ఇందుధరుడు" అంటే శివుడు, చంద్ర శేఖరుడు. చంద్రశేఖరుడంటే అందరికీ తెలుసు. ఇందుధరుడు అని పెట్టుకుంటే? "ఇందుధర్" అని పెట్టుకుంటే కొత్తగా ఉంటుంది! ఎందుకంటే, పాత పేర్లు పిల్లలు ఒప్పుకోరుగా! ఎవరన్నా పేరు పెట్టండి అంటే ఇలాంటివేవో వెతుక్కుంటూ ఉండాలి. "ఇందుధర్" అన్నామనుకోండి, "అదేంటి సార్?" అంటే అదే, చంద్రశేఖరోయ్!"

అని చెప్పాలి. *"నిందుధరసుందరీ మందిరంబు"* – ఇందుధర సుందరి ఆవిడ. అంటే, శివునికి ప్రీతి కలిగించేటువంటి అమ్మవారు కదా!

*"నిందుధరసుందరీ మందిరంబు నేరి సలిల ధారాధౌత కరచరణారవిందయై"*– ముందు గుడిలోకి వెళ్ళంగానే చేతులు కడుక్కుంది. సలిలములంటే నీళ్ళు. వాటితో "ధౌతం" – కడుక్కోవటం. *"ధౌత కరచరణారవిందయై"* – చేతులు కడుక్కుంది. అంటే, మనం ఏం చెయ్యాలో చెప్తుంటాయి. గుడికెళ్తే లోపలికెళ్ళి ముందు ఏం చెయ్యాలి? కాళ్ళు, చేతులు కడుక్కోవాలి. ఇంట్లో కడుక్కున్నాం కదా అంటే మరి రోడ్డు మీద నడిచాం కదా అని చెప్తారు. అందుకని, ఇది చదువుకుంటే ఏమవుతుందంటే కొన్ని కొన్ని సంస్కారాలు మనకి తెలుస్తూ ఉంటాయి. గుడి ఆవరణంలో ప్రవేశించి, ఏదో ఒక మూల పంపు ఉంటుంది, అలా కాళ్ళు, చేతులు కడుక్కొని, వీలుంటే కొంచెం కన్నులు కూడా కడుక్కొని, కొన్ని నీళ్ళు నెత్తిమీద వేసుకొని, అప్పుడు గుడిలోకి వెళ్ళటం ఆచారం.

*"భవసహితయైన భవానికి"* అంటే అక్కడ గుడిలో శివుడు, పార్వతి ఇద్దరూ ఉన్నారు. *"మజ్జనంబు గావించి"* – స్నానం చేయించి, అభిషేకం చేశారన్నమాట. *"గంధాక్షతంబు విలిడి"* – గంధము, అక్షతలు. *"వస్త్రమాల్య భూషణంబుల నలంకరించి"* – బ్రాహ్మణుల భార్యలు వివరంగా గుడిలో పూజ చేశారండి. *"నలంకరించి ధూపదీపంబు లొసంగి నానావిధోపహారంబులు సమర్పించి"* – నైవేద్యం కూడా పెట్టారు. *"కానిక లిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి రప్పుడు"* –

వాళ్ళంతా బాగా పూజచేసుకున్నంత సేపు ఆమె కూడా దండం పెట్టుకొని కూర్చుంది. ఆ తర్వాత మొక్కించారు. మొక్కితే అప్పుడు ఆ అమ్మవారు ఏం భావన చేసిందో మనకి ఇచ్చారండి. ఆ పద్యం దాదాపు నేను తెలుగువాడిని అనుకున్న ప్రతివాడికి వచ్చి ఉండేది ఇది వరకు. ఇప్పుడు కూడా వింటే అవును, మాకు తెలుసులెండి అని మీరంటారు. అలాంటి పద్యమది. ఇది కంఠస్థం చెయ్యాల్సిన పద్యం. మనకు కూడా పనికొచ్చే పద్యం.

"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ పురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటిపె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!"

రోజూ ఇలాంటి పద్యం తెలుగులో ఒకటి చదువుకుంటూ ఉంటుంటే అమ్మ అనుగ్రహం చాలా సులభంగా లభిస్తుంది. సంస్కృతం ఏదో చదువుకుంటాం గాని అది అర్థం చేసుకొని చదువుకుంటే గాని అందులోని భావగంభీరత మనకి అందదు. ఇలాంటి పద్యం ఉందనుకోండి, చదువుకుంటేనే మనకి లోపల నుంచి ఒక రకమైనటువంటి భక్తి హృదయంలో, హృదయాన్ని ద్రవింపచేసే విధంగా ఉంటాయి ఈ పద్యాలు.

*"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్"* –సనాతనులంటే ఎప్పుడూ ఉండేవాళ్ళని అర్థం. పార్వతీ పరమేశ్వరు లంటే ప్రకృతి–పురుషులు. వారు ఎప్పుడూ ఉన్నారు. సృష్టి ఉన్నప్పుడూ ఉన్నారు, సృష్టి లేనప్పుడూ ఉన్నారు. అయ్యవారులోంచి అమ్మవారు వచ్చింది అని చెప్తుంటామే...

అయ్యవారులోంచి అమ్మవారు, అయ్యవారు, ఇద్దరూ ఒకేసారి బయటకి వస్తారు. అంతకుముందుండే తత్త్వమే. అందుకనే, వాళ్ళిద్దర్లో ఎవరు ముందు, ఎవరు వెనుక అనేటువంటిది లేదు. విద్యుత్తు manifest అయితే AC, DC current గానే manifest అవుతుంది. ఇంకోరకంగా manifest అవ్వదు కదా! అంటే, ప్రకృతి లేనిది పురుషుడు లేడు, పురుషుడు లేనిది ప్రకృతి లేదు. వీళ్ళిద్దరిలో ఎవరు గొప్ప అంటే, ఇద్దరూ సరిసమానమైనటువంటి వారు. వారిరువురు సనాతనులే అయి ఉండటం చేత మనం ఎలా భావన చేయాలి? అమ్మవారి పూజ చేస్తే అయ్యవారి పూజ చేయాలి. అయ్యవారి పూజ చేస్తే అమ్మవారి పూజ చేయాలి. వీళ్ళిద్దరూ ఒక్కటే అనే భావన ఎప్పుడూ ఉండాలి.

అందుకనే, మన పూజా విధానంలో పురుషసూక్తం–శ్రీసూక్తం, లక్ష్మీఅష్టోత్తరం–నారాయణ కవచం ఇచ్చారుకదా! దీని తర్వాత అది, దాని తర్వాత ఇది. లేకపోతే, ఇది ముందు చదవచ్చు, అది తర్వాత చదవచ్చు. ఎలా అయినా చేసుకోవచ్చు. ప్రకృతి పురుషులను సమానంగా ఆరాధన చేయటం యోగవిధానం. అందుకనే, ప్రతి దేవాలయంలో కూడా అమ్మవారున్న చోట అయ్యవారుంటాడు. అయ్యవారున్నచోట అమ్మవారుంటారు. అయ్యవారిని చూశాం కదా, అమ్మవారిని చూడక్కర్లేదు అనడానికి వీల్లేదు. అయ్యవారిని చూశాం కదా, అమ్మవారిని చూడడం ఎందుకులే అనుకోగూడదు. ఇద్దర్నీ చూడాలట. ఇంకో రహస్యం చెప్పనా, అసలు ఏదైనా ఒక విగ్రహం ఉంటే అది అమ్మవారే. ఎందుకంటే, అయ్యవారికి రూపం లేదు. అమ్మవారిలో అయ్యవారుంటారు. రూపం అమ్మవారిది. అందు వశించేటటువంటి వాడు అయ్యవారు.

అతను పురుషుడు, ఆమె పురము అయివుండటం చేత వాళ్ళెప్పుడు ఏకకాలంలో అవతరిస్తారు సృష్టి యందు. సృష్టి లేనప్పుడు తత్త్వంగా ఉంటారు. ఇది బాగా తెలియాలి.

*"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్ మిమ్ముఁ బురాణదంపతుల"*– ఇంతకన్నా ముందు దంపతి లేదు. అందుకనే, మనకి పెళ్ళప్పుడు పెళ్లికూతురు చేత గౌరీపూజ చేయిస్తారు. ఎందుకు చేయిస్తారంటే, ఆవిడే అందరికన్నా ముందు నుంచి ఉంది. *"పురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ"* —ఎప్పుడూ నేను మిమ్మల్ని భజన చేస్తూనే ఉంటాను కదా! "మేటిపెద్దమ్మ" – చాలా పెద్దమ్మ అంటే అమ్మనుగన్న అమ్మ, అమ్మలకు అమ్మ. మొట్టమొదట ఎవరు అంటే ఆదిపరాశక్తి, పరా ప్రకృతి అయినటువంటి తల్లి. *"దయాంబురాశివి గదమ్మ!"* – అది కావాలి. ఎందుకంటే, జీవుల యెడల మనం దయ చూపిస్తున్న కొద్దీ మన యందు అమ్మ దయ చూపిస్తుంది. జీవుల యెడల మనం ఎంత దయ చూపిస్తే, అమ్మ మన యందు అంత దయ చూపిస్తూ ఉంటుంది.

*"దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయుము"*– అది కూడా కోరాలి మనం, నాకు నా స్వామిని నీవు ఏర్పాటు చేయమని. ఎందుకంటే, ఆమె తలచుకుంటే తప్ప కార్యం సిద్ధించదు, సంకల్పం ఆవిడదే. అంచేత, అమ్మవారి ప్రార్థన ప్రధానమైనటువంటి ప్రార్థనగా మన సంప్రదాయంలో ఏర్పరచారు. ఏ పని కావాలన్నా అమ్మవారిని ప్రార్థన చేసుకోవాలి. ఆవిడ సంకల్పిస్తే ఎలాంటి కార్యాలైనా అవుతాయి. ఇక్కడ హరిని పతిని చేయటం ఏమిటి? కృష్ణుడిని పతిని చేయాలి కదా! అంటే, కృష్ణుడు, హరి అనేది ఒకటే.

"హరి" అన్న పదానికి ప్రత్యేకమైనటువంటి అర్థం దిగివచ్చేవాడని. దిగిరానివాడిని మనం పట్టుకోవాలంటే కష్టం కదా! దిగి వచ్చే వాడిని హరి అంటారు. ఎవరైతే ఆవరణలోకి దిగిరాగలడో వాడిని "హరి" అంటాం. గజేంద్రుడిని రక్షించాలని దిగి వస్తాడు. "భగవంతుడు హరియై దిగివచ్చుట" అనేది ఒక heading పెట్టి భాగవత రహస్య ప్రకాశంలో మాస్టారు వివరం ఇచ్చారు. ఎప్పుడైతే సర్వవ్యాపియైనటువంటి దైవము ఒక సన్నివేశం కోసం దిగివస్తాడో అప్పుడు అతడు "హరి" అవుతాడు. ఇట్లా దిగి వచ్చి, మనల్ని అందుకొని వెళ్ళాలి కదా! భక్తుడు తానుగా భగవంతుని దగ్గరకు చేరలేడు. భగవంతుడు వచ్చి, తనను తీసుకువెళ్ళాలి అనేటువంటి పద్ధతుల్లో ఉంటాం. మనం భగవంతుని దగ్గరకు చేరటం అనేటువంటిది అహంకారం, అది అయ్యే పని కాదు. సూర్యుడు దగ్గరికి మనం వెళ్ళలేం. సూర్యుడు కిరణముల ద్వారా వచ్చి మనల్ని అందుకోగలడు. అంచేతే, మన సంప్రదాయంలో పెళ్ళికొడుకు పెళ్ళికూతురు ఉన్నటువంటి ఊరికి వచ్చి, పెళ్ళికూతుర్ని తీసుకొని వెళ్ళాలి. ఎందుకంటే, పెళ్ళికొడుకు విష్ణుస్వరూపుడు. మనకి హరి ముఖ్యం. హరి అంటే దిగివచ్చేవాడు అని అర్థం. మనం ఉన్నచోటులోకి అతను దిగిరావాలి. అలా దిగివస్తేనే కార్యక్రమం. అలా దిగిరాకపోతే, మనకిగా మనం వెళ్ళలేం. అలా ఎవరైతే దిగిరాగలడో, వాడు వచ్చి నన్ను అందుకునేట్టుగా చూడమని చెప్తోంది రుక్మిణీదేవి. హరి దిగిరావడానికి మనము అమ్మవారిని ప్రార్థన చేస్తాము. అమ్మవారే హరి. హరి రూపంలో దిగివచ్చేది ఆమే.

*"నమ్మినవారి కెన్నటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!"* అంది. నిన్ను నేను నమ్ముకున్నాను. నాకు హరి పతిగా కావాలి అని కోరుకుంటోంది. మనం కూడా అదే కోరుకుంటున్నాం. ఇప్పుడు మనం మాస్టర్, మాస్టర్ అంటుంటాం కదా! ఏమిటి మాస్టర్? దిగి వచ్చి, మనల్ని తీసుకువెళ్లి, బ్రహ్మం దాకా తయారుచేస్తున్నట్టు బాధ్యత వహించే మాస్టర్ హరియే. మనం పిలవంగానే వచ్చి, మన హృదయంలో కూర్చొని, మన లోపల చేయవలసిన మరమ్మత్తు లన్నీ చేసి, మనల్ని తనతో పాటు తీసుకెళ్ళేవాడు హరేగా! మనం వేరు వేరు పదాలు వాడుకోవటం చేత, అంతా వేరు వేరు అనుకుంటున్నాం. కానీ, వేరు కాదు, అదంతా ఒకటే. ఎవరు దిగివచ్చి, మనల్ని ఉద్ధరిస్తాడో, వాడల్లా హరే నండి. హరి గురువు కూడా, గురువు హరి కూడా.

**"అని గౌరీదేవికి మ్రొక్కి పతులతోడం గూడిన బ్రాహ్మణభార్యలకు లవణా పూపంబులును దాంబూల కంఠ సూత్రంబులను నిక్షుదండం బులు నిచ్చి రుక్మిణీదేవి వారలం బూజించిన."**

అమ్మవారికి మ్రొక్కిన తర్వాత ఆ బ్రాహ్మణ స్త్రీలందరిని పూజించిందట. మనక్కూడా ఆచారంలో పెద్దముత్తైదువలకి తాంబూలం ఇప్పిస్తారు. ఇక్కడ ఏం చేశారు? వాళ్ళకి తయారు చేసిన పిండి వంటలతో సహా తాంబూలాలిప్పించి... కంఠసూత్రం అంటే మంగళసూత్రం. వారిని యథావిధిగా సత్కరించి, ఆ తర్వాత పండ్లిచ్చి, చెఱకు గడలిచ్చి.... చెఱకు గడ దేనికి ప్రసిద్ధి అంటే అది చాలా తీపితోకూడినది కాబట్టి. తీపి పదార్థమైన చెఱకు

గడనిస్తే మనకి జీవితంలో ఏది తియ్యటి అనుభవమో, అది మనకి దక్కడానికి సంకేతం. మనం ఏది అందిస్తే, అది మనకు అందుతూ ఉంటుందండి. అందుకే స్వీట్లు పంచుతూ ఉంటాం కదా! ఎంచేత? మన జీవితం మధురంగా ఉండాలంటే స్వీట్లు పంచుతాం. అంతేగాని, కాకరకాయలు అలాంటివి పంచుకోరు కదా! అవి కావాలనుకుంటే కొనుక్కుంటారు! "మీకు sugar కదండి, ఒక kg కాకరకాయ పట్టుకొస్తాను!" అని ఎవరూ రాలేదు నా దగ్గరికి! గురువుగారికి sugar. వారికి కాకరకాయ ఇద్దాం లేదా వేపపండ్లు ఇద్దాం, వేపచిగురు ఇద్దాం. ఇలా పెట్టుకోరుగా! ఆయనకి sugar. అయినప్పటికీ కూడా మనం ఇవ్వాల్సింది తీపే అని తీపిస్తారు. ఎందుకని? వాళ్ళు జీవితంలో తీపి కోరతారు కాబట్టి. మనం ఏమిస్తే, మనకది వస్తుంది. "ఇక్షుదండములు" – వీళ్ళందరికి చెరుకుగడలు. అమ్మవారికి ప్రీతికరమైనది చెఱకు గడలు. అమ్మవారు అందరికి మధురమైనటువంటి జీవనం ఉండాలని కోరుకుంటూ, అవి ఎప్పుడూ పట్టుకొని ఉంటుంది.

"వార లుత్సహించి వలనొప్ప దీవించి
సేస లిడిరి యువతి శిరమునందు
సేస లెల్లఁ దాల్చి శివవల్లభకు మ్రొక్కి
మౌననియతి మాని మగువ వెడలె."

వాళ్ళు అక్షతలు వేశారట, అనుగ్రహించారట. గుర్తుపెట్టుకోండి, ముత్తైదువలకి మనం ఏదన్నా చేసేటప్పుడు వాళ్ళు సంతోషించేట్లుగా చేయాలి. సీతాదేవి ఋషి భార్యలందరికీ తిలకం అద్దుతుంటే, ఒక ఋషిపత్నికి కొంచెం నొప్పి పుట్టేట్టుగా అద్దిందట.

అంచేత, ఒక సంవత్సరం ఆ విధంగా కష్టపడాల్సి వచ్చింది. బొట్టు చాలా జాగ్రత్తగా పెట్టాలి. ఒక పుణ్య స్త్రీ మరొక పుణ్యస్త్రీకి తిలకం అద్దేటప్పుడు చాలా సున్నితంగా పెట్టాలి. ఎంచేత? నువ్వు ఏది కోరుకుంటున్నావో అది నీకు లభ్యం కావాలంటే, నీవు పెట్టిన తీరుతో అవతలవాళ్ళు సంతోషించాలి తప్ప దుఃఖపడకూడదు. అలా ఇంత పెట్టామనుకోండి, అది వచ్చి అవతల వాళ్ళకి కళ్ళల్లో పడ్డదనుకోండి, నీకు ఫలం దక్కదు. " వివాహం తర్వాత నీకు చాలా కష్టాలుంటాయి తల్లీ!" అని ఆ ఋషిపత్ని చెప్తుంది. అంటే, శాపం కాదు. అది జరిగిన సన్నివేశం లోంచి ఆమె చూసి చెప్పేసింది. అమ్మవారి వైవాహిక జీవితమంతా కూడా ఏముంది? అరణ్యాలకి వెళ్ళిపోయింది. అటుపైన తిరిగివచ్చినా, మళ్ళీ అరణ్యాలకే వెళ్ళిపోయింది కదా! ఈ ముత్తైదువలకి మనం ఇచ్చేటువంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి.

*"వార లుత్సహించి వలనొప్ప దీవించి"* – వాళ్ళందరూ బాగా ఉత్సాహంగా దీవించారు. జరగబోయే సన్నివేశం ఎవరికీ తెలియదు. కేవలం ఆవిడకే తెలుసు, ఆయనకే తెలుసు. ఇంకెవ్వరికి తెలీదు. పెళ్లికూతురికి జరగబోయే విషయం తెలుస్తుందండి. కానీ, ఎలా జరుగుతుందో తెలియదు, ఎలా వస్తాడు? ఇప్పుడు రావాలి కదా! వచ్చి తన్ని తీసుకెళ్ళాలి కదా! అంచేత, వాళ్ళందరికీ భక్తిగా దండం పెట్టుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా ఇంక మాట్లాడటం మొదలు పెట్టింది. *"మౌననియతి మాని మగువ వెడలె"* – బయలుదేరి వచ్చిన దగ్గరనుంచి అంతవరకు మౌనంగానే ఉంది. అమ్మవారికి మొక్కుకోవటం తప్ప, అది కూడా భావమే, మన

లాగా బయటకి చదవలేదు పద్యాలు! రుక్మిణి భావాన్ని ఇక్కడ ఆవిష్కరించారు అంతే.

"ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు తెఱంగున మృగధరమండలంబు నిర్గమించి చరించు మృగంబు చందంబునఁ గమలభవనర్తకుం డెత్తిన జవనిక మఱుఁగు దెరలి పొడసూపిన మోహినీదేవత కైవడి దేవ దానవ సంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్య మాణ పన్నగేంద్ర పాశ పరివలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల మంథాన మథ్యమాన ఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవ మధ్యంబున నుండి చనుదెంచు నిందిరాసుందరీవైభవంబున బహువిధ ప్రభా భాస మానయై యిందుధర సుందరీ మందిరంబు వెలువడి మానస కాసార హేమకమల కానన విహరమాణ మదమరాళంబు భంగి మంద గమనంబునఁ గనక కలశ యుగళ సంకాశ కర్కశ పయోధర భార పరికంప్య మాన మధ్యయై రత్నముద్రికాలంకృతంబైన కెంగేల నొక్క సఖీలలా మంబు కైదండ గొని రత్ననివహ సమంచిత కాంచన కర్ణపత్త్ర మయూఖంబులు గండభాగంబుల నర్తనంబులు సలుప నరవింద పరిమళ కుతూహలావతీర్ణ మత్తమధు కరంబులమాడ్కి నరాళంబులైన కుంతల జాలంబులు ముఖమండలంబునం గ్రందుకొన సుందర మందహాస రోచులు దిశలందు బాలచంద్రికా సౌందర్యంబు నావహింప నధర బింబఫలారుణ మరీచి మాలికలు రదన

కుందకుట్మలంబుల కనురాగంబు సంపాదింప మనోజాత కేతన సన్నిభంబైన పయ్యెదకొంగు దూఁగ సువర్ణమేఖలాఘటిత మణికిరణపటలంబుల కాల శక్రచాపజనకం బులై మెఱయఁ జెఱకువిలుతుం డొర వెటికి వాఁడియుడిదంబు జళిపించిన ధగధగాయమానంబు లగు బాణంబుల పగిది సురుచిర విలోకన నికరంబులు రాజవీరుల హృదయంబులు భేదింప శింజాన మంజు మంజీర నినదంబులు చెవుల పండువులు సేయఁ బాద సంచారంబున హరిరాక కెదురుచూచుచు వీరమోహినియై చనుదెంచు సమయంబున."

ఇదంతా ఏమిటంటే, అమ్మవారు నడిచొచ్చే విధానం అంతా కూడా వర్ణిస్తారు ఇక్కడ. చిట్టచివరికి ఏముంటుందంటే ఇందులో *"వీరమోహినియై చనుదెంచు సమయంబున"* అంటే ఒక వీరమోహినిగా ఆమె నడిచి వస్తుండే సందర్భం అంతా కూడా వివరిస్తారు. సమయాభావం చేత ఈ వచనం వివరించటం లేదు సుమా!

"అళినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరన్
గలకంఠిన్ వపల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్తనిన్
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభోజాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్."

ఆమె నెమ్మదిగా నడిచి వస్తుంటే ముంగురులన్నీ ఆడు తున్నాయటండి. నల్లనైన ముంగురులు అలా అల్లల్లాడుతూ ఉంటే ముఖం చంద్రబింబం లాగా ఉందిట చూడ్డానికి. లేడి కన్నులు

చూచినట్లుగా అట్లా పక్క చూపులు చూస్తూ నడుస్తోంది. నడిచి వెళ్తోంది, కానీ ఎక్కడున్నాడో చూడాలి కదా! ఇలాంటి కన్నులతో అటుపక్క ఇటుపక్క చూస్తూ ఉన్నది. పగడము వంటి పెదవి కలిగి ఉన్నదట అంటే, ఎఱ్రని పెదవులు కలిగి ఉన్నది. కోకిల కంఠస్వరం వంటి కంఠస్వరం లాగా ఉన్నదిట అమ్మవారి స్వరం. అంటే, కంఠం బట్టి కంఠస్వరం చెప్పారు ఇక్కడ.

మదపుటేనుగులాగా వయ్యారంగా నడుస్తోందట అండి. ఏనుగు నడిస్తే వయ్యారంగా ఉంటుందా అనుకుంటాం. ఏనుగు నడుస్తుంటే వెనకనుంచి చూడండి. ఆ వయ్యారంలో ఒక రకమైన ఠీవి ఉంటుంది. అందుకనే "గజగమనము" అంటారు. కొంతమంది నడుస్తూ ఉంటే, ఆ నడుము ఇలా ఇలా ఊగుతూ ఉంటుంది వెనకాల. అందరికీ అట్లా ఊగదు. కొంతమందికే ఊగుతుంది. ఎవరికైతే మదగజగమనం ఉన్నదో వాళ్ళు చాలా ఐశ్వర్యవంతులు. మీరు ఏనుగు నడుస్తుంటే వెనక నుంచి ఎప్పుడన్నా చూడండి. చూస్తే, మీకు అవగాహన కలుగుతుంది – ఓహో! ఇలా ఉంటుందా మదగమనం అంటే అని. అలా ఆమె నడుచుకుంటూ వెళ్తుందండి. నడుము చూడబోతే సన్నగా ఉందిట. "మృగరాజమధ్యమ సింహం" గమనమేమో "గజగమనము". "నీలమోహిని" – నడిచివస్తుంటే, వాళ్ళంతా విభ్రాంతులైపోయారటండి. ఆమె సౌందర్యానికి ముగ్ధులై, అటుపక్క, ఇటుపక్క చేరిన రాజులందరూ, వారి వారి సైన్యాలన్నీ వెనుక rows లో ఉంటాయి. ముందు row లో వీళ్ళంతా ఆయుధాలు ధరించి ఉన్నారు.

"మఱియు నయ్యింతిదరహాస లజ్జావలోకనంబులం జిత్తంబు లేమఱి ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు

విడిచి గౌరవంబులు మఱచి చేష్టలు మాని యెఱుక లుడిగి యాయుధంబులు దిగవైచి గజ తురగ రథారోహణంబులు సేయనేరక రాజులెల్ల నేలకు వ్రాలి రా యేణీలోచన తన వామకర నఖంబుల నలకంబులు దలంగం ద్రోయుచు నుత్తరీ యంబు చక్కనొత్తుచుఁ గడగంటిచూపులం గ్రమంబున నా రాజ లోకంబు నాలోకింపుచు.''

అలా నడిచి వెళ్తుంటే, *''నయ్యింతి దరహాస లజ్జావలోక నంబులం జిత్తంబు లేమఱి''*– ఆవిడ సిగ్గుతో, సన్నటి చిరునవ్వుతో, అలా అలా కన్నులు తిప్పుతూ నడిచివెళ్తూ ఉంటే, వాళ్ళ చిత్తంబులు ఏమరుపాటు చెందినాయి. మామూలుగా చెప్పాలంటే వాళ్ళకి మతిపోయింది! *''ధైర్యంబులు దిగనాడి''* అంటే దున్నేస్తాం, పొడిచేస్తాం, తన్నేస్తాం అంటూ ఉన్నటువంటిది అంతా వారికి జారిపోయింది. అంటే, అతిలోక సౌందర్యవతిని చూసినవాడు ఎంత వీరుడైనా అలా నీరుకారి పోవాలట. మన తెలుగు భాషలో చెప్పాలంటే నాలుక వెళ్ళపెట్టి, సొంగ కారుస్తున్నాడంటారు చూశారా! అలా ఉంది ఆమె సౌందర్యం. వాళ్ళందరికీ ఏం జరిగిందండి? *''జిత్తంబు లేమఱి ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు విడిచి''* అంటే బెట్టుకూడా పోయిందండి వాళ్ళకి. *''గాంభీర్యంబులు విడిచి గౌరవంబులు మఱచి''* అంటే step by step ఎలా దిగిపోయారో చూడండి. ముందేమో ఈమె వెళ్ళిపోయింది. ఇంక మనసు ఏమరుపాటు వచ్చేసింది, ధైర్యం దిగనాడిపోయింది. ప్రతి వాడికీ లోపల వాడిదైన పట్టు ఒకటి ఉంటుంది కదా, పైగా రాజులు. ఆ పట్టు వీడిపోయింది.

ఇహ వాళ్ళకుండే గౌరవ మర్యాదలు కూడా మరిచిపోయి చూస్తున్నారటండి. ఆమె సౌందర్యంముందు అంతలాగా వాళ్ళు దిగజారిపోయి, అట్లా నోళ్ళు వెళ్ళపెట్టుకొని చూస్తున్నారన్నమాట. *"చేష్టలు మాని యెఱుక లుడిగి యాయుధంబులు దిగవైచి"* – ఆయుధాలన్నీ పడిపోయినాయట. చేతులో ఉండే ఆ విల్లు, గద అన్నీ నేలమీద పడిపోయినాయి. *"గజ తురగ రథారోహణంబులు సేయనేరక"* – ఇప్పుడు వాళ్ళ పరిస్థితి ఏంటంటే, ఇప్పుడు వాళ్ళు గభాల్న ఒక గుఱ్ఱం కూడా ఎక్కలేరు. ఏనుగు మీద, గుఱ్ఱాల మీద వస్తారు కదా! నిలబడ్డారు. ఇప్పుడు కాసేపట్లో ఏదన్నా అవతల వస్తే, వీళ్ళు గుఱ్ఱము ఎక్కలేరు, ఏనుగు ఎక్కలేరు, రథ మెక్కలేరు. ఈ సన్నివేశం ఊహించుకుంటేనే చాలా బాగుంది కదా!

ఆవిడ ఏమి చేసిందంటే, కొంగు భుజంపైన నుంచి పడుతుంది కదా! ఈ ఎడం వైపు కొంగునట్లా సవరించుకుంటూ, వాళ్ళందరినీ అట్లా చూసిందటండి. వీళ్ళంతా స్వయంవరం కోసం వచ్చిన రాజులు, అలా బారులు తీరి, అట్లా దేభ్యం ముఖాలు వేసుకొని ఉన్నారండి అందరూ. అది ఆవిడ ఆలోకించిందట, చూసిందట. మరి స్వయంవరం అంటే అదే! పూర్వకాలంలో రాకుమారి వస్తూ, అందర్నీ చూసీ చూడకుండా చూస్తూ, అందులో ఏ వికారం లేకుండా ఉన్నవాడిని వరిస్తుంది. తనను చూసి వికారం చెందే వ్యక్తిని వరిస్తే ఉపయోగం లేదు. తనకుండే రూప, గుణ, లావణ్యానికి లొంగనివాడు తనకి భర్తగా వస్తే తనను ఎట్టి పరిస్థితుల్లోనైనా రక్షించుకోగలడు. తనకన్నా బలహీనుడు తనకి భర్తగా వస్తే ఉపయోగ మేముందండి! మీ ఇంట్లో పనివాడు లాగా వాడుకోవాలి అంతే! అంతకన్నా పనికిరాడు కదా!

"కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల గ్నునవాంభోజదళాక్షుఁ జారతరవక్షున్ మేఘసంకాశ దే హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్ ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్."

రుక్మిణి చూసిందిటండి. ఇంతకు ముందు చూడలేదు కదా ఎప్పుడూ! వినడమేగా! ఆ ముఖం చూసిందట. చూస్తే, చంద్రమండల ముఖం అది. చంద్రమండలం అంటే ఇరవై ఏడు నక్షత్రాల్లో తిరుగుతూ ఉంటాడు ఆయన. చంద్రుడుకున్న అన్ని కళలు ఆ ముఖంలో గోచరించాయి. ముఖానికి ఎప్పుడూ చంద్రుడే చెప్తారు, సూర్యుడిని చెప్పరు. ఎంచేతంటే, చూస్తే ముఖం ఆహ్లాదంగా గోచరించాలి కదా! ఒకటికి నాలుగు సార్లు చూద్దాం అనిపించేట్టుగా ఉండాలి తప్ప, ఒక్కసారి చూస్తే కల్లోకొచ్చేట్టుగా ఉండకూడదు కదా! ఎన్నాళ్ళనుంచో కృష్ణుడి గూర్చి తాను కలగంటోంది. ఇప్పుడు నిజంగా చూస్తే ఎలా ఉంటుంది? *"గంఠీరవేంద్రావలగ్నం"* – ముఖం చూసింది, నడుం చూసిందట. ఎంత అందమైన ముఖమది! ఎలాంటి నడుమున్నదో కదా! ఆ నడుము ఎట్లా ఉందంటే, సింహము నడుము వలె ఉందిటండి. సింహం నడుము ఎందుకు చెప్తారంటే, సింహంఛాతి ఎంత విశాలంగా ఉంటుందో నడుము అంత సన్నగా ఉంటుంది. ఛాతికన్నా నడుము ఎక్కువ ఉందనుకోండి అది దేహపరంగా అవలక్షణం. ఛాతి కొలతలు తీసుకొని, నడుము కొలత తీసుకోండి. ఛాతి కొలత, నడుము కొలత కన్నా ఎక్కువుండాలి. ఛాతి చాలా విశాలంగా ఉండి, నడుము చాలా సన్నగా ఉందనుకోండి, వారు

చాలా పటుత్వం కలిగిన దేహం కలిగినవారై, బలిష్ఠమైన దేహం గలిగినవారై ఉంటారు. "కంఠీరవం" అంటే సింహం. దాని యొక్క నడుములాంటి నడుము కలిగి ఉన్నాడట. ముఖం ఏమో చాలా అందంగా ఉందిట.

*"నవాంభోజదళాక్షున్"* – అప్పుడే విచ్చుకున్నటువంటి కలువ లేక తామర పువ్వుల యొక్క దళాలుంటాయి చూశారా, అందంగా ఆకర్షణీయంగా ఉంటాయి. అలాంటి కన్నులు కలిగి ఉన్నాడట. *"జారతవక్షున్"* – వక్షము చాలా విశాలమై గోచరించిందట. *"మేఘసంకాశ దేహున్"* – దేహమంతా కూడా ఒక రకమైన శ్యామల వర్ణమది, నలుపని అనడానికి లేదు. అంతే తప్ప, అంత నల్లవాడు కాదు. తెల్లవాళ్ళ మధ్యలో నల్లవాడు. ఛామన చాయ అంటారు చూశారా అలా ఉన్నాడన్నమాట. మామూలు రాజుల మధ్యలో కొంచెం ఓ వన్నె తక్కువుంటాడట. ఎందుకంటే, ఆ రంగులో అలాంటి గోపనం ఉంటుంది. అంటే, ఎవ్వరికీ తెలియదు. ఈ నీలం ఏమిటంటే, లోతు తెలియని తెలుపది. లోతు తెలియని తెలుపు నీలం. అందుకనే, ఆకాశం నీలం అంటూ ఉంటాం కదా! ఎందుకు? లోతు తెలీదు. అది ఎలా ఉంటుందంటే, అది తెలుపనడానికి వీల్లేదు, మరీ నల్లటి నీలం అనడానికి వీల్లేదు. అలాంటి నీలచ్ఛాయ దేహం అటండి.

*"నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం"* – నగారాతి అంటే కొండలకి శత్రువు ఒకడు ఉన్నాడట. పూర్వకాలం ఈ కొండలు, పర్వతాలు వాటికి రెక్కలుండి, ఎగురుతూ ఉండేవి అవి కూడా. మరి పర్వతాలు ఎగురుతూ అట్లా అట్లా తిరుగుతూ వాటికి తోచి నప్పుడల్లా ఇలా భూమి మీద దిగినాయి అనుకోండి, అక్కడ

ఊళ్ళో మనుషులందరూ పచ్చడయిపోతారు కదా! ఆ కొండల యొక్క రెక్కలను తెగగొట్టటానికి ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని బలంగా వాడాడట. ఎవరి బాహుబలం చేత కొండలయొక్క రెక్కలు తెగి పడిపోయినాయో, అలాంటివాడు ఎక్కే ఏనుగు. అది ఐరావతం కదా! ఆ ఐరావతం తొండం ఎంత లావుగా, బలంగా ఉంటుందో, అలా ఉన్నాయటండి ఆయన చేతులు. సామాన్యమైన ఏనుగు కాదది. అది ఇంద్రుడెక్కే ఏనుగు. అలాఅంటే, మనకి ఎలా తెలుస్తుందండి? మనం చూడలేదు కదా! అంటే, చాలా బలిష్ఠంగా ఉంది అని అర్థం చేసుకుందాం. అతడు అటువంటి బాహువులు కలవాడని.

*"చక్రిన్"* – ఆయన అప్పుడప్పుడు చక్రం ధరిస్తూ ఉంటాడు. ఎప్పుడూ ఉండదు చక్రం చేతిలో. ఈ "చక్రి" అనే పదం హస్తమునందు చక్రం ధరించినవాడని కదా! అంతేకాదు, మొత్తం చక్రం తిప్పేవాడు కూడా వాడే. అది సృష్టిచక్రాన్ని తిప్పేటువంటి తత్త్వమది. తత్త్వమే రూపుకట్టుకొని వస్తే కృష్ణుడవుతాడు. అలాంటి *"జక్రింబీతాంబరున్"* – ఆ నీలదేహం మీద పచ్చని వస్త్రం వేస్తే ఎలా ఉంటుందో బాగా ఆలోచించండి! చాలా బాగుంటుంది. అంటే హిరణ్యమైన రంగు, లోపల నీలమైన రంగు. అలాంటి రంగుతో కూడిన వస్త్రాలు ధరించాడు. *"ఘనభూషాన్వితుం"* – బాగా ఆభరణాలు ధరించాడు. *"గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్"* – జగన్మోహనంగా ఉన్నాడాయన. అలాంటి వ్యక్తిని చూసి ఆమె సంతోషించింది.

"కని తదీయ రూప వయో లావణ్య వైభవ గాంభీర్య చాతుర్య తేజోవిశేషంబులకు సంతసించి

మనోభవ శరాక్రాంతయై రథారోహణంబు గోరుచున్న యవ్వరారోహం జూచి పరిపంథిరాజలోకంబు చూచుచుండ మందగమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి ఫేరవంబుల నడిమి భాగంబుగొని చను కంఠరవంబు కైవడి నిఖిల భూపాలగణంబుల గణింపక తృణీకరించి రాజకన్యకం దెచ్చి హరి తన రథంబు మీఁద నిడికొని భూనభోంతరాళంబులు నిండ శంఖంబు పూరించుచు బలభద్రుండు తోడనడవ యాదవవాహినీ పరివృతుండై ద్వారకానగర మార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశు లయిన రాజు లందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక."

ఏం చూసింది? రూపం చూసింది. చాలా లావణ్యంగా ఉంది. సుకుమారమైన స్థితిని "లావణ్య" అంటారు. అందుకని "లావణ్య" అనే పేరు భవిష్యత్తు కూడా అలోచించి పెట్టాలి. లావణ్య అని పేరు పెట్టుకుంటే, ఆ తర్వాత మనిషి పిప్పళ్ళ బస్తాలాగా ఉందనుకోండి! బాగుండదు కదా! అందరూ వెక్కిరిస్తారు కూడా. "ఎందుకు నాకిలాంటి పేరు పెట్టారు" అని ఆ అమ్మాయి కూడా కోప్పడుతుంది వాళ్ళ అమ్మా నాన్నని. "ఏం మీరేమంత లావణ్యంగా ఉన్నారని, నేను లావణ్యంగా పుట్టాను. నాకెందుకు లావణ్య అని పేరు పెట్టారు?" అని అడిగితే ఏం చెప్పలేం! కొన్ని కొన్ని పేర్లు తొందరపడి పెట్టకూడదు. అలా చాలా పెట్టేసుకుంటారు లెండి!

రూప లావణ్యం. అది చాలా వైభవంగా ఉందిటండి. "వైభవం" అన్న పదానికి జ్యోతిషశాస్త్రంలో ఒక అర్థముంది. ఎవరి

జాతక చక్రమందు బృహస్పతి, శుక్రుడు, సూర్యుడు, ఇంద్రుడు– ఈ నలుగురు చాలా ఉచ్ఛస్థితిలో ఉంటారో వాళ్ళదటండి వైభవ మంటే! శుక్రుడు, బృహస్పతి ఇద్దరూ గురువులే. సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు ఇంతమంది ఉచ్ఛదశలో ఉంటే, ఇంక ఆ మనిషి వైభవం పట్టలేని వైభవంగా ఉంటుంది. అలాంటి వైభవంతో ఉన్నాడట. ఆయన గంభీరంగా ఉన్నాడట. గంభీరంగా అంటే అర్థమేంటో తెలుసా? చాలా లోతు తెలియని వ్యక్తి అని అర్థం. అంటే, మనిషి లోతు తెలియదు అన్నట్టుగా ఉంటుంది. "చతురత" అంటే, అది ఒక రకమైనటువంటి నిపుణత్వమది. అంటే, చేతలు గాని, మాటలు గాని అనూహ్యంగా ఉంటాయి. అలా ఉంటేనే అది చతురత. *"తేజోవిశేషంబులకు"* – విశేషమైనటువంటి తేజముంది. ఈ విశేషాలన్నీ చూసేసిందిట రుక్మిణీదేవి. ఒక్కసారి అలా కనపడంగానే అన్నీ గ్రహించేసింది.

*"సంతసించి మనోభవ శరాక్రాంతయై"* – లోపలనుంచి ఇహ మన్మథుని బాణాలు బాగా టప, టప వేసేస్తున్నాడటండి ఆవిడ మీద. అంటే, ఇంక తట్టుకోలేనంత ఆకర్షణ కలిగిందని అర్థం. తట్టుకోలేనంత ఆకర్షణ లోపలినుంచి వచ్చేసింది. ఇంక తాళలేని పరిస్థితి అన్నమాట. *"రథారోహణంబు గోరుచున్న"* – ఇంక ఎలా చూసిందంటే, ఇంకేమిటి ఆలస్యం, ఎత్తుకెళ్ళిపో అన్నట్లుగా చూసిందన్నమాట. అంటే ఆ చూపులో అంత ఆత్రుత కనిపించింది. ఎంచేత? లోపలనుంచి మన్మథుడు పద పద మంటున్నాడు. అలా *"గోరుచున్న యవ్వరారోహం జూచి"* – వరుని దగ్గరికి చేరే ఉద్దేశ్యంతో రథ మెక్కడానికి సిద్ధంగా ఉన్న రుక్మిణీదేవిని చూచాడటండి.

*"పరిపంథిరాజలోకంబు చూచుచుండ మందగమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి"*– మదపుటేనుగులాగా నడిచాడట ఆయన. ఈమె నెమ్మదిగా నడుచుకుంటూ వస్తోందట. ఆయన చాలా నెమ్మదిగా నడుచుకుంటూ వస్తున్నాడట. రాజు లందరూ ఎలా ఉన్నారో పొద్దున చెప్పుకున్నాం. వాళ్ళంతా ఎలా చేష్టలు ఉడిగిపోయారో, ఐదు రకాల పతనాలు చెప్పారక్కడ. వాళ్ళు అట్లా ఊరికే ఉన్నారు తప్ప, చేష్టలు ఉడిగిపోయి ఉన్నారు అమ్మవారిని చూసి. ఈయన వస్తుంటే అసలు వాళ్ళకి ఏమీ చలనం లేదు.

*"గంధసింధురంబు లీలం జనుదెంచి భైరవంబుల నడిమి భాగంబు గొని"* – ఆమె నడుము చుట్టూ చెయ్యివేశాడట. ఆవిడది చాలా సన్నని నడుము కదా! సన్నటి నడుము చుట్టూ ఏనుగు తొండంలాంటి చేయి వేశాడు. వేసి, అలా ఎత్తుకున్నాడు. ఎత్తుకొని, రథంలో కూర్చోబెట్టేశాడు. *"నడిమి భాగంబుగొని చను కంఠరవంబు కైవడి"*– సింహం లాగా అట. అంటే, సింహము లేడిపిల్లని ఆ మధ్య భాగంలో నోటితో పట్టేసుకున్నట్టు. పట్టేసి తీసుకెళ్ళిపోతుంది, తర్వాత భోజనం చేస్తుంది. అక్కడే భోజనం చేయదు పులిలాగా. పులి పద్ధతి వేరు, సింహం పద్ధతి వేరు. పులికి కొంచెం తొందరబాటు, లేకితనం అన్నీ ఉంటాయి. ఆకలి లేకపోయినా తింటూ ఉంటుంది. సింహం అట్లా కాదు. ఆకలి వేస్తేనే తింటుంది. ఎక్కడపడితే అక్కడ తినే type కాదు. తీసుకెళ్ళి, తన గుహా ప్రాంతంలో భోజనం చేస్తుంది.

*"కంఠరవంబు కైవడి నిఖిల భూపాలగంబుల గణింపక"* – అసలు వాళ్ళక్కడ ఉన్నట్టే లెక్కకాదండి ఆయనకి. They don't exist. మొత్తం ఈ రాజులు, వాళ్ళ సమూహాలు, వాళ్ళ సైన్యాలన్నీ అక్కడ ఉన్నా, to him they didn't exist. అందుకనే, ముందు చూశాడు కదా! చూస్తే, వాళ్ళందరూ మనం చిన్నపిల్లలప్పుడు ఆడుకుంటూ ఉంటాం, statue అంటే వాడు నిలబడిపోతాడు కదా! అన్నీ బొమ్మలే! అలా నిలబడి పోయారు. *"గణింపక తృణీకరించి"* అంటే, వాళ్ళను బొత్తిగా గడ్డిపోచలతో సమానంగా చూశాడు అని చెప్పటానికి తృణీకరము అంటారు. *"రాజకన్యకం దెచ్చి హరి తన రథంబుమీఁద నిడికొని భూనభోంతరాళంబులు నిండ శంఖంబు పూరించుచు"* – రథంలో కూర్చోపెట్టుకున్న తర్వాత, ఆకాశం, భూమి నిండిపోయే అంత గట్టిగా ఆయన శంఖం ఒక్కసారి ఊదాడట.

# శ్రీకృష్ణుడు రుక్మిణిని గొనిపోవుట

*"బలభద్రుండు తోడనడవ యాదవవాహినీ పరివృతుండై ద్వారకానగర మార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశు లయిన రాజులందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక"* – అప్పుడు వాళ్ళకి కొంత ఇంద్రియాలు పనిచేయటం మొదలుపెట్టి, "ఒరేయ్! ఇదేంటిరా! అందరము ఇక్కడున్నాం!" అనుకున్నారు. ఆయుధాలు జారిపోయినాయి. వాళ్ళే జారిపోయారు అన్ని రకాలుగా కదా! అప్పుడు జరాసంధుడికి ముందు మెలకువ వచ్చింది అందరి కన్నా. తెలివి వచ్చిందంటాం మనం విశాఖపట్టణంలో. అప్పుడు తెలివొచ్చింది ఆయనకి.

**"ఘనసింహంబులకీర్తి నీచమృగముల్ గైకొన్నచందంబునన్
మనకీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
చనుచున్నా రదె శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ కాల్పనే
తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ క్రంతలన్."**

వారికి రోషం వచ్చేసింది. మంచి సింహంయొక్క కీర్తిని ఒక నీచమైన మృగం యెత్తుకుపోయిన విధంగా ఎత్తుకుపోతున్నాడు కృష్ణుడు అని జరాసంధుడు అంటున్నాడు. ఎవరు ఘనమైనటువంటి సింహం? ఎవరు నీచమృగాలు? బాగా చేతన అధోగతికి జారి వెళ్ళిపోతే నీచమంటారు కదా! అంతకుముందు వరకు వీళ్ళంతా చాలా నీచమంటే, ఆ విధంగా చేతనలు ఉడికిపోయిన వాళ్ళు వీళ్ళు. మెలకువ రాగానే అవతల వాళ్ళని నీచులన్నారు.

ఎందుకంటే, వాళ్ళ స్వభావమది. *"గోపకుల్బనుచున్నా రదె"* – ఈ గోపకులందరూ కూడా పట్టుకొని వెళ్లిపోతున్నారు. *"శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ కాల్పనే"* అన్నాడు. ఇంకెప్పుడురా మీ శౌర్యం? ఆయన బయలుదేరి వెళ్ళిపోయాడు. ఎందుకు కాల్చుకోడానికా ఈ శస్త్రాస్త్రాలన్నీ? అన్నాడు

ఇప్పుడు మనం ఈ రుక్మిణి అనే కన్యను అతని నుండి మళ్ళీ తిరిగి సంపాదించుకోకపోతే, విడిపించి తెచ్చుకోలేకపోతే, మొత్తం ఈ భూమి మీద మనుషులందరూ కూడా *"నగరే ధాత్రీజనుల్ క్రంతలన్"* "గ్రంతలం" అంటే చిన్న చిన్న సందులలో. అంటే, చిన్న చిన్న సందుల్లో కూడా నవ్వుకుంటారరట. అంటే, అన్ని చోట్లా నవ్వుకుంటారనేగా అర్థం. ఇప్పుడు ఆ అమ్మాయిని, ఆ రాజ కూతుర్ని మనం విడిపించకపోతే, ప్రతి చిన్న సందులో కూడా మన గురించి నవ్వుకుంటారు. కాబట్టి, ఇంక పదండి అని మొదలు పెట్టాడు.

"అరి బలభట సాయకముల
హరిబలములు కప్పఁబడిన నడరెడుభీతిన్
హరిమధ్య సిగ్గుతోడను
హరివదనముఁ జూచెఁ జకిత హరిణేక్షణ యై."

సరే, వీళ్ళు బయలుదేరారు. అంటే, కోలాహలంగా ఉంటుంది. యాదవసైన్యం బలరాముడి యొక్క ఆధ్వర్యంలో బయలుదేరి ద్వారకానగరం వైపుకి వెళ్ళిపోతున్నారు. రథమెక్కిన తర్వాత, అప్పుడు మొఖం దగ్గరగా చూసిందటండి. అంతవరకు close look లేదు కదా! ఈ హడావిడిలో రథంలో తాను, ఆయన

ఉన్నారు కదా! అప్పుడు దగ్గరగా చూసేసరికి, బిత్తర చూపులు వచ్చేసినాయి ఆవిడకి. కృష్ణుడుని దగ్గరగా చూస్తే, బెదిరిన లేడి ఏ విధంగా చూస్తుందో అలాంటి చూపులతో కృష్ణుడిని అట్లా చూసిందటండి.

"చొచ్చెద రదె యదువీరులు
వ్రచ్చెద రరిసేన నెల్ల వైరులు పెలుచన్
నొచ్చెదరును విచ్చెదరును
జచ్చెదరును నేఁడు చూడు జలజాతాక్షీ!"

అని అన్నాడాయన. ఆయన రథంలో ఎక్కించుకుని పెట్టుకున్నాడు. ఇంక మరి ప్రతాపం చూపించాలి కదా! ఆ గంభీర మైనటువంటి కృష్ణుడిని చూసి ఈవిడ విలవిల లాడిపోయింది, భయపడిపోయింది.

అప్పుడు ఆయనన్నాడు, అదుగో వస్తున్నారు! వాళ్ళందరూ, శత్రుసైన్యాలన్నీ... నొచ్చెదరంటే వేసిన బాణాలు బాగా గుచ్చుకుంటాయి. ఆయుధాలన్నీ బాగా నొచ్చుకోవడం జరుగుతుంది. "విచ్చెదరు" – కాళ్ళు, చేతులు ఊడిపోతూ ఉంటాయి కదా! యదువీరుల బలం అలాంటిది. యదువీరులు చాలా బలమైనవాళ్ళు. అందుకే దుర్యోధనుడు వాళ్ళకోసం మోహపడతాడు. "పదివేలమంది యదువీరులు ఒక పక్క, నే నొక్కడిని ఒక పక్క. ఏం కావాలో చిన్నవాడివి కాబట్టి ముందు నువ్వు కోరుకో" అని అర్జునుడితో చెప్పాడు. అలా అంటే, దుర్యోధనుడు బయపడ్డాడు, అర్జునుడు పదివేల వీరుల్ని కోరుకుంటాడేమో అని. "నేను యుద్ధం చేయను, ఊరికే ఉంటాను. వాళ్ళు పదివేలమంది

యుద్ధం చేస్తారు. ముందు చిన్నవాడిని ఎవరు కావాలో కోరుకోనీ, లేకపోతే చిన్నవాడిని చేసి అన్యాయం చేశాము అని మనిద్దరినీ అంటారు" అని చెప్పి, కృష్ణుడు అర్జునుడికి ముందు అవకాశమిస్తే, అర్జునుడు పదివేల వీరుల్ని కోరుకుంటాడేమో అని దుర్యోధనుడు భయపడ్డాడండి. అంతటివాళ్ళు ఆ యదువీరులు అందరూ, సామాన్యులు కాదు. అందుకని, కృష్ణుడు చెప్తున్నాడు – అదుగో యదువీరులందరూ ఉన్నారు. ఈ యదువీరులు శత్రువీరులు. వాళ్ళందరూ నొచ్చెదరు, విచ్చెదరు, చచ్చెదరు. కొంతమంది they get hurt. కొంతమంది కాళ్ళు, చేతులు, తలకాయలు పోతాయి. కొంతమంది చచ్చిపోతారు చూడు అని చెప్పాడు.

"అని రుక్మిణీదేవిని హరి యూఱడించె నంత లభద్రప్రముఖులైన యదువీరులు ప్రళయవేళ మిన్నునం బన్ని బలుపిడుగు లడరించు పెను మొగిళుల వడువున జరాసంధాది పరిపంథిరాజచక్రంబు మీఁద నవక్ర పరాక్రమంబున శిఖిశిఖా సంకాశ నిశిత శిలీముఖ నారాచ భల్ల ప్రముఖంబు లైన బహువిధ బాణ పరంపరలు గురియ నదియును విదళిత మత్త మాతంగంబును విచ్ఛిన్నతురంగంబును విభిన్నరథవరూథంబును వినిహత పదాతి యూథంబును విఖండిత వాహ వారణ రథారోహణ మస్తకంబును విశకలిత వక్షో మధ్య కర్ణ కంఠ కపోల హస్తంబును విస్ఫోటిత కపాలంబును వికీర్ణ కేశజాలంబును విపాటిత చరణ జాను జంఘంబును విదళిత దంత సంఘంబును విఘటిత వీర మంజీర కేయూరంబును

విభ్రష్ట కుండల కిరీట హారంబును విశ్రుత వీరాలాపంబును విదార్యమాణ గదా కుంత తోమర పరశు పట్టిస ప్రాస కరవాల శూల చక్ర చాపంబును వినిపాతిత కేతన చ్ఛత్ర చామరంబును విలూన తనుత్రాణంబును విలీయమాన ఘోటక సంఘ రింఖా సముద్ధూత ధరణీపరాగంబును వినష్టరథవేగంబునువినవారితసూతమాగధవందివాదంబును వికుంఠిత హయహేషా పటహ భాంకార కరటిఘటా ఘీంకార రథనేమి పటపటాత్కార తురగ నాభిఘంటా ఘణాత్కార వీరహుంకార భూషణ ఝుణఝుణాత్కార నిస్సాణ ధణధణాత్కార మణినూపురక్రేంకార కింకిణీ కిణకిణాత్కార శింజినీటంకార భట పరస్పర ధిక్కార నాదంబును వినిర్భిద్యమాన రాజసమూహంబును విద్య మాన రక్తప్రవాహంబును విశ్రూయమాణ భూత వేతాళ కలకలంబును విజృంభమాణ ఫేరవ కాక గృధ్ర కంకాది సంకులంబును బ్రచలిత కబంధంబును బ్రభూత పలల గంధంబును బ్రదీపిత మేధో మాంస రుధిర ఖాదం బును బ్రవర్తిత ఢాకినీప్రమోదంబును నై యుండ నప్పుడు.

ఇంక ఇవన్నీ ఏముందిలెండి! వరుసగా వీళ్ళందరూ బాణాలు వేస్తుంటే, అవి ఆకాశంలోంచి పిడుగులు పడుతున్నట్టుగా ఉన్నాయటండి. తమ్ముడొక్కడే వెళ్ళాడని బలరాముడు కూడా వచ్చాడు కదా! వీళ్ళు బాణాలు వేస్తుంటే, అవన్నీ సరాసరి పిడుగులు పడ్డట్టుగా పడి, వాళ్ళ రథాలు విరిగిపోయినాయి, గుఱ్ఱాలు చచ్చిపోయినాయి, ఏనుగులు కిందపడిపోయినాయి. మనుషులు

రకరకాలుగా ఛిన్నాభిన్నంగా, వాళ్ళు అందరూ ఓడిపోవటం జరుగుతుంది. మొత్తం సేనంతా ఆ విధంగా, చిత్తుచిత్తు కింద కొట్టారంటారు చూశారా! అంటే, వంద రన్స్ లోపలే all out అయిపోయారంటే ఎలా ఉంటుంది అట్లా!

"మగిడి చలించి పాఱుచును మాగధముఖ్యులు గూడి యొక్కచో వగచుచు నాలిఁ గోల్పడినవానిక్రియం గడు వెచ్చ నూర్చుచున్ మొగమునఁ దప్పిదేరఁ దమ ముందటఁ బొక్కుచునున్న చైద్యుతోఁ బగతుర చేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే."

అయిపోయింది యుద్ధం, ఎక్కువసేపు పట్టలేదు. చాలాసేపు జరుగుతుందనుకున్నారు యుద్ధం. ఇంతమంది రాజులొచ్చారు కదా! చాలాసేపు జరగద్దండి యుద్ధం! ఉన్నట్టుండి ఊరినిండా ప్రకృతి నుంచి పిడుగులు పడిపోయినాయి అనుకోండి, ఎట్లా అయిపోతుంది? ఎంతసేపు పడాలండి? ఇహ, ఈ మిగిలిన వాళ్ళు, శిశుపాలుడు, ఆయన అనుచరులు *"మగిడి చలించి పాఱుచును"* అంటే వెనక్కి పరిగెత్తారు. పోనీలే! నువ్వన్నా బతికావు అనుకున్నారటండి వాళ్ళు. జరాసంధుడు మొదలగు కృష్ణుడు విరోధులైన రాజులందరును కృష్ణుని సైనికుల దెబ్బకు తాడలేక, వెనుకకు తిరిగి పరిగెత్తి పోవుచూ, ఒక ధావన చేరుకొని, దుఃఖపడుచూ, తన యెదుట పెళ్ళామును పోగొట్టుకొనిన వాని వలె మొగము వేల వేసుకొని, వేడి నిట్టూర్పులు విడుచుచున్న శిశుపాలుని చూచి ఊరడించువారై, "ఓ! శిశుపాల, నీవు పగవారి చేత చిక్కుకొని ప్రాణములు పోగొట్టుకొనక క్షేమముగా నున్నావా?"

అన్నారట. ఎలా అయిపోయిందో చూడండి? పాపం వాళ్ళు ముందు మూడు, నాలుగు రోజుల నుంచి చాలా preparation లో ఉన్నారు కదా! అదంతా చాలా తక్కువ time లో ఒక గడియ కాలమంటాం, అంటే ఇరవైనాలుగు నిమిషాలు అనుకోండి.

సరే, ఈయన (శిశుపాలుడు) వెనక్కొస్తే ఆయన కనపడ్డాడట. ఎవరు? జరాసంధుడు, వాళ్ళందరూ కూడా పారిపోయి వచ్చేశారు. జరాసంధుడికి పారిపోవటం కొత్త కాదు. అది బాగా నేర్చుకున్నా డాయన. కృష్ణుడే నేర్పాడు. ఇప్పుడు జరాసంధుడే చెప్పుకుంటాడు అది. *"బగతుర చేతిలోఁబడక ప్రాణముతోడుత నున్న వాఁడవే"* – బతికున్నావు, అంతే చాలన్నాడు. అసలు చచ్చిపోతే ఇంకేం చేస్తావు అని చెప్పాడు.

"బ్రదుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండినఁ
బ్రతుకు గలిగెనేని భార్య గలదు
బ్రతికితీవు భార్యపట్టు దయ్యు మెఱుంగు
వగవ వలదు చైద్య వలదు వలదు. "

ఓడిపోయినవాళ్ళ తత్త్వం చెప్తున్నాడు! ఒక్కొక్కరు ఒక చోట కూర్చొని ఒకరికొకరు ఓదార్చుకుంటున్నారండి. ఓదార్పు మాటలు చెప్పుకుంటున్నారు. ఇంతకి ఎక్కువ effect అయ్యింది ఎవరు? శిశుపాలుడు. ఆయనకోసమే కదా వీళ్ళంతా మోపు చేశారు. నీకెందుకు, మేమున్నాం కదా! నీదే రుక్మిణి! అన్నట్టుగా అందరూ బాగా ప్రోత్సహించారు కదండి శిశుపాలుడిని! అన్నిపక్కల నుంచి. చాలా రాజులు, వారి సైన్యమంతా వచ్చి చేరారు కదా! ఇది

ఏంటి ఇట్లా అయిపొయింది? Double century కొడ్తాడంటే, వెళ్ళంగానే మొదటి ball కే clean bowled అయిపోతే, వాడు తిరిగొస్తుంటే వాడికి ఎట్లా ఉంటుందండి? pavillion కొచ్చిన తర్వాత, వాడిని ఎవరో ఒకడు సముదాయించకపోతే చచ్చిపోతాడు కదా! అందుకని, ఈయన సముదాయిస్తున్నాడు ఈ విధంగా.

*"బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన"* – ఒంట్లో ప్రాణాలంటూ ఉంటే *"బ్రతుకు గలిగెనేని భార్య గలదు"* . రుక్మిణీదేవి లేకపోతే నేను చచ్చిపోతాను అన్నట్టుగా, అంత విపరీతంగా ప్రేమించిన వాడేం కాదు కదా! వాళ్ళదంతా రాజకీయం. ఎవరు ఏ రాజకుమార్తెని పెళ్లిచేసుకుంటే ఏ రాజు మన బలంలో చేరతాడు, ఇది కదా లెక్క! ఎక్కువ రాజుల పెళ్ళిళ్ళు అట్లాగే ఉంటాయి. ఆ పరరాజ్యంలో ఒక కుమార్తె ఉన్నది. మరొక దగ్గర కుమారుడున్నాడు. వివాహం చేస్తే ఏమవుతుంది, రెండు రాజ్యాలు ఒక్కటై పోతాయి కదా! అలా ఉంటాయి తప్ప, ఇలా రుక్మిణీదేవి లాగా, ఇంక మరి కృష్ణుడు లేకపోతే నేను బతకను అన్న పరిస్థితి కాదుగా శిశుపాలుడిది! అందుకని ఏం చెప్పాడు? ఈ భార్య కాకపోతే ఇంకొక భార్య. *"బ్రతికితీవు భార్యపట్టు దైవమెఱుంగు"* – నీకు భార్యంటావా, అది దేవుడికి తెలుసులే, ఆయన చూస్తాడు. God knows అంటాం కదా! *"దైవమెఱుంగు వగవ వలదు చైద్య వలదు వలదు"* అన్నాడు. అంటే ఏడ్చేవాడిని, ఏడవబోకురా! ఇంకో పెళ్ళాం దొరుకుతుంది అని చెప్పాడండి.

అంటే రుక్మిణి దొరకడంలోను, ఇంకొకళ్ళు దొరకడంలోను చాలా తేడా ఉంటుంది, తెలుసా! కొందరి జాతకాలకి వివాహమైన

తర్వాత చాలా వృద్ధి ఉంటుంది తెలుసా! ఎందుకంటే, భార్య సంసారానికి ఎంత హేతువో, ముక్తికి కూడా అంతే హేతువు. మన ప్రారబ్ధం బట్టి అది. ఎవరెవరికి ఎలాంటి భార్య వచ్చినా, భర్త వచ్చినా, ఇద్దరూ కలిసి ముక్తిమార్గంలో నడవడం ఆనందం అనుకోండి. ముక్తిహేతువు – ఒకరికొకరు బాగా support చేసుకుంటారు. చాలా ముక్తిపథంలో నడిచే స్త్రీని ఒక పురుషుడు పెళ్లి చేసుకుంటే, ఆమె యొక్క సంస్కారబలంచేత అతడు కూడా క్రమంగా మార్గంలోకి వచ్చిన సన్నివేశాలు చాలా ఉంటాయి. అందుచేత, ముక్తికాంత పోయిందని బాధపడకు అంటున్నాడు. అంటే, ముక్తికాంత వీడికి ఎలాగు దక్కదు అని! వీడికున్న పరిస్థితికి, సంస్కారానికి దక్కేది కాదు ఆమె. ఇంకోటి ఏదన్నా దక్కుతుందిలే, ఏం ఫర్వాలేదు, ప్రస్తుతానికి మన పరిస్థితి ఈ విధంగా ఉంది కాబట్టి దీనికి నువ్వు ముందు ఈ పరిస్థితిని అంగీకరించమని చెప్పాడండి.

“వినుము. దేహధారి స్వతంత్రుండు గాఁడు. జంత్రగాని చేతి జంత్రపు బొమ్మ కైవడి నీశ్వరతంత్ర పరాధీనుండై సుఖదుఃఖములందు నర్తనంబులు సలుపుఁ దొల్లి నేను మధురాపురంబుమీదఁ బదియేడు మాఱులు పరాక్రమంబున విడిసి సప్తదశవారంబులు చక్రిచేతం బరాజితబలచక్రుండనై కామపాలు చేతం బట్టుబడి కృష్ణుండు కరుణసేసి విడిపించిన వచ్చి క్రమ్మఱ నిరువదిమూఁ డక్షౌహిణులం గూడుకొని పదునెనిమిదవ మాఱు దాడిచేసి శత్రువులం దోలి విజయంబు చేకొంటి నిట్టి జయాపజయంబు లందు హర్షశోకంబులం నెన్నండునుం జెంద నేఁటిదినఁబున నీ కృష్ణు నెదిరిపోర

మన రాజలోకం బెల్ల నుగ్రాక్షుల గూడుకొని పోరిననోడుదు మింతియగాక దైవయుక్తం బయిన కాలంబునం జేసి లోకంబులు పరిభ్రమించుచుండు నదియునుం గాక."

స్వతంత్రం మనం ఉందనుకుంటున్నాం గాని, ఏమీ లేదురా! అని చెప్పాడు. జరాసంధుడు మహాజ్ఞాని. జ్ఞానులకైనా అహంకారం కలిగినప్పుడు ప్రవర్తన మరొక రకంగా ఉంటుంది. తన అల్లుడిని చంపాడు కాబట్టి కృష్ణుడి మీద వైరం తప్ప, వాడు ఎందుకు చంపాడు అనేది చూడాలి కదా! అంతకుముందు తన అల్లుడు కంసుడు చేస్తున్న పనులన్నిటినీ జరాసంధుడు చాలా నిగ్రహించేవాడు. నువ్వు చేసే పనులన్నీ నువ్వు నా అల్లుడవని చెప్పు కోవటానికి సిగ్గుగా ఉంటోదని చెప్తుండేవాడు అల్లుడికి. అంత పెద్దవాడాయన. జరాదేవి కృపతో జీవిస్తున్నటువంటివాడు జరాసంధుడు. చాలా బలులిచ్చి బలవంతుడయ్యాడు. భావిభారత సామ్రాజ్యానికి తాను చక్రవర్తి అవ్వాలనే ఆశ ఉండేది. చాలా బలమైనవాడు. అల్లుడు చేసే పనులు చూస్తుంటే, మరీ ఊరకుక్కలా చేస్తున్నాడనిపిస్తుండేది. తన స్థాయికి తగిన అల్లుడు దొరకలేదే అని బాధ పడేవాడు. అలాంటి అల్లుడిని కృష్ణుడు సంహరించటం చేత, తన కుమార్తె పరిస్థితిని చూసి కృష్ణుడు మీద వైరం పెంచుకున్నాడు. మనకి వైరం ఎవరిమీదన్నా పెరిగితే వాడితో ఎవరకి వైరం ఉంటుందో వాళ్ళందరినీ మనం పోగేసుకుంటాం కదా! అలా అందర్నీ ఒక గుంపు చేసుకున్నాడు. కాని, తెలియనివాడు కాదు. అంచేత, ఏమంటున్నాడంటే *"జంత్రగాని చేతి జంత్రపు బొమ్మ"* – బొమ్మలాడించే వాడు ఒకడుంటాడు కదా! బొమ్మలాడించేవాడు

ఆడిస్తుంటే బొమ్మలు ఆడుతూ ఉంటాయి. రంగులరాట్నం ఎక్కామనుకోండి, ఎక్కికూర్చుంటే తిప్పేవాడిని బట్టి కదా మన తిరుగుడంతా! అట్లాగే సృష్టి చక్రమందు జీవులందరూ కూడా ఒకడు తిప్పుతుంటే అందులో అందరూ తిరుగుతున్నారు రా! అంత పెద్ద స్వతంత్రమేమీ మనకు లేదు.

*"నీశ్వరతంత్ర పరాధీనుండై నర్తనంబులు సుఖదుఃఖము లందు సలుపు"* – అంతా ఈశ్వరేచ్ఛ వల్ల జరుగుతుంది. సుఖ దుఃఖాలు ఈశ్వరేచ్ఛ అని చెప్పాడు. *"దొల్లి ఇది వరకు నేను మధురాపురంబుపై పడి బదియేడు మాఱులు పరాక్రమంబున విడిసి సప్తదశ వారంబులు చక్రి చేత నిర్మూలిత బలచక్రుండనై"*– ఇంతకముందు పదిహేడుసార్లు పరాక్రమంతో పడ్డాడటండి మధురాపురం మీద. ఎందుచేత? కంసుడిని సంహరించిన కృష్ణుడు అక్కడ ఉన్నాడు కాబట్టి జయించాలి. "సప్తదశ వారంబులు" – పదిహేడు మార్లు!

*"చక్రిచేతం నిర్మూలిత బలచక్రుండనై"* –వెళ్తే, కృష్ణుడు పదిహేడుసార్లు శుభ్రంగా జరాసంధుడిని ఓడించేసి, అతడి సైన్యాలన్నిటినీ హరించేసి, అతన్ని మాత్రం వదిలేసేవాడు. ఎందుకలా చేశాడు? జరాసంధుడి మరణం భీముడు చేతిలో నిర్ణయమై ఉన్నది. భీముడు, జరాసంధుడు, దుర్యోధనుడు, కీచకుడు, బకాసురుడు. ఈ ఐదుగురులో ఎవరు ఎవర్ని మొదట చంపితే, ఇహ వాళ్ళే మిగతా వాళ్ళందర్నీ కూడా చంపుతారని ఉంది. వీళ్ళందరూ వాయుపుత్రులే, పంచవాయువులు. ఇందులో ఏ వాయువు మిగతా వాయువుల్లో ఒక దాన్ని హరిస్తే, ఆ

వాయువే అన్ని వాయువుల్ని హరిస్తుందని ఒక కథ ఉన్నది. కథే కాదు, అందులో సత్యమున్నది. అది యోగపరంగా మనం పంచప్రాణాలు గురించి ఎప్పుడో చెప్పుకున్నప్పుడు చెప్పుకోవచ్చు. మొట్టమొదట భీముడు బకాసురుడిని జయిస్తాడు. కాబట్టి అప్పుడే నిర్ణయమైపోతుంది. అంచేత, కృష్ణునికి తెలిసి, అతనిని మాత్రం సంహరించకుండా వదిలేస్తే ఏం చేస్తాడు? మాటిమాటికీ సైన్యాలు తెస్తూ ఉంటాడు. అంటే, ఎవరెవరైతే అధర్మానికి పాల్పడతారో వాళ్ళందరూ అతనితో చేర్తారు కదా! అధర్మం ఆచరించే రాజసమూహాలను వారి సేనలతో పాటు సంహరిస్తూ, జరాసంధుని వదిలేస్తాడు. వదిలేస్తే, వాడు మళ్ళీ పోగేసుకొని మళ్ళీ వస్తాడు. మళ్ళీ వస్తే, మళ్ళీ వాళ్ళందర్ని సంహరించి, వీడిని పంపించేశాడు. ఇట్లా పదిహేడుసార్లు జరిగింది. పదిహేడుసార్లు ఇలా ఓడిపోయాను, ఇప్పుడు అది చెప్తున్నాడు చైద్యుడికి. అంటే 17 grand slam finals లో ఓడిపోయాడండి. ఒక grand slam finals కి కృష్ణుడు ఆడలేదు, కావాలనే. ఆ ఒకసారి భీముడు ఆడాడు. (కృష్ణుని సహాయంతో) అప్పుడు జరాసంధుడు ఓడిపోవడమే కాకుండ, చచ్చిపోయాడు కూడా!

*"బలచక్రుండనై కామపాలు చేతం బట్టువడి కృష్ణుండు కరుణసేసి విడిపించిన పుచ్చిన క్రమ్మఱ నిరువదిమూఁ డక్షౌహిణులం గూడికొని పదునెనిమిదవమాఱు దాడిచేసి శత్రులం దోలి విజయంబు చేకొంటి"* – పద్దెనిమిదోసారి ఇరవై మూడు అక్షౌహిణుల సైన్యాన్ని తీసుకువెళ్ళాను. వెళ్తే, అప్పుడు నాకు జయం కలిగింది. *"నిట్టి జయాపజయంబులందు హర్షశోకంబుల జెంద నేనెన్నండునం"* – అందుకని అన్నిసార్లు ఓడిపోతే మరి

ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో? మరి మీరందరూ ఉన్నా కూడా ఇట్లా ఎందుకు ఓడిపోయామని వాడు అడక్కుండానే చెప్పు కుంటున్నాడన్నమాట.

ఈ రోజున రుద్రుడు, ఉగ్రాక్షుడు, మూడోకన్నువాడు కూడా వచ్చి మనతో చేరి పోట్లాడినా ఇవ్వాళ మనం కృష్ణుడిని గెలవలేము అని చెప్పాడు. ఒప్పుకున్నాడండి. కాని, ఒక్కొక్కరోజు అట్లా ఉండదంటాడు. పదిహేడుసార్లు నేను ఓడిపోయాను, పద్దెనిమిదో సారి గెలిచాను. ఇవ్వాళ ఆ కృష్ణుడని గెలవడం మనవల్ల కాదు. మనవల్ల కాదంటే, ఏమయినా అంటాడేమో అని చెప్పి శివుడని కూడా కలుపుకున్నాడు! అదెందుకండి అక్కర్లేని మాట! కృష్ణుడితో శివుడు యుద్ధం చేయడు కదా! ఎందుకట్లా చెప్పుకున్నాడు? అంటే, నేనే కాదు, వాడైనా ఓడిపోతాడు ఇవాళ కృష్ణుడి చేతిలో అని చెప్తే వీడికి ఊరట కలుగుతుందని. వాడు ఓడిపోతాడో లేదో నీకెట్లా తెలుస్తుంది? మనం ఊరడింపుకు చెప్పే మాటలు ఇట్లా కలిపేస్తుంటాం కదా! ఇంకా continue చేస్తున్నాడు ప్రవచనం శిశుపాలుడికి.

"తమకుం గాలము మంచిదైన మనలం ద్రైలోక్యవిఖ్యాత వి
క్రములన్ గెల్చిరి యాదవుల్ హరిభుజాగర్వంబునన్ నేఁడు కా
లము మేలై చనుదెంచెనేని మనమున్ లక్షించి విద్వేషులన్
సమరక్షోణి జయింత మింతపనికై శంకింప నీ కేటికిన్."

*"తమకుం గాలము మంచిదైన"* ఇవాళ వాళ్ళ time బాగుందయ్యా అని చెప్పాడు. అవ్వటం చేత వాళ్ళకి *"ద్రైలోక్యవిఖ్యాత విక్రములన్"* విక్రములతో గెలిచారట వాళ్ళు. చాలా గొప్పగా

గెలిచారు ఇవాళ. *"యాదవుల్ హరిభుజాగర్వంబునన్"*– కృష్ణుడు తోడుండగ ఈ విధంగా యాదవులు మనల్ని ఎందుకూ కానట్టుగా చిత్తుచిత్తుగా కొట్టేశారు. ఈ రోజున చాలా గర్వంగా పోట్లాడారు. *"కాలము మేలై చనుదెంచనేని"* – మనకి మంచి రోజులు వస్తే... ఈ రోజు ఇలా జరిగింది. ఇంకో రోజు ఇలా జరుగుతుందని ఏమీ లేదు. అందుకని, ఇంకో రోజు మనదై వస్తుంది, మంచి రోజులు వస్తాయిలే, బాధపడకు అని చెప్పాడు. *"శంకింప నీ కేటికిన్"* అని చెప్పాడు.

"అని యిట్లు జరాసంధుండు నతని యొద్దిరాజులును శిశుపాలుని పరి తాపంబు నివారించి తమతమ భూములకుఁ జనిరి. శిశుపాలుండు ననుచర సేనాసమేతుండై తన నగరంబునకుం జనియె. నంత రుక్మి యనువాఁడు కృష్ణుండు రాక్షసవివాహంబునం దన చెలియలిం గొని పోవుటకు సహింపక నేకాక్షౌహిణీబలంబుతోడ సమరసన్నాహంబునం గృష్ణుని వెనుతవిలి పోవుచుఁ దన సారథితో ని ట్లనియె."

వీళ్ళందరూ ఆగిపోయారండి. ఇవాళ ఫాలాక్షుడు వచ్చినా మనం గెలవలేము, కాబట్టి ఇంక వద్దని విజ్ఞత కలిగి వాళ్ళంతా వెళ్ళిపోతే, మూర్ఖుడైన రుక్మి ఒకడు మిగిలిపోయాడు. అంటే, ఇతడు ఎంత మూర్ఖుడో తెలుస్తుంది. అంతమంది మహావీరులు ఇవాళ time బాలేదు, వద్దు అనుకున్నారు. వీడేంటి? రోషం. ఎందుకంటే, proposal రుక్మిది కదా! రుక్మే కదా స్నేహితుడికి చెప్పాడు, "మా చెల్లెల్నిచ్చి పెళ్లి చేస్తాను నీకు" అని. ఇంట్లోనేమో

అమ్మా నాన్నతో బాగా పాషాణంగా వాదించి ఒప్పించాడు. ఇప్పుడు కథంతా ఇలా అయిపోయిందికదా!

"బల్లిదు నన్ను భీష్మజనపాల కుమారకుఁ బిన్నచేసి నా చెల్లెలి రుక్మిణిం గొనుచుఁ జిక్కని నిక్కపు బంట పోలె నీ గొల్లఁడు వోయెడిన్ రథముఁ గూడఁగఁ దోలుము తేజితోల్లస ద్భల్ల పరంపరన్ మదముఁ బాపెదఁ జూపెద నా ప్రతాపమున్."

*"బల్లిదు నన్ను"* – చాలా బలమైనవాడట వాడు! ఇలా మాట్లాడే వాళ్ళు ఎవరూ పైకిరారనేది మనకి తెలిసిన విషయం కదా! చాలా తేజస్సుతో కూడిన, బాణముల పరంపర వరసగా గబగబా కృష్ణుడు మీద వేసి, అతడి మదం అణిచేస్తాడటండి. *"జూపెద నా ప్రతాపమున్"* అన్నాడు. మరి కనీసం driver తో అన్నా చెప్పకపోతే వాడు తోలడు కదా! బలవంతుడగు భీష్మక మహారాజు కుమారుడైన నేను ఒకడున్నా డనేటువంటిది విచారింపక, నా చెల్లెలైన రుక్మిణిని ఎత్తుకొని మహాసూరుడు వలె పరిగెడుతున్నాడు. నీవు శీఘ్రముగా రథమును తోలుము. వాడిగా చేయబడిన బాణముల చేత మదము అణిచి, నా ప్రతాపంబును కనిపింప చేస్తాను అని చెప్పాడు.

"అని యిట్లు రుక్మి యనువాఁడు హరికొలంది యెఱుంగక సారథి నదలించి రథంబు గూడం దోలించి గోపాలక వెన్నముచ్చ నిమిష మాత్రంబు నిలు నిలుమని తిరస్కరించి బలువింట నారి యెక్కించి మూఁడు వాఁడితూపుల హరి నొప్పించి యిట్లనియె."

గబగబా రథం తోలాడు, దగ్గరగా వెళ్ళాడు. మిగతావాళ్ళు ఎవ్వరు దారిలో లేరుకదా! వెన్నను దొంగిలించేటువంటి వాడా, ఓ నిమిషమాత్రం నిలువు అనిచెప్పి, నారి సంధించి ఒక బాణం తర్వాత ఒక బాణం, ఓ మూడు బాణాలు వేసి కృష్ణుడికి గుచ్చుకున్నేట్టుగా కొట్టాడటండి.

"మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ
నేపాటిగలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి
వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు
మాయగైకొని కాని మలయ రావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు
వసుధేశుఁడవు గావు వావి లేదు

కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు."

మూడు బాణాలు వేసి ఈ విధంగా మాట్లాడాడు. ఈ పద్యంలో చాలా తత్త్వం ఉంటుంది. ఈ పద్యంకూడా చిన్నతనంలో పిల్లల చేత కంఠస్థం చేయించేవాళ్ళు. *"మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ"* – మాతో సమానమైనటువంటి వాడివి కాదు అన్నాడు. నిజమే! నీ కన్నా చాలా గొప్పవాడు కదా! కేవలం ఆమె కోరుకోబట్టి

వచ్చాడు గాని, ఆయనకి కోరికేముందండి? భీష్మకుడికిగాని, రుక్మికిగాని అందే విషయమా కృష్ణుడు! *"నేపాటిగలవాఁడ వేది వంశము"* అంటే నువ్వు ఎంతటి వాడవో తెలీదుగా! ఇంతటి వాడు కృష్ణుడు అని ఎవ్వరూ చెప్పలేరు. అంతటి వాడాయన! ఏ వంశము? ఏదో ఉత్తమోత్తమైనటువంటి వంశాల్లో పుడ్తాడని అందరూ ఊహించారట. ఈయన ఆమ్ ఆద్మీ పార్టీలాంటి వంశంలో పుట్టాడు. చాలా సర్వసామాన్యమైనటువంటి వంశంలో పుట్టాడండి. అందుకనే, దశమ స్కంధంలో వస్తుంది – *"శీలము గల కులమున ఏలా పుట్టెను హరి"* అని ఉంటుంది పద్యం. అంటే, శీలముగల కులమంటే మచ్చ ఉన్నటువంటి వంశము అని అర్థం. మచ్చగల వంశంలో పుట్టాడేంటి భగవంతుడు అని. ఏదైతే ఏవిటంట! దిగివచ్చినవాడు ఎలాంటివాడు! మట్టిలో మాణిక్యముందేమిటంటే, మట్టిలో ఉండకపోతే మీ ఇంట్లో iron safeలో ఉండదు కదా! *"ఎందు జన్మించితివి"* – నువ్వు ఎట్లా పుట్టావు? ఎక్కడ పెరిగితివి? నీ నడవడి తెలీదు, నీ పుట్టుక తెలీదు. అసలు భగవంతుడికి పెరగడం అంటే ఏముండదు కదా! అంటే పెరగడం, తరగడం లేనటువంటివాడు, పుట్టుక లేనివాడు కదా!

*"మానహీనుఁడవు"* – మానమంటే కొలత. కొలతల కందదు. కొలతల కందనటువంటి వాడు. *"మర్యాదయును లేవు"* – సంఘంలో బతికేవాళ్ళకి మర్యాద. కానీ, దానికి అతీత మైన వాళ్ళకి మర్యాదతో సంబంధం లేదు. *"మాయ గైకొని కాని మలయ రావు"* – అంటే మాయ ధరిస్తేనే కనిపిస్తాడు, లేకపోతే కనిపించడు. *"నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవువసుధేశుఁడవు గావు వావి లేదు"* – నువ్వు రాజువి కాదు

కదా! మా అమ్మాయిని ఏదో రాజుకిచ్చుకుందాం అనుకున్నాను. నువ్వు రాజువు కాదు. ఎంచేత? కంసుడిని వధించి, రాజ్యాన్ని మళ్ళీ తాతగారికిచ్చేస్తాడు, "నువ్వే రాజువి, నువ్వే పరిపాలించు, మనకి రాజ్యం వద్దు" అని. *"వసుధేశుఁడవు గావు వావి లేదు"* – అలాంటిది నువ్వు గుణరహితుడవు. గుణరహితుడంటే మూడు గుణములకు అతీతమైన తత్త్వమది. దానికి గుణముండదు. మూడు గుణాల్లో ఉంటే ఈ తమోగుణమా, రజోగుణమా, సత్త్వగుణమా అని చూసుకోవాలి. అన్ని గుణాలకి అతీతుడైనవాడు. గుణహీనుడంటే తప్పేముంది? నిందాస్తుతి అంటారు. నింద చేసినట్లు కనిపిస్తుంది, కాని స్తుతి చేసినట్లుంటుంది. *"విడువు విడువ వేని విలయకాలముగా"* అంటే ఇంక ప్రళయం సృష్టించేస్తున్నాను అంటున్నాడండి. తన బాణాలతో ప్రళయం సృష్టించేసి, నీ గర్వ మంతా హరించేస్తాను అని చెప్పి రుక్మి పలికితే...

"అని పలికిన నగధరుండు నగి యొక్క బాణంబున వాని కోదండంబు ఖండించి యాఱు శరంబుల శరీరంబు దూఱనేసి యెనిమిది విశిఖం బుల రథ్యంబులం గూల్చి రెండమ్ముల సారథింజంపి మూడుఁ వాఁడి తూపులం గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్క విల్లందినం దునిమి వెండియు నొక్క ధనువు పట్టిన విదళించి క్రమంబునఁ బరిఘ పట్టిస శూల చర్మాసి శక్తి తోమరంబులు ధరియించినఁ దునుకలు చేసి క్రమ్మఱ నాయుధంబు లెన్ని యెత్తిన నన్నియు శకలంబులు గావించె నంతటఁ దనివి సనక వాఁడు రథంబు డిగ్గి ఖడ్గహస్తుండై దవానలంబుపయిం బడు మిడుత

చందంబునం గదిసిన ఖడ్గ కవచంబులు చూర్ణంబులు చేసి మెఱుంగులు చెదర నడిదంబు వెఱికి జళిపించి వాని శిరంబు తెగవ్రేయ గమకించి నడుచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణారవిందంబులు పట్టుకొని యిట్లనియె."

ఒక్కసారి నవ్వాడట కృష్ణుడు. *"నగి యొక్క బాణంబున వాని కోదండంబు ఖండించి"* – ఒక్క బాణం వేశాడు, మొత్తం ఆ విల్లు విరిగిపోయిందండి. *"యాఱుశరంబుల శరీరంబుదూఱ నేసి"* – ఆరు బాణాలు ఒక్కసారి వదిల్తే, మొత్తం రుక్మి శరీరంలోకి గుచ్చుకుపోయినాయి. *"యెనిమిది విశిఖంబుల రథంబులం గూల్చి"* – ఎనిమిది బాణాలు ఒక్కసారిగా వేస్తే, రథం మొత్తం ముక్కలు ముక్కలుగా అయిపోయింది, గుఱ్ఱాలన్నీ పడిపోయినాయి. *"రెండమ్ముల సారథిం జంపి"* – ఓ రెండు వాడికి వేశాడు. *"మూఁడు వాఁడి తూపులఁ గేతనంబుఁ ద్రుంచి"* అంటే రథం పైన ఉంటుంది కదా! ప్రతి వాడు ఒక జెండా పెట్టుకొస్తాడు కదా! ఎవరి పార్టీ వాడిది, వాడికొక జెండా కదా! అంటే, వాడు ఉపాసన బలంకొద్దీ వాడు పెట్టుకుంటాడు. ఒక్కొక్కడు ఒక్కొక్క కేతనం. దాన్ని *"మూఁడు వాఁడి తూపులఁ గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్కవి ల్లందినం"* – మళ్ళీ ఈ లోపల ఇంకో విల్లందుకున్నాడట రుక్మి. *"విదళించి క్రమంబునం బరిఘ పట్టిస శూల చర్మాసి శక్తి తోమరంబులు ధరియించినం దునుకలు చేసి"* – ఆ తర్వాత పెద్ద గద పట్టుకున్నాడట, విసిరేద్దామని. దాన్ని ముక్కలు ముక్కలు చేసేశాడట. *"క్రమఱనాయుధంబు లెన్ని యెత్తిన నన్నియు శకలంబులు కావించె"* – వాడేం పట్టుకుంటే దాన్ని ముక్కలు

ముక్కలుగా కొట్టేశాడండి అది. *“నంతటఁ దనివి ననక వాఁడు రథంబు డిగ్గిదనివి ననక”* – అంతటితో వాడు ఊరుకోవచ్చు కదా! ఏం పట్టుకున్నా కొట్టేస్తున్నాడు కదా! నువ్విట్లా ఎత్తేలోపల ముక్కలైపోతోంది అది. అంత వేగంగా అటునుంచి బాణాలు వచ్చేస్తున్నాయి. ఇంక ఊరుకోవచ్చు కదా! రథమైపోయింది, గుఱ్ఱాలు, సారథి అయిపోయారు. తనకా ఆరుబాణాలు గుచ్చు కున్నాయి. ఏం పట్టుకుంటే అది విరిగిపోతుంది. పట్టుకొని ఇట్లా ఎత్తే లోపల అది విరిగిపోతోంది.

*“ఖడ్గకవచంబులు చూర్ణంబులు”* – సహింపక, ఆ కత్తి పట్టుకొని అలా పరిగెత్తుకొని వచ్చేస్తున్నాడట ఆవేశంగా. పరిగెత్తు కొస్తుంటే కత్తి విరిగిపోయింది, కవచాలు ఊడిపోయినాయిటండి కొట్టిన దెబ్బలకి. అట్లా కొట్టాడు శ్రీకృష్ణుడు. *“మెఱుంగులు చెదర నడిదంబు వెఱికి జళిపించి వానిశిరంబు తెగవ్రేయ నని గమకించి నడచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణారవిందంబులు పట్టుకొని యిట్లనియె”* – అయిపోయింది వాడికి, కవచాలు ఊడదీసేశాడు. ఆ పట్టుకొస్తున్న ఖడ్గం కొట్టేశాడు. వీడికి ఇది కాదు, వీడికి ఇంకా బుద్ధి రాలేదని వీడి తల తీసేస్తాను అని కృష్ణుడు రథం దిగిపోయాడు. ఎందుకంటే, రుక్మి మూర్ఖత్వంలో పరాకాష్ఠ చూపించాడు. ఎవడూ చూపించనంత మూర్ఖత్వం చూపించాడు.

కృష్ణుడు అలా రథం దిగి వెడుతుంటే రుక్మిణి వెంటనే ఆయన కాళ్ళు పట్టుకుందట. పాపం! పెళ్ళికూతురు ప్రాణనాథుడితో వెళ్తుంటే ఇలాంటి పరిస్థితులు ఎవరికన్నా వస్తాయా అండి!

"నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామరకీర్తిశోభిత! సర్వలోకశరణ్య! మా
యన్న యీతఁడు నేడు చేసె మహాపరాధము నీ యెడన్
నన్ను మన్నన సేసి కావు మనాథనాథ! దయానిధీ!"

నువ్వు ఈశ్వరుడివి. నువ్వే సమస్తానికి దేవదేవుడివి అని తెలుసుకోలేక *"యో సన్నుతామరకీర్తిశోభిత"* –చాలా నిర్మలమైనటువంటి కీర్తితో ఎప్పుడూ పొగడబడుతూ, పుణ్యశ్రవణ కీర్తనుడు అని అంటారు. అట్లా పొగడుతూ ఉంటారు. అంతటివాడు ఆయన అని అన్నది. అనాథనాథుడివి నువ్వు. చాలా దయ కలిగినవాడివి. నీకేమాత్రం నన్ను మన్నన చేద్దాం అని నీకనిపిస్తే, ఈ మూర్ఖుడిని మరి ఇంకేం చేయబోకు అని అడిగింది. *"కల్ల లేదని విన్నవించుట గాదు"* – మా అన్న తప్పు చెయ్యలేదు అని నేను అనట్లేదు. అన్న చేసింది మహా అపరాధం. నువ్వు ఎంతటి వాడివో తెలీకుండా, నీ మీదకు దూకుతున్నాడు వాడు. పైగా ఎన్నిసార్లు ఓడిపోతున్నా, మళ్ళీ మీదమీదకు వస్తున్నాడు.

"కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ! యీతనిన్
బ్రల్లదుం దెగఁజూచితేనియు భాగ్యవంతుల మైతి మే
మల్లుఁ డయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితు లైన మా
తల్లిదండ్రులు పుత్ర శోకము దాల్చి చిక్కుదు రీశ్వరా!"

ఈ బ్రల్లదుడిని, ఈ దుష్టుడిని, ఈ దురాచారుడిని నువ్వు చంపేస్తే, తలకాయ తెగవేస్తే... అక్కడ ఇంట్లో అమ్మా నాన్న బాధ పడతారు. వాళ్ళకేం అభ్యంతరం లేదు ఈమెను కృష్ణుడు

తీసుకెళ్ళడం. కృష్ణుడు కదా! ఇప్పుడే పెళ్లి. పెళ్లి కూతురికి పెళ్లి చేస్తే, కొడుకు పోయాడని అంటే అది ఎంత బాధ తల్లిదండ్రులకి? తల్లిదండ్రులు చాలా బాధ పడ్తారు. ఈ సందర్భంలో ఇలా కృష్ణుడు మా అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని అమితమైన ఆనందంలో మా తల్లిదండ్రులుండగా, ఉన్న కొడుకు చచ్చిపోయాడనే దుఃఖంలో పడిపోతారు. ఈ శుభసమయంలో ఇలాంటి దుఃఖం నా తల్లి దండ్రులకు కలిగించటం న్యాయం కాదు కదా! అందుచేత, నా మీద నీకు ఏ మాత్రం దయ ఉన్నా, కరుణ ఉన్నా, నన్ను అనాథగా భావించి, అనాథులకు నీవు నాథుడివి కాబట్టి, వీడిని ఈ రోజు ఈ విధంగా చంపకుండా వదిలేయమని చెప్పి కోరుకుంటోంది.

**“అని డగ్గుత్తికతో మహా భయముతో నాకంపితాంగంబుతో వినత శ్రాంత ముఖంబుతో శ్రుతిచలద్వేణీ కలాపంబుతోఁ గనుదోయిం జడిగొన్న బాష్పములతోఁ గన్యాలలామంబు ప్రెమొ క్కిన రుక్మిం దెగ వ్రేయఁబోక మగిడెం గృష్ణుండు రోచిష్ణుఁడై.”**

అర్థమైపోయింది కదా మీకు! ఆవిడ మరి కన్నీళ్ళు పెట్టేసిందండి. కన్నీళ్ళు పెడితే, గొంతు బాగా డగ్గుత్తిక అయిపోయింది. భయంతో వణికిపోతోంది ఆవిడ, అన్నయ్యని చంపేస్తాడేమో అని. కళ్ళనిండా నీళ్ళు వచ్చేస్తున్నాయి. అట్లా కన్నీళ్ళు పెట్టుకుని, కృష్ణుడి కాళ్ళమీద పడి, మా అన్నయ్యను రక్షించు అని అడిగితే ఆయన ఇంక ఏం మాట్లడతాడండి! అంచేత, ఆయన క్రమంగా తనయొక్క ప్రతాపాన్ని తగ్గించుకొని, చేయబోయే పనిని ఉపసంహరించుకుని...

"ఇట్లు చంపక బావా రమ్మని చిఱునగవు నగుచు వానింబట్టి బంధించి గడ్డంబును మీసంబునుం దలయును నొక కత్తివాతి యమ్మున రేవులువాఱఁ గొఱిగి విరూపింజేసె నంత యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి తత్సమీపంబునకు వచ్చిరప్పుడు హతప్రాణుండై కట్టుబడి యున్న రుక్మిం జూచి కరుణసేసి కామపాలుండు వాని బంధంబులు విడిచి హరి డగ్గఱి యిట్లనియె."

మరి ఇంకా కోపముంటుంది. ఎందుకంటే, అంత రెచ్చ కొట్టిన తర్వాత, ఆ కోపం తగ్గడం కష్టం. ప్రతాపవంతులు బాణం ఎక్కుపెట్టిన తర్వాత, ఇప్పుడు చాలు, ఉపసంహరించు అంటే అలా కుదరదు, ఇది ఎక్కడో అక్కడ విడవాలి దీన్ని, చెప్పమని చెప్తూ ఉంటారు మీకు కథల్లో. తన మీద యెగబడి తనని చంపాలని వస్తున్నటువంటి వాడిని, చంపక వదలడానికి చాలా ఉపసంహారం కావాలి. సరే, ఈమె కాళ్ళమీద పడ్డది. ఒళ్ళంతా వణుకుతోంది, కళ్ళలో నీళ్ళు వస్తున్నాయి. చెప్పిన విషయం కూడా బాగుంది. మా అమ్మా నాన్నా నా పెళ్ళయిందని సంతోషిస్తుంటే, వీడు పోయాడని ఏడవాల్సి వస్తుంది కదా! అందుకే కదా ఈవిడ అసలు బయట తీసుకెళ్ళిపొమ్మంది! నేను ఊరు బయటకు వస్తాను, తీసుకెళ్ళమని అడగడానికి కారణమిదే. ఏమిటంటే, తన గృహంలో తన వారు మరణించచ్చుగా, ఇతరులు మరణించచ్చుగా, అందుకు కదా ఆవిడ అడిగింది! వీడు చచ్చిపోతే ఇప్పుడు అమ్మా నాన్నా ఏడుస్తారు కదా! ఇన్ని రకాలుగా చెప్తే, ఇంక ఆయన కాదనలేకపోయాడు.

*"గడ్డంబును మీసంబును దలయును ఒక కత్తి వాతియంబున రేవులు వాఱఁ గొఱిగి విరూపింజేసె"* – అది చేశాడండి. అంటే, మామూలుగా గొరిగితే ఫర్వాలేదు తెలుసా! తలనీలాలు ఇచ్చుకుంటూ ఉంటారు దేవుడికి. అలా చేయలేదు కృష్ణుడు. బాగా పదునుగా ఉన్న కత్తి ఒకటి తీశాడట. తీసి, " రేవులు వాఱ" అంటే మీరు నదిలో రేవులు చూస్తే, అట్లా పరలుపరలుగా గీతలు పడి... ఇప్పుడు west లో fashion వచ్చింది. India లో కూడా బొంబాయి అటువంటి చోట్లకెళ్తే కనిపిస్తాయి. అట్లా గీతలు గీతలుగా మధ్యలో దార్లు వదిలేశాడండి. అట్లా గీసేశాడు మొత్తమంతా కూడా! మీసం గీసేశాడు, గడ్డం గీసేశాడు. ఇట్లా గీతలుండేట్టుగా గీశాడండి. వికారంగా కురూపిని చేశాడట.

ఎంతో చక్కగా, నైపుణ్యంతో, అన్ని విద్యల్లో ఆరితేరినటువంటి కృష్ణుడు ఈ గుండు గొరగటం విద్యలో కూడా రకరకాల డిజైన్లు వాడి నెత్తిమీద ఏర్పాటు చేస్తూ, కత్తితో గుండు చేశాడట. ఇట్లా ఈ రకంగా గుండు చేసినటువంటి కథ మనకి ఎక్కడా కనిపించదు కదా! అశ్వత్థామకు కూడా గుండు గీయిస్తాడు కృష్ణుడు. ఆయనకి సరదా అనుకుంటాను! అశ్వత్థామ ఉపపాండవులందర్నీ చాలా దుర్బుద్ధితో, కఠినమైనటువంటి హృదయంతో అర్ధరాత్రి శిబిరంలోకి చొరబడిపోయి వాళ్ళని చంపేశాడు. అటుపైన బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడు. దాన్ని ఉపసంహరించటానికి అర్జునుడి చేత బ్రహ్మాస్త్రం ప్రయోగింపచేస్తాడు శ్రీకృష్ణుడు. అప్పుడు అశ్వత్థామ దాన్ని ఉపసంహారం చేసుకోలేకపోతే, తానే ఉపసంహరిస్తాడు. అటుపైన అశ్వత్థామకు భీముడుచేత గుండు చేయిస్తాడు. ఎంచేతంటే, పరాక్రమవంతులకి ప్రాణం

తీయడంకన్నా ఈ విధమైనటువంటి శిరోజములను నిర్మూలించుట అనేటువంటిది అవమానము. అంటే, మానం పోయి బతకడం కన్నా చచ్చిపోవటం మంచిది అని. అందుకనే, ఓడిపోయిన రాజు యుద్ధంలో చచ్చిపోవటానికి సహిస్తాడు తప్ప, శత్రువులకి పట్టుబడి, అతడిచేత అవమానింపబడడానికి ఉత్సహించడు, ఏ మాత్రం దానికి అంగీకరించడు. యుద్ధంలో మరణిస్తే వీర స్వర్గం ఒకటుందని భావించి అక్కడే మరణిస్తాడు. శత్రువులకి చిక్కి, అవమానింపబడటం, తనముందు తన వారిని అవమానం చేస్తుంటే చూడడం అనేది కష్టమైన విషయం. ఎలాగూ రుక్మిని సంహరించాల్సిన పరిస్థితి ఉన్నది. అతని సంస్కారం అలాంటిది. రుక్మిణీదేవి వేడుకోవటం వల్ల ఈ విధంగా ఓ చక్కని డిజైన్ లో, నదీతీరంలో ఉండేటువంటి ఇసుక రేవులు ఏ విధంగా రేవు వలె ఏర్పడుతూ ఉంటాయో, అలా గుండు తయారు చేసేసి ఉంచాడు.

అప్పుడు బలరాముడు వచ్చాడు. బలరాముడు వచ్చి, " ఇదేం పనిచేశావు?" అని అన్నాడు. తప్పు కదా! బావమరిది కదా! ఇంకా పెళ్ళికూడ అవ్వలేదు. పెళ్లి చేసుకోవడానికి తీసుకువెళ్తూ ఉన్నాడు. వీడు వధార్హుడే సందేహం లేదని చెప్పింది అమ్మవారు. వధార్హుడేగాని నా తల్లితండ్రులని మనసులో పెట్టుకొని ఇతన్ని నీవు క్షమించమని కోరింది. బలరాముడు అంతకుముందు వృత్తాంతం జరుగుతున్నప్పుడు అక్కడ లేడు కనక, వచ్చినప్పుడు ఇది చూచి కొంత బాధ పడ్డాడు. అరె! పెళ్ళికూతురు అన్నగారు కదా! అలాంటి వాడిని ఈ విధంగా చేశాడే అని ఈ పద్యం చెప్పాడు.

*"యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి తత్సమీపంబునకు వచ్చిరప్పుడు"* – అప్పుడు వీళ్ళంతా వచ్చేశారు.

అక్కడ పనైపోయింది కదా! వస్తే, బలరాముడు చూశాడు. చూసి, ఇదేవిటిరా అని ఆయనకు బాధ వచ్చింది. బలరాముడు చాలా మెత్తటి హృదయమున్నవాడు. గభాల్న కోపమొస్తుంది, గభాల్న చల్లారిపోతాడు, గభాల్న కరుణ వచ్చేస్తుంది, గభాల్న అనుగ్రహం వచ్చేస్తుంది. అంతా గభాలున వచ్చేస్తుంది. అంతకుముందు రుక్మి ఏం చేశాడో తెలియదు కదా! ఇప్పుడు వాడు బావమరిది కదా! అంచేత, వాడిని వచ్చి చూస్తే, ఈ విధంగా చాలా నైపుణ్యంతో తలమీద శిల్పం చెక్కినట్టు చెక్కేశాడు కృష్ణుడు అది చూసి బలరాముడు అప్పుడు శాంత వచనాలు పలుకుతాడు.

## బలరాముని శాంతవచనములు

"కొందఱు రిపు లని కీడును
గొందఱు హితు లనుచు మేలు గూర్పవు నిజమీ
వందఱి యందును సముఁడవు
పొందఁగ నేలయ్య విషమబుద్ధి ననంతా!"

వీళ్ళు నా హితులు కాబట్టి వీళ్ళకి మంచి చెయ్యాలి, వీళ్ళు నాకు శత్రువులు కాబట్టి వీళ్ళకి కీడు చేయాలి అనే భావన లేనివాడివి కదా! ఎవరెవరు ఏ విధంగా వారి వారి కార్యములు నిర్వర్తించారో తదనుగుణమైన కర్మ వాళ్ళని వరిస్తుంది. దానిని సాక్షీభూతుడిగా చూస్తూ ఉంటాడు. రక్షణ కోరినవాడికి రక్షణ ఇస్తూ ఉంటాడు. వీడి విషయంలో ఎందుకిట్లా చేశావు? అని అడుగుతాడు. ఎందుకిట్లా చేశాడో మళ్ళీ బలరాముడికే తెలుస్తుంది తర్వాత. అలా జరగవలసింది కాబట్టి అలా చేశాడు అంతే! చాలా విషయాల్లో మనకి ఎందుకిలా జరిగిందని అనుకుంటాం కదా! అలా జరగాల్సి ఉంది. ప్రత్యేకంగా తెలుగువారు అందరం, మన రాష్ట్ర పరిస్థితి, దేశ పరిస్థితి మొత్తం చాలా అస్తవ్యస్తంగా ఉంది. ఎందుకిలా ఉంది? ఏది ఎలా జరగాలో, అది దైవ సంకల్పంగా జరుగుతూ ఉంటుంది. దాంట్లో మన ఫలానుభావం ఉంటుందే, అదంతా మన పాపపుణ్యములు బట్టి ఉంటుంది.

రుక్మి శిక్షింప అర్హుడు కాబట్టి శిక్షించాడు తప్ప, కేవలం వాడిమీద ఒక విధమైన ద్వేషంతో చేయలేదు. కృష్ణుడు

ఏం చేశాడు? ఎప్పుడైతే రుక్మిణీదేవి కోరిందో, అప్పుడు ఉపసంహరించుకున్నాడు ఆ సంహరించే కార్యక్రమం నుంచి. అప్పుడు ఏం చేశాడు? నవ్వుతూ పిలిచాడు కదా! బావా రమ్మని, "చీటి" కదా! బావగారు! రండని నవ్వుతూ పిలిచాడు. లోపల అంత ద్వేషము, పగ, కసి, కక్ష ఉంటే చక్కగా నవ్వుతూ పిలవము కదా! ఈయన చక్కగా పిలిచి, ఒళ్లో కూర్చోపెట్టుకోలేదుగాని, అంత ముద్దు చేసి గుండు చేసేశాడండి. కాబట్టి విషమ బుద్ధి లేదక్కడ. కాకపోతే, బలరాముడు వచ్చి చూసినప్పుడు అలా కనిపించింది. రుక్మిణీదేవి బాధ పడిపోతోందేమో అనుకొని, బలరాముడు బాధపడి, కొంత వేదాంత బోధ చేస్తాడు. ఈ వేదాంత బోధ రుక్మిణీదేవికి అవసరమని నేను అనుకోవట్లేదు, మనందరికి అవసరము. అందుకని మనం చదువుకుంటాము. ఎంచేతంటే, ఏమైందో రుక్మిణికి తెలుసు. అసలు ఉరిశిక్ష వెయ్యాల్సిన వాడిని, ఉరిశిక్ష వేయకుండా, గుండు గీసి పంపించేస్తున్నాడు. ఇంక అంతకన్నా కోరేదేముంటుంది? ఉరిశిక్ష కాకపోతే next ఏం చేయాలి? Next life imprisonment, శేషజీవితమంతా కూడా కారాగారం కదా! అది కూడా లేదు ఇక్కడ. అప్పటికే ఆవిడ చాలా సంతోషిస్తుందని నేను భావిస్తున్నాను. అతడు మరణానికే అర్హుడని చెప్పిందిగా! అతడు వధార్హుడే, కాదని నేను అనడంలేదని చెప్పింది. అంచేత, ఆమె దుఃఖపడే సందర్భం అక్కడ లేదు, కానీ చూసే వాళ్ళకి అలా అనిపించి

"తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు నె గ్గాడు జూడకు మమ్మ పూర్వభవ కర్మాధీనమై ప్రాణులం

గీడున్ మేలును జెందులేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ తోడంబుట్టువు కర్మశేష పరిభూతుం డయ్యె నేఁ డియ్యెడిన్."

అని చెప్పాడు. అంతకముందు తమ్ముడితో ఎందుకట్లా కసిగా వాడికి గుండు గీశావురా అన్నవాడు, ఇక్కడ ఏం చెప్తున్నాడు? పూర్వకర్మానుభవం చేత జీవులకు మేలు, కీడు జరుగుతూ ఉంటుంది. ఇలా జరిగిందని మా తమ్ముడి మీద నువ్వు కోపం పెట్టుకోవద్దు. కోపం పెట్టుకునే పరిస్థితి లేదక్కడ. ఎంచేత? తనని అనుగ్రహించినవాడు. కృష్ణుడు ఆ విధంగా వచ్చి తనని రక్షించకపోతే, తానే ఉండేది కాదు కదా! తాను కోరడం చేత, తన అన్నగారి యొక్క ప్రాణములు హరించకుండా వదిలేశాడు కదా! ఇంక అంతకన్నా ఏం కోరుతుందండి? కానీ, ఈయనేమన్నాడు? వాడికీ విధంగా రాసిపెట్టి ఉంది అని చెప్తుంటాం కదా మనం కూడా! మనకి జరిగినప్పుడు మనం అంగీకరించలేము. కానీ, ఇంకొకరికి జరిగినప్పుడు చెప్పటానికి మనకొస్తాయి! అంటే ఏం జరుగుతుంది? చాలా మహత్తరమైన, అనన్యమైన భక్తిలో ఉండేవాళ్ళు తప్ప, తమకొచ్చిన కష్టాన్ని తాము ఈశ్వరుని యొక్క అనుగ్రహంగా భావించలేరు. అది చాలా కష్టమైన విషయం. జరుగుతున్నప్పుడల్లా అలా అనిపించదు. జరిగిపోయిన తర్వాత అనిపించవచ్చు. ఇంకొకరు కష్టంలో ఉంటే, ఈ మాట తప్పకుండా ఉపశమనం కలిగిస్తుంది. చాలా కష్టం వచ్చింది. ఆ కష్టంలో ఉన్నవాళ్ళకి ఉపశమనం వాక్యాలు అందరూ పలకలేరు కదా! అలా తప్పించుకు తిరుగుతారు! ఎలా వెళ్ళాలి, ఎలా face చేయాలి అనుకుంటారు. ఏం మాట్లాడాలో తెలియదు కదా! ఏం మాట్లాడతారు? ఓ పెళ్లి జరిగిందండి. ఉన్న ఒకే కూతురుకి

పెళ్లి చేశాడండి. పెళ్ళైన తర్వాత పదహారు రోజులలో కొడుకు చచ్చిపోయాడంటే అది ఎంత దుఃఖం? అలాంటి వారితో ఏం మాట్లాడతావు నువ్వు? ఏదో మరి ఆ సమయానికి ఉపశమనం వాక్యాలు నాలుగు చెప్పాలి, అంతే కదా! మనం చెప్పినంత మాత్రాన అతను సర్దుకుంటాడా? కాలం వల్ల సర్దుకుంటాడు. క్రమంగా ఎంత కష్టాన్నైనా జీవుడు నెమ్మదిగా మింగుతాడు. అలా జరుగుతుంది.

ఈ కీడు, మేలు మా కృష్ణుడు చేశాడని నువ్వు అనుకోబోకు. రుక్మికి ఉన్నటువంటి కర్మ ప్రకారం ఈ విధంగా అతడు అవమానింపబడ్డాడు తప్ప, దీని గురించి నువ్వు కృష్ణుని మీద ఏవిధమైన కోపము తెచ్చుకోబోకు తల్లీ! అని చెప్పి, కాబోయే మరదలకి బావగారు ఓ చిన్న హితోపదేశం చేశాడు. సందర్భం ఏదైనా మనకి చాలా ముఖ్యం కదా! జీవితంలో కష్టాలు, నష్టాలు రానివాళ్ళు ఎవ్వరూ ఉండరు. జీవితంలో నవరసాలు, షడ్రుచులు అంటాం కదా – చేదు, వగరు, తీపి, పులుపు, ఉప్పు ఉంటుంది కదా! అన్నీ ఉంటాయి. కానీ, ఒకరికి కష్టం వచ్చినప్పుడు రెండోవారు ఉపశమనంగా కొంత తత్త్వబోధ చేయటం వల్ల వాళ్ళకు ఉపశమనం కలుగుతుంది. “పుణ్యాత్ముడు తల్లీ! ముందుగా వెళ్ళిపోయాడు”, అని చెప్తాడు కాస్త తొందరగా వెళ్ళిపోతే! నీలో కల్మషం ఉంటే “అర్ధాంతం చావు చచ్చాడు వాడు” అంటాం కదా! మన బుద్ధే అది. కొన్ని జన్మ పరంపరలు గబగబా జరిగిపోవటం కూడా పరిణామ దశలో చాలా మంచి విషయం. ఎప్పుడూ వెళ్ళిపోయిన వాళ్ళు పుణ్యాత్ములే. వీడు వెళ్ళిపోలేదు,

దురదృష్టవంతుడు అంతే! రుక్మి వెళ్ళిపోవకపోవడం వల్ల కదా ఈ మాటలన్నీ కూడా వినాల్సొచ్చింది! అక్కడే ఉన్నాడు కదా! వాడూ వింటున్నాడు. ఏమని వింటున్నాడు? వీడు చేసుకొన్న దాన్నిబట్టి, వీడికి ఇదొచ్చింది అని వింటున్నాడు కదా!

"చంపెడి దోషము గలిగినఁ
జంపఁ జనదు బంధుజనులఁ జను విడువంగాఁ
జంపిన దోషము సిద్ధము
చంపను మఱి యేల మున్న చచ్చినవానిన్."

బంధుజనులను దోషమున్నాకూడా వాళ్ళను చంపగూడదు అని అంటాడు ఈయన. అందుకే, భారత యుద్ధంలో కౌరవులకి, పాండవులకి మధ్య యుద్ధం జరుగుతుంటే, బలరాముడిని అడుగుతాడు శ్రీకృష్ణుడు, "అన్నయ్యా! నీ పరిస్థితి ఏంటి?" అంటే "నాకొద్దురా! నేను చూస్తూ చూస్తూ బంధుజనులను అలా చంపలేనురా!" అంటాడు. బంధువుల్ని చంపలేదు ఆయన. కంసుడిని కూడా మేనమామ అని ఆయనను చంపలేదుగా! బంధుజనులను చంపగూడదు అనే సిద్ధాంతం మీదే బలరాముడు భారతయుద్ధంలో పాల్గొనడు. ఎంచేత? ఆయనకో క్లిష్ట సమస్య వచ్చేసింది. అందరూ బంధువులు, ఒకటి. దుర్యోధనుడు తన శిష్యుడు. తన దగ్గర గదాయుద్ధం నేర్చుకున్నాడు. కాకపోతే, ధర్మమేమో పాండవుల వైపు ఉంది. కాబట్టి, తన శిష్యుడు దుర్యోధనుడు వచ్చి అడిగితే తను అధర్మం వైపు యుద్ధం చేయలేడు. శిష్యుడు అడిగితే కాదనలేడు. ప్రతి వాళ్ళకి శిష్యుడంటే కొంచెం weakness ఉంటుంది కదా! ఏ weakness

లేనివాడు కృష్ణుడొక్కడేనండి. ఒకవేళ అర్జునుడే పదివేలమంది యాదవులనడిగి, దుర్యోధనుడే కృష్ణుడిని అడిగి ఉంటే, కృష్ణుడు ఇటు ఉండి, దుర్యోధనుడు వాళ్ళని ఓడించేసేవాడు. ఏం సందేహం లేదు. కృష్ణుడు అంతపని చేయగలడు. కర్ణుడికి శల్యుడు చేసిన పని, కృష్ణుడు పరిపూర్ణంగా కౌరవులలో చేసి ఉండేవాడు. ఎంచేతంటే, ధర్మరక్షణ ప్రధానం ఆయనకు.

సరే అది అలా ఉండగా, ఈ బలరాముడు బంధుజనులను చంపకూడదు అన్నాడు. అక్కడ బంధుజనుల్ని చంపలేనటువంటి ఉద్దేశ్యంతోనే తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు బలరాముడు. "ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగుతూ ఉంటే నువ్వు ధర్మం పక్కన పని చేయాల్సిన వాడివి. బంధుజనులను అడ్డుపెట్టుకొని వెళ్ళిపోయావు. నీకు తెలీదా జ్ఞానం?" అని తర్వాత కృష్ణుడు అడుగుతాడు. "ఎవరు బంధువు, ఎవరు బంధువు కాదు? తత్త్వం తెలిసినవాడివే, మరి ఎందుకిలా తప్పించుకున్నావు నువ్వు?" అని అడుగుతాడు చివరిలో. అప్పుడేమీ మాట్లాడలేకపోతాడు బలరాముడు. ఆయన సిద్ధాంతమిది.

ఇంక ఈ రుక్మిని చంపాల్సిన అవసరం లేదు. వీడు చచ్చిపోయిన వాడితోనే సమానం. ఎందుకంటే, ఒక క్షత్రియుడికి ఆ విధంగా తల గొరిగితే, వాడిని సంహరించేసినట్టే అనే ఉద్దేశ్యంతో! రాజులకి మీసాలు గొరిగినా ప్రాణం తీసినట్టేనండి. తలనీలాలు తీసేసినా ప్రాణం తీసేసినట్టే. ఎందుకంటే, వాళ్ళ పరాక్రమానికి అవి చిహ్నాలై ఉండటం చేత.

" బ్రహ్మచేత భూమిపతుల కీధర్మంబు
కల్పితంబు రాజ్యకాంక్షఁజేసి
తోడిచూలు నయినఁ దోడఁబుట్టినవాఁడు
చంపుచుండుఁ గ్రూరచరితుఁ డగుచు. "

అసలు బ్రహ్మరాసిన రాతలోనే భూమిని పరిపాలించే పాలకులు ఉంటారే, వాళ్ళకి ఈ ధర్మమొకటి కల్పితంగా ఉంటుందట. ఏమిటంటే, వాడు తోడబుట్టినవాడైనా, మన పదవికి వాడు అడ్డు వస్తాడు అనుకుంటే, వాడిని చంపేయటం అనేది పరిపాలకులకి రాసిపెట్టిన ఓ ధర్మం కల్పించాడు బ్రహ్మ దేవుడు. పాలకులకి అలాంటి రాజ్యకాంక్ష ఉంటుంది. అది ఎంత కాంక్షంటే, ఆ కాంక్షకి అడ్డొస్తే, తమ్ముడైనా, అన్నయైనా, తండ్రైనా, చెల్లెలైనా, అక్కైనా! కంసుడదే కదా మరి దేవకీదేవిని సంహరించటానికి పూనుకుంటే వసుదేవుడు రక్షించుకున్నాడు. ఎందుకని సంహరించదలచాడు? తన ప్రాణానికి కీడు తెచ్చేవాడు ఈమె గర్భంలో పుడతాడు అని తెలియటం చేత. ఇలాంటిది ఒకటి రాసేశాడు బ్రహ్మదేవుడు, పాలకులకి ఆ విధమైన నైజం ఉంటుంది.

"భూమికి ధనధాన్యములకు
భామలకును మానములకుఁ బ్రాభవములకుం
గామించి మీఁదు గానక
శ్రీ మదమున మానధనులు చెనకుదు రొరులన్."

బాగా దురభిమానం కలిగినవాడు భూమికోసమైనా సరే చంపేస్తాడటండి. భూమి తగాదాల్లో చంపుకోవటాలు ఉండవా?

సీమ రాజకీయాలన్నీ అట్లాగే పుట్టినాయి – భూమి తగాదాలే, చంపుకుంటూ ఉంటారు. ధనధాన్యములకు చంపుకుంటారు. భామల కొరకు అంటే, తను ప్రేమించిన అమ్మాయి ఇంకొకడిని పెళ్లిచేసుకుంటుందనే సందర్భంలో వాడిని చంపడమో, లేక కసి తీరకపోతే ఆ అమ్మాయినే చంపెయ్యడమో, మొహం మీద acids పోసెయ్యటమో, ఇలాంటివన్నీ చూస్తున్నాం కదా! ఇవన్నీ ఎవరికుంటాయి అంటే, బాగా కామించినటువంటి వాళ్ళకి ఉంటాయి. ఇలాంటి ధర్మాలు కొన్ని చెప్పాడు, అందుకని చదువుతున్నాను.

భామలకు, మానములకు, తమ ప్రాణానికి ఏదైనా తేడా పడ్డది, లేదా తమ కీర్తికి తేడా పడ్డదనుకో, అలాంటి తేడా పడే సందర్భంలో, సమస్త కీర్తి కాపాడుకోవటం కోసం, తమ మానం కాపాడుకోవటం కోసం.... ప్రాభవములకు అంటే, చాలా కీర్తి వస్తుందన్నా చేస్తాడట ఆ పని, కీర్తి పోతుందన్నా చంపేస్తాడట. *"గామించి మీఁదు గానక"* అంటే తర్వాత వచ్చేటువంటి ఫలితములు అప్పుడు వాళ్ళకి కనపడవు. మొట్టమొదట క్షత్రియుల గురించి చెప్పాడు. రెండోసారి కాముకుల గురించి చెప్పాడు. కామకులకు ఇది ఉచ్ఛము, ఇది నీచము అని ఏం అనిపించదు. Desire knows no decency అని ఒక వాక్యం రాశారు. అడుక్కుతినే వాడికి మర్యాదేముందండి!

ఇంద్రుడు వృత్రాసురుడిని సంహరించాలంటే, దధీచి మహర్షి యొక్క వెన్నెముకను నువ్వు తెచ్చుకోవాలి, నువ్వు దాంతో ఆయుధం తయారు చేసుకుంటే, అదే వజ్రాయుధం, అప్పుడు నువ్వు వృత్రుడిని గెలవగలుగుతావు అని చెప్తే, ఈయన వెళ్లి ఎలా

అడుగుతాడండి " కొంచెం మీ వెన్నెముక ఇచ్చేస్తారా?" అని. ఏదో వేలు అడిగాడంటే అది వేరే సంగతి. అదేదో కాలి వేలో, చేతి వేలో, చెవి అడిగాడట అంటే అర్థం, ముక్కడిగాడట అంటే అర్థం, ఒక కన్ను ఇమ్మంటే అర్థముంది. బొత్తిగా సరాసరి ఆయన వెన్నెముక ఇచ్చేయమన్నాడండి! వెన్నెముక ఇచ్చేస్తే ఇంకేముంది! ఎంచేత? ఆ వెన్నెముకలో అద్భుతమైన తపశ్శక్తి ఉంది. ఆయన సుషుమ్నలో ఉండే ఆ శక్తి ఆ వెన్నెముకకు కూడా పట్టేసిందిట. కాబట్టి, అది తెచ్చుకుంటే బాగుంటుంది నువ్వు అని అంటే, అది అడగటానికి వెళ్ళిపోయాడండి ఈయన! అదెట్లా అడుగుతాం అన్నారు మిగతా దేవతలు. బాగుండదు కదా! అంటే, అడిగేవాడికి ఉచ్ఛనీచాలు ఉండకూడదు అని ఇంద్రుడు నీతి చెప్తాడు. మనకవసరం కాబట్టి వెళ్లి అడిగేయడమే! ఇస్తే ఇస్తాడు, లేదంటే తిడతాడు అంతే కదా! అడగటంలో తప్పేముంది! చాలామంది అలాంటి logicతో అడిగేస్తుండరూ! కాముకులు, వాళ్ళ పనికోసం ఏమైనా చేస్తారు. అని చెప్పి ఇంకోటి చెప్పాడు.

"వినుము. దేవమాయం జేసి దేహాభిమానులైన మానవులకుఁ బగవాఁడు బంధుం డుదాసీనుండను భేదంబు మోహంబున సిద్ధం బయి యుండు జలాదుల యందుఁ జంద్రసూర్యాదులును ఘటాదులందు గగనంబును బెక్కులై కానంబడు భంగి దేహధారుల కందఱకు నాత్మ యొక్కండయ్యును బెక్కండ్రై తోఁచు నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్య ప్రాణ గుణాత్మకంబై యాత్మ యందు నవిద్య చేతఁ గల్పితంబై దేహిని సంసారంబునం ద్రిప్పు

సూర్యుండు తటస్థుండై యుండం బ్రకాశ మానంబులైన దృష్టి రూపంబులుంబోలె నాత్మ తటస్థుండై యుండ దేహేంద్రియంబులు ప్రకాశమానంబు లగు నాత్మకు వేఱొక్కటితోడ సంయోగవియోగంబులు లేవు వృద్ధి క్షయంబులు చంద్రకళలకుంగాని చంద్రునికి లేని కైవడి జన్మనాశంబులు దేహంబునకుంగాని యాత్మకుఁ గలుగనేరవు నిద్రబోయినవాఁ డాత్మను విషయఫలానుభవంబులు చేయించు తెఱంగున నెఱుక లేని వాఁడు నిజము గాని యర్థంబు లందు ననుభవము నొందుచుండుఁ గావున."

*"దేవ మాయం జేసి దేహాభిమానులైన మానవులకు"* – మనకన్నీ దేహం వల్లే కదా ఈ బంధుత్వాలు కాని, ఒకరితో ఒకరికి ఏర్పడినటువంటి సంబంధాలు కాని, ఒకరితో ఒకరు అభిమానం! దేహమే లేకపోతే ప్రపంచంలో దేనితోనూ బంధం లేదు, సంబంధము లేదు. బంధం లేకపోతే మంచిదే, సంబంధం కూడా ఉండదు. జీవుడొక్కడే కదా! వచ్చుచూ పోవుచున్న వాడు ఒక్కడే! *"పాపపుణ్య ఫలమందిన నొక్కడే కానరాడు వేరొక్కడు వెంటవెంటి భవనల్లనయ కృపచూడవయ నీటక్కరి మాయలందిడక భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధి"* అంటాడు రామదాసు. ఒక్కడే! ఇవన్నీ మాయచేత కల్పింపబడుతూ ఉంటాయి కదా! పై జన్మకి ఈ బంధుత్వాలు ఇట్లా ఉండవు, ఇంకో రకంగా ఉంటుంది. ఇప్పుడు కిందటి జన్మలో మనతో మన తమ్ముడో, అన్నయ్యో, అమ్మో, నాన్నో, అక్కయ్యో, చెల్లెలో, భార్యో, భర్తో, అలా అన్న వాళ్ళందరూ ఇప్పుడు వేరేవేరేగా ఇక్కడ కనిపిస్తుండచ్చుగాని వాళ్ళెవరో తెలియదు కదా!

ఇట్లా పూర్వజన్మల్లో మనతో సోదరులుగా, సోదరీమణులుగా, కొంతమంది ఉండి ఉండవచ్చు. ఈ జన్మకే తెలుసు. పై జన్మకి మళ్ళీ తెలియవు కదా! కానీ, ఈ సంబంధం దేనివల్ల ఏర్పడ్డది? దేహం వల్లే ఏర్పడ్డది. దేహమే లేకపోతే ఇవన్నీ లేవు.

ఎంత దేహాభిమానం ఉంటే, అంత బంధు బంధం ఉంటుంది. బంధుప్రీతి అంటూ ఉంటాం. అది ప్రీతి, అంటే బీరకాయ పీచు లాంటిది! కొబ్బరికాయ పీచు అంటే ఇంకా బాగుంటుంది! అది ఎప్పటికీ తెగదు. వాళ్ళు వీళ్ళను పీకుతూ ఉంటారు, ఇటు అటు, అటు ఇటు ఇట్లా పీకుతూ ఉంటారు. పీకులాటతో అయిపోతూ ఉంటుంది కదా కాలం! ఇదంతా లేకపోతే ఏం బాగుంటుంది? బాగుండదు! ఇవి ఉండాలి, ఉంటేనే రుచి. అంటే, పొడిమెతుకల్లే బతికితే బాగుండదు కదా! పక్క మెతుకుతో అంటి ఉంటేనే తింటానికి బాగుంటాయి. అలాగే పొడిపొడిగా జీవించకూడదు, తడిగానే జీవించాలి. తడి తగుల్తూ ఉంటేనే బాగుంటుంది. కానీ, ఇదంతా తాత్కాలికము అని తెలుసుండాలి. అయినప్పటికీ, ఇందులో రసమున్నది కాబట్టి అనుభవిస్తున్నాను. కాని ఇది ఎప్పుడూ ఇలాగే ఉండదు కదా అని తెలిసి ఉండటం అనేది ఉన్నప్పుడు, నీకు ఉభయకుశలోపరి ఉంటుంది. ఉత్తరంలో ఉభయకుశలోపరి అని రాసుకుంటూ ఉంటాం కదా! అంటే, మేము కుశలంగా ఉన్నాము, మీరు కూడా కుశలంగా ఉన్నారనే మేము భావిస్తున్నాం అని. అలా ఆటలో దిగకపోతే ఆనందం లేదు. దిగితే చిక్కులొస్తాయి అని ఆడకపోతే బాగుండదు. ఇది ఆట కదా అని గుర్తుంచుకొని ఆడితే మనం out అయిపోయామనుకోండి అంత బాధుండదు. వెళ్ళంగానే out అయిపోతూ ఉంటాం కదా!

ఆటేకదా! ఆటలో ఉద్రిక్తత కలిగితే, ఓడిపోతుంటే, రోషం వస్తూ ఉంటుంది. గెలుస్తుంటే అభిమానం పెరుగుతూ ఉంటుంది, దురభిమానం అయిపోతుంది. ఇవన్నీ కాకుండా, ఈ ఆడుకోవటం అనేది ఉండాలి. ఇవన్నీ వస్తాయి కాబట్టి నేను ఆడను అనకూడదు. ఆడతాను గాని, ఇది ఆటని తెలిసి ఆడతాను అని ఆడేవాడికి రసానుభూతి ఉంటుంది.

ఇప్పుడు రుక్మిణీదేవికి ఇదంతా ఎందుకండి? శుభమా అని కృష్ణుడిని పెళ్లిచేసుకుందాం అని వెళ్తూ ఉంది. ఏదో దార్లో అడ్డమొచ్చింది, దార్లో వీళ్ళందరూ అడ్డుపడ్డారు. ఆ కథ పూర్తి అయిపోయింది. ఇంక పెళ్లికోసం మెట్టినింటికి వెళ్తోంది. పెళ్ళిచేసుకునే పిల్లకి ఈ వేదాంతం అంతా ఎందుకు చెప్పాడో బలరాముడు? బావగారు మహాజ్ఞాని అని తెలియాలనేమో! మా బావగారు మహాజ్ఞాని అని అనుకోవాలని చెప్పాడంటారా? లేకపోతే, మనకోసం ఇది చెప్పాలని బమ్మెర పోతనగారు ఈ విధంగా రాశాడా? అక్కడక్కడ ఏం చేస్తారంటే కొంత రాస్తూ ఉంటారు మనకోసం. లేదా, అంతలా నువ్వు కృష్ణుడిని నమ్మబోకు, వాడితో కష్టం అని చెప్తున్నాడా? చిన్నప్పటినుంచి చూస్తున్నాడు కదా కృష్ణుడిని. ఎట్లా ఉంటాడో తెలియదు కదా! అందుకని, ఊరికే వాడితో నువ్వు పెనవేసుకోబోకు, చాలా ఇబ్బంది పడిపోతావు సుమా అని చెప్తున్నాడా? ఆవిడ అవన్నీ దాటేసిన మనిషి. ఎందుకంటే రుక్మిణీదేవికి కృష్ణుడితో ఎప్పుడు ఏ సమస్యా లేదు. మిగతా భార్యలకి వచ్చినాయి తప్ప ఆవిడకి లేవు. అయినప్పటికీ, ఈ విధంగా ఆయన చెప్తున్నాడు. మనం వింటున్నాం!

*"జలాదుల యందుఁ జంద్రసూర్యాదులు"* – అక్కడ ఒక చెరువుంది, అక్కడే ఇంకోచోట ఇంకొక చెరువుందండి. చంద్రుడు ఏ చెరువులో కనిపిస్తాడంటారు? అన్ని చెరువుల్లో ఉన్నాడుగా! ఒకే చంద్రుడు అన్ని చెరువుల్లోనూ గోచరిస్తున్నాడు గాని అన్ని చంద్రులు లేరు కదా! ఒకే సూర్యుడు బెంగుళూరులోనూ ఉన్నాడు, విజయవాడలోనూ ఉన్నాడు, హైదరాబాదులోనూ ఉన్నాడు, విశాఖపట్టణంలోనూ ఉన్నాడు. ఎవరెవరు ఏ ఊరులో ఉన్నారో, వారి వారి ఊర్లో వాళ్ళకి రోజూ సూర్యోదయం అవుతూనే ఉంటుంది కదా! ఒకే ఊళ్ళో, ఎవరి కిటికీ తెరుచుకుంటే వాళ్ళ తూర్పు కిటికీల్లోంచి వాళ్ళింట్లోకి సూర్యకిరణాలు వస్తూనే ఉంటాయి. ఇంత మందికి ఇన్ని సూర్యులున్నారా? సూర్యుడు ఒకడే! ఒకే చంద్రుడు ప్రతిబింబం చేత ఇన్ని తటాకాలలో దర్శించినట్టు, ఒకే ఆత్మ ఇన్ని దేహాల్లో ప్రతిబింబిస్తూ ఉన్నది అని చెప్తున్నాడు బలరాముడు. ఒకే ఆత్మ, ఒకడే విశ్వాత్మ. అది ఇన్ని శరీరాల్లోను ప్రతిబింబిస్తూ ఉంటే, ప్రతివాడు నేను అనుకుంటూ ఉంటాం. ఇన్ని నేనులు లేవు, ఒకటే నేను ఉంది. అంతా ఒకటే నేను. కాని ఆ నేను ఇన్నిట్లో పడితే ఇన్ని నేనులుగా అనిపిస్తుంది తప్ప నిజంగా ఉన్నదొక్కటే కదా! ఒక్కడే కదా సూర్యుడు! *"ఒక సూర్యుండు సమస్త జగతికిన్ తాను ఒక్కొక్కడే గోచరించుభంగి"* అని పద్యముంది. ఎవరి సూర్యుడు వారికి కదా!

*"బెక్కులై కానంబడు భంగి దేహధారుల కందఱకి నాత్మ యొక్కండయ్యును"* – అందరి దేహాల్లోనూ ఒకే ఆత్మ వెలుగుతూ ఉంటే, ఒక్కొక్కడు తానొక్కక్క ఆత్మ అనుకుంటం చేత ప్రత్యేక ఆత్మ అయ్యాడు, అహంకారి అయ్యాడు. అహంకారమంటే

నేనొక్కడిని వేరుగా నున్నాను అనేటువంటి భావన. ఇప్పుడు తటాకా లన్నిట్లోనూ ఒకే చంద్రుడు ప్రతిబింబిస్తున్నాడు అని తెలుసుకోవటం మనకంత కష్టమైన విషయం కాదు. ఆకాశంలో ఉన్న ఒకే చంద్రుడు ఇన్ని తటాకాల్లోనూ ప్రతిబింబించి, ప్రతి తటాకంలో ఉన్నట్టుగా గోచరిస్తూ ఉన్నాడు. అలాగే, ఒకే ఒక విశ్వాత్మ ఇన్ని దేహాల్లోనూ ప్రతిబింబిస్తూ, ఇందరిలోనూ తాను ఒక్కొక్కడై ఉన్నట్టుగా గోచరిస్తూ ఉన్నాడు అని చెప్తున్నాడు. అది ఎంత చక్కని ఉపమానం కదా!

*"నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్య ప్రాణ గుణాత్మకం బయి"* అంటే దీంట్లో పదార్థముంది. అంటే, పంచ భూతాలతో కూడినటువంటి పదార్థం, ప్రాణమున్నది, మూడు గుణాలు ఉన్నాయి. మూడు గుణములు, ఐదు భూతములు – మొత్తం ఎనిమిది. ఇవన్నీ చక్కగా కూడి ఉండటానికి ఒక ప్రాణ స్పందన. దీనికి మొదలుంది, చివరుంది. పంచభూతములు, త్రిగుణములు, ప్రాణముతో కూడినటువంటి దేహమేదైతే ఉందో, దానికి తుది, మొదలు ఉన్నాయి.

*"నవిద్య చేతఁ గల్పితంబైదేహిని సంసారంబునం ద్రిప్పు"*– ఇందులోకి దిగి ప్రతిబింబవశాత్తు దిగివచ్చినవాడు జీవుడు, దీని యందు మోహపడి, తటాకంలో చంద్రుడున్నాడు అని భ్రమపడితే ఎట్లా ఉంటుందో, అట్లా భ్రమ పడిపోతాడు. భ్రమపడిపోయి, అలా గింగరాలు తిరుగుతూ ఉంటాడు. ఇదంతా నేను, నాది, నావారు – ఈ మూడింటి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అసలు నువ్వు లేవురా అని చెప్తుంది జ్ఞానం. నువ్వు ఉన్నావు అనుకుంటున్నావు తప్ప ఉన్నది ఒక్కడే! మామూలుగా ఇది వింటూ ఉంటే రుక్మిణీదేవి

ఏం అనుకోదు. ఇదేంటండి ఇప్పుడు సమయం, సందర్భమేనా ... ఏం గురుపూజలా? ప్రవచనం చెప్పుకోవటానికి కాదుగా! రోడ్డు మీదున్నారు కదా! కాకపోతే ఏంటంటే, కవులుగాని, మహర్షులుగాని సందర్భోచితంగా కొంత ఇలా మన బోటి మోహబుద్ధి కలవారికి, దేహాభిమానం కలిగినటువంటి వాళ్ళకి బోధ చేయాలి కదండి. అలాంటి బోధలు వస్తున్నాయి అనుకోవాలి. అంతేకాని బలరాముని గూర్చి మరో భావన మనకు రారాదు.

*"నెఱుకలేనివాఁడు నిజముగాని యర్థంబునందు"* – ఇదంతా నిజమనుకొని, ఏదేదో రకరకాలుగా పగలు, రాత్రి పనిచేసుకుంటూ, ఏదో కింద పడుతూ, మీద పడుతూ.... జీవితం ఎంత క్లుప్తం చేసుకుంటే, అంత ఎక్కువ అనుభూతి చెందవచ్చు. జీవితం ఎంత మల్చుకుంటే, అందులోకి ఇంకిపోతాం. అంతే కదా! ఉన్నది చెంబుడు నీళ్ళు. వాటిని ఇక్కడ పోశామనుకోండి, ఇక్కడ ఆ కాస్తలోనే ఇంకిపోతాయి. నీళ్ళు ఇంకిపోయే మట్టిలో ఎంత నీళ్ళుపోసినా అంతా పుచ్చుకుంటుంది కదా! అంటే, నీ జీవ శక్తి ఉందే, దాన్నంతా ఈ పదార్థమయమైన ప్రపంచంలో, వాటిని పొందాలనే దృష్టితో నువ్వు చేసే కార్యక్రమములన్నీ కూడా అవి నిరర్థకమైన కార్యక్రమములు అయి ఉంటాయి.

ఇవ్వాల్టికి ఇంత చేశాం, రేపు ఇంకా ఇంత చేయాలి, ఎల్లుండికి ఇంతవుతుంది, ఆ తర్వాత మనం ఇలా ఇంత fixed deposit వేసుకోవచ్చు, ఆ పైన ఏదో flat కొనుక్కోవచ్చు, ఆ తర్వాత అందులో అట్లా ఉంటాం, ఇట్లా ఉంటాం, ఇట్లా అనుకుంటూ ఉంటారు కదా! అలా జరుగుతుందా? ఏదో అడ్డు వచ్చేస్తుంది కదా! ఎప్పుడు మనం flat కొనుక్కుందాం

అనుకున్నా, మనం పోగేసుకున్న దానికన్నా ఒక పది లక్షలు ఎక్కువే ఉంటుంది flat. అందరి అనుభవమదే! స్థలం కూడా అంతే! మనం అనుకున్నదానికన్నా కొంచెం ఎక్కువ ధర ఉంటుంది. ఆ ధరకి మనం చేరేసరికి స్థలం ధర ఇంకొంచెం పెరుగుతుంది. ఎప్పుడూ దానికీ మనకీ ఒక బెత్తెడు తేడా ఉంటూనే ఉంటుంది కదా! ఎప్పటికి కొంటావు నువ్వు? ఎప్పుడు అందులో ఉంటావు? ఇక నుంచి హాయిగా ఉందామనే పరిస్థితేముండదుగా! ఎంచేత? ఈ పదార్థమయమైన ప్రపంచంలో నీకు ఆ విధమైన మోహం కలుగుతూ ఉంటుంది.

అంచేత, ''ఇప్పుడు వీడికి గుండుకొడితే పెద్ద point ఏముందిలే!'' అని చెప్తున్నాడనమాట. దేహాభిమానం ఉండటం చేత కదా అంతలా గింజుకోవాలి! లేకపోతే గుండుకి ఏంటండి బాధ? ఈ మధ్య fashion అయిపోయింది గుండు చేయించుకోవటం. ఇదివరకు ఏదో తీర్థయాత్రలకి వెళ్తే గుండు చేయించుకునేవాళ్ళు. ఇప్పుడు ఎవర్నైనా చూసి, తిరుపతి వెళ్ళావా అని అడగటానికేమీ లేదు! ఎందుకంటే, ఊరికే సరదాగా కొట్టించేసుకుంటున్నారు గుండ్లు. ఒక విధంగా మంచిదే, జుట్టు మీద అభిమానం లేదన్నమాట. లేదా, అది సరిగ్గా పెరగట్లేదు! కారణాలేమైనా జుట్టు విషయంలో అభిమానం తగ్గిపోయింది. మంచి విషయమే కదా! అలాంటివే ఇవన్నీ కూడా అని చెప్తున్నాడు.

*''అజ్ఞానజ మగు శోకము విజ్ఞాన విలోకనమున విడువుము''* – ఇలాంటి విజ్ఞానం మనకున్నప్పుడు ఏం జరుగుతుందంటే, అజ్ఞానం లోంచి బయటికి వస్తాము. ఇప్పుడు బలరాముడు

చెప్పేదానికి ప్రయోజనం ఏముందంటే, "నిత్యానిత్యవస్తు వివేకమని" ఒకటి చెప్తూ ఉంటారు ఇది నిత్యం, ఇది అనిత్యమని. "దేహినిత్యుడు, దేహములు అనిత్యాలు" అంటూ అన్నమాచార్యుల వారు కీర్తన రాశారు. సంపద పోగేసుకున్నామండి. మనతో రాదు కదా! ఇవన్నీ ఇక్కడ వదిలేసి వెళ్ళిపోవాల్సిందే కదా! ప్రతి రూపాయి మనమే సంపాదించినా, అది కోటి రూపాయలు దాటిపోయినా, అది నీతో రాదు. "ఎంతో ప్రేమగా చూస్తాను. మా ఆవిడ నాతో రాదంటారా?" అని అడిగారనుకోండి. రాదు! అలాగే పిల్లలు, అలాగే బంధుజనులు, అలాగే ఆప్తులు, అలాగే ప్రియులు. ఏవీ రావు కదా నీతో! ఇలాంటి విషయం మధ్య మధ్యలో మనకు గుర్తు ఉందనుకోండి, అంతలా ఆరాటపడిపోయి, పేడ–బెల్లం కలిపేసుకొని బతికే పరిస్థితికి రాము అని చెప్తున్నాడు ఇక్కడ బలరాముడు.

"అజ్ఞానజ మగు శోకము
విజ్ఞాన విలోకనమున విడువుము నీకుం
బ్రజ్ఞావతికిం దగునే
యజ్ఞానులభంగి వగవ నంభోజముఖీ!"

*"అజ్ఞానజ మగు"* అంటే అజ్ఞానం చేత పుట్టినటువంటిది శోకము. *"శోకము విజ్ఞాన విలోకనమున విడువుము"* – నువ్వు ఈ కష్ట సమయంలో జ్ఞానం తెచ్చుకున్నావనుకో, అప్పుడు ఈ శోకం నుంచి బయటపడే అవకాశం నీకు ఏర్పడుతుంది. *"నీకుం బ్రజ్ఞావతికిం దగునే యజ్ఞానులభంగి వగవ, నంభోజ ముఖీ!"*

అని అన్నాడు. నువ్వు అజ్ఞానుల్లాగా కాదు. నువ్వు ఈ విధంగా బాధపడటం అనేది తగునా! కాదని చెప్పాడన్నమాట.

"ఇట్లు బలభద్రుచేతఁ దెలుపంబడి రుక్మిణీదేవి దుఃఖంబు మాని యుండె నట రుక్మి యనువాఁడును బ్రాణావశిష్టుండై విడువంబడి తన విరూప భావంబునకు నెరియుచు హరిం గెలిచికాని కుండినపురంబు జొర నని ప్రతిజ్ఞ సేసి తత్పుర సమీపంబున నుండె నివ్విధంబున."

ఇది చూడండి! జుట్టు పెరిగిన తర్వాత ఇంటికెళ్ళచ్చుకదా! ఇప్పుడు నాకు జుట్టు తీసేశాడు కాబట్టి ఇప్పుడు నేను ఇక్కడే ఉండిపోతాను. నేను విదర్భ రాజధానియైన కుండినపురంబు వెళ్ళను. ఇక్కడే ఉండిపోయి ఏం చేస్తాడట వాడు? కృష్ణుడు మీద గెల్చిన తర్వాత ఇంటికెళ్తాడటండి. అంటే, ఇంటికెళ్ళడని అర్థము. ఇంటికెళ్ళేదేముంది? అన్నయ్య ఇంటికి రాకపోతే, మిగతా తమ్ముళ్ళు కూడా సంతోషిస్తారక్కడ, రాజ్యానికి ఒకడు తగ్గాడు కదా! ఇంకా ముగ్గురున్నారు వాడి తమ్ముళ్ళు. ఇదే పిచ్చి అంటే. అవన్నీ వాళ్ళకి ప్రతిజ్ఞల్లాగా ఉంటాయి. ఈ ప్రతిజ్ఞకి అర్థం లేదు. నువ్వు ఎప్పటికీ గెలవ లేవు కదా! అలాంటి వాడివి, ఇది పోగొట్టుకొని, అటు రాజ్యము పోగొట్టుకున్నాడుగా! అది చూడండి.

*"విరూప భావంబునకు నెరియుచు"*– గుండెపోయిందని దుఃఖపడుతున్నాడట. *"హరిం గెలిచికాని కుండినపురంబు చొర*

*నని ప్రతిజ్ఞ సేసి తత్సమీపంబున నుండె"* – ఆ దగ్గరలో ఉన్నాడట, suburbలో. అంటే, విజయవాడకి కంకిపాడు, రామవరంపాడు ఇలా ఉంటాయి, ఊళ్ళోకెళ్ళడానికి వీలుగా city busలు నడుస్తూ ఉంటాయి! అలా దూరంగా ఉండిపోయి, ఇంటికి రానని చెప్పేశాడు. సరే ఉంటే ఉన్నాడు ఏమిటి ఇప్పుడు? ఇంక వాడి కథ ఎక్కడా కనిపించదు.

# రుక్మిణీ కళ్యాణము

"రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెల్చి రాజస మొప్పన్
రాజిత యగు తన పురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్."

ఇది బమ్మెర పోతన stamp పద్యం. ఇలా చాలా పద్యాలుంటాయి. ఇది ఆయన పక్కి. ఇలా ఒక శబ్దం తీసుకుంటే, దాన్నే రకరకాలుగా అర్థాలు వచ్చేట్టుగా దాన్ని వాడ్తారు. *"రాజీవలోచనుఁడు హరి"* – రాజీవమంటే ఏంటి? పద్మదళం. రాజీవలోచన అంటే పద్మదళం వంటి కళ్ళు. పద్మముల వంటి కన్నులు అని కాదు, పద్మదళ మది. రాజీవమంటే పద్మమే. కాబట్టి, అలా విచ్చుకున్నటువంటి కన్నులు గలది. *"హరి రాజసమూహముల గెలిచి"* – చాలామందిని గెలిచాడు కదా! *"రాజస మొప్పన్"* – రాజీవము, రాజు, రాజసము. *"రాజిత యగు తన పురికిని"* – రాజిత అంటే బాగా కాంతులతో కూడినటువంటి పురమది, ద్వారకాపురం. అద్భుతమైనటువంటిది ద్వారకాపురం. ద్వారకాపురి యొక్క వైభవం తెలియాలంటే, భారతంలో యుధిష్ఠిరుడి కోసం నారదుడు వర్ణిస్తాడు. ఎందుకంటే, మయసభ చూసి మురిసిపోయి ధర్మరాజు ఇలాంటిది ఎక్కడున్నా ఉందా అంటే, చాలా చెప్పుకుంటూ, ద్వారక కూడా చెప్తాడు. అది విశ్వకర్మ నిర్మాణం. సాక్షాత్తు సృష్టి నిర్మాణం చేసినటువంటి వాడే విశ్వకర్మ.

The great architect of the universe అంటారు. అలాంటి వాడు నిర్మించి ఇచ్చాడు ద్వారకాపురం. *"రాజిత యగు తన పురికిని రాజానన"* – ఈ రాజెవరు? చంద్రుడు. నెలరాజా, వెన్నెలరాజా అంటుంటాం కదా! రాత్రికి ఆయనే రాజు కదా! చంద్రబింబం లాంటి ముఖం కలిగిన ఆవిడను తెచ్చినందుకు *"దెచ్చె బంధురాజి నుతింపన్"* – బంధువులందరూ కూడా బాగా సంతోషించారటండి.

"అంత నయ్యాదవేంద్రుని నగరంబున సమారబ్ధ వివాహకృత్యంబును బ్రవర్తమాన గీత వాద్య నృత్యంబును బ్రతిగృహాలంకృత విలసితాశేష నరనారీ వర్గంబును బరిణయ మహోత్సవ సమాహూయమాన మహీపాల గజఘటా గండమండల దానసలిల ధారాసిక్త రాజమార్గంబును బ్రతిద్వార మంగళాచార సంఘటిత క్రముక కదళికా కర్పూర కుంకుమాగరుధూపదీప పరిపూర్ణకుంభంబును విభూషిత సకల గృహవేదికా కవాటగేహళీ స్తంభంబును విచిత్ర కుసుమాంబర రత్నతోరణ విరాజితంబును సముద్ధూత కేతన విభ్రాజితంబును నై యుండె న య్యవసరంబున."

*"అంత నయ్యాదవేంద్రుని నగరంబున"* – వాళ్లు వస్తున్నారని ద్వారకలో వీళ్ళు అన్నీ బాగా సంబరంగా ఏర్పాట్లు చేసుకుంటారు, విపరీతంగా. మొత్తం ద్వారకానగరమంతా కూడా దేదీప్యమానంగా వెలిగిపోయేట్లు పువ్వులతోనూ, ఆ మామిడి రెమ్మలతోనూ, ఎంత బాగా అలంకారం చేసుకోగలరో,

అంత బాగా అలంకారం చేసుకున్నారండి. అందరూ చక్కగా ముందు ఊరు అలంకారం చేసుకొని, వాళ్ళని వాళ్ళు అలంకారం చేసుకున్నారు. వారి గృహాల్ని అలంకారం చేసుకున్నారు, అంత సంతోషం. ఊరంతా పెళ్లిసందడిలో ఉంది. ఎంచేత? వాళ్ళందరికీ శ్రీకృష్ణుడంటే అంత ఇష్టం కాబట్టి.

**"ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్ మాన వై భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం ధవ సత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్ సువిభూషాంబరధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్."**

రుక్మిణి ఎలాంటి ఆవిడ? సాక్షాత్తు పరాప్రకృతియే కదా! ఎంచేత? ఆవరణం దాటి బయటకొచ్చేసి, కృష్ణుని పొందింది. మిగతా భార్యలందరికీ ఇలా ఉండదు కదా! అందుకని ఈవిడతో ఎవరూ సమానం కాదు. మహాలక్ష్మియే ఆ విధంగా మహావిష్ణువు కృష్ణుడిగా అవతరించిన సందర్భంలో, ఆయనని తిరిగి పొందటానికి ఈ విధంగా జన్మించినటువంటిది. సహజంగా బంగారు దేహం కలిగినది. రుక్మిణి అంటే అర్థమది. రుక్మిణీదేవి అనగా బ్రహ్మవిద్య. దానిని వివాహము చేసుకొనినవాడు బ్రహ్మవేత్తయైన శ్రీకృష్ణుడే కాని మరొకడు కాదు. శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన అజ్ఞానులు కారని భావం. అంటే ఆవిడని వివాహం చేసుకోవటానికి వాళ్ళకి అర్హత లేదు. *"ధ్రువకీర్తి"* అంటే ఈ ధ్రువుడు, ధ్రువనక్షత్రం ఉన్నంత కాలం ఈ రుక్మిణీకళ్యాణ కథ అలా నిల్చిపోతుంది. అటువంటి పెళ్ళిట అది. మనం నిలబెట్టుకోకపోతే, మన సంస్కారాలన్నీ పోతాయోమో అని భయపడుతూ ఉంటారు. ఆ

భయం అక్కర్లేదు. సత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరం లేదు, సత్యం నిలబడే ఉంటుంది. దాన్ని అనుసరించే వాడిని కాపాడుతుంది. ధర్మాన్ని నిలబెట్టేవాడు రక్షింపబడతాడు తప్ప, ధర్మాన్ని ఎవ్వరూ ఏమీ చేయలేరు. అలాంటి సత్యమది. అంచేత, ఆ కీర్తి ఎల్లకాలం ఉంటుంది.

వైభవము, గాంభీర్యము కలది, అష్టైశ్వర్యములు కలది. ఏమన్నా డిక్కడ? *"హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్"* అన్నాడు. అంటే, కృష్ణుడు మనసు అపహరించింది రుక్మిణి. అందుకనే కదా ఆయన కూడా బ్రాహ్మణుడు వస్తే సంతోషిస్తాడు! అందుకనే "కళ్యాణమస్తు" అనంగానే చిరునవ్వు నవ్వుతాడు, ఆహా! మనకి పనికొచ్చిన వార్త తెచ్చాడు అని. మీకు మొదటి సంవత్సరంలో చెప్పాను. "నిజ చేతోహారిణిన్" అంటే తన యొక్క మనస్సును హరించినటువంటిది అమె.

*"వైభవ గాంభీర్య విహారిణిన్"* – వైభవమంటే పొద్దున చెప్పాను. లోతైనటువంటి గాంభీర్యంతో, వైభవంతో ఎప్పుడూ సంచరించేటువంటి ఆమె. *"సంపత్కారిణిన్"* – సకల సంపత్తు, సంపదలను ఇచ్చేటువంటిది కదా! *"అశ్వదాయిచ గోదాయి ధనదాయి మహాధనే, ధనంమే జుషతాం దేవీం సర్వ కామార్థసిద్ధయే"* అని అంటాం కదా! అంతేకాదు, సోమపానం కూడా చేయించగలదు అని చెప్పుకుంటాం. *"ధనమగ్నిర్ధనం వాయుర్ధనం సూర్యోధనం వసుః, ధనమింద్రో బృహస్పతి ర్వరుణం ధనమశ్నుతే వైనతేయ సోమం పిబసోమం పిబతు సోమినో"* అంటాం. అమృతతుల్యమైన ప్రజ్ఞ అది.

*"సంపత్కారిణిన్ సాధు బాంధవ సత్కారిణి"* – సాధుజను లందరికీ కూడా సాధుత్వం చేత బాంధవత్వం. సాధుజనులు సాధువుల్నే కోరుకుంటూ ఉంటారు. సాధువులంటే సన్యాసులు కాదు. సాధువులు అంటే సున్నితమైనటువంటి మనస్సు కలవారు. మాటతోగాని, చేతతోగాని ఇతరులను హింసించనటువంటి వారు. అలాంటి వాళ్ళందరి చేత సత్కరింపబడుతున్నది పుణ్యచారిణి. అంతేకాదు, వాళ్ళందరికీ సత్కార్యములకు సహాయం చేస్తుంది. *"మహాదారిద్ర్య సంహారిణిన్"* – అందుకనే ఎక్కువ ఏం చెప్తారో తెలుసా? ఎగపడి లలితా సహస్రనామం చేయకండి, లక్ష్మీసహస్రం చేసుకోండి అని పెద్దవాళ్ళు చెప్తారు. ఎందుకంటే, లలితా సహస్రనామం మహాశక్తివంతమైన స్తోత్రమది. అందులో తంత్ర మున్నది, మంత్ర మున్నది, యోగ మున్నది, అంత్యార్థములు కోకొల్లలుగా ఉన్నది. మహా శక్తివంతమైనది, మనం పట్టగలిగింది కాదు. సామాన్యులు అయిన వాళ్ళు చేసుకోవాల్సినది లక్ష్మీ సహస్రం అని చెప్పారు. రెండూ ఒకటే కాని, ఒకటి పరాశక్తి, ఒకటి సంపత్ శక్తి. మనకి శుభములు కూర్చేటువంటిది లక్ష్మి. *"దారిద్ర్య సంహారిణిన్ సువిభూషాంబర ధారిణిన్"* – చాలా విశిష్టమైనటువంటి అమ్మవారి అలంకారం. చాలా అద్భుతం, మహాలక్ష్మికి కదా! లక్ష్మి అలంకరణ.

*"గుణవతీ చూడామణిన్"* అంటే గుణములు ఎవరికన్నా ఉన్నాయా అంటే అమ్మవారితో పోల్చి చూసుకోవాల్సిందే! లక్ష్మీదేవి లాగా ఉంటుందండి అంటాం కదా! లక్ష్మీ సమానురాలు అంటూ ఉంటాం కదా! అంటే ఏమిటి? ఎవరిని పోల్చుకోవాలన్నా

అమ్మవారితో పోల్చుకుంటారు. ఆవిడే చూడామణి, దాంతో పోల్చి చెప్పుకుంటాం. అంటే, గుణములు ఎవరితో పోల్చి చెప్పుకుంటారో, వాళ్ళు ఎంతటివాళ్లై ఉండాలి? రామునితో పోల్చి చెప్పుకోవటం, కృష్ణునితో పోల్చి చెప్పుకోవటం, అమ్మవారితో పోల్చి చెప్పుకోవడం ఉంటాయి కదా! గుణములకు మరి ఆమె రుక్మిణిన్. అంటే, బంగారు కాంతి కలిగినటువంటిది. అలాంటి ఆమెను, అంటే సాక్షాత్తు మూలప్రకృతిని ఆ విధంగా శ్రీకృష్ణుడు పెళ్లి ఆడాడు అనేటువంటిది ఆ పద్యం.

"సతులుం దారును బౌరులు
హితమతిఁ గానికలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నత వర్ధిష్ణులకును మా
నిత రోచిష్ణులకు రుక్మిణీకృష్ణులకున్."

బాగా బహుమతులు వాళ్ళ వాళ్ళ ప్రీతికొద్ది ఇచ్చుకున్నారు.

"హరి పెండ్లికిఁ గైకేయక
కురు సృంజయ యదు విదర్భ కుంతి నరేంద్రుల్
పరమానందముఁ బొందిరి
ధరణీశులలోన గాఢ తాత్పర్యముల్."

వీళ్ళంతా కూడా శిష్టాచారులైన రాజసంఘాలు. ఈ పెళ్లి జరగడం వల్ల ఎలాంటి polarizations జరుగుతాయో చూసుకుంటారండి వాళ్ళు. ఎంతసేపు వాళ్ళ పని అది –పొత్తు. మనకదే కదా గోలంతా! ఎవడు ఎవడితో పొత్తు కుదుర్చుకుంటాడని

కదా! ఇప్పుడు ఈ వివాహం వల్ల ఎలాంటి polarizations జరుగుతాయి అనేది వీళ్ళందరు ఆలోచించారట. అందుకనే కదా, బలరాముడు యొక్క కుమార్తెను, లక్ష్మణ కుమారుడు పెళ్లి చేసుకుంటే, యాదవులంతా తమవైపు ఉంటారనే ప్రయత్నం. ఇలా కొన్ని కొన్ని ప్రయత్నాలు. ఆ రాజవంశాల్లో ఏంటంటే, ఈ వివాహబంధం ద్వారా there will be new alignments. అవి వాళ్ళు ఆలోచించుకొని సంతోషించారట.

"హరి యీ తెఱఁగున రుక్మిణి
నరుదుగఁ గొనివచ్చి పెండ్లియాడుట విని దు
ష్కరకృత్య మనుచు వెఱఁ గం
దిఱి రాజులు రాజసుతులు దిక్కుల నెల్లన్."

కృష్ణుడు ఈ విధంగా పెళ్లి చేసుకున్నాడని కొంతమందికి ఇది చాలా సంభ్రమాశ్చర్యాలు కలిగించిందట. ఎందుకంటే, అరుదుగా ఇట్లా ఎత్తుకొచ్చి, పెళ్ళిచేసుకోవడం జరుగుతుంది. సులభమైన పని కాదిది. *"వెఱఁ గందిరి"* – రాజులందరూ ఆశ్చర్యపడిపోయారట. రాజులు ఆశ్చర్యపడటం సరే! రాజసుతులు మనం కూడా ఇలాంటిదేదన్నా చెయ్యగలమా అని పోటీ చూసుకుంటారు కదా! పెళ్లి కావలసిన రాజకుమారులకి ఇది ఒక parameter, ఒక benchmark కదా! మనమిలా చేయగలమా అని అనిపిస్తూ ఉంటుందన్నమాట. అన్ని దిక్కుల్లో కూడా ఈ విధంగా ఈ వార్త పెల్లుబికిపోయి బాగా, it was the talk of the nation and neighboring nations. దేశమే కాదు, చుట్టుపక్కల దేశాల్లో కూడా చాలాకాలం ఇది ఒక పెద్ద వార్తగా చెప్పుకున్నారటండి.

"అనఘ! యాదిలక్ష్మియైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు."

ఈ విధంగా పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు అట్లా ఊళ్ళో తిరుగుతూ ఉంటే, ఊళ్ళో వాళ్ళందరూ చూసి ఆనందిస్తూ ఉంటారు. వాళ్ళు కూడా friends ఇంటికి, చుట్టాలింటికి, వాళ్ళింటికి, వీళ్ళింటికి వెళ్తూ ఉంటారు కదా! వీళ్ళు ఈ రాజవీధుల్లో తిరుగుతున్నప్పుడు, ఊళ్ళోవాళ్ళందరూ చూసి చాలా సంతోషించడమే కాదట, వాళ్ళకి భయం కూడా పోయిందిటండి. ఎంచేతంటే, సమస్తం – ప్రకృతి, పురుషులు – ఇక్కడే ఉంది. అంతకుముందు ఆయన ఉన్నాడు. ఇప్పుడు ఆమె కూడా చేరింది. ఇంక భయానికి తావేముంది అని చెప్పి వాళ్ళు సంతోషించారటండి.

"కువలయ రక్షా తత్పర!
కువలయదళ నీలవర్ణ కోమలదేహా!
కువలయనాథ! శిరోమణి
కువలయజన వినుత విమల గుణసంఘాతా!"

"ఊరిని, భూమిని పరిపాలించుటయందు ఆసక్తి కలవాడవును, నల్లకలువ రేకల వలె నీలవర్ణము, మనోజ్ఞమైన దేహము కలవాడవును, రాజశ్రేష్ఠ డవును, భూమిలో నుండు సకల జనుల చేత కొనియాడబడిన సర్వజ్ఞత్త్వము, సర్వేశ్వరత్త్వము, సర్వభౌక్తత్త్వము, సర్వకర్తృత్త్వము, సర్వపాలకత్త్వము,

సర్వసంహారకర్తము మొదలైన మంచి గుణముల సమూహములు కలవాడివైన ఓ స్వామి!" అని చెప్పి దీనికి తాత్పర్యం. ఎవరిది ఈ కీర్తన? కృష్ణుడిని ఆ విధంగా కీర్తించుకున్నారట ప్రజలందరూ, ఇలాంటి కృష్ణస్వామి మన దగ్గర ఉన్నాడు అని. భయం పోయింది. *"కువలయ రక్షా తత్పర"* – కువలయం అంటే భూమండలం. *"కువలయ రక్షా తత్పర! కువలయదళ నీలవర్ణ కోమల దేహా!"* – మన భూమి బయట నుండి చూస్తే ఎలాంటి కాంతిలో ఉంటుందో... ఇప్పుడు మనకి తెలుస్తోంది కదా! బొమ్మలు తీస్తున్నారు కదా space లోంచి! ఎలా ఉంటుంది? Violet కాంతితో ఉంటుంది. నీలి bluish violet కదా! Pink violet కాదు. అలా ఉంటాడు కృష్ణుడు.

"కువలయనాథ" – భూమికి నాథుడవు, శ్రీభూసమేతుడివి కదా! *"కువలయనాథ! శిరోమణి కువలయజన వినుత విమల గుణసంఘాతా!"* – కువలయ జనులంటే, మనమే. భూమి మీద ఉండే వాళ్ళం. మన అందరిచేత ఎప్పుడూ కీర్తింపబడే వాడు. "విమల గుణసంఘాతా!" – చాలా నిర్మలమైనటువంటి విమలం అంటే, మలము లేనిది అని నిర్మలము అని అర్థం. అటువంటి గుణముల సమూహములు కలిగిన వాడివి నీవు అని చెప్పి కృష్ణుడిని ఉద్దేశించి ద్వారకాపురంలో ఉండే ప్రజలందరూ కూడా చక్కగా కీర్తించుకుంటూ, ఆనందంగా, భయంలేకుండా బతుకుతూ ఉన్నారటండి.

"సరసిజనిభహస్తా! సర్వలోకప్రశస్తా!
నిరుపమశుభమూర్తీ! నిర్మలారూఢకీర్తీ!

పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!
గురుబుధజనతోషీ! ఘోరదైతేయశోషీ!"

ఈ రెండు పద్యాలు కృష్ణుని ఉద్దేశించి ప్రజలు పలికినవి. మనం కూడా కంఠస్థం చేసుకోవచ్చు. *"సరసిజనిభహస్తా"* అంటే కమలములను పోలిన హస్తములు కలవాడా అని. బాహువులు చాలా బలంగా ఉన్నప్పటికీ, ఏదీ ఐరావతం తొండం లాగ, చేతులు సున్నితంగా ఉంటాయి. *"కువలయజనిభహస్తా! సర్వలోకప్రశస్తా!"* – ఒక్క భూమే కాదు, అన్ని లోకాల్లోనూ ప్రశంసింపబడుతూ ఉంటాడు. *"నిరుపమ శుభమూర్తీ"* – ఇంకో ఉపమానం లేదటండి. ఇంత శుభంగా రూపం ఉంటుందని. కృష్ణుడు ఎంత అందంగా ఉంటాడు అని చెప్పాలంటే ఇంకో ఉపమానం లేదు. ఎంత అందంగా ఉంటాడంటే, కృష్ణుడంత అందంగా ఉంటాడని చెప్పాలంతే! ఇంకో పోలిక లేదు. అది ఎందుకిలా చెప్పానంటే, రాముడి అందం గురించి అడుగుతారు తులసీదాసుని. ఎంత అందమైనవాడు రాముడు? ఇంకో దాంతో పోలిక చేసి చెప్పమని. అంటే, ఆయనకి దేంతో పోల్చాలో తెలీదు. కవి కదా! కబీరుని అడిగాడట ఆయన. రాముడి అందం దేంతో పోలిస్తే బాగుంటుంది అని. రాముడి అందం దేంతో పోల్చాలంటే, రాముడితోనే పోల్చాలి అని చెప్పాడాయన. అంటే రామకృష్ణాదుల రూపము ముందు భూమి మీద అంత పరిపూర్ణమైన రూపములు గోచరించవు. "నిరుపమ శుభమూర్తీ" – అన్నీ శుభములు కూడినటువంటి మూర్తి. అందుకని వాళ్ళని పెట్టుకుంటాం. పరిపూర్ణమైనటువంటి శుభములు కలిగించే మంగళప్రదమైన మూర్తులను, విరాట్పురుషుల మూర్తులే సాక్షాత్తు. అంటే పొట్టి

కాదు, పొడవు కాదు, నలుపుగాదు, పసుపుగాదు, లావుగాదు, సన్నముగాదు. మరీ లతల్లాగా అట్లా కమిలి వాడిపోయేట్లుగా ఉండదు, అలా అని బండగా ఉండదు. మరి ఏం చూసుకున్నా అన్నిట్లోనూ ఇంకో రకంగా ఇది ఉండటానికి వీల్లేదన్నట్లుగా ఉంటుంది అలాంటి మూర్తి.

*"నిర్మలారూఢకీర్తి"* – అలా పొగడుతూ ఉంటే, ఎంత కీర్తంటే అది నిర్మల ఆరూఢ పరిశుద్ధమును, నిలకడగలది. నిలకడగలది అయిన కీర్తి గలవాడా! పరిపూర్ణమైనటువంటి కీర్తి నిలకడగా ఉంటే కీర్తి. మామూలుగా కీర్తికి గూడా హెచ్చుతగ్గులుంటాయి. హెచ్చుతగ్గులు లేని కీర్తి కలిగినటువంటివాళ్ళు. *"పరహృదయవిదారీ"* – శత్రువులకు గుండెల్లో గుబులు పుట్టేస్తుంది అంటారు చూశారా! చాలా హృదయవిదారత అయిపోతుంది కృష్ణుని నామం. కంసుడు ఆ విధంగా బాధపడి చచ్చిపోతాడు కదా! నిజానికి కంసుడిని చంపే అంతటి పరిస్థితే రాదు కృష్ణుడికి. ప్రతిక్షణం కొంచెం కొంచెం చచ్చిపోతూ ఉంటాడు కంసుడు. ఎంచేతంటే, ఏది కదిలినా కృష్ణుడేనేమో అని అనుకుంటూ భయపడి పోతూ ఉంటాడు, గజగజలాడ్తూ ఉంటాడు. కృష్ణుడు కనపడి, మీదకి ఒక్కసారి సింహం లాగా లంఘించి, ఆయన మీద పడేసరికి, దానికే ఆయన ప్రాణం పోతుంది. అంత భయం. కృష్ణుడు అంటే దుష్టుల హృదయంలో అంత భయం. అంచేతే, ఈ రాజులందరూ కూడా కృష్ణుడు గురించి భయపడే కాపాడుకోవటానికి చాలా ప్రయత్నం

చేశారు. రుక్మి యొక్క ప్రోత్సాహం చేత, శిశుపాలుని యొక్క ఉత్సాహం చేత వచ్చారు గాని ఏమైంది? ప్రాణములు పోయాయి.

*"పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!"* – భక్తులకు, భక్తలోకానికి ఎప్పుడూ ఉపకారం చేస్తూ ఉంటాడు. *"గురుబుధజనతోషీ"* అంటే సద్గురువులు, బుధులు అంటే తెలిసినవారు, జనులు అంటే సామాన్యజనులు. వాళ్ళందరికీ ఈయన్ని చూస్తే ఒక ఆనందం, ఒక సంతోషం. వాళ్ళు తలుచుకుంటే ఆనందం, కృష్ణుడు విగ్రహం చూస్తేనే ఆనందం, ఫోటో చూస్తే ఆనందం. ఏం చూసినా కొంతమందికి ఈయనను చూస్తుంటేనే ఆనందం కలుగుతుంది కదా! అందుకనే, అందరి దగ్గర కృష్ణుని యొక్క చిత్రపటాలు చాలా ఎక్కువగా ఉంటూ ఉంటాయి. రకరకాల భంగిమల్లో ఉంటాయి. *"ఘోరదైతేయశోషీ"* – దైత్యులకు మాత్రం చాలా భయంకరంగా కనిపిస్తూ ఉంటాడట. వాళ్ళకి నాలుక పిడచకట్టి పోతుంది. ఒళ్ళంతా కంపించి, భయం వచ్చేసి, ఆ మాట వింటేనే గజగజ లాడిపోయేటువంటి మూర్తిట.

అలాంటి శ్రీకృష్ణుడిని, రుక్మిణి తన భక్తి చేత మెప్పించి, వివాహం కావించుకున్నటువంటి కథ ఇది. ఈ దశమస్కంధం, పూర్వభాగంలో చిట్ట చివరి ఘట్టం. ఈ రుక్మిణీకళ్యాణం మన విజయవాడ గణపతి, సోదరులైన కృష్ణమూర్తి గారి యొక్క మేధస్సులోంచి ఈ ఘట్టం మనమంతా ఒకసారి యథాశక్తి వినాలనే సంకల్పం ఒకటి జరగటం చేత, అది ఈ మూడు సంవత్సరాలు మనం ఈ విధంగా నిర్వర్తించుకున్నాము. ఇటువంటి ఘట్టాలు మనం చదువుకున్నప్పుడల్లా, విన్నవారందరికీ

కూడా చక్కని శుభములు కలుగుతాయి. మళ్ళీ దారి తప్పిన వారికి దారి దొరుకుతూ ఉంటుంది. ఇటువంటి ఫలాలన్నీ ఉంటాయి. ఏదేమైనప్పటికీ పురోగతి బాగుంటుంది. ఈశ్వర అనుగ్రహం లభిస్తుంది. అలాంటి రుక్మిణీకళ్యాణం ఘట్టాన్ని ఈ రోజు మనము ఇక్కడ పరిపూర్ణం గావించుకున్నాము.

*స్వస్తి.*

## DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar, Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

### WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E/G/S |
| 2. | Ambareeshudu | T |
| 3. | Amanaskudu | T/K |
| 4. | Antardarsana Dhyanamulu | T/K |
| 5. | Anveshakudu | T |
| 6. | Asangudu | T |
| 7. | Ashram – Regulations for Entry | E/S/G |
| 8. | Ashram Leaves | E/G/S |
| 9. | Ayurvedic Principles for Daily Life | E/G/S |
| 10. | Bharateeya Sampradayamu | T/K |
| 11. | Bhrikta Rahita Taraka Raja Yogamu | T/K |
| 12. | Cow | E/S/T/K |
| 13. | Devapi Maharshi Bodhalu | T/K/HI |
| 14. | Discipleship | E |
| 15. | Dhanakamuni Katha | T |
| 16. | Dharmavigrahudu – Sri Ramudu | T |
| 17. | Doctrine of Eternal Presence | E/S |
| 18. | Gajendra Mokshanam | T |
| 19. | Gayatri Mantra Avagahana | T |
| 20. | Geetopanishad – Dhyana Yogamu | T |
| 21. | Geetopanishad – Gnana Yogamu | T |
| 22. | Geetopanishad – Karma Yogamu | T |
| 23. | Geetopanishad – Karma Sanyasa Yogamu | T |
| 24. | Geetopanishad – Sankhya Yogamu | T |
| 25. | Geetopanishad – Vignana Yogamu | T |
| 26. | Good Friday | E/G/S/F/H |
| 27. | Health and Harmony | G/E |

28. Healer's Handbook E
29. Hercules – The Man and the Symbol E/G/S
30. Himalaya Guru Parampara (The Hierarchy) T/K/HI
31. Indian Tradition T
32. Jupiter – The Path of Expansion E/G/S
33. Just Adjust – Yoga of Synthesis E/G/S/F
34. Jyotirlinga Yatra T
35. Kapila & Kardama - The quintessence of the Path E/G/S
36. Katha Deepika T
37. Listening to the Invisible Master E/G/S/F/H
38. Lord Maitreya – The World Teacher E/G/S/F
39. Mana Master Garu T
40. Mantrams – Their Significance and Practice . E/G/S
41. Maria Magdalena E/S
42. Marriage – A Sacrament E/G/S
43. Mars – The Kumara E/G/S
44. Maruvu Maharshi Bodhalu T/K/HI
45. Master C.V.V. (Birthday Message) T/K
46. Master C.V.V. – Nuthana Yogamu T/K
47. Master C.V.V. – Saturn Regulations E/G
48. Master C.V.V. – Yogamu-Karma Rahityamu T/K
49. Master C.V.V. – Yogamu T/K
50. Master C.V.V.–The Initiator, Master E.K.–The Inspiror E
51. Master E.K. – The New Age Teacher E/G/S/T
52. Master M.N. – A Fiery Flame E/G/S
53. Mercury – The Alchemist E/G/S
54. Mithila – A New Age Syllabus E/G/S/K
55. New Age Hospital Management E/G/S/F
56. Occult Meditations E/G/S
57. OM T/K
58. OM Namo Narayanaya E/G/S
59. On Change E/G/S
60. On Healing E/G/S

| | | |
|---|---|---|
| 61. | On Love | E/G/S |
| 62. | On Service | E/G/S |
| 63. | On Silence | E/G/S |
| 64. | Parikshit – The World Disciple | E/G/S/F |
| 65. | Prayers | E/G/S |
| 66. | Pranayama | T/K |
| 67. | Rudra | E/G/S |
| 68. | Sai Suktulu | T |
| 69. | Sanganeethi | T |
| 70. | Saraswathi – The Word | E/G/S |
| 71. | Saturn – The Path to Systematised Growth | E/G/S |
| 72. | Shirdi Sai Sayings | E/G/S/T/HI |
| 73. | Sound – The Key and its Application | E/G/S |
| 74. | Spiritual Fusion of East and West | E |
| 75. | Spiritualism, Business and Management | E/G/S |
| 76. | Sri Dattatreya | E/G/S/T/HI |
| 77. | Sri Guru Paadukastavamu | T/K |
| 78. | Sri Krishna Namamrutham | T |
| 79. | Sri Lalitha I | T |
| 80. | Sri Lalitha II | T |
| 81. | Sri Lalitha III | T |
| 82. | Sri Lalitha IV | T |
| 83. | Sri Lalitha V | T |
| 84. | Sri Lalitha VI | T |
| 85. | Sri Lalitha VII | T |
| 86. | Sri Lalitha VIII | T |
| 87. | Sri Lalitha IX | T |
| 88. | Sri Lalitha X | T |
| 89. | Srimad Ramayana – Dharma Kusumalu | T |
| 90. | Sri Sastry Garu | E/G/S/F/T |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టము అందరికీ తెలిసిన కథయే. ఈ కథలో చాలా లోతులు ఉన్నాయి. ఈ కథలో జీవాత్మ–పరమాత్మల అనుసంధానానికి సంబంధించిన సమస్త సాధన ఉన్నది, భక్తి ఉన్నది, జ్ఞానం ఉన్నది, వైరాగ్యం ఉన్నది, యోగం ఉన్నది. దైవమును జీవుడు చేరేటువంటి ప్రయత్నంలో మనకు సహజంగా మనలో నుండి అడ్డుపడే అహంకార తత్వం ఉన్నది. ఇలా రకరకములైన విషయములన్నీ కూడా ఒక మధురమైన ఘట్టంగా రూపొందించారు ఋషులు. జరుగుతున్న కథలో ఎన్నెన్నో రహస్యాలు చూపించి, సాధకునికి పనికొచ్చే తీరులో ఆ కథని వర్ణించడమే ఋషులు చేసిన ఒక మహత్తరమైన ప్రయత్నము. రుక్మిణీ కళ్యాణము అనే ఈ ఉపాఖ్యానము సర్వశుభకరము, మంగళప్రదము. ఇది కళ్యాణ ఘట్టము కనుక దీనిని చదివినా, విన్నా, అప్పుడప్పుడూ పారాయణ చేసుకున్నా, చాలా శుభములు కలుగుతాయి.

ధనిష్ఠ

ISBN 978-81-89467-68-5